# మిసిమి

మాసపత్రిక

**సంపుటి 32** **సంచిక 11**

**నవంబర్ - 2021**

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

*సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్***

*సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం*

KALA JYOTHI — Since 1946 —

Printed & Published by

**BAPANNA ALAPATI**

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,

**Hyderabad - 500 020.**

Ph: 040 - 27612436, 27645538.

ప్రతి : ₹ 30/- సంవత్సరానికి : ₹ 360/-

విదేశాలకు ప్రతి : $ 3.00 సంవత్సరానికి : $ 36.00 (by Air Mail)

కార్యదర్శి : వి. ఆశారాణి

ఫోన్ : 040 - 27645536. సెల్ : 994 951 6567.

LIBRARY OF CONGRESS

INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE

**LCCN 91-903060** **ISSN 2454-4329**

E-mail: **misimi90monthly@gmail.com**

www.misimimonthly.com

e-magazine : www.kinige.com/misimi

facebook.com/misimimaasapathrika

YouTube : **Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 100 పేజీలు

# మిసిమి

## నవంబర్ నెల సూచికలు...


కమ్మతెమ్మెరలు : ... 5
'రవీంద్ర స్మృతి'లో నేను! : ప్రొ. తంగెడ కిషన్‌రావు... 7
నా స్మృతిపథంలో రవీంద్రనాథ్ గారు : ఎ.బి.కె. ప్రసాద్... 8
ఆలపాటి రవీంద్రనాథ్ స్మృతి : పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్... 9
వ్యక్తికి బహువచనం : కె. శ్రీనివాస్... 11
రవీంద్ర సన్నుతి : ఆచార్య అనుమాండ్ల భూమయ్య... 12
మనిషితనం అల్లిన వైజయంతి : డా. వోలేటి పార్వతీశం... 13
రవీంద్ర గీతి : ఆచార్య పప్పు వేణుగోపాలరావు... 15
సాహితీ చైతన్య శిల్పి ఆలపాటి : ఆలపాటి రాజేంద్రప్రసాద్... 16
రసార్ద్ర రేఖ! : వల్లూరి శ్రీరామచంద్ర మూర్తి... 18
చతుర్ముఖ జ్యోతి : ప్రొ. రావినూతల సత్యనారాయణ... 19
అరుదైన సంపాదకుడు ఆలపాటి : డా. ఎన్. ఇన్నయ్య... 30
నా తలపులలో నాన్నగారు : దుర్గ నన్నపనేని... 32
కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు : పావులూరి శివరామకృష్ణయ్య... 33
స్మృతి సమీరం : డా. అవధానం రఘుకుమార్... 34
జయదేవుని అష్టపదులు : ఆచార్య పప్పు వేణుగోపాలరావు... 37
బహిరంగ కళ : తంగెడ విశ్వేశ్వర ప్రసాద్... 43
గాజుల లక్ష్మీనర్సు శెట్టి : సరోజినీ ప్రేమ్‌చంద్... 50
నిడదవోలు మాలతి : డా. రమేష్ ప్రసాద్ రావెళ్ల... 55
కళ్యాణ కర్ణాటక సీమ చారిత్రక వైభవం : కొసరాజు వెంకటేశ్వరరావు... 61
సూయజ్ కెనాల్ - నౌకా రహదారి : ప్రసాద్ చెన్నూరి... 67
ధార్మిక విలువలు : అశ్వినీకుమార్... 73
ఈ భూమిపై నివసిస్తున్న ప్రాణికోటితో బాంధవ్యం : జిడ్డు కృష్ణమూర్తి... 76
నాదోపాసిని : డా. నటరాజ రామకృష్ణ... 77
ఆయన నేర్పినదే మన సజీవ భాష : ఆచంట జానకిరామ్... 80
మానవీయ మానవి : ఓల్గా... 81
శ్రీకాకుళ స్వామి సిగపై సువాసించె : తనికెళ్ల భరణి... 83
జ్ఞాపకాల జడివాన ! : పద్మశ్రీ ఎస్.వి. రామారావు... 85
నిరుడు మెరిసిన తెర వసంతాలు : సరస్వతీ ప్రదీప్... 91
సదా సమాజ సేవలో: గాంధీ మార్గం : డా. శ్రీరాములు గోసికొండ... 93
చదవండి... : మిసిమి... 96




ఆలపాటి రవీంద్రనాథ్




ఆలపాటి రవీంద్రనాథ్ (చిత్రకారుడు: గిరిధర్ గౌడ్)


రతిజఘన విలాపం


శృతిమండల రచన


పద్మావతీ చరణ చారణ చక్రవర్తి


శ్రీ గీత గోవింద కావ్య రచన, చిత్రాలు - డా. టి. సాయికృష్ణ

- ప్రత్యేక వ్యాసం పుట: 37

# కమ్మతెమ్మెరలు

"... *మిసిమి* అక్టోబర్ – 2021 సంచికలో అత్యంత మనోజ్ఞమైన 'ఆధ్యాత్మికత అంటే.....' అనే మహోత్తమ వ్యాసాన్ని అందించిన ఆచార్య చి. పప్పు వేణుగోపాలరావుగారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు అందించగోరుచున్నాను..."

*– ఆకెళ్ళ మల్లికార్జునశర్మ, హైదరాబాద్.*



"…. *మిసిమి* అక్టోబర్ – 2021 సంచిక కణుపు–కణుపు తియ్యగా ఉంది. కంటికి ఇంపు, మెదడుకు మేత. మేము మర్చిపోతున్న తెలుగు పదాలను సందర్భోచితంగా ప్రయోగించి, చక్కటి ప్రయోజనం పొందుతున్నారు. *మిసిమి* తెలుగు పలుకు మధువులొలుకుతుంది. ఆలోచనా విధానంలో పరిపక్వత, వేదాంత విషయాలు, భౌతిక, లౌకిక జీవనానికి అన్వయించే తీరు 'ఓహో…' అనిపిస్తోంది. మీకు నా హృదయపూర్వక ధన్యవాదాలు…"

*– పతివాడ సూర్యనారాయణ, హైదరాబాద్*

"…. *మిసిమి* ఆగస్టు – 21 సంచికలో మూడు వ్యాసాలు నన్ను మిక్కిలిగా ఆకర్షించాయి. తంగెడ కిషన్‌రావుగారి *మైత్రీబంధం* – ఇది ఒక కావ్యానికి రాసిన పీఠికగానూ, సమీక్షగానూ కాకుండా ఒక రసవత్తరమైన కథానికలాగా నన్ను చదివించింది. ఎంతో ఆత్మీయతతో కూడిన వ్యాసం. 1971 నాటి తన ఎం.ఎ. విద్యార్థి జీవితాన్ని కళ్లకు కట్టించారు కిషన్‌రావుగారు. మైత్రి అనేది మన జీవితంలో ఎంత మధురమైనదో నిరూపించారు… ప్రొ. కొప్పరపు నారాయణమూర్తిగారి *సిమియాటిక్స్ ఒక పరిశీలన* గొప్ప పరిశోధనతో కూడిన లోతైన వ్యాసం. ఉద్దండ పండితులైన శ్రీ మేళ్లచెరువు సుబ్రహ్మణ్య శాస్త్రిగారి కావ్యాలలోని సంజ్ఞలు పాశ్చాత్యుల సిమియాటిక్స్‌కన్నా నిశితమైనవని నిరూపించారు. శ్రీకృష్ణుని రాసలీలను యోగత్రయీహేలగా స్థాపించారు. శేషేంద్ర *షోడశి* రామాయణ రహస్యాలను *స్వర్ణహంస* శ్రీహర్షుని నైషధములోని శ్రీవిద్యను వెల్లడించాయన్నారు. ఈ వ్యాసం చదివిన నాకు సంస్కృత సాహిత్యం మీద గౌరవం మరింత పెరిగింది. సంపాదకులు అశ్వినీకుమార్ గారి *మరణమంటే భయమెందుకు?* అనే వ్యాసం బౌద్ధ ధర్మాన్ని అనుసరించి, మరణాన్ని విశ్లేషించింది. 70 ఏళ్లు దాటిన వృద్ధులందరూ తప్పక చదవదగిన వ్యాసం. ఈ వ్యాసం పద్ధతిలోనే హైందవధర్మంలో మన ప్రాచీన రుషుల శాస్త్రాలు, వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, పురాణాలు – ఆధారంగా *మరణమంటే ఏమిటి* అనే వ్యాసాన్ని సమర్థులైన పండితులెవరిచేతనైనా వ్రాయించి, *మిసిమి* లో ప్రచురిస్తే సంతోషిస్తాను. *మిసిమి* అంటే చింతనాత్మక సారస్వతం కదా!.."

*– తంగిరాల వెంకట సుబ్బారావు, బెంగళూరు*

"…. *మిసిమి* పత్రిక పాఠక వ్యసనపరుల్లో నేనొకడిగా కొనసాగుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. పిల్లల ఉద్యోగరీత్యా రెండున్నర సంవత్సరాలు నేను ఉత్తరప్రదేశ్‌లో ఉండవలసి వచ్చింది. ఆశారాణిగారితో మాట్లాడితే పత్రికను అక్కడికి కూడా పంపించే ఏర్పాటు చేశారు. ప్రస్తుతానికి వస్తే సెప్టెంబరు 2021 *మిసిమి* పత్రికలో వ్యాసాలన్నీ ఎంతో లోతుగా ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. గార రంగనాథం గారు రాసిన *జంట గ్రామాలు* వ్యాసం నాకు ప్రత్యేకమైన అనుభూతిని మిగిల్చింది. కారణం నా బాల్యంలో ఆ గ్రామాల్లో ఉండే అవకాశం నాకు దక్కింది. అమందరాడ మేనమామ సోమరాజు సీతారాం ఉండే ఊరు. రచయిత రంగనాథం గారు శతాబ్దం వెనుకటి కళాసంపద సాహితీరంగ వైభవాలు చక్కగా వివరించారు. ఈ రోజు పరిస్థితుల ప్రభావం వల్ల ఎంతోమంది ఉన్న ఊరు విడిచి వలసలు పోతున్న రంగనాథంగారు తన ఊరి గత చరిత్రను సేకరించడానికి చాలా శ్రమపడి ఉండాలి. ఉన్న ఊరిపై ప్రేమను ఎంతో చక్కగా వ్యక్తీకరించారు. అలాగే *మిసిమి* పత్రిక సంపాదకులు వల్లభనేని కుమార్‌గారి *నాగరకత* వ్యాసం నేటి సామాజిక బలహీనతల్ని చాలా సున్నితంగా, పరోక్షంగా ఎత్తి చూపించారు. వారికి ధన్యవాదాలు. ఇక యలవర్తి నాయుడమ్మగారిని గురించి గత మూడు నెలల నుండి నడుస్తున్న ప్రచురణలు చాలా బాగున్నాయి. వచ్చేనెల *మిసిమి* పత్రిక ఎప్పుడొస్తుందా అని ఎదురు చూపులు చూడాల్సి వస్తుంది. *మిసిమి* పత్రిక రచయితలందరూ ఎంతో ఆలోచనాశక్తితో రచనలన్నీ కొనసాగుతున్నందుకు వారికి నా ధన్యవాదాలు…"

*– దూబ వేణుగోపాలరావు, కోరుకొండ సైనిక్ స్కూల్*

"…. మధ్యాహ్నం భోజనం ముగించుకొని లేచేసరికి మా తనయుడు *మిసిమి* అక్టోబర్, 2021, సంచిక నా చేతికందించాడు. అందులో తమచే విరచితమైన 'పద్య కవితా పురుషోత్తముడు' అను వ్యాసరాజం చదివాను. ఇంతటి ప్రామాణికమైన




విమర్శను ఇంతటి నాదసుందరమైన పదాలతో ఇంతటి భావగర్భితమైన భాషలో ఇంతగా పరవశమొనరించే రీతిలో వెలువరించిన తమను కీర్తిచడానికి తగు పాండిత్య రహితుడైనందుకు చింతిస్తున్నాను. గతంలో గురజాడ అప్పారావుగారు ప్రశంసిస్తూ తమరు రేడియోలో వినసొంపుగా చేసిన ప్రసంగాన్ని విని ఉన్నాను. ఇంతటి రసవత్తర వ్యాసం ఇతరులే కాదు మీరు సహితం వ్రాయజాలరనుకొన్నాను. అయినా నా ఊహను పరాస్తము చేస్తూ రసవత్తర వ్యాసామే కాక రసవత్తమవ్యాసం లిఖించారు. మమ్ముల రసానంద జలధిలో తానమాడించారు. ఈ నా ప్రశంసకు నిరూపణలు: కదన రంగంలో నాగమ్మ, కదన రంగంలో కృష్ణారావుగారు / యశశ్శరీరులయ్యారు. త్యాగచరితులు, దేశభక్తులు, మహావీరులు – చరించిన పుణ్యధాత్రి, ఇది! పురుషోత్తమ మహారాజువలె – ధర్మవర్తనులు, సత్యమార్గానుయాయి / అక్షరార్చన, వారికి దేవతార్చన / కాళీ / ములోని పలుకుబడిని, పురస్కరించుకొని, జరిగిన పురస్కారమే తప్ప ఎవరి పలుకుబడివల్లనో కాదు / కనుమరుగవుతున్న చరిత్రను, వ్యాఖ్యాన సుందరంగా రచించి, కవి పండితలోక సన్మానితులయ్యారు / – ఈ కొలది ఉదాహరణలు, మచ్చుతునకలే కాని నిండు కొలతలు కావు! తమ ప్రతిభను నిండుగా కొలుచుటకు, ముళ్లపూడి రమణగారు బ్రతికి రావలెను సుమా! Your friend suddenly becomes rich becaus to be your friend! అనే వ్యాఖ్యానన్యాయముననుసరించి మన మధ్య మైత్రికి తావు లేనందుకు వగచుచున్నాను! ఇప్పటి మీదే సరోగ/ము. ఇప్పటి మీ మేథోసంపత్తి, ఎప్పటికీ తరగకుండుగాక!…"

*– పెద్ది సత్యనారాయణ, బెంగుళూరు*

"…. సెప్టెంబర్, అక్టోబర్ – 21 *మిసిమి* సంచికలు సర్వాంగ సుందరీమణుల చిత్రాలను దాటుకుని – సెప్టెంబర్ సంచిక పుట విప్పగానే *శీతవేళ రానీయకు – శిశిరానికి చోటీయకు* అంటూ *నానివాసమ్ము, లోయిత గంధర్వలోకమ్ము* అని పలికిన గంధర్వుడాయన. ఆయన చూపులు గంధర్వలోకం నుండి దారి తప్పి వచ్చినట్లుగా ఉండేవి. ఆయనే కృష్ణశాస్త్రి. పాట వ్రాసినా, పద్యం వ్రాసినా, వ్యాసం వ్రాసినా, నాటకం, యక్షగానం ఏది వ్రాసినా పరమాద్భుతం. భావకవి జీవితమంతా ఆనందంగా గడిపిన నిత్య వసంతుడు కృష్ణశాస్త్రి. ముసలితనం నా దగ్గరకు రానీయకు అన్నారు. నేనూ అంతే సుమా!… మందరాడ – కాకరాపల్లి గురించి శ్రీ రంగనాథం వ్రాస్తూ ఆనాటి ఐక్యతా పరిపూర్ణమైన పరిస్థితులనూ, ఈనాటి ఆధునిక వ్యవస్థనూ కళ్ళకు కట్టినట్టు రచనలు చూపించి, ఆవేదన చెందారు. దేశ భవిష్యత్తుకు పల్లెసీమలే పట్టుకొమ్మలు…. నాయుడమ్మ గారి గురించి వరుసగా వచ్చిన వ్యాసాలు చదివి, ముగ్ధడనయ్యాను. గొప్ప శాస్త్రవేత్త. తన విజ్ఞానాన్ని సామాన్యులకు సమాజం దూరంగా పెట్టిన వర్గాలలో ఆర్థిక చైతన్యం – పారిశ్రామిక తత్త్వం వారి జీవనంలో వెలుగు దారులు వేసిన మహనీయుడు. పద్మశ్రీ నాయుడమ్మ నా దృష్టిలో శ్రీ నాయుడమ్మ భారతరత్న. వారి కనుసన్నలలో పెరిగిన శాస్త్రవేత్త శ్రీ శేషగిరిరావు కూడా గొప్ప ప్రతిభావంతుడుగా దర్శనమిస్తున్నారు. రచయిత నాయుడమ్మ గురించి సమగ్రంగా వ్రాసి పాఠకులలో మహత్తరమైన చైతన్యం కలిగించారంటాను… *బహుళ* నవలను గురించి చదివాను. నవల చదవాలని నా మనసు తొందర పెడుతుంది… ఉత్తరాంధ్ర నుండి నాటకం – కథ – నవల పుట్టాయనిపిస్తున్నది. గురజాడ – రాచకొండ – చాసో – కాళీపట్నం వంటి ప్రభావం తప్పక ఉండే ఉంటుంది. అప్పలనాయుడు గారు పండితుడు – కవి అని విన్నాను. నవలారచయితన్నమాట! అంతర్జాతీయ శాస్త్రవేత్త – భారతదేశానికి గొప్ప సేవలందించిన సంస్కృతాంధ్ర భాషా పండితుడు సూరి భగవంతం గారి గురించిన రచన నా మనసునాకట్టుకున్నది. శ్రీ వేణుగోపాల్ శాస్త్రజ్ఞుడు. కనుకనే భగవంతం గారి గురించి అంత బాగా వ్రాశారు. నాటకరంగం – రాజమహేంద్రవరం గురించి ప్రతివాద సూర్యనారాయణ గారు *ఆంధ్ర నాటక రంగా*న్ని మన కళ్ళ ముందుంచారు. వృద్ధాప్యంలో ఆనాటి జ్ఞాపకాల పుటలను మధురంగా విప్పారు. నాటక సమాజాలు – నటులు – రంగస్థల కేరికలు – ఆనాటి రాజమహేంద్రవరం వేదిక – కందుకూరి – చిలకమర్తి – ఇమ్మానేని – శ్రీపాద – గున్నేశ్వరరావు గారు – ప్రకాశం పంతులుగారు – ఎంతోమంది మహనీయుల అద్భుతమైన కృషిని ఈ తరానికి చెప్పారు. పతివాడ సూర్యనారాయణ గారు ఉన్నతమైన ఉద్యోగి. అంతకంటే సంస్కృతీ సంపన్నుడు. దేశభక్తుడూన్నూ. ధన్యవాదాలు…" *– చెరుకువాడ వెంకట్రామయ్య, విస్సాకోడేరు. ఫోన్: 954 211 8184.*



ఆలపాటి

# 'రవీంద్ర స్మృతి'లో నేను!

– ప్రొ. తంగెడ కిషన్‌రావు
వైస్ ఛాన్స్‌లర్,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ఆలపాటి రవీంద్రనాథ్‌గారి శతజయంతి సందర్భంగా *మిసిమి* ప్రత్యేక సంచిక నవంబర్ – 2021 ప్రచురిస్తున్నాం. *రవీంద్ర స్మృతి* ని పరిశీలించి, మీ అమూల్యమైన అభిప్రాయాన్ని రచన రూపంలో పంపించమని *మిసిమి* సంపాదకులు, నాకు సహృదయ మిత్రులూ అయిన అశ్వినీకుమార్‌గారు లేఖ ద్వారా తెలియజేశారు. వారి అభ్యర్థనమేరకు *రవీంద్ర స్మృతి* ని ఆసాంతం పరిశీలించాను – ఆలపాటి రవీంద్రనాథ్‌గారు 'ఇప్పుడు ఉండి ఉంటే!' సాహిత్యపరమైనవి, లోకానుభవానికి చెందినవీ అయిన ఎన్నో సంభాషణలను వారితో జరిపి, ఎంతో అనుభూతిని, అనుభవాన్నీ 'నేను సైతం' మూటకట్టుకొని ఉండేవాణ్ణి కదా! అని, ఒకింత హృదయావేదనలో ఆలోచనలో పడ్డాను. ఆ ఆలోచనలో నుండి తేరుకొని వారి జీవితానికి, వారి వ్యక్తిత్వానికీ సంబంధించి నాకు నచ్చినవి, నన్ను ఆకర్షించినవీ అయిన కొన్ని విషయాలను *మిసిమి* పాఠకులతో పంచుకోవాలని భావించి ఈ రెండు మాటలు రాస్తున్నాను–

ఆలపాటి రవీంద్రనాథ్‌గారు అభ్యుదయ వివాహం చేసుకున్నారు. ప్రెస్‌ను ప్రారంభించి *మిసిమి*వంటి పత్రికలను ప్రచురించి, సంపాదకత్వాన్ని చేపట్టారు.

వారితో చిరు పరిచయం ఏర్పడినా, అది చెరగని ముద్రగా మిగిలిపోతుంది. అధికారులు, సుప్రసిద్ధ రచయితలు, మేధావులు వారి పరిచయాన్ని అమూల్యంగా భావించేవారు. అజ్ఞాతంగా ఉండిపోయిన ప్రతిభా మూర్తులెందరినో పసిగట్టి, వారిలోని *మిసిమి* ని లోకాలని పంచాలని తపన పడ్డారు.

పుస్తకాలతో నేస్తం చేసి తాను పొందిన అనుభూతిని, ఆర్జించిన విజ్ఞానాన్నీ స్నేహితులతో పంచుకోవాలని తపనపడేవారు 'వారితో మాట్లాడటం ఓ ఎడ్యుకేషన్!' అని, వారితో సంభాషణలు జరిపిన మిత్రులు భావించేవారు. తనకు డిగ్రీలు లేకున్నా, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం ప్రదానం చేసిన గౌరవ డాక్టరేట్‌ను సార్థకం చేసుకున్నారు.

*మిసిమి* పత్రిక స్థాపన వెనుక వారి అమితమైన తపన ఉంది. పాఠకులకు, జిజ్ఞాసువులకు, పరిశోధకులకు, మేధావులకు మహోపకారం చేసిన ఆ పత్రిక వారి సంపాదకత్వంలో సార్థకమైంది.

ఆయన ఆయనగానే జీవించారు – "నీవు నీవుగా బ్రతుకు. నీవు నీవుగా ప్రేమించు, అనుభవించు. అలా జీవించడంలోనే నీ 'అసలుతనం' ఉంది" అని, తన ఫిలాసఫీని తానే ఆచరణలో చూపించారు.

"అతనిది మానవీయ ప్రవృత్తి. అవ్యాజమైన మైత్రి" అని మా గురువుగారైన 'సినారె'వారి వ్యక్తిత్వానికి కొలమానం పట్టారు. కృషి, చింతనలతో వర్తమాన, భావితరాలకు స్ఫూర్తిమంతులైన రవీంద్రులు చిరంజీవులై – చిరకాలం వర్ధిల్లుతూ *మిసిమి* ఉన్నంత కాలం ప్రతి అక్షరంలోనూ తన మూర్తిమత్త్వాన్ని సాక్షాత్కరింపజేస్తూనే ఉంటారు అనేది *మిసిమి* తో పాతికేళ్ల అనుబంధం ఉన్న ఒక పాఠకునిగా, హృదయపూర్వకంగా నేను చెప్పున్న మాట!

ప్రొ. తంగెడ కిషన్‌రావు
వైస్ ఛాన్స్‌లర్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,
హైదరాబాద్. ఫోన్: 770 241 4100.

# నా స్మృతిపథంలో రవీంద్రనాథ్ గారు

– ఎ.బి.కె. ప్రసాద్
సీనియర్ జర్నలిస్ట్

*మిసిమి* వ్యవస్థాపక సంపాదకులు ఆలపాటి రవీంద్రనాథ్ గారు జన్మించి అప్పుడే వందేళ్లు (నవంబర్ 4, 1921) పూర్తి అయ్యాయంటే నమ్మశక్యం కాకుండా ఉంది. ఎందుకంటే నాకూ, ఆయనకూ వయస్సులో తేడా 14 ఏళ్లు. కాలంతో పరుగు పందానికి ఏళ్లతో సంబంధం లేదు. సుప్రసిద్ధ హేతువాదిగా, మానవతా వాదిగా, మానవేంద్రనాథ్ రాయ్ (ఎం.ఎన్. రాయ్), మార్క్సిస్టు భావజాలాలతో ప్రభావితాలైన తన నాటి సమకాలీన సిద్ధాంత వైరుధ్యాల మధ్య తన దృక్పథాన్ని తీర్చిదిద్దుకుంటూ వచ్చిన వ్యక్తిగా నాకు రవీంద్రనాథ్ ఎరుక. ఇక్కడే ఆయనకూ, నాకూ మధ్య వయస్సు తేడా అన్నది ప్రధానం కాదు. చొరవలో, శేముషిలో, పట్టుదలలో మా ఉభయులకూ మధ్య 14 ఏళ్ల దూరాన్ని కొంతవరకు తగ్గించింది! భావాలలో రాడికలిజం, స్నేహంలో ఆప్యాయత పరిశీలనలో నిష్కర్షత ఆయనతో గడిపిన కొద్దికాలంలోనే నాకు అవగతమైంది. నా కొన్ని రచనలను పరిశీలించిన తరవాత మెచ్చుకున్న క్షణాలూ ఉన్నాయి. ఆ ముచ్చట అలా ఉంచితే, మా ఇరువురి మధ్య ఈ కొద్దిపాటి పరిచయం *మిసిమి* సాహిత్య పత్రికగా, విభిన్న అంశాలపై వివిధ కోణాల నుంచి విశ్లేషణలు అందించే రాష్ట్రంలోని సారస్వతేయులందరికీ ఒక 'చలివేంద్రం'గా మారుతూ వచ్చింది. ముఖ్యంగా అప్పటికి ఎన్నో దశాబ్దాల తరబడిగా కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు వారిలాంటి మహోద్దండ సారస్వతీయుల చేతుల మీదుగా ఎదిగిన 'భారతి'లాంటి ఉత్తమ సాహిత్య మాసపత్రిక కాలక్రమంలో 'కాలం' చేసిన తరవాత అత్యున్నత స్థాయి ఉత్తమ సాహిత్య మాసపత్రికే తెలుగువారికి లేకుండా పోయింది.

కనీసం పిల్లలకే కాదు, సాహతీపరులకు సహితం సరదాగా చదువుకుంటూ 'సేద'తీర్చుకోదగిన 'చందమామ' లాంటి విలక్షణ పత్రికలు కూడా సుప్రసిద్ధ సంపాదకులు, కథకులు కొడవటిగంటి కుటుంబరావుగారు మరణించిన దరిమిలా కానరాని పెద్ద వెలతి సాహిత్యాభిమానుల్ని బెంగతో వెన్నంటుతున్న సమయంలో ప్రసిద్ధ సాహితీ ప్రియులు, అభినవ భావుకులైన ఆలపాటి రవీంద్రనాథ్ గారు వ్యయప్రయాసలకోర్చి ప్రారంభించిన *మిసిమి* తెలుగు వారి హృదయ సీమల్ని అలరించడానికి ఉద్యమించడం 'ఆకలిగొన్నవాడు ఆవురావురుమంటూ కడుపు చల్లార్చుకోవడానికి' ఎదురుతెన్నులు చూసినట్లు తెలుగు సీమలోని సారస్వతీయులకు *మిసిమి* కనిపించడం అబ్బురమేమీ కాదు. అది మొదలు విభిన్న కోణాల నుంచి ఆలోచింపజేసే రచనలతో *మిసిమి* చింతనాత్మక సారస్వత దీపికగా వెలుగొందుతూ ప్రతి నెలా పాఠకుల మనస్సులను తేజోవంతం చేస్తోంది. ఒక్క కోణం నుంచి కాదు, పలు కోణాలలోంచి మనకు విందుగొలిపే ప్రసిద్ధ దేశీయ, ప్రపంచ చిత్రకారుల కళాఖండాలను *మిసిమి* నాలుగు అట్టలలోనూ ముచ్చటైన రంగుల్లో పాఠకులకు అందిస్తూ రావటం, పాఠకులలో తృష్ణను పెంచే సంక్షిప్త గ్రంథ సమీక్షలు అందిస్తున్న రవీంద్ర స్మృతి వెలుగు *మిసిమి* ఆయన జయంతి సందర్భంగా ప్రత్యేక సంచికగా వెలువడడం శాశ్వత నివాళిగా నిలిచిపోతుంది. రవీంద్రనాథ్‌గారి కుమారులిద్దరూ (బాపన్న, దేవేంద్ర) సుప్రసిద్ధ కళాజ్యోతి ప్రింటింగ్ ప్రెస్ ద్వారా యథాశక్తి అనేకమంది రచయితలకు, సంస్థలకు అనేక సందర్భాలలో ఉదార సేవలు అందించడం మరొక విశిష్ట కోణంగా భావిస్తున్నాను. సదా *మిసిమి* వర్ధిల్లాలని కోరుకుంటున్నాను.

ఎ.బి.కె. ప్రసాద్
సీనియర్ జర్నలిస్టు, హైదరాబాద్. ఫోన్: 984 831 8414.



ఆలపాటి రవీంద్రనాథ్

# ఆలపాటి రవీంద్రనాథ్ స్మృతి

– పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్
ఫార్మర్ వైస్ చాన్స్‌లర్,
శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ, తిరుపతి

అది 1952 ప్రాంతం.

మా ఊరు వేజండ్ల. గుంటూరు తెనాలి మధ్య రైల్వేస్టేషన్. తెనాలి పది మైళ్లు, గుంటూరు ఎనిమిది మైళ్ల దూరం. ఆ రోజుల్లో గుంటూరు విద్యకు, పొగాకు వ్యాపారానికి ప్రసిద్ధి. తెనాలి సంగీతానికి, సాహిత్యానికి, నాటకానికి, చలనచిత్ర రంగానికి పెద్ద పేరు. నేనా సంవత్సరం ఫోర్త్ ఫారం, తొమ్మిదవ తరగతిలో ఉన్నాను. అప్పటికీ నేను 'దేశం ఏమయ్యేట్టు?' 'ధర్మాసుపత్రి' త్రిపురనేని గోపీచంద్ కథానిక సంపుటులు చదివాను. త్రిపురనేని రామస్వామి చౌదరి పేరు చాలా ప్రధానంగా జనం చెప్పుకొంటూ ఉండేవాళ్లు. ఆవుల గోపాలకృష్ణమూర్తిని పేదల ప్లీడరు అని మావాళ్లు ప్రస్తావిస్తూ ఉండేవాళ్లు.

చలం, కొడవటిగంటి, శారద, రావూరి పేర్లు పత్రికల్లో ప్రస్తావనల్లో ఉండేవి.

*రేరాణి, జ్యోతి* పత్రికలు తెనాలిలో ముద్రితమయ్యేవని రైలుబళ్లలో కేకలు పెట్టి అమ్మేవాళ్లవల్ల తెలుసు. కొన్నింటిని చూశాను. కొన్ని చదివాను. నేనొకరోజు తెనాలి వెళ్లి, రావూరి భరద్వాజను కలిశాను. రాయల్ హోటల్‌లో మేనేజర్ గదిలో ఒక మూల నేల మీద బాచిపట్టు వేసుకొని కూర్చుని ప్రూఫులు చూస్తున్నాడు. పత్రికల్లో చిన్నచిన్న కథలు వ్రాసేవాడు. పుటల్లో ఖాళీ జాగా మిగులుతుంటే ప్రేమ సంఘటనలు హుషారుగా వ్రాసి ఆనందం కలిగించేవాడు. రాయల్ హోటల్ అంటే నాడు రసికతకు మారు పేరు. అక్కడి సంఘటనలు, సన్నివేశాలు పత్రికల్లో కథలుగా మారేవని చెప్పుకొంటూ ఉండేవాళ్లు చదువరులు. నాటి రాయల్ హోటల్ పక్కన కట్టెల అడితీ ఉండేది. అక్కడ రంపపు పొట్టు రాసులు నాకు ఆశ్చర్యంగా ఉండేవి. నేడు వాటి జాగాలోనే, గౌతమ్ గ్రాండ్ హోటల్ ఉందనుకొంటున్నాను. నన్ను చాలాసేపటికి రావూరి భరద్వాజ 'ఏరా తమ్ముడు! ఎవరు నువ్వు' అన్నాడు. పేరు, ఊరు చెప్పి, 'మిమ్మల్ని చూడటానికి వచ్చా'నన్నాను. 'రా, కూర్చో' అన్నాడు. పక్కన కూర్చున్నాను. తల ఎత్తి ఒకసారి, ఎత్తక మరోసారి ఏదో అడిగేవాడు. నేను ఏదో బదులాడేవాణ్ణి.

ఆ స్నేహం భరద్వాజ జీవితాంతందాకా నాతో కొనసాగుతూ వచ్చింది. తెనాలి రైల్వేస్టేషన్‌కు ఎదుట హోటల్‌లో 'శారద' నటరాజన్ సర్వర్‌గా పనిచేసేవాడు. ఆ హోటల్ నిద్రపోదని ప్రసిద్ధి. అక్కడ రోజంతా కాఫీ దొరికేది. రాత్రంతా రసికులు ఉండేవాళ్లు. పక్క సందులో 'రసిక'లుండేవాళ్లు. పరిచయం అయ్యాక నవ్వి, నా తల దువ్వి, తన పని తాను చేసుకోసాగాడు నటరాజన్ (శారద).

ఆ రోజుల్లో కప్పు కాఫీ ప్రసిద్ధి. అరకప్పుకు అప్పుడే అది మార్పు చెందుతూ ఉంది. అరకప్పు కాఫీ కప్పులో ఒకరు, సాసర్లో ఒకరు తాగే రోజులు ప్రారంభమయ్యాయి. రావూరి భరద్వాజ ఆ వెసులుబాటు కనిపెట్టాడని నా నమ్మకం. ఆ రోజుల్లో రావూరిని అడిగాను, పత్రికలు ప్రింట్ అయ్యే చోటు చూస్తానని. వెంట తీసుకుపోయాడు, చూపించాడు. అప్పుడు చూశాను, ఆలపాటి రవీంద్రనాథ్‌ని.

'ఎవరతను?' అని అడిగాడు. 'నా తమ్ముడు, ఊరు వేజండ్ల' అని చెప్పాడు. అదీ నేను వారి కంఠస్వరం వినటం, నా గురించి వారికి తెలుసునని నేను అనుకోవటం. 'ఆయన ఏమిటి?' అని అన్నను అడిగాను.

'పత్రికల యజమాని. ఎడిటరు' అని తెలుసుకొన్నాను.

నాకు ఆలపాటి రవీంద్రనాథ్ ఒక ఆశ్చర్యం. ఒక అద్భుతం. మనషిని చూడటం ఆశ్చర్యం. మాట వినటం అద్భుతం. సౌకుమార్యం మనిషి అయితే ఈ మనిషిలాగా ఉంటుందనిపించింది.

సంగీతం మాటలో దాగి ఉంటుందంటే గుర్తించటానికి ఆయన పలుకు వింటే చాలు. చూపులో కరుణ, జాలి, దయ, ప్రేమ కలగలసి మనమీద ప్రవహిస్తాయంటే ఆ చూపు చూచినవాళ్లు నమ్ముతారు. నడుస్తున్న అందంలాగా కనిపించాడు. ఇలాంటివాళ్లను చూచే 'తాజమహలు'ను నిర్మించి ఉంటారనిపించింది. ఎత్తయిన మనిషి! అందమైన శరీరం! తాకాలనిపించే సున్నితమైన అవయవాలు. చేతుల కదలిక అనాయాసంగా, సునాయాసంగా ఉంది. చూడబుద్ధి పుట్టే రూపం. అలాంటి అందమైన మనుషుల్ని సినీమాలలో చూడగలము కాని, ప్రత్యక్షంగా చూడగలమా అని భ్రమ, భ్రాంతి కల్పించేంత సొగసు, సోయగం, సౌకుమార్యం తనది.

పైగా ఆదరంగా పలకరించే సౌజన్యం, మంచితనం.

సినిమా నటుడు నారాయణరావు గుర్తుకు వచ్చాడు.

నాటకంలో ద్రౌపదిని దగ్గరకు తీసుకొన్న అర్జునుడు స్మృతిపథంలో కదిలాడు. మగవాళ్లు ఇంత అందంగా ఉంటారా అని బిత్తరపోయే రూపం ఆలపాటి రవీంద్రనాథ్ శరీరమంతా ఆవరించింది. ఆ తర్వాత నేను చాలాకాలం దాకా చూడలేదు, వారిని. నా సాహిత్యం, నాకూ లోకానికీ ఆనందం కలిగిస్తున్న రోజుల్లో వారిని హైదరాబాదులో చూశాను. ఇంతకాలం తర్వాత కూడా ఆ మనిషి రూపంలో, నడకలో, పలుకులో, పలకరింపులో అందం, హుందాతనం, స్వరసంగీతం, ఆత్మీయానురాగ సాహిత్య స్పర్శ తగ్గలేదు, చెక్కుచెదరలేదు. స్థిరమైన పునాదుల మీద నిలబడ్డ కళాఖండంలాగా కనిపించాడు. ఈసారి మునుపటి సామీప్యం, సాన్నిహిత్యం నాకు సాధ్యం కాలేదు.

మనిషి నిలువెత్తు బంగారం. పోతపోసిన స్వర్ణ సౌందర్యం. బంగారానికి ఉండే *మిసిమి* వారి శరీరానికి ఉంది. ముప్ఫైఏళ్లలో ఆ *మిసిమి* చెడలేదు. ఇనుమడించింది. తాను లేకున్నా తన *మిసిమి* పత్రికా రంగంలో పదిలంగా ముప్ఫైఏళ్లు నిలిచింది. అన్ని పత్రికల తోవలోకాక, తన తోవలో తాను నడుస్తూ ఉంది *మిసిమి* ఆలపాటి రవీంద్రనాథ్‌గారిలాగ. తాను గుర్తుకువస్తే మూర్తి దాల్చిన సౌందర్యం స్మృతిలో మెరుస్తుంది.

అందానికి మగతనం వస్తే అది ఆలపాటి రవీంద్రనాథ్ అవుతుంది. '*మిసిమి* వారి ఆల్టర్ ఈగో.'

తాను గుర్తుకు రావటం, ఒక ఉత్సాహానికి, ఉద్వేగానికి నేను గురికావటం ఎంతో సుఖమైన మధురస్మృతి.

**పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్**
ఫార్మర్ వి.సి., శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ.
ఫోన్: 944 024 3433.

## పాన్ షాపులో ఓ మెరుపు

*– కాంగో రాముడు*

2017లో ఓ మారుమూల పాన్‌షాపులో ఓ మెరుపు, అందని అక్షరాల అరుపులతో – నాలో ఉరుములతో ఊపడం, తనను తాకినాక తెలిసింది – ఓ *మిసిమి* యని, ఆపై నేన్నెడు ధరించే శమంతకమణుల అక్షరమాలగా తరించడం– ఎంత భాగ్యం! 50 సం.ల పైన – 30 సం.ల శ్రామిక జీవన పోరులో, తెలుగును ఎప్పుడో మరవడం, మరల కొత్త వెలుగు అందాలుగా, ఆ అలుపులేని ఆలపాటి రవిదాగని అలల – తెల్లని పంచె ముడతల కళాప్రవాహపు వడి – నిత్య రసమయ ప్రసాదపు గుడి – ఆ ఆలపాటి రవీంద్రుల – మా తెనుగు సంజీవిని – అన్నిమూలల – అన్నితరాల దాగిన తెనుగు తరంగాలను – ఆయన 1947లో వెలిగించిన అగ్గిపుల్ల కాంతి, తనువు సిగరెట్ భ్రాంతి (మసైనా)– మరో పది – నూరు వసంతాలు *మిసిమి* లో పొదిగించి – అన్ని తరాలుకు తెలుగు పాలను పొంగిస్తూనే – తెలంగాణాంధ్రుల నేలను కళాతేమతో సుస్థిరతా కామధేనువు దానముగా – ఆయన ప్రాణం నిలువగలదేమో!

అనుకోకుండా *మిసిమి* పొందిన భాగ్యంతో! ఆలపాటి రవీంద్రుల శతజయంతి శుభాకాంక్షలతో

ఐ.వి.రామరాజు, కాంగో.



ఆలపాటి రవీంద్రనాథ్

# వ్యక్తికి బహువచనం

– కె. శ్రీనివాస్
ఎడిటర్ – ఆంధ్రజ్యోతి (దినపత్రిక)

సమాజం ముందుకు వెళ్లడానికి చేసే ప్రయత్నంలో 'పాత'తో ఘర్షణ పడుతుంది, 'కొత్త'ను త్వరితంగా ఆవిష్కరించడానికి తాపత్రయ పడుతుంది. ఇదంతా అనేక పొరల జీవనరంగాలలో, అనేక స్థాయిలలో బహుముఖంగా, ఏకకాలంలోను, ముందువెనుకలుగాను, విడివిడిగాను, సమష్టిగాను జరిగే సంక్లిష్ట ప్రక్రియ. కాలం గడచిన తరువాత, ఆ కష్టం అంతా సంస్కారం రూపంలో వాతావరణంలో భాగమైపోతుంది. తెలుగు సమాజాలు సంతరించుకున్న ఉదాత్త ఆదర్శాలు, అభిరుచులు, చైతన్యం, సభ్యత, సంస్కృతి.. ఇవన్నీ ముందే మేల్కొని చీకట్లను తరిమివేసిన గొప్పగొప్ప వ్యక్తులవల్ల, సమూహాలవల్లనే సాధ్యపడ్డాయి. ఫలానా మనిషి కృషి ఫలానా ఫలితానికి దారితీసింది అని ఖచ్చితంగా చెప్పలేము కానీ, వ్యక్తుల కృషి వెనుక కూడా ఒక సామూహిక ప్రేరణ, ధోరణి ఉంటుంది. అటువంటి గొప్ప వ్యక్తులలో ఆలపాటి రవీంద్రనాథ్ ఒకరు.

అనేక ఇతర రంగాలలో కూడా ఆలపాటి రవీంద్రనాథ్‌కు కృషి ఉండి ఉండవచ్చును కానీ, తెలుగువారి పురోగామి సాంస్కృతిక వారసత్వంలో ఆయన భాగస్వామ్యం విశేషమైనది. తెనాలి పట్టణంలో, దాని పరిసరాలలో గత శతాబ్ది ఆరంభ దశాబ్దాలలో గొప్ప ప్రతిభాపాటవాలు, సృజనాత్మకత, నూతన భావావేశాలు, శాస్త్రీయ స్పృహ వ్యక్తమయ్యాయి. ఆ పరంపరలోనే ఆలపాటి రవీంద్రనాథ్ తనను తాను మలచుకున్నారు. 'జ్యోతి' పత్రిక నుంచి 'కళాజ్యోతి' దాకా ఆయన ప్రయాణం, కేవలం వ్యక్తిగత వ్యాపకాల, వ్యాపారాల క్రమం కాదు. విలువలను నెలకొల్పుతూ, కొనసాగిస్తూ చేసిన ప్రయాణం.

రెండేళ్ల క్రిందట ప్రముఖ రచయిత ధనికొండ హనుమంతరావు శతజయంతి కార్యక్రమాలు జరుగుతున్నప్పుడు, ఆలపాటి రవీంద్రనాథ్ పేరు తరచు ప్రస్తావనకు వచ్చింది. రవీంద్రనాథ్ స్వయంగా రచయిత కాకపోయినప్పటికీ, రచనలను మదింపు వేయడంలోను, పాఠకులకు కావలసిన నూతనాంశాలను గుర్తించడంలోను ఆయనకు గొప్ప నేర్పు ఉండేది. మేధావి అయిన పాత్రికేయుడు ఆయన. ధనికొండ, రావూరి భరద్వాజ రవీంద్రనాథ్ ఆశ్రయంలోనే తమ ప్రయాణం ప్రారంభించారు. తెలుగులో ఇంకా సచిత్ర వారపత్రికలు ఆరంభం కాని రోజుల్లో, కాల్పనిక సాహిత్యమూ ఆసక్తికర సమాచారమూ కలగలసిన మేగజైన్ జర్నలిజానికి రవీంద్రనాథ్ 'జ్యోతి' నమూనాగా ఉండింది. 'శారద' కథలకూ అదే వేదిక. నిరాకరణలు ఎదురైన చలం కథలకూ అదే పత్రిక. కొత్త కలాలకు, కొత్త భావాలకు 'జ్యోతి' చిరునామాగా ఉండింది. కాల్పనిక సాహిత్యంలో ఆంక్షలను, హద్దులను సడలించి, కొత్త స్వేచ్ఛలకు ఆస్కారం కల్పించడంలో 'రేరాణి'ది మరొక దారి. ఇది కానీ, తరువాత కాలంలో 'అభిసారిక'గానీ, అసభ్యతకు ఆస్కారం లేకుండా, విజ్ఞాన దృష్టితో శృంగార, లైంగిక అంశాలను సాహసంతో ప్రచురించాయి.

కొత్తదారులు తొక్కినవారు చేపట్టే వృత్తివ్యాసంగాలు కూడా ప్రత్యేకంగా ఉంటాయి. ప్రగతిశీల భావకులకు, ముద్రణా రంగానికి సహజమైన సంబంధాన్ని ఆధునిక చరిత్రలో కనుగొనవచ్చు. ప్రెస్ అనేది, ముద్రణ వసతి కలిగిన కార్యాలయం మాత్రమే కాదు. అక్కడ అచ్చుకోసం వచ్చే రచయితల కూడలి కూడా. అక్కడి సమాజంలో కొత్త భావాల

అలజడులన్నీ ముద్రణాలయాలలో ప్రతిధ్వనిస్తాయి. ప్రెస్‌లు ప్రారంభించినవారే పత్రికలను కూడా మొదలుపెట్టారు. తెనాలి నుంచి మద్రాసు వలసలు కూడా 1940లు, 50లలో ఒక అనివార్య పరిణామాలు. మద్రాసు, సినీరంగ కేంద్రం కావడాన, కళాకారులకు, రచయితలకు కూడలి. తెనాలి కేంద్రంగా హేతువాద, మానవోద్యమాల ప్రభావంలో ఉండిన తన అభిరుచులను, జీవన వ్యాసంగాలను కలగలుపుకుని మద్రాసు వెళ్లారు. పత్రికలు ఎల్లకాలం నడవలేదు. ముద్రణను విస్తరించడానికి ఆయన హైదరాబాద్‌కు వచ్చారు. అభ్యుదయ భావశిబిరాల నుంచి వచ్చి హైదరాబాద్‌లో ముద్రణ చేపట్టిన అనేక ఉదాహరణలను మనం చూడవచ్చు. తెనాలి నుంచి మద్రాస్ మీదుగా హైదరాబాద్ చేరిన రవీంద్రనాథ్, ఈ ప్రయాణంలో సమకూర్చుకున్న స్నేహాలు అపురూపమైనవి, ప్రత్యేకమైనవి.

ముద్రణాలయాలు, తమ యంత్రాలకు మేతను సాహిత్యేతర రంగాల నుంచే అధికంగా పొందుతున్నప్పుడు, ప్రెస్‌లు క్రమంగా కేవల వ్యాపార కేంద్రాలుగా మారడం సహజం. కానీ, రవీంద్రనాథ్ తన ప్రయాణాన్ని మరచిపోకూడదనుకున్నారు. పత్రికను ప్రారంభించారు. సాహిత్య, కళారంగాలకు తాను అర్పించే నైవేద్యం అనుకుని **మిసిమి** ని ప్రారంభించారు. స్థాయిలో, సంస్కారంలో రాజీ లేదు. ఏ మిలమిలలు లేవు, కేవలం అక్షరాల **మిసిమి**, అంతే.

ఆయన లేకపోయినా, **మిసిమి** కొనసాగుతున్నది. మూడు దశాబ్దాల చరిత్ర చిన్నది కాదు. రవీంద్రనాథ్ పాదులు తీసిన మొక్క అది.

కె. శ్రీనివాస్
ఎడిటర్, ఆంధ్రజ్యోతి (దినపత్రిక)
హైదరాబాద్. ఫోన్: 998 541 1077.

---



ఆలపాటి రవీంద్రనాథ్

# రవీంద్ర సన్నుతి

**– ఆచార్య అనుమాండ్ల భూమయ్య**

*చదువ లే దాత డొక పెద్ద చదువు, కాని,*
*చదివినట్టి వారికి మించి చదివినాడు –*
*జీవితమును, మానవలోక జీవితమును;*
*"జ్యోతి" వెలిగించి చదివింపజేసినారు.*

*ఆత డాలపాటి రవీంద్రు, డతడు చదువు*
*కొన్న రచయితల రచనలకు "మిసి"మింత కూర్చి*
*పాతకోత్తముల హృదయద్వారములకు*
*పచ్చ తోరణముల గూర్చి పరిమళించె.*

*కాలమును హరించు టొకండె కాదు, హృదయ*
*సౌకుమార్యమును హరింపజాలినట్టి*
*పత్రికలను చదువ నలవాటు పడిన*
*వారికి **మిసిమి** నే చదువవలెనన్న –*

*క్రొత్త అభిలాష రగిలించి, క్రొత్త భావ*
*నేత్రము నొసంగిన నరేంద్ర ! నీవు భావి*
*తరములకు సన్నిహిత మార్గదర్శి వీవు.*
***మిసిమి** నీవయై బ్రతికిన మేటి వీవు*

*ధ్యానమున బుద్ధు డైన మహాత్ము నెరిగి*
*ఎరుక గలవాడె సకలమ్ము నెరుగు నంచు*
*ఎరిగి, బుద్ధుని బోధల నెరుకపరుప*
***మిసిమి** నొక దూతగా జేసి మసలినావు.*

*ఒక ముఖము "జ్యోతి", "సినిమా" మ రొక్క ముఖము,*
*ఒక ముఖమ్ము "రేరాణి", మరొకటి **మిసిమి***
*ముఖములుగ నొప్పెసగు చతుర్ముఖుడ వీవు;*
*చూపు నివి మార్గముల పరిశోధకులకు.*

ఆచార్య అనుమాండ్ల భూమయ్య, హైదరాబాద్. ఫోన్: 889 707 3999.



ఆలపాటి రవీంద్రనాథ్

# మనిషితనం అల్లిన వైజయంతి

– డా. వోలేటి పార్వతీశం

నిజమే! ప్రవాహానికి కొన్ని కొలమానాలుంటాయి. కానీ ఎప్పుడు? అది నదీప్రవాహమైనప్పుడు. ఎక్కడ పుట్టిందో, ఎంత దూరం ప్రవహిస్తుందో, ఎక్కడ సాగరాన సంగమిస్తుందో, ప్రవాహ వేగమెంతో, విస్తృతి ఎంతో, ఇటువంటివన్నీ లెక్కలు కట్టుకోవచ్చు. ఒకవేళ అది కాలప్రవాహమైతే కొలమానాలకు వీలుంటుందా? ఎప్పుడు పుట్టిందో తెలియదు. ఎందుకు పుట్టిందో తెలియదు. ఎప్పుడు ముగుస్తుందో తెలియదు. ఆద్యంతాలు బొత్తిగా తెలియవు. కానీ మనిషి తన సౌలభ్యం కోసం, తననో, తన చుట్టూ ఉన్న సమాజాన్ని సాపేక్షంగా చేసుకొని అఖండ కాల ప్రవాహాన్ని ఖండఖండాలుగా విభజించుకున్నాడు. కాలం పుట్టుక తెలియకపోయినా, తన పుట్టుక తెలుసు కనుక సమాజం పుట్టుకని, సమాజంలోని మనుషుల పుట్టుకల్నీ వారివారి జీవితాంతాలను అంచనా కట్టగలుగుతున్నాడు. కోట్లాదిగా పుడుతున్న జనం, కోట్లాదిగా మరణిస్తున్న జనం జనన మరణ చక్రం పరిభ్రమిస్తూనే ఉంది. ఇంతమంది జనంలో ఎంతమంది మనకో, సమాజానికో తెలుస్తున్నారు. ఎవరెందుకు పుడతారో? ఏ పని సాధిస్తారో? అంచనాలకు అందని విషయం. అయితే ఇన్ని కోట్లమంది జనంలో కొందరు ధన్యజీవులుగా మెదులుతారన్నది నిజం. వాళ్ళు కాలాతీత వ్యక్తులు. వాళ్లకి కాలప్రవాహంతో సంబంధం లేదు. తమ జీవితకాలం పూర్తి అయిపోయినా సరే, తరువాతి కాలానికి కూడా వాళ్లు మిగిలే ఉంటారు జ్ఞాపకాలుగా.

ఎక్కడో గుంటూరు జిల్లాలో మారుమూల గ్రామం గోవాడ. అప్పుడెప్పుడో వెళ్లిపోయిన 1922వ సంవత్సరం. అలాంటి చోట పుట్టటవేమిటి? ఇప్పటికీ మనం తెలుసుకోవడమేమిటి? ఆయన పుట్టిన నూరవ సంవత్సరం ఇది. బహుశః అందుకేనేమో, ఈ జ్ఞాపకాలు ఇంకా ప్రబలంగా ఉబికి వస్తున్నాయి. బాల్యం ఎవరికైనా బంగారమే. అటువంటి పసిడి శైశవం ఆలపాటివారికి ఉన్నదా? అప్పట్లో తురుమెళ్ల గ్రామంలో ఒక పాఠశాల ఉండేది. దక్షిణామూర్తిగారు ఆ బడికి ప్రధానోపాధ్యాయుడు. క్రమశిక్షణకు మరో అర్థం చెప్పాలంటే ఈ బడి పేరు చెప్పవచ్చు. ఈ బడిలోనే రవీంద్రనాథ్ విద్యాభ్యాసం మొదలైంది. మొదలైతే అయింది కానీ, అది ఎక్కువ కాలం కొనసాగలేదు. క్రమశిక్షణ పేరుతో, దక్షిణామూర్తిగారు చేపట్టిన చర్యలు, బాలరవీంద్రుని స్వేచ్ఛకు సంకెళ్లుగా పరిభ్రమించాయి. పసివయసులోనే పాఠశాల పైన విముఖత ఏర్పడిపోయింది. ప్రైవేటుగానే ఇంగ్లీషు చదువుకున్నారు – గ్రంథాలయంలోని పుస్తకాలన్నీ చదివారు.

తెలుసుకోవటం సరే! అది వ్యక్తిగతం. కానీ దానిని వ్యవస్థపరం చేయాలంటే తెలియజెప్పాలి! ఎలా? ఈ ఆలోచనలో నుంచి పుట్టిందే ప్రచురణాలయ ప్రకరణం. తొలిదశలో ముద్రణాలయం బ్రతుకుతెరువు కోసం మొదలై ఉండవచ్చు. కానీ, అది ప్రచురణాలయంగా మారాకా, ఆలపాటి వారిలోని పరిణతికి అది పతాకనెత్తింది. స్వాతంత్రోద్యమ సందర్భంలో ప్రచురణాలయాలు, గ్రంథాలయాలు సాధించిన విజయాలపైన రవీంద్రునికి సాకల్యమైన అవగాహన ఉంది. అందుకే ఈ రంగాన్ని ఎంచుకున్నారు. కళాకారుల్ని కలుసుకొనే వీలుంది, రచయితల్ని కలుసుకొనే వీలుంది, విద్యావేత్తలను, మేధావులను కలుసుకొనే వీలుంది. సమాజ సేవకుల్ని,

రాజకీయ ప్రముఖుల్ని కలుసుకొనే వీలుంది. ఎన్నెన్నో రంగాలు, మరెన్నెన్నో దృక్పథాలు వీటన్నింటినీ సంపుటీకరించే వేదిక దొరికింది. అందుకే ప్రచురణ ఆయన ముమ్ముందు జీవిత ప్రకరణాలు లిఖించింది.

1946లోనే తెనాలిలో జ్యోతి ప్రచురణాలయం ఊపిరి పోసుకుంది. ఈ ప్రచురణాలయ ప్రాంగణమే, మేధావి వర్గానికి కార్యశీలగా మారిపోయింది. రచయితలు, నటులు, ఉపాధ్యాయులు, కమ్యూనిస్టులు, హేతువాదులు, సామాజికవేత్తలు, రాజకీయ నాయకులు, ఎన్ని వైరుధ్యాలు, ఎన్నెన్ని చర్చలు. వీటన్నిటితో పాటు యం.యన్. రాయ్ భావజాలం. ఇవన్నీ మూకుమ్మడిగా ముప్పిరిగొన్న యౌవనదశ ఆయనది. నిగ్రహానికి విగ్రమ వాక్యంలా రవీంద్రునికి ఒక మూర్తిమత్వం ఏర్పడింది. ప్రచురణ మాధ్యమంలో పత్రికల నిర్వహణ ఆలపాటీ జీవన యానంలో ప్రథమాంకం. జ్యోతి, రేరాణి, సినిమా ఈ పత్రికలన్నీ ఆయన ఆలోచనలను సాకారం చేసిన అక్షర పుత్రికలు. నిజానికి వ్రాయటం పట్ల ఆయనకు పెద్దగా ఆసక్తి ఉన్నట్లు తోచదు. అయితే, వ్రాయించటంలో మాత్రం మహదిట్ట. వ్రాసిన దానిని చిత్రిక పట్టటం, మరిన్ని మెరుగులు దిద్దటం ఆయనకు భలే ఇష్టం. అంతేకాదు, ప్రవర్థమానమౌతున్న రచయితల్ని వెతికి పట్టుకోవడం, సముచిత ఆసనాలపైన వారిని ఆశీనులను చేయటం ఆయనకు ఇష్టమైన పనులు.

ఆలూరి భుజంగరావు, ఈదర లక్ష్మీనారాయణ శారద, ప్రకాశరావు, హితశ్రీ, రావూరి భరద్వాజ, శార్వరి, తాళ్లూరి నాగేశ్వరరావు ఇటువంటి కలాలలో సిరాను నింపింది, ఆలపాటివారే. కొత్త రచయితలకు, ప్రసిద్ధులైన చలం, కొప్పర సుబ్బారావువంటి రచయితల ప్రక్కన స్థానాలను కేటాయించటంవలన, కొత్త తరానికి ఆకాశాన్నంటిన సంతసం, ఈ కారణంగానే వాళ్లంతా ఆయనకు కృతజ్ఞులయ్యారు. అంతేనా? రావూరి భరద్వాజ, తన కుమారుడికి 'రవీంద్రనాథ్' అని ఆయన పేరే పెట్టుకున్నారు. ఇలాంటి ఉదంతాలు చాలా ఉన్నాయి. అవన్నీ కూడా ఆయన ఔన్నత్యానికి అద్దంపడతాయి.

హైదరాబాద్‌లో కళాజ్యోతి ప్రెస్‌లో మిత్రులతో జరిపిన సమాలోచనల్లో నుంచి, వారు అందించిన సహాయసహకారాల నుంచీ *మిసిమి* పత్రిక పుట్టింది. ముందు చెప్పాను కదూ! ప్రచురణ అవసరం కోసం ప్రకటించడానికి కాదని. ఆ మాటకు కట్టుబడిన సందర్భం అదే. ఒక మాసపత్రికకు పూర్తి స్థాయి సంపాదకునిగా ఆలపాటి రవీంద్రనాథ్ చేసిన కృషి నిజంగా సంస్తవనీయం.

మానవీయమైన విలువల్లోని రామణీయకత ఏమిటో, ప్రాధాన్యత ఏమిటో, తన పత్రిక ద్వారా తెలియజెప్పారని, ఆయన మిత్రవర్గం ఇప్పటికీ కితాబునిస్తారు.

ఆలోచనల్ని అక్షరాలుగా మలచి, వాక్యాలు నిర్మించి, వాటికి ప్రవాహయోగ్యతను కల్పించి ప్రజాసమూహాలనే పంటభూముల్లోకి వాటిని మళ్లించిన దార్శనికుడు ఆలపాటి రవీంద్రనాథ్. ప్రచురణకర్తగా పత్రికా సంపాదకునిగా ఆయన సాధించిన ఘనవిజయాలుగా వాటిని మనం తప్పక నమోదు చేయాలి. మన గురించి మనం ఏమాత్రం ఆలోచిస్తామోగాని, ప్రక్కవాళ్ల గురించి పదేపదే ఆలోచిస్తాం. వీళ్ల గురించి, వాళ్ల గురించే కాకుండా, ఎక్కడో ఉన్నవాళ్ల గురించి కూడా మనం ఎంతెంతో తెలుసుకోవాలని ఆసక్తిని ప్రకటిస్తాం. ఇది మానవ నైజం. కానీ ఎవరి గురించో కాదు, తనను గురించి తాను తెలుసుకోవటం ఆత్మజ్ఞత. అయితే మనను గురించి మనం వివేచించుకోవటం అంత తేలికైన పని కాదు. అందరూ ఈ పని చేయలేరు. కానీ దీనిని అలవోకగా సాధించిన వ్యక్తి రవీంద్రనాథ్. ఒకానొక సందర్భంలో తనను తానే ఆవిష్కరించుకుంటూ తన మిత్రునితో భావ చయనికను పంచుకున్నారు. నిన్ను నీవుగా ప్రేమించు, అనుభవించు. ఇలా జీవించడంలోనే నీ అసలుతనం ఉంది. అదే నీవు. అదే నేను. 'తనపట్ల తనకు' ఉన్న అవగాహన ఎంత స్పష్టమైనదో గమనిస్తే మనకి ఆశ్చర్యం కలుగుతుంది. మనిషిని విశ్లేషించి చూడటం మన, తన అన్న భేదం లేకుండా, మనిషి తనాన్ని మానవత్వాన్ని చూడగలగటం, ఆయనకు *మిసిమి* లా అబ్బిన విద్య. ఆద్యంతాలకు అతీతమై సాగే కాలగమనంలో ఏదో ఒక జన్మ, కారణ జన్మమౌతుంది. మరొక జన్మ మానవత్వం పరిమళించే గృహసీమకు తోరణమౌతుంది. కొన్ని జన్మలు, కాలాలతో కదిలే తిరునాళ్లౌతాయి. మరికొన్ని జన్మలు కాలాలను కొలిచే ఆనవాళ్లౌతాయి. కొన్ని జన్మలు ధన్యమౌతాయి. అవి ముందు తరాలకు మూర్ధన్యమౌతాయి. ఇటువంటి నేపథ్యంలో ఆలపాటి రవీంద్రనాథ్‌గారి శతజయంతి, కాలపురుషుని కంఠసీమన మనిషితనమై ప్రకాశించే వైజయంతి. నిన్న నేడు రేపు కూడా ప్రవహించగల ఉషస్స్రవంతి.

డా. వోలేటి పార్వతీశం - హైదరాబాద్. ఫోన్: 944 003 1213.

# రవీంద్ర గీతి

– ఆచార్య పప్పు వేణుగోపాలరావు

తరతరాలుగా మన సంప్రదాయంలో ఒక పద్ధతి ఉంది. ఏదేనా ధర్మ సంకటం వస్తే ఏంచెయ్యాలి. వేదాలలోనో, శాస్త్రాలలోనో, ధర్మశాస్త్రాలలోనో, పురాణాలలోనో అటువంటి పరిస్థితి కలిగినప్పుడు ఏది ధర్మమో చెప్పి ఉంటారు. అది తెలుసుకుని అనుసరించడం. అలా ఏ శాస్త్రంలోను మనకి తట్టని, తోచని, కనిపించని సందేహాలున్నప్పుడు ఏం చెయ్యాలో శ్రీ కృష్ణుడు భగవద్ గీతలో చెప్పాడు. శ్రేష్ఠులు, ఉత్తములు, మార్గదర్శకులైనవారు, ఏది ఆచరిస్తారో అది లోకానికి ప్రమాణం. వారి జీవితం, వారి ఆచరణ మనకు ప్రమాణం. మనం దానిని అనుసరించాలి. ***యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః / సయత్ ప్రమాణం కురుతే లోకః తదనువర్తతే*** *–(3.21)*

నాకు ఆలపాటి రవీంద్రనాథ్ అలా కనిపిస్తారు. దానికి రెండు మూడు కారణాలున్నాయి. ఆయనకు చాలామంది హేతువాది అనే ముద్ర వేశారు. కొంతవరకు సమంజసమే కాని ఆయన నిజానికి సంప్రదాయవాది. సామాజిక విలువలు, కుటుంబ పరంపర, వ్యక్తిగత స్వాతంత్ర్యం, తను నమ్మినది ఆచరించడం, ఇలా కొన్ని గొప్ప లక్షణాలు ఆయనలో కనిపిస్తాయి. ఆయన ఎవరినో అనుసరించాలనో, నలుగురూ నడచిన తోవలో నడవాలనో అనుకోలేదు. అలా అనుకుని ఉంటే ***మిసిమి*** లాంటి ఒక మాసపత్రిక ఈనాటికి నిలిచి ఉండేది కాదు. ముక్కుకు సూటిగా వెళ్ళినా ఎదుటివారిని నొప్పించే స్వభావం కాదాయనది. పురాణంవారు మధురవాణి ఇంటర్వ్యూలలో కొందరిని దుయ్యబట్టిన కొన్ని సంఘటనలు రవీంద్రనాథ్‌గారే స్వయంగా ఎడిట్ చెయ్యడం దానికో తార్కాణం. జీవితంలో ఒడిదుడుకులకు లొంగని వ్యక్తిత్వం ఆయనది. నిజానికి ఆయన ఒక యోగి. రాగద్వేషాలకు అతీతుడు. అయినా తను నమ్మింది సాధించాలానే తపనే ఆయన పాత్రికేయ ప్రపంచంలో కాలు పెట్టడానికి కారణం.

ఆయన *జ్యోతి* పత్రిక నడిపి కొత్తకొత్త రచయితలను ఆలోచనావిధానాన్ని పాఠకులకు పరిచయం చెయ్యడంలో పాత్రికేయ లోకంలో నూతన గవాక్షాలు తెరుచుకున్నాయి.

ఆయన సృష్టించిన లోకంలో ***మిసిమి*** ఒక విశిష్టమైన స్థానం పొందింది. మొదట పక్షపత్రికగా మొదలై నాలుగు నెలలలో మాసపత్రిక రూపం దాల్చి *భారతి* వంటి పత్రికగా తనదైన ఒక అనన్యమైన స్థానంతో ఈ నాటికీ రసజ్ఞుల మన్ననలు పొందుతోందంటే అది వారి దూరాలోచనకు, సాహసానికి పట్టుదలకి ప్రతీక. వారు ఏ దృష్టితో ***మిసిమి*** స్థాపించారో ***మిసిమి*** ఈనాటికీ ఆ విలువలను, ఆ ఆశయాలను సమర్థవంతంగా అనుసరిస్తోంది. ఇదే ఆయనకీ శత జయంతిలో గొప్ప కితాబు. ఆయనను నేను ఒకేసారి చూశాను. మదరాసులో మిత్రులు BSR కృష్ణగారితో. నాకు బాగా మిత్రులైన, డి.వి. నరసరాజుగారు, జగ్గయ్యగారు, పురాణం సుబ్రహ్మణ్య శర్మగారు వారికీ మిత్రులు. రవీంద్రనాథ్‌గారి గురించి నాతో తాపీ ధర్మారావుగారి కుమారులు రామమోహన్‌రావుగారు రెండుమూడుసార్లు ప్రస్తావించారు. ఎదో సాహిత్యపరమైన సంభాషణలో.

వీటన్నిటివల్ల నాకర్థమైన రవీంద్రనాథ్ ఒక కృషీవలుడు, యోగి, అనిపిస్తుంది. వారి కుమారులలో తండ్రి ఆశయాలపట్ల ఉన్న విశ్వాసం హృదయంగమమైనది. ఆస్తికి మాత్రమే వారసులవాలనుకునే రోజులలో ఆశయాలకు అండగా నిలించిన వారి కుటుంబం ఆదర్శప్రాయమైనది.

రవీంద్రనాథ్ గారు బాగా ఆలోచించి ఒక మార్గం ఎన్నుకుంటే ఆర్థికంగా అది విజయవంతం కాకపోయినా దానిమీద ఏ సందేహాలు ఉండేవి కాదు ఆయనకు. సినీమా రంగంలో ఎందరో మిత్రులున్నా దాని జోలికి పోకపోవడానికి కూడా ఆయన నిశ్చలమైన ఆలోచనా విధానమే కారణం. నమ్మిన విషయాన్ని పూర్తిగా నమ్మాలి, అక్కడ సందేహాలకు తావు లేదు. అదే *భగవద్ గీత* లో శ్రీకృష్ణుడు చెప్తాడు.

జ్ఞానం లేనివాడు, శ్రద్ధ లేనివాడు, అన్ని విషయాలలో సంశాయాలే ఉన్నవాడు, ఇహ పరాలు రెంటిలోనూ ఏమీ సాధించలేడు. సందేహప్రాణి నశిస్తాడు అని.

***అజ్ఞశ్చ అశ్రద్ధదానశ్చ సంశయాత్మా వినశ్యతి (4.40)***

ఈ సందేహం అనేమాట విచిత్రమైనది. దేహాన్ని ఆవరించి ఉంటుంది గనుక అది సందేహం. దేహం ఉన్నన్నాళ్ళూ సందేహాలు ఉంటూనే ఉంటాయి. రవీంద్రనాథ్ గారు లోకాన్ని ఆకళింపు చేసుకున్నవారు. ఆలపాటివారు ఒక క్రాంత దర్శి. ఆయన శతజయంతి ద్వారా ఆంధ్ర జాతి జాగృతమై తమ సంపదను, సంప్రదాయాన్ని, విలువలను గుర్తిస్తుందని ఆశిద్దాం.

ఆచార్య పప్పు వేణుగోపాల రావు
చెన్నై. ఇ-మెయిల్: pappuvenu@gmail.com



సర్వేపల్లి రాధాకృష్ణతో రవీంద్రనాథ్

# సాహితి చైతన్య శిల్పి ఆలపాటి

– *ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ మంత్రివర్యులు*

సమాజంలో అమానుష పరిస్థితులు నెలకొని అప్రతిష్టపాలు చేసే పరిస్థితిని కళ్లముందు మెదులాడుతున్నప్పుడు నైతిక భావాల ఉన్నత ప్రమాణాలను ప్రాచుర్యంలోకి తేవడంకంటే సాహిత్యానికి ఉత్తమమైన కర్తవ్యమేమీ ఉండదని *కన్యాశుల్కం*లో గురజాడ అప్పారావుగారు అన్నారు. సాహిత్యం ద్వారా సమాజంలోని సమస్యలకు పరిష్కారం వెతకాలనుకున్న సాహితీ ప్రియుడు. అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించి, జ్ఞానం అనే వెలుగును ప్రసాదించే దిశగా అడుగులు వేసిన ఉన్నతమైన వ్యక్తి మన ఆలపాటి రవీంద్రనాథ్. అందుకే సాహిత్యం మీద ధ్యాస పెట్టారు. ఎన్నో సమస్యలను అధిగమిస్తూ సాహిత్యమే శ్వాసగా జీవించిన వ్యక్తి మన ఆలపాటి.

ఏ మనిషి పుట్టుకతోనే గొప్పవాడు కాడు. కాని తన పుట్టుకకు అర్థం, సార్థకం చేసుకున్నవారే రవీంద్రనాథ్. తాను గడించిన సాహిత్య పండిత సంపద సాంఘిక ప్రయోజనం కోసం చేకూర్చుకున్న మహోన్నతమైన వ్యక్తిగా, తన ప్రజ్ఞా పాటవాలతో లక్షలాదిమంది ప్రజలను అభిమానులుగా మార్చుకున్న సామాన్యుడు, ఎంతోమంది రచయితలను ప్రోత్సహించిన సాహితీ చైతన్య శిల్పి ఆలపాటి. సారస్వతానికి, కళలకు గౌరవాన్ని ఆపాదిస్తూ పత్రికలను స్థాపించి, ప్రచురించబడే విషయాల ఎంపికలో అత్యున్నత ప్రమాణాలను నిలుపుకుంటూ తన ప్రత్యేకతను చాటుకున్నారు. *జ్యోతి, రేరాణి, సినిమా,* ***మిసిమి*** పత్రికల స్థాపన ద్వారా శాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారం చేశారు.

ఆలపాటి రవీంద్రనాథ్ గుంటూరు జిల్లా, అమృతలూరు మండలం గోవాడలో 1922, నవంబరు 4న వెంకట్రామయ్య, అమ్మెమ్మలకు జన్మించారు. ఒక మహిళ చదవు ఆ కుటుంబానికే కాదు సమాజానికి సైతం వెలుగునిస్తుంది. పాఠశాల హెడ్‌మాస్టర్‌గా ఉన్న దక్షిణామూర్తి క్రమశిక్షణలో యిమడలేక చదువుకు స్వస్తి పలికినా... డిగ్రీ లేని పాండిత్యం, సాహిత్యంతో కూడిన సహజ సిద్ధమైన సరస్వతి పుత్రుడు మన ఆలపాటి. అలాగే తల్లి అమ్మెమ్మ విద్యావంతురాలు కావడంతో ఆ ప్రభావం రాజేంద్రనాథ్‌గారిపై బాగాపడింది. అందుకే సమాజాన్ని మేలుకొల్పేందుకు నడుం బిగించి వడివడిగా అడుగులు వేశారు. అందరూ చదువు మీద ధ్యాస పెడితే రవీంద్రనాథ్ గారు మాత్రం సమాజమనే పుస్తకాన్ని చదవటం మొదలు పెట్టారు. గోవాడ గ్రామంలో గ్రంథాలయం స్థాయి ఆయనకు సరిపోక తెనాలికి చేరుకున్నారు. అప్పటికే ఎం.ఎన్. రాయ్ నాయకత్వాన మానవవాద ఉద్యమం ముమ్మరంగా సాగుతున్నది. ఆయనకు ఎంతో ఇష్టమైన వాతావరణం అక్కడ ఉండటంతో ఆర్థిక ఇబ్బందులున్నా పత్రికలను ప్రారంభించే సాహసం చేసి ప్రజలను చైతన్యపరులుగా తీర్చిదిద్దడానికి కంకణం కట్టుకున్నారు. కళలకు కానాచి అయిన తెనాలి పట్టణానికి రవీంద్రనాథ్ గారి సాహిత్య ప్రక్రియ తలమానికం.

భారతీయ చరిత్రను, సంస్కృతిని, తత్వాన్ని, బౌద్ధాన్ని, శాస్త్రీయ దృక్పథంతో చూడాలన్న ఎం.ఎన్. రాయ్ భావజాలంతో 1946లో తెనాలిలో జ్యోతి ప్రెస్ ప్రారంభించారు. ఆలపాటివారి ప్రెస్‌ద్వారా కళాకారులు, పండితులు, గాయకులు, నటులు, ఉపాధ్యాయులతో రాడికల్ హ్యూమనిస్టులకు, హేతువాదులకు, స్వతంత్ర ఆలోచనాపరులకు కేంద్రమైంది. ఆయన పత్రికల ద్వారా బుద్ధుడి బోధనలకు విస్తృత ప్రచారం కల్పించారు.. రవీంద్రనాథ్‌కు మరొక ప్రత్యేకత ఏమిటంటే.. రచయితలతో రాయించడం ఆయనకున్న గొప్ప విద్య. 1948లో *ఆంధ్రప్రభ* పత్రికకు ఎడిటర్‌గా పనిచేస్తున్న నార్ల వెంకటేశ్వరావు రాసిన సంపాదకీయంపై "జ్యోతి" పత్రిక సంపాదకుడుగా ఉన్న ఆలపాటి రవీంద్రనాథ్ వ్యాఖ్యానం చేస్తూ "ఇది బొక్క

బెరడానా? నార్ల సంపాదకీయమా?" చెప్పుకోండి చూద్దాం అంటూ రాశారు. తెనాలి నుండి వెలువడుతున్న ఆ పత్రిక వ్యాఖ్యానం చూసి, కొడుకు చనిపోయినరోజే ఇలాంటి వ్యాఖ్యలు వినాలా అని నార్ల బాధపడిన విషయం తెలిసి రవీంద్రనాథ్ వెంటనే మద్రాసు వెళ్ళి నార్లకు క్షమాపణ కోరారు. *జ్యోతి* పత్రికలో వ్యాఖ్యానానికి కాదు. కుమారుడు చనిపోయాడని తెలియదనీ, అందుకు మన్నించమనీ కోరడం ఆయన విఘ్నతకు, ఔనత్యానికి, వ్యక్తిత్వానికి మచ్చుతునక ఇది రవీంద్రనాథ్ యొక్క విశిష్టత. రెండు కథలు పంపిస్తాను ప్రచురించే దమ్ముందా అని సుప్రసిద్ధ రచయిత చలం విసిరిన సవాల్‌ను స్వీకరించి స్టేషన్ పంపు, హంకో మొహొబత్ కథలను ప్రచురించారు. ఆ తరువాత ఛాలెంజ్ లేకుండా పంపిన కళ్యాణిని రవీంద్రనాథ్ తిరస్కరించారు.

రవీంద్రనాథ్ పత్రికలకు నలుమూలల నుండి రచయితలు తమ వ్యాసాలు పంపేవారు. రవీంద్రనాథ్ పత్రిక *రేరాణి* యువతలో విపరీతమైన ఆకర్షణగా ఉండేది. ఆనాడు ఆలపాటి కృష్ణకుమార్ అమెరికా నుంచి తెప్పించిన టైప్ రైటర్ *జ్యోతి* ప్రెస్‌కు బహుకరించడం తెనాలికే అపురూపం. రవీంద్రనాథ్ పెట్టిన పత్రిక సినిమా తెనాలికి ఉన్న సినిమా బంధాలవలన ఆ పత్రిక అందరినీ ఆకర్షించింది. సినిమా పత్రిక రవీంద్రనాథ్ జీవితంలో మరో ఘట్టం. తెనాలి నుండి అలాంటి పత్రిక నడపడం గొప్ప సాహసం. ఆ రోజులలో సినిమా రంగం అంతా మద్రాసు కేంద్రంగా ఉండేది. అయినా సాహసించి, సినిమా పత్రిక పెట్టి, సినిమాల రివ్యూలు, తారల విశేషాలు పాఠకులకు అందించారు. తెనాలి నుండి అప్పటికే కాంచనమాల, వరలక్ష్మివంటివారు రంగంలో ఉన్నారు. రవీంద్రనాథ్ అప్పుడప్పుడూ మద్రాసు వెళ్ళి వస్తుండేవారు. మద్రాసు పత్రికల స్థాయిలో తెనాలి నుండి విజయవంతంగా నడిచినా కొన్నాళ్ళ తరువాత ఆ పత్రిక నిలిపేశారు. రవీంద్రనాథ్ ప్రోత్సాహంతో ధనికొండ హనుమంతరావు, కొలను బ్రహ్మానందం, శారద, ఆలూరి భుజంగరావు, ఎం.ఎల్. నరసింహారావు, అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నెల్లూరి కేశవస్వామి రావూరి భరద్వాజ, శార్వరివంటివారు వెలుగులోకి వచ్చారు. ఆయన స్నేహమాధుర్యం గొప్పతనం ఆనాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాసిన రావూరి భరద్వాజగారికి జరిమానా వేస్తే స్వయంగా రవీంద్రనాథ్‌గారే కట్టి తనవద్దే ఉంచుకున్న మహోన్నతుడు. చిన్న పాదుచేసి, నీరుపోసి నేను పెరగడానికి బతకడానికి దోహదం చేసిన దయామూర్తి రవీంద్రనాథ్‌గారేనని భరద్వాజ్‌గారు ఆరాధనా భావంతో తలుచుకున్నారు. ఆ కృతజ్ఞతతోనే రావూరి భరద్వాజ తన పెద్ద కుమారిడి పేరు రవీంద్రనాథ్ అని పెట్టుకున్నారు. తెనాలి, విజయవాడలో జీవితం గడిపిన అనంతరం హైదరాబాద్‌లో కుదుటబడ్డారు. సాంస్కృతిక రంగాన్ని చేబట్టి అనుకోని విజయాలను సాధించారు. అది బృహత్తర కృషి. యువతను బాగా ఆకట్టుకున్న ఈ రంగం ఎంతో ప్రభావాన్ని కనబరిచింది. అమెరికా, ఇంగ్లండ్ పర్యటించి సాంఘిక శాస్త్రాల విజ్ఞాన సర్వస్వంతో తన లైబ్రరీని ముందు చూపుతో నడిచారు. యూనివర్సిటీలకు సైతంలేని అనేక గ్రంథాలు వీరి దగ్గర ఉండటం అనేక సందర్భాల్లో రిఫరెన్స్‌కు పనికొచ్చాయి. మరోవైపు బౌద్ధాన్ని అధ్యయనంచేసి, సిలోన్, టిబెట్, థాయ్‌లాండ్ నుండి విశిష్ట గ్రంథ సేకరణ చేశారు. అమెరికా నుండి 40 ఏళ్ళపాటు టైం మాగజైన్, ఎవర్ గ్రీన్ పత్రిక తెప్పించారు. అనేకమందితో సంప్రదించి తన సొంత లైబ్రరీని సంతరించుకోవడం నిత్యకృత్యంగా పెట్టుకున్నారు. బూదరాజు రాధాకృష్ణ, ఇన్నయ్య, తాళ్లూరి నాగేశ్వరరావు, సి. ధర్మారావు, రావూరి భరద్వాజలతో చర్చించి **మిసిమి** ని 1990లో పక్షపత్రికగా ప్రారంభించారు. తరువాత మాసపత్రికగా మార్చారు. **మిసిమి** ఆనాటి నుంచి ఈనాటివరకు విజయవంతంగా కొనసాగుతున్న ఏకైక పత్రిక. పేరుకు తగ్గట్టుగా ప్రతి నెల అందమైన చిత్రాలతో కళాత్మకతకు పెద్దపీట వేస్తూ పాఠకులను పలకరిస్తుంది, పులకరింపజేస్తుంది. రవీంద్రనాథ్ సంజీవదేవ్‌వంటివారితో బౌద్ధం గురించి రవీంద్రనాథ్ చర్చించేవారు. బౌద్ధంపై వివిధ దేశాలలో ప్రచురితమైన రచనలు తెప్పించేవారు.

తెలుగు పత్రికలు, హిందూ దినపత్రిక **మిసిమి** ని గుణాత్మకంగా మెచ్చుకోవడం గమనార్హం. **మిసిమి** లో విశ్లేషణ, చదవటంతో సమాజాన్ని చదివిన అనుభవం పాఠకులకు తప్పకుండా కలుగుతుంది. ఈ దేశంలో వాణిజ్య ప్రకటనలు లేకుండా దశాబ్దాలుగా వెలువరించబడుతున్న ఏకైక మాస పత్రిక **మిసిమి** మాత్రమే. **మిసిమి** పత్రిక ద్వారా ప్రజల్లో చైతన్యం నింపేందుకు తండ్రి వారసత్వాన్ని బాపన్న, దేవేంద్రలు పుణికిపుచ్చుకున్నారు. అంతే కాకుండా ఆ తరువాత వచ్చిన మూడోతరం వారసులు రామ్‌నాథ్, కార్తీక్‌లు సైతం **మిసిమి** బాధ్యతను తమ ప్రథమ కర్తవ్యంగా నడుపుతున్నారు. అదేవిధంగా చెన్నూరు ఆంజనేయ రెడ్డి, వల్లభనేని అశ్వినీకుమార్, ఓలేటి పార్వతీశం ప్రస్తుత బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మి

# రసార్ద్ర రేఖ!

**- వల్లూరి శ్రీరామచంద్ర మూర్తి**
*ఆధ్యాత్మిక శాస్త్రవేత్త*

కడలిని కుండలో బంధించటం ఎలా?

అలలను అరచేతిలో ఒడిసిపట్టటం ఎలా?

కొన్ని వ్యక్తిత్వాలను రేఖామాత్రంగా లిఖించటం ఎలా?

కాలపు ఇసుక ఎడారిలో కొందరు వదలిన పద ముద్రలను అనుసరించటం ఎలా?

ఒకే జీవితం సహస్రదళ పద్మంగా, శతపత్ర సుందరంగా, బహుముఖీనంగా, ప్రతిభామంతంగా, వేవేల వెలుగులను సునాయాసంగా ఇముడ్చుకుని, భావ పరిమళాలను ఎల్లెడలా వెదజల్లటం సాధ్యమేనా?... ఇన్ని ప్రశ్నల, ఆలోచనల మధ్య పురుడు పోసుకుంటున్న ఈ సంక్షిప్త రచన, అద్దంలో కొండ! కొండ, అచలం! అద్దం, అబద్ధం చెప్పదు!! ఆ కొండ శ్రీ ఆలపాటి రవీంద్రనాథ్ గారు! వసివాడని, వన్నె తరగని, చిన్నె కరగని *మిసిమి* కి తండ్రి!

'కళాజ్యోతి'ని అఖండ విజ్ఞాన దీపమాలికగా సంకల్పించి, కల్పించిన విధాత! ఈ రెండింటినీ వారసత్వపు హక్కుగా కాక, బాధ్యతగా నిర్వహిస్తున్న సత్పుత్ర సంతతికి, 'పుత్రాధిచ్ఛేత్ పరాజయం' అనే అపరాజితానందానికి అసలు తండ్రి! రాయని భాస్కరుడు. రాయించిన భాస్వరుడు. రాయిస్టు, రేషనలిస్టు, అంతకుమించి హ్యూమనిస్టు. దృక్పథం, శాస్త్రీయం. నడక, కళాత్మక జీవనం వైపు. ప్రత్యక్ష లోకాన్ని క్షుణ్ణంగా చదివిన, చదువరి! అధ్యయన శీలి, ప్రతిభాశాలి, ప్రయోగశీలి. ఏటివాలు ప్రయాణం నచ్చని, ఎదురీతగాడు! జీవితాన్ని ఆయన నడపలేదు, గడపలేదు, జీవితాన్ని జీవించిన బుద్ధజీవి! తాను నమ్మిన సిద్ధాంతాలకు బద్ధజీవి!

తాను ఎంచుకున్న ఏ రంగంలోనైనా తానే వైతాళికుడు.

ఆయన జీవితం, జీవనం రసాత్మకం! అది ఆశయాల, ఆదర్శాల కలనేత! పలుకుని, కులుకుని నిస్వార్థంగా ప్రేమించిన, రసపిపాసి! స్వాత్మానందమే ఆయన సౌందర్యం!

ప్రతిభను, ప్రజ్ఞను పసిగట్టి, పాదుకట్టి, ఎదిగే దాకా కంచెకట్టి ప్రపంచానికి అందించిన ఔదార్య స్ఫూర్తి. పరస్పర విరుద్ధ భావజాలంతో నడిచే ప్రపంచంలో తన విస్పష్ట, వైవిధ్య భావసంపదను ఆజన్మాంతమూ నిలుపుకున్న భాగ్యశాలి.

సుమారు దశాబ్ద కాలం, ఆయనను చూసి, కలసిన సందర్భాలు నిత్య స్మరణీయాలు, రమణీయాలు, వరణీయాలు. ఆయన జన్మస్థలం గోవాడ, తిరునాళ్ళకు ప్రసిద్ధి! నా జన్మస్థలం తురుమెళ్ళ, విద్యాభ్యసనానికి సుప్రసిద్ధం.

గుంటూరు జిల్లా, తురుమెళ్ళలో ఆయన కొంత చదువుకోవటం, నన్ను పెంచుకున్న నా అమ్మమ్మ గోవాడ తిరునాళ్ళకు నన్ను తీసుకువెళ్ళటం, యాదృచ్ఛికంగా అనిపించే అధివాస్తవం! ఆ రకంగా మేమిద్దరం 'ఆ భూమి పుత్రులం'. అది నాకు అందమైన ఆబాల్య జ్ఞాపకం.

'కళాజ్యోతి'తో రెండు దశాబ్దాల నా అనుబంధం ఎంతో పవిత్రమైనది. వ్యాపారబంధం లోబరచుకోని, ఆప్యాయత, మైత్రి, వాత్సల్యం వంటి ఉదాత్త స్థాయిలో నిలచిన, నిత్య జ్యోత్స్న. దేవేంద్రనాథ్ గారు, బాపన్నగారు చూపే ప్రత్యేక ప్రేమ ఎనలేనిది. ఎంతో విలువైనది. ఇప్పుడు రామనాధ్ గారు వారికంటే భిన్నం కాదు.

ఇక *మిసిమి*! 25 సంవత్సరాలుగా అభిమాన పాఠకుడిని. అప్పుడపుడూ రచయితను. కాలగమనంలో, కాలానుసారం తనను తాను 'విజ్ఞానపీఠ' స్థాయిని సంతరించుకుంటున్న *మిసిమి*, నవనవోన్మేషం! సంపూర్ణ బౌద్ధ వాఙ్మయ స్ఫూర్తితో *మిసిమి*, అన్నపురెడ్డి గారి సంపాదకత్వంలో పరిమిత పరిధిలో చాలా కాలం కొనసాగి,అశ్వనీకుమార్ గారి సంపాదక సారధ్యంలో వైవిధ్యం సంతరించుకుని విభిన్న రీతిలో అనేక క్షేత్రాలను తడుముతూ ఉదాత్త స్థాయిలో సాగుతున్నది. మానవ వికాసాన్ని, చరిత్రగతిని, పురావైభవాన్ని సకల జన హృదయోల్లాస పులకిత పుంభితంగా, నిండుగా, ఒడ్డెరుగని కళాస్రవంతిగా, తెలుగుల లోగిళ్ళను నిత్యం తడుపుతున్న, తడుముతున్న, *మిసిమి* తెలుగు జాతి సంస్కార రేఖ!

రవీంద్రనాథ్‌గారి 'శత జయంతి' ఒక సాంస్కృతిక వైజయంతి. ఆయన స్మృతి, ఎన్నటికీ ఆరని జ్యోతి. అది కళాత్మకం, కాల యవనిక మీద చిర ముద్ర!

ఆయన జ్ఞాపకం, చిలుకవాలిన, వన్నెల వృక్షం!

ఇంటా, బయటా, అన్నిటా, అంతటా తన వ్యక్తిత్వంతో, శ్వాసించిన అమృత కలశం, ఆయన జీవితం!

ఆయన గత కాలంలో వెలిగిన దివ్వె!

ఆగామి కాలాలను వెలిగించే స్ఫూర్తి తేజో శిఖ! మి

---


వి.యస్.ఆర్. మూర్తి, ఆధ్యాత్మిక శాస్త్రవేత్త, హైదరాబాద్.
ఫోన్: 944 060 3499.

# చతుర్ముఖ జ్యోతి
## (రవీంద్ర స్మృతికి జోహార్లు)

– ప్రొ. రావినూతల సత్యనారాయణ



ఆలపాటి రవీంద్రనాథ్

**ప్రస్తావన:**

విఖ్యాతులైన వ్యక్తుల స్మృతిని స్మరించుకుంటూ అభినందన సంచికలు, షష్టిపూర్తి సంచికలు వెలువరించుట మన సంప్రదాయము. కొంతమంది విశిష్ట వ్యక్తులకు వారితో సంబంధమున్న అభిమానులు, మిత్రబృందం అధిక సంఖ్యలోనేగాక, అన్ని రంగాలలోను ఉంటారు. శాస్త్రజ్ఞులు, విశేషజ్ఞులు, విద్వాంసులు, కవులు, గాయకులు, జ్ఞానులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ వేత్తలు, ఉన్నతాధికారులు, రచయితలు, అమితంగా ఆదరాభిమానాలు ప్రకటించే సాధారణ వ్యక్తులు, సహాయసహకారాలను అందుకొనినవారు, ఎందరో ఉంటారు! అంతేకాక, ఆ విఖ్యాత వ్యక్తి, సమాజానికి అందజేసిన సేవలు, సంస్థాగతంగా ఆయన సాధించిన విజయాలను ప్రతి రోజు గుర్తుకు తెచ్చుకొని, ఆ విశిష్ట వ్యక్తి లక్షణాలను స్తుతించేవారిని సహితం మనం రోజూ చూస్తుంటాము. సరిగ్గా అదే జరిగింది కీ.శే. ఆలపాటి రవీంద్రనాథ్ గారి విషయంలో! అందుకే వెలుగులోనికి వచ్చింది ***రవీంద్ర స్మృతిసంచిక.*** సుందరమైన తెలుగు లిపిలో, అతి సుందరమైన చిత్రపటాలతో, ఆకర్షణీయ రంగు చిత్రాలతో, చక్కని కాగితంపై, మనసునాకట్టుకొనే మంచి రచనలతో. తెలుగునాడులో నేడు ప్రసిద్ధులైన మేధావులందరు, ఈ సంపుటికి రచనలందజేసి, శ్రీ రవీంద్రనాథ్‌పై వారికిగల అవ్యాజ ప్రేమను, హృదయ కంపనలను, ఆదరాభిమానాలను, శ్రద్ధాభక్తులను, వ్యక్తపరచారు. అన్ని వయసులవారు, ఆ సౌజన్యమూర్తి పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని (మూర్తిమత్వం) మనముందు ప్రతిష్టించారు. అదే, మన కన్నుల ముందు దర్శనమిచ్చే శిల్పాకృతి ***రవీంద్ర స్మృతి*** అనే ఈ గ్రంథం. ఇంతమంది ప్రముఖ వ్యక్తుల నుండి ఏ రూపంలోనైనా, ఇన్ని రచనలు, పత్రికా స్పందనలు, యేకీకృతం చేయుట అసాధారణ విషయం. రచనలు పొందుపరచుట ఒక యజ్ఞ సమానమయితే, వాటిని తగురీతిలో అతి తక్కువ ముద్రణా లోపములతో గ్రంథ రూపంలో, ఎక్కడికక్కడ, సముచిత చిత్రాలతో ఆహ్లాదకరంగా అమర్చి రూపొందించుట మరో యాగంలాంటిది. ఇంతటి గొప్ప పని సాధించిన ***రవీంద్ర స్మృతి*** సంపుటి సంపాదక మహాశయులు ***సహవాసి*** (జంపాల ఉమామహేశ్వర రావుగారు) ప్రశంసనీయులు. ఈ స్మృతి సంపుటికి, దాదాపు 45మంది ప్రముఖులు తమ తమ రచనలు అందజేశారు. కొందరు తక్కువ మాటలతో ఎక్కువ భావపరంపర వ్యక్తపరుస్తే, మరికొందరు వివరణాత్మకంగా తమ అనుభూతి అనుకంపాలను అక్షరరూపంలో చిత్రించారు. రవీంద్రనాథ్‌గారితో వారివారి అనుభవాను బంధాలను ప్రస్ఫుటపరచారు. అందరూ కలిసి రవీంద్రనాథ్ గారి పూర్ణమూర్తిమత్వం, ఆయన యొక్క విశిష్ట వ్యక్తిత్వాన్ని విస్మరించక, రూపుకట్టే యత్నం చేశారు! అది అత్యంత ముదావహం. ఈ పుస్తకాన్ని ***రవీంద్ర చతుర్ముఖ జ్యోతి*** గా భావించి, అందులోని విశేషాలు నాలుగు స్రవంతులుగా ప్రవహించి ఏకోన్ముఖమై శిల్పసాగరంగా పరిణతి చెందిన విధానాన్ని, విశేషాలను, విజ్ఞులైన పాఠకుల ముందు ఉంచుటయే, ఈ వ్యాసం యొక్క ప్రధానోద్దేశం.

ఆ ప్రయత్నంలోని సఫలతా మూల్యాంకణం, విజ్ఞులకే వదులుదాం! ఈ వ్యాసం చదువుతున్నప్పుడూ, చదివిన తర్వాత, రవీంద్రనాథ్‌గారి ఆర్ద్రత, సౌహార్ధం, సంస్కారం, సౌజన్యం పాఠకుల తలపులలో పరిమళాన్ని వెదజల్లుతాయని నానమ్మకం.

*"సత్పురుషుల మంచితనం - ఘుంఘూనిల ధాటి కాగి / దిగంతాల పర్యంతం - సుగంధాలు పంచుతుంది"* అన్నట్లుగా!

**చతుర్ముఖ జ్యోతి:**

దీనిని నాలుగు పాయలుగా భావించడమైనది. ఆ నాలుగు పాయలు: రవీంద్రనాథ్, వారి పరిచయ స్రవంతి, పత్రికలు (జ్యోతి, రేరాణి, సినిమా), ***మిసిమి***. ఈ చతుర్ముఖ జ్యోతిలోని తొలి పాయ రవీంద్రనాథ్‌గారి జీవిత విశేషాలు. ఆయన బాల్య చర్యలను గూర్చి మనకు ఎక్కువ విశేషాలు తెలియనప్పటికీ, కొన్ని వివరాలు తెలుసుకొనుట మన కర్తవ్యం. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో, తెనాలి తాలుకా గోవాడ అనే గ్రామంలో ఓ రైతు కుటుంబంలో నవంబరు 4వ తేదీన 1922వ సంవత్సరంలో జన్మించారు శ్రీ ఆలపాటి రవీంద్రనాథ్‌గారు. ఆయన తల్లి తండ్రులు ఆలపాటి వెంకటరామయ్య, అమ్మెమ్మగారలు. రవీంద్రనాథ్‌గారికి ఒక సోదరుడు, ముగ్గురు అక్కచెల్లెండ్రు. రవీంద్రనాథ్‌గారి విద్యాభ్యాసం కింగ్ జార్జి కొరొనేషన్ హైస్కూల్‌లో ప్రారంభమైనప్పటికీ, మధ్యలోనే ఆగిపోయింది. సహజంగా స్వేచ్ఛాప్రియుడైన రవీంద్రనాథ్‌కు, క్రమశిక్షణ చట్రములో నడిచే పాఠశాల వాతావరణం నచ్చలేదు. అందుచేత స్కూలు చదువుకు త్వరలోనే స్వస్తి చెప్పారు. అంతేగాని, విద్యాభ్యాసానికి కాదు. ఇంట్లో ఉపాధ్యాయులని పెట్టుకొని విద్యాభ్యాసము కొనసాగించారు. పట్టాలకు, పరీక్షల కోసం కాకుండా, అసలైన జ్ఞానసముపార్జనకు నిష్ఠతో ప్రయత్నించారు. తనకు అభిమాన విషయాలపై మంచి పుస్తకాలను తెప్పించుకొని స్వయంగా పఠించే పద్ధతిని అలవర్చుకొన్నారు. అనేక విషయాలకు సంబంధించిన పుస్తకాలను నిబద్ధతతో చదివి, విషయాలను గ్రహించి, అవగాహనా శక్తిని పెంపొందించుకొన్నారు. తను చదివిన విషయాలనుగూర్చి, పుస్తకాలను గురించి మిత్రులతోను, విశేషజ్ఞులతోను చర్చలు ప్రారంభించారు. అంతేకాక, తను అవగాహన చేసుకొనిన అనేక విషయాల సారాంశాన్ని మిత్రులకు తెలియపరిచేవారు.

రవీంద్రనాథ్ గారికి స్కూల్లో సీనియర్ విద్యార్థి, కొసరాజు సాంబశివరావు, ఆనాటి రవీంద్రనాథ్ చురుకుతనాన్ని గురించి, అప్పటి అల్లరి పనులగూర్చి తన తీపిజ్ఞాపకాలుగా చెప్పేవారు. చిన్నతనం నుంచే రవీంద్రనాథ్‌గారిపై తన తాతగారైన దేవయ్యగారి ప్రభావం కొంత ఎక్కువగా ప్రస్ఫుటించేది. గోవాడ గ్రామం ఆనాటి రాజకీయాలలో సక్రియాత్మకంగా ఉండేది. కాంగ్రెసు పార్టీ ప్రభావం ఆ గ్రామంలో కొంత హెచ్చుగానే కనిపించేది! గోవాడ గ్రామం కాంగ్రెసు నాయకులను బాగా ఆకర్షించేది. రవీంద్రగారికి 10ఏండ్ల ప్రాయంలోనే గాంధీజీ గారిని చూచే అవకాశం లభించింది. రవీంద్రనాథ్‌పై గాంధేయ ప్రభావం ఉన్నదనడానికి, ఆయన ఖద్దరు ధరించడం, శాకాహారం తీసుకొనడం నిదర్శనాలుగా చెప్పుకొనవచ్చు.

1934వ సంవత్సరం నుండి రవీంద్రనాథ్‌గారు సొంత చదువులలో ఎక్కువ సమయం వినియోగించేవారు. తరచుగా తెనాలి వస్తూ పోతుండటంతో, తెనాలిలోని వ్యక్తుల ప్రభావం ఆయన మీద పడనారంభించింది. ఆంధ్రా పారిస్‌గా పేరుపొందిన తెనాలిలో నాటక శాలలు, ప్రింటింగు ప్రెస్సులు, పత్రికలు ఎక్కువ సంఖ్యలోనే ఉండేవి. సామాన్యంగా చురుకైన, ఆలోచనాపరుడైన రవీంద్రనాథ్‌గారి ఊహలు ప్రింటింగ్ వ్యాపారం వైపు మళ్ళాయి! ఈ మధ్యకాలంలో రవీంద్రనాథ్ గారికి అబ్బూరి రామకృష్ణారావుగారితో పరిచయమేర్పడింది. రామకృష్ణారావుగారిలాంటి పెక్కు మేధావులను డా. ఎమ్.ఎన్. రాయ్ స్థాపించిన రాడికల్ డెమొక్రటిక్ పార్టీ ఆకర్షించింది. వారిలో త్రిపురనేని గోపీచంద్, అబ్బూరి వరద రాజేశ్వరరావు, ఆలపాటి రవీంద్రనాథ్ ముఖ్యులు. శ్రీ రామకృష్ణరావుగారి ఆధ్వర్యంలో వీరంతా ఆపార్టీకి కార్యకర్తలుగా పనిచేసేవారు.

1942వ సంవత్సరంలో, తన 21వ యేట రవీంద్రనాథ్ గారి వివాహం చెరుకూరి బాపనయ్య, భ్రమరాంబల కుమార్తె కళావతితో జరిగింది. సామాజిక చైతన్యం కోసం పోరాటం జరిపిన విఖ్యాత వ్యక్తి త్రిపురనేని రామస్వామి చౌదరిగారి గారు ఆధ్వర్యం వహించి ఆ వివాహాన్ని జరిపించారు. ఆ వివాహంలో పాల్గొన్న మరో ప్రసిద్ధ వ్యక్తి ఆంధ్ర విశారద శ్రీ తాపీ ధర్మారావు (తాతాజీ)గారు. ఆ రోజుల్లో ఆ వివాహాన్ని అభ్యుదయ వివాహంగా పేర్కొన్నారు. తెనాలిలో అనేక ప్రభావాలకు గురైన రవీంద్రనాథ్, రామస్వామి చౌదరి, తాపీగార్ల ప్రభావానికి కూడా కొంత మేరకు లోనయ్యారు. ఆనాటి పరిస్థితులలో

వారిరువురు చైతన్యం తేవడంలో బాగా ఉపకరించారన్నారు. రవీంద్రనాథ్ గారు తెనాలిలో ప్రింటింగ్ ప్రెస్ పెట్టడం, వారి జీవితంలో ఒక ముఖ్య మలుపు. అది వ్యాపార రీత్యా అవసరమేగాక, ఆయన వ్యక్తిత్వాన్ని వికసింపజేసుకోడానికి ప్రధాన సాధనమయింది. దేశ స్వాతంత్ర్యానికి పూర్వం ప్రింటింగ్ ప్రెస్సులు చాలా కీలకపాత్ర వహించాయి. అవి కళాకారులు, పండితులు, గాయకులు, నటులు, ఉపాధ్యాయులు, కలిసే చర్చావేదికలుగా ఉపకరించేవి. ఆ తరుణంలో ఆ ప్రెస్‌ల అన్నిటి మధ్య రవీంద్రనాథ్ తన ప్రింటింగ్ ప్రెస్‌ను స్థాపించారు. దాని పేరు జ్యోతి ప్రెస్ అని పెట్టారు. ఆ రోజుల్లో జ్యోతి ప్రెస్ రాడికల్ హ్యూమనిస్టులకు, హేతువాదులకు, స్వతంత్ర ఆలోచనా పరులకు కూడలిగా పేరుబడింది.

ప్రింటింగ్ ప్రెస్‌కు బాగా పని సమకూర్చుకోవలసిన ఆవశ్యకత శ్రీ రవీంద్రనాథ్‌ను తరచూ మద్రాసు ప్రయాణాలకు పురిగొల్పింది. ఈ రంగంలో పోటీ కూడా హెచ్చుగానే ఉండేది. రవీంద్రనాథ్‌కు పని సమకూర్చే విషయంలో మాట సహాయం చేసినవారిలో శ్రీయుతులు బెజవాడ గోపాలరెడ్డి, అబ్దుల్ సలాం, వామనరావు (డి.జి.ఐ.), బుల్లెయ్య (విద్యాధికారి), గోవింద రాజుల నాయుడు మొదలైన ప్రభృతులుండేవారు. సినిమా రంగంలో సహితం శ్రీయుతులు కొంగర జగ్గయ్య, డి.వి. నరసరాజు, పాలగుమ్మి పద్మరాజు, గుమ్మడి వెంకటేశ్వరరావు, కాంచనమాల రవీంద్రనాథ్‌గారికి అత్యంత సన్నిహితులు.

ప్రింటింగ్ ప్రెస్ చక్కగా నడుస్తున్న కాలంలో రవీంద్రనాథ్ గారి ఆలోచనా సరళి పత్రికల వైపు మరలింది. మద్రాసులో పత్రికలకు కావలసిన సమాచారం, పాత మాగజైనులు, పుస్తకాలు లభించేవి. మోర్ మార్కెట్టులో ఈ సామాగ్రి అంతా చౌకగా దొరికేది. ఆ రోజుల్లోనే, రవీంద్రనాథ్ గారికి మద్రాసులో శ్రీశ్రీ, ఆరుద్రాలు సన్నిహిత మిత్రులయ్యారు. ఒకవైపు జాతీయోద్యమం, ముమ్మరంగా సాగుతున్న రోజులవి. మరోవైపు ఎమ్.ఎన్. రాయ్ ఎదురీతగా రాజకీయాలలో వివేచన ఉండాలనీ, వికేంద్రియకరణ రాజకీయంగాను, ఆర్థికపరంగాను ఉండాలన్న వాదనను ప్రచారం చేయ మొదలెట్టాడు. రాయ్ భావాలు చాలామంది తెలుగువారిని ఆకర్షించాయి. రాడికల్ డెమోక్రాటిక్ పార్టీ ఏర్పాటు, దానికి త్రిపురనేని గోపీచంద్ కార్యదర్శి కావడం, ఇంకా ఎన్నో పరిణామాలు జరగడం, ఎం.ఎన్. రాయ్ రెండోసారి తెనాలి రావడం, అన్నీ వెనువెంటనే జరిగిపోయాయి. ఈ పరిణామాల ప్రభావం రవీంద్రనాథ్‌పై కూడా కొంత పడింది. రవీంద్రనాథ్‌గారు రాయ్‌గారి భావాలకు దగ్గరయ్యారు. ఆ స్ఫూర్తితోనే పత్రికలు స్థాపించారు. రమణీయకత, కళలు, విమర్శల నిమిత్తం ఒక పత్రిక (జ్యోతి), కళాపోషణ, సెక్సును శాస్త్రీయంగా చెప్పడానికి రేరాణి పత్రికను ఉద్దేశించారు.

జ్యోతి పత్రిక ప్రారంభంతో ఆంధ్రాలో కొత్త గాలి వీచింది. కొత్త రచయితలకు అవకాశం లభించింది. రవీంద్రనాథ్ ప్రోత్సాహంతో పలువురు రచయితలు వెలుగులోకి వచ్చారు. ఇతర పత్రికలు వేయని రచనలు (చలంగారి రచనలు) జ్యోతిలో చోటు సంపాదించాయి. ముఖాలు పరికించక, రచనలోని పసచూచి ప్రచురించే సాంప్రదాయాన్ని రవీంద్రనాథ్ జ్యోతి ద్వారా ప్రవేశపెట్టారు. జ్యోతి పత్రికను రేషణలిష్టు పత్రికగా పేర్కొన్న రవీంద్రనాథ్, ఆ విధానికి తగ్గట్టుగానే పత్రికను నడిపారు. ఎమ్.ఎన్. రాయ్ ఆలోచనా స్రవంతిలోని శాస్త్రీయ ధోరణి రవీంద్రనాథ్‌ను బాగా ఆకర్షించింది. రాడికల్ హ్యూమనిస్టులలో రవీంద్రనాథ్‌కు సన్నిహితులైనవారు ఆవుల గోపాల కృష్ణమూర్తి, జి.వి. కృష్ణారావుగారలు. అలాగే తెనాలి నుండి సినిమా పత్రిక నడిపి, కొత్త దారులు, నూతన పద్ధతులు తెలుగు వారికి తెలియపరిచారు.

పత్రికా నిర్వహణ (అంటే తెనాలిలో ప్రారంభించిన ***జ్యోతి*, *రేరాణి*, *సినిమా***) ద్వారా రవీంద్రనాథ్ గారు చాలామంది కొత్త రచయితలను తెలుగు వారికి పరిచయం చేశారు. వారిలో ముఖ్యులు శారద (నటరాజన్), రావూరి భరద్వాజ, ధనికొండ హనుమంతరావు ఇత్యాదులు. అంతేకాక, చాలామంది ప్రముఖులతో తమ పరిచయాన్ని, స్నేహాన్ని పెంపొందించుకొన్నారు. వ్యక్తిగా, మేధావిగా వికసించారు. బాహ్య సౌందర్యముతోపాటు, హృదయ సంస్కారాన్ని పెంపొందించుకొన్నారు. అభిప్రాయాలు కలువనివారితో సహితం అత్యంత సౌమ్యతతో వ్యవహరించి, వయసులోని తారతమ్యతను పాటించక, అభిమానాప్యాయతలు కనబరచుటలో ఆయనకు ఆయనే సాటి, అని పేరుబడ్డారు.

వ్యక్తిగా కొన్ని నియమాలను స్వయంగా నిర్ణయించుకొని, వానిని అనుసరిస్తూ, నియమబద్ధమైన జీవన శైలిని అలవర్చుకొన్నారు. శరీరానికి, వ్యాయామ, ఆహార, విశ్రాంతులు అత్యంత ముఖ్య సాధనాలుగా భావించి, వాటిని క్రమం తప్పకుండా పాటించేవారు. వ్యాయామానికి ప్రతిరోజు

సాయంత్రాలు టెన్నిసు ఆట ఆడేవారు. ఆహార, విశ్రాంతుల విషయంలోను, చాలా కచ్చితంగా వ్యవహరించేవారని ప్రతీతి. వీటన్నితో పాటు జ్ఞానసముపార్జనకై, మంచి పుస్తకాలు, విదేశాలలో ప్రచురితమైన Times పత్రిక మొదలైన మాగజైనులు తెప్పించుకొని చదివేవారు. కనీసం రోజుకు 300–400 పేజీలు చదివితేగాని ఆయనకు రాత్రి నిద్రపట్టదని ఆయననుగూర్చి మిత్రులు చెప్పేవారు. మంచి పుస్తకాలు తాను చదవటమే కాక, చాలామంది మిత్రుల చేత కూడా చదివించేవారట! తాను చదివిన గ్రంథాలలో విజ్ఞానాన్ని మిత్రులకు సహితం పంచేవారని, ఆయన మిత్రులు వ్యక్తపరిచిన అభిప్రాయాలవలన రూఢి పడుతుంది. మంచిని పెంచడం, మానవతను మన్నించడం, జ్ఞానాన్ని పంచిపెట్టడమనే లక్షణాలు ఒకటిగా మూర్తీభవించిన వ్యక్తి రవీంద్రనాథ్‌గారని పలువుర ప్రశంసలందుకొన్నారు. అలాగే, సిగరెట్లు, విస్కీ, టెన్నిస్ రవీంద్రనాథ్‌గారి నిత్యావసరాలుగా మారాయి. చాలాకాలం వాటిని విడవలేదు. అలాగని, అతిగా సేవించిన సందర్భాలు సహితం మనకు తెలియవు.

మూఢాచారాలుగాని, మూఢ నమ్మకాలుగాని వారి దరికి చేరిన వివరాలు సహితం మనకు తెలియవు. ఇక మత విషయానికి వస్తే, రవీంద్రనాథ్ బౌద్ధ తత్త్వ ప్రియుడని తెలియుచున్నది. బౌద్ధంపై చాలా గ్రంథాలు, కొన్ని అరుదైనవి, సేకరించి చదివారని తెలియనగుచున్నది. బుద్ధుని గొప్ప తాత్వికునిగా, చింతనాపరుడుగా, నీతిమంతుడుగా ఆయన భావించారు. నిత్య జీవితంలో బుద్ధుడు చెప్పిన కొన్ని విషయాలు తరచు ఉల్లేఖించేవారని ప్రసిద్ధి! భిక్షకు వెళ్ళినప్పుడు ఎవరు ఏదిచ్చినా అది స్వీకరించాలేగాని, ఫలానిది కావాలనో, ఇచ్చింది వద్దనో భిక్షువులు అనరాదని బుద్ధుడు చెప్పాడట. అంతేకాక, బోధకులు స్థానిక భాషను తప్పనిసరిగా నేర్చుకోవాలని, దానితోపాటు కొంత వైద్యం వస్తే మంచిదని బుద్ధుడు భావించాడట! ఈ విషయాలన్నీ రవీంద్రనాథ్‌కు చాలా నచ్చిన అంశాలు. ఆధునిక బౌద్ధ చింతనా పరిణామాలతో ఆయన ఎప్పటికప్పుడు కొత్త విషయాలు సేకరించేవారని మిత్రులు పేర్కొన్నారు.

తెనాలిలో ఉన్నంత కాలం ఈ విధమైన జీవితాన్ని గడిపారని రవీంద్రనాథ్‌నుగూర్చి వ్రాసిన ప్రతి రచయిత ఉల్లేఖించారు. కాలం ఒకేరీతి సాగదు కదా?! రవీంద్రనాథ్ గారు సహితం వ్యాపారంలో నష్టాలకు గురికాక తప్పలేదు. తెనాలిలో తాము ప్రారంభించిన పత్రికలు మూతపడినవి. 1957వ సంవత్సరంలో ముద్రణా యంత్రాంగాన్ని హైదరాబాదు తరలించారు. హైదరాబాదులో కళాజ్యోతి ప్రెస్‌ను అన్ని హంగులతో ఆధునిక యంత్రాంగంతో స్థాపించే ప్రయత్నంలో నిమగ్నులై తను ఊహించిన విధంగా ఆ ప్రెస్‌ను తీర్చిదిద్దటంలో విజయాన్ని సాధించారు. కొత్త ముద్రణాలయం హైదరాబాదు నగరంలో ఒక గొప్ప ప్రెస్‌గా పేరుపొందింది. రైల్వే బ్రాంచి నుండి, తెలుగు అకాడమీ నుండి, పని హెచ్చు పరిమాణంలో లభించేది. రవీంద్రనాథ్ గారు ఉదయం నుండి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రెస్ కార్యకలాపాల్లోనే నిమగ్నమయ్యేవారు. రవీంద్రనాథ్ కుమారులు ప్రెస్ పనులకు ఆధ్వర్యం వహించేవరకూ శర్మగారనే వ్యక్తి ప్రెస్ కార్యకలాపాలు నిర్వహించేవారని చెప్తారు. హైదరాబాదులో సహితం నియమబద్ధమైన జీవనశైలినే పాటించేవారు రవీంద్రనాథ్‌గారు. ప్రముఖమైన క్లబ్బులలో సక్రియాత్మక సభ్యులుగా వ్యవహరించేవారు. సాయంత్రాలు ఫతే మైదాన్‌లో టెన్నిస్ ఆడడం, మిత్రులతో గడపడం రవీంద్రనాథ్‌గారి నిత్య కృత్యాలలో భాగమయ్యాయి. పుస్తక ప్రదర్శనాలకు వెళ్ళుట, నచ్చిన పుస్తకాలు కొని తన లైబ్రరీకి చేర్చుట రవీంద్రనాథ్ గారి మరో కార్యక్రమంగా ఉండేది. సికింద్రాబాదు క్లబ్బులోని గ్రంథాలయం, ముఖ్యంగా మాగజైన్స్ సెక్షన్ (Magazines Section) అంటే ఆయనకు చాలా యిష్టం. హైదరాబాదులో అనేక మిత్రులతో, కొత్త వారి పరిచయాలతో తన మానసిక పరిధిని పరిణతం చేసుకోవడం వారికి అలవాటుగా మారింది. అలా తరచుగా కలిసేవారిలో అబ్బూరి రామకృష్ణారావుగారు పేర్కొనదగినవారు. ఆ రోజుల్లో రవీంద్రనాథ్ గారిని తరచు కలిసిన మిత్రులలో బూదరాజు రాధాకృష్ణ, తాళ్ళూరి నాగేశ్వరరావు, అశ్వినీకుమార్ (విజయవాడ), రావూరి భరద్వాజ, సినారే, సి. ధర్మారావు ఆయనకు బాగా సన్నిహితులు. వయసు మీరుతున్నకొలదీ ప్రెస్ బాధ్యతలన్నీ కుమారుల కప్పగించి, తాను విశ్రాంతిగా తన సమయాన్ని సభలు, సాహిత్య గోష్ఠులు, ఇతర సామాజిక వ్యవహారాలలో గడిపేవారు.

**ఆయన తత్వం** (Personal philosophy) ''నేను ఎవరిని అని చాలామంది ప్రశ్నించుకొంటూ ఉంటారు. ఈ ప్రశ్నను గురించి మీరేమైనా ఆలోచించారా?" అని డా. రవీంద్రనాథ్‌గారిని ఒకసారి ప్రశ్నించినప్పుడు, వేదాంతులు మాట్లాడుకునే ఆత్మ ఏమిటో నాకు తెలియదు. కాని, నా మాత్రానికి నేను ఈ విధంగా సమాధానం చెప్పుకొంటాను" అన్నారు ఆయన. "నేను నేనే. నేనుకు అర్థం చెప్పుకోవడానికి నేను నా నుంచి బయటకు పోవలసిన పని

లేదు. జీవితంలో అనేక సన్నివేశాలు ఎదురవుతూ ఉంటాయి. వాటిల్లో నా పాత్రను నిర్వహిస్తూ ఉంటాను. మామూలుగా ఈ పాత్రలపరంగా నేను ***ఇది, ఫలానా*** అని చెప్పుకొంటాం. కేవలం నేను తండ్రి, భర్త, స్నేహితుడూ, మొదలయిన పాత్రల సంయోగం మాత్రమే కాదు. అంతకంటే ఎక్కువ. నాకు కొన్ని ఆశంసలు, ఆకాంక్షలు, లక్ష్యాలు ఉంటాయి. నన్ను నేను వాటిపరంగా నిర్వచించుకొంటాను. ఏదో ఒకటి చేస్తూ ఉంటాను. అదే జీవితం కాదు. అదే నేను కాదు.... నేను కావాలనుకొన్నది అయ్యాను.... ***నేను*** ను గురించి నేను ఏమి చెప్పాలనుకొన్నది వ్యక్తత చేశాననుకొంటాను".

**రవీంద్రనాథ్ పరిచయ స్రవంతి:**

ఇది ఒక పెద్ద ధార! చిన్న పాత్ర (కొద్ది పుటల)లో ఇమడ్చడం కష్టతరమైనపని! సాధ్యమైనంతవరకు ప్రయత్నం చేద్దాం! చిరు ప్రాయంలోనే రవీంద్రనాథ్‌గారికి ఎక్కువమంది పరిచయస్తులు తయారయ్యారు. దానికి కారణం ఆయన ఆకర్షణీయ వ్యక్తిత్వం. సాధారణంగా స్నేహం, వయస్సులో అనుభవంలో సమవుజ్జీల మధ్య ఉంటుంది. అందులోనూ, సంప్రదాయ శృంఖలాలని తెంచుకోలేని సమాజంలో, ఈ అంతరాలని తొలగించుకొని మైత్రిని నెరపటం చాలా అరుదు. అదే జరిగింది శ్రీ రవీంద్రనాథ్‌గారి జీవితంలో. మంచి పెంచడం, ఆనందాన్ని పంచడం, ఆలోచనల్ని రేకెత్తించడం అందరు చేయలేని పని. దానిని సాధించడంలో సఫలులయ్యారు రవీంద్రనాథ్. అంతేకాదు, అభిప్రాయాలు కలవనివారితో కూడా అత్యంత సౌజన్యంతో వ్యవహరించి, అభిమానాప్యాయతలు కనబరచుటలో ఆరితేతినవారు రవీంద్రనాథ్‌గారు. అందుకే మరి – ఇంతమంది కవులు, పండితులు, విద్యావేత్తలు, మేధావులు, రచయితలు, న్యాయమూర్తులు, అడ్మినిస్ట్రేటర్లు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికులు, సినీప్రముఖులు, ఇంకా ఇతర జీవన రంగాలలోని మాన్యులు, సామాన్యులతో రవీంద్రనాథ్ గారి పరిచయాలు, స్నేహబంధాలు వెల్లివిరిశాయి. రవీంద్రనాథ్ గారికి జ్ఞానార్జన తీరని దాహం, సాహిత్యం, తత్వ శాస్త్రం, ఆధునిక దర్శనాలు (తత్వాలు), Time, Encounter లాంటి పత్రికలు – ఒకటేమిటి ఆలోచనాపరుల మేధకు పదును పెట్టేవేవి ఆయన పరిధిని దాట లేదు! తాను పొందిన అనుభూతిని, ఆర్జించిన విజ్ఞానాన్ని స్నేహితులతో పంచుకోవాలనే తపన, ఆయనను స్నేహితులు చుట్టు ముట్టుటకు ప్రభల కారణం. తరచుగా స్నేహితులని తన Nestకి ఆహ్వానించి, అతిథి మర్యాదలు జరిపి, తాజాగా తాను చదివిన గ్రంథాల సారాంశాన్ని వారికి చెప్పి చర్చిస్తేగాని, ఆయనకు సంతృప్తి కలిగేది కాదు. సినారేగారు వ్యాఖ్యానించినట్లుగా "భావప్రేరకంగా ఉన్న ఏ చిన్న అంశం దొరికినా, హేతువుకు ఏతామెత్తే ఓ వాక్యం కంటబడినా, రవీంద్రునికి నిలువెల్లా పారవశ్యం. నిరాఘాటంగా ఆ ఆనందానుభూతి ఆర్థికపరమైన కాలమానాలకు అతీతం. సంస్కృతి ఆయన రక్తములోనే వుంది (Culture is in his blood)". అదే ఇంతటి విస్తృత పరిచయ మండలి (స్రవంతి) రవీంద్రనాథ్‌కు కల్గుటకు అసలు కారణం! ఈ కౌటుంబిక నేపథ్యం వారి అన్తమయం దాకా నిరాఘాటంగా ప్రవహించింది! ''ఆయనతో దశాబ్దాల స్నేహ సాన్నిహిత్యాలున్నవారు, తక్కువ కాలమైన, నిక్కమైన పరిచయం వున్నవారు, బంధువులు, ఆంతరంగికులు తమ జీవితాల జ్ఞాపకాల వాకిళ్ళు తెరచి, తరచి ఆయనతో పెనువడిన తమ అనుభవాలు, సంఘటనలు, విశేషాలతో ఈ సంపుటి నింపారు, సుసంపన్నం చేశారు. ఆయన జీవితాన్ని, చింతనని, కృషిని పునరావిష్కరించారు.... ఇక ఏం వ్రాసినా, చర్విత చరణమే అవుతుంది"! అందుకే, ఆ ప్రయాసమానుకున్నాను. పాఠకులు స్మృతి సంపుటిని చదివి ఆనందిస్తారని ఆశిద్దాం!

మిత్రమండలి దృక్పథంతో రవీంద్రనాథ్‌గారిని దర్శిద్దామా! "రవీంద్రుని దృష్టిలో వ్యాపారం వ్యాపారమే, వినోదం వినోదమే, విజ్ఞానం విజ్ఞానమే! వ్యాపార దృష్టిని, వైజ్ఞానిక దృష్టి నుంచి భిన్నంగా ఉంచిన వివేకి అతడు... జీవితాంతం మానవీయ ప్రవృత్తిని, అవ్యాజ మైత్రిని తన మనుగడలోని అవిభాజ్య పార్శ్వాలుగా మలుచుకొన్న డా. ఆలపాటి రవీంద్రనాథ్ రుచిర స్మృతికి అంకితం ఈ అక్షర సంపుటి" అంటారు డా. సినారే.

"ఆయన... ఉద్గమన శక్తి ప్రౌఢమై భూమి పెకల్చుకొని వచ్చినవాడు అందువలననే, డిగ్రీలు లేకుండానే పాండిత్యం గడించి, ఆ పాండిత్యానికి వన్నె వాసియేకాక, సాంఘిక ప్రయోజనాన్ని చేకూర్చారు" అంటారు జస్టిసు పి.ఎ. చౌదరి. "రవీంద్రనాథ్‌గారి వ్యక్తిత్వం, కృషి, సౌహార్థం చాలా దొడ్డవి. ఆయున స్నేహం అమృతాయమానం'' అంటారు డా. బూదరాజు రాధాకృష్ణ. ఎందరో మేధావులనుగూర్చి, రచయితలనుగూర్చి, మన జీవితాలను ప్రభావితం చేసిన ఆలోచనా పరులనుగూర్చి ఆయన చెప్పేవారు... ఆయనతో సంభాషణ తర్వాతే నేను బౌద్ధాన్ని గూర్చి, అంబేద్కరు రచనల గురించి తెలుసు కొన్నాను" (డా. జయప్రకాష్ నారాయణ).




"డా. ఆలపాటి రవీంద్రనాథ్‌గారి ఉత్తమ కళాభిరుచీ, స్నేహశీలత, సహృదయతా చిరస్మరణీయాలు" అంటారు అబ్బూరి ఛాయాదేవి. "డా. రవీంద్రనాథ్‌గారిని చూచినప్పుడు ఉత్సాహం మూర్తీభవించిన ఈయనలో సీరియస్ సాహిత్యోపాసకుడున్నాడని అనుకోవడం కష్టం'' అని అభిప్రాయం వ్యక్తపరచారు రామలక్ష్మీ ఆరుద్ర. ''నాకు ప్రతిభవలన, కృషి వలన ఎన్నో క్వాలిఫికేషన్సు లభించి ఉండవచ్చు. కాని, రవీంద్ర నాథ్‌గారితో పాటుగా ఈ లోకంలో కొంత కాలం పాటుగా జీవించి ఉండటం, వారితో పరిచయం కలిగి ఉండటం – ఈ రెండు యోగ్యతలు ఎంతో మిన్న! రవీంద్రనాథ్ మేధావులలో కూడా నవీనుడు, ఆధునిక అనంతరుడు" అని వర్ణిస్తూ, దీపం (జ్యోతి) ఆయనే, కాంతి (***మిసిమి***) ఆయనే"! అంటారు భరాగో.

"ఆయనలో రస, సౌందర్యాలు తొణికిసలాడుతుంటే, నన్ను సిద్ధాంతాలూ, దర్శనాలు, తర్కం ఆకట్టుకొన్నాయి. ఫలితంగా ఆయన పచ్చనిచెట్టు అయితే, నేను ఎండువారిన కట్టెను – ఈ తేడా ***మిసిమి*** లో ప్రతిఫలించింది" అంటారు అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి – ***మిసిమి*** కి రవీంద్రనాథ్‌గారి తర్వాత సంపాదకత్వం వహించినవారు. ఎంత గొప్పగా వర్ణించారు రవీంద్రనాథ్‌గారి మూర్తిమత్వం!

"రవీంద్రనాథ్‌గారు చాలా ముందుచూపున్న భావుకులు నా జీవితానికింత స్థిరత్వం ప్రసాదించిన వారికి పాదాభివందనం" అని తమ సన్నిహితత్వాన్ని ప్రకటించారు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత శ్రీ రావూరి భరద్వాజ.

''శ్రీ రవీంద్రనాథ్‌గారు వస్త్రధారణ నుంచి ప్రతి అంశములోనూ సౌందర్యాన్ని, ఆధునికత, హుందాతనాన్నిచ్చి, విలువలు పెంచే సంప్రదాయబద్ధత పాటిస్తూ జీవితంలో సమతౌల్యం, ప్రదర్శించి, తన జీవితాన్ని విలువలతో, ప్రయోజనాత్మకంగా అనుభవించిన వ్యక్తి" అని అభివర్ణించారు విదుషీమణి డా. మంజులత. రవీంద్రనాథ్‌ను సరసుడూ, సాహిత్యాభిమాని, స్నేహశీలి, అభ్యుదయవాది, భేషజాలు లేని మనిషిగా చిత్రించారు సంగీత, సాహిత్యాభిమాని డా. వై. విశ్వనాథ్. "నిజానికి రవీంద్రనాథ్‌తో నా పరిచయం మూడు సంవత్సరాలే! కాని నా జీవితంలో ఈ మూడు సంవత్సరములు మధురమైన సాహిత్యానుభవాల్ని మిగిల్చి, నన్ను నన్నుగా నిలబెట్టాయి'' అని తన అనుభవాలను వివరించారు ప్రముఖ పాత్రికేయుడు టి. రవిచంద్. సాంస్కృతిక పునర్జీవన కృషిలో రవీంద్రనాథ్ ప్రముఖ పాత్ర వహించారు. ఆకాశవాణి ప్రసారం చేసే వివిధ కార్యక్రమాల బాగోగులు విమర్శనాత్మకంగా రేడియో రివ్యూ – శీర్షికను మొట్టమొదట తెలుగు పత్రికలలో ప్రవేశపెట్టినవారు రవీంద్రనాథ్‌గారే! అంతేకాదు, హేతువాద భావవ్యాప్తికి శాస్త్రీయ భావనల ప్రచారానికీ చేయూతనిచ్చి సాంఘిక చైతన్యానికి పాటుపడినవారు రవీంద్రనాథ్‌గారు. పత్రికా సంపాదకునిగా ఆయన పాత్ర శ్లాఘనీయమని అభివర్ణించారు, ప్రజాసాహితి సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు.

''తాము కల్పించుకునే విలువకు మించి మానవ మనుగడకు వేరే అర్థమూ, పరమార్థమూ ఏదీ లేదు. ఎవరైనా తమ జీవితాలను అర్థవంతంగా తీర్చుకోగలిగినప్పుడు, ఆ జీవితం నుండి అద్భుతమైన ఫలితం వెలువడితే అది వారికి అమరత్వాన్ని ప్రసాదిస్తుంది.... కొందరు అదృష్టవంతులు తమ జీవిత కాలంలో వీలైనంత జ్ఞానాన్ని సముపార్జించి తమ తర్వాత వారికి అందజేయగల్గుతారు... ఆ కోవకు చెందినవారు డా. రవీంద్రనాథ్ అని చిత్రించారు ***రేపు*** పత్రికా నిర్వాహకులు సి. నరసింహారావు. "కొత్త కొత్త విషయాలను గురించి, భావాలను గురించి తెలుసుకొంటూ, వాటిని పాఠకులకందించాలన్న తపనగల వ్యక్తి శ్రీ రవీంద్రనాథ్. ఆయన సార్థక జన్ములు" అని పొగిడారు ప్రముఖ హిందీ సాహిత్యవేత్త డా. భీమసేన్ నిర్మల్. హేతువాది, రచయిత్రి, ఫెమినిస్టు, ఉద్యమకర్త్రి, సంఘసేవిక మల్లాది సుబ్బమ్మ స్మృతి పథంలో రవీంద్రనాథ్‌గారొక విజ్ఞాన ఖని. ఆ విజ్ఞానాన్ని సమాజానికి అందజేయడానికి ఆయన సల్పిన కృషి అమోఘం" అంటారావిడ! "ఎవరైనాగాని స్వయం ప్రకాశంగల్గి ఉండాలేగాని, ఛాయా గ్రహాలుగా ఉండటం రవీంద్రనాథ్‌గారికి గిట్టదు" అంటారు శ్రీరాం ఇంజనీరింగ్ ఇండస్ట్రీస్ అధినేత డి. శేషగిరిరావుగారు.

***ఆగమ గీతం ఆలపించిన ఆలపాటి*** అనే వ్యాసంలో "మూసలో పోసిన ఊసులు భావాలు వద్దంటూ (దీనినే in-doctrination అంటారు) సమాజ హిత భావ సమ్యగ్దర్శనంతో, భావుక సమన్వయత్వంతో కథా కథనం సాగించాలన్న ధోరణి

ప్రవర్థమానమైంది. భేదాభిప్రాయాలపట్ల మన్నన చూపగల ప్రశస్త భావుకతలోనే అవిశ్రాంతంగా ఆయన జీవించాడు" అని పేర్కొన్నారు రచయిత, రాడికల్ హ్యూమనిస్టు పి. అచ్యుతరాం. ఎంతటి సముచిత వ్యక్తిత్వ చిత్రీకరణ! "శ్రీ రవీంద్రనాథ్ వ్యక్తిత్వం ఉన్నతమైనది, మహోన్నతమైనది, అజాత శత్రువు, ఆయన ఏ విమర్శకు దొరకని అతీతుడు" అంటారు డా. సి. హెచ్. వెంకటేశ్వరరావు.

One of the cousins of Dr. Ravimdranath, Alapati Krishna Kumaran, opines that his cousin Dr. Ravimdranath known by his colleagues, friends and competitors as well, for his drive for success in the publishing world and his desire for service to the society. He has written a long article about his cousin and the factors that influenced the making of his personality. Prof. Krishna Kumaran happens to be a Professor Emeritus of Marquette Varsity, U.S.A.

ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, హిందీ సాహిత్య కోవిదుడు పావులూరి శివరామకృష్ణయ్యగారి దృష్టిలో డా. రవీంద్రనాథ్ తన కృషి, చింతనలతో వర్తమాన, భావితరాలవారికి స్ఫూర్తిమంతులయ్యారు.

"డా. రవీంద్రనాథ్ పసితనం నుంచే పరిణతి చెందిన ప్రతిభను ప్రదర్శించి, అనితర సాధ్యమైన పద్ధతిలో ఉన్నత శిఖరాలనధిరోహించే దిశలో పయనిస్తూ విశిష్ట ప్రవర్తనంతో విలక్షణ వ్యక్తిగా ప్రవర్తించారు. ఉన్నత ప్రమాణాలను సంతరించుకొని అన్ని వర్గాల ఆదరాభిమానాలను చూరగొన్న మానవతామూర్తిగా ఎదిగారు" అని ప్రశంసించారు ఆచార్య యం.యల్. గురప్ప చౌదరి.

యల్. యస్. రామయ్యగారి మాటల్లో రవీంద్రనాథ్ గారు ఒక మహావ్యక్తి, సహృదయుడు. వారి ద్వారా సహాయం పొందినవారనేకులు. వారిలో ఏదో సాధించాలనే తపన, సమాజంలో మార్పు రావాలన్న ఆసక్తి మిక్కుటంగా కనిపించేవి.... మనిషి గంభీరంగా ఉండి, తొణకని నిండు కుండలా ఉండేవారు. తెల్లటి లాల్చీ, యిస్త్రీ చెరగని తెల్లటి పంచలో మనిషి పులు కడిగిన ముత్యంలా వుండేవారు".

ప్రముఖ చిత్రకారుడు ఎస్సారె (రహమత్ ఆలీ) కుంచె తీర్చిన అక్షర చిత్రం ప్రకారం "హృదయ సౌందర్యం, బాహ్య సౌందర్యం మేలిమి కోవకు చెందిన వ్యక్తుల్లో రవీంద్రనాథ్ ఒకరు. నిండు విగ్రహం, పసిడి ఛాయ, వయసుతో పాటు పెరుగుతూ పోయిన విశాలమైన నుదురు, చక్కటి ముక్కు, గంభీరంగా కనిపించే ఆ ముఖకవళికల్ని సెకన్లలో ఆహ్లాదంగా మార్చగలిగే అరుదైన చిరునవ్వు ఆయన స్వంతాలు". ఇంతకంటే గొప్పగా ఏ మహామనీషి మనకు కనిపిస్తాడు?!




పరిమళించే పరిపూర్ణ వ్యక్తిత్వం.! కాదు, మూర్తిమత్వం!

**చతుర్ముఖ జ్యోతి – మూడవ పాయ:**

**(జ్యోతి, రేరాణి, సినిమా)**

1946 రవీంద్రనాథ్ గారి జీవితంలో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకొన్నది. ఆ సంవత్సరంలో ఆయన జ్యోతి ప్రెస్ ప్రారంభించారు. అదే సంవత్సరం, ***జ్యోతి***, ***రేరాణి*** పత్రికలు కూడా స్థాపించి, వాటి సంపాదకత్వం చేపట్టారు.

***జ్యోతి*** పత్రిక పెట్టుటలోని ప్రధానోద్దేశము రమణీయకత, కళలు, విమర్శలను ప్రోత్సాహించుట. ఈ మేరకు, రచనలోని స్థాయి, పస చూచి ప్రచురించే సాంప్రదాయాన్ని రవీంద్రనాథ్ ప్రవేశపెట్టారు. ఆ రోజుల్లో ప్రముఖ పత్రికలలో చాలా భాగం మద్రాసు నుండి ప్రచురితమయ్యేవి. దానికి ముఖ్య కారణం ముద్రణా సౌకర్యాలు మద్రాసులో ఉన్నట్లు ఇతర చిన్న పట్నాలలో లేకపోవడమే. ఆ తరుణంలో రవీంద్రనాథ్‌గారు సాహసించి తెనాలిలో జ్యోతి వెలిగించారు. ***జ్యోతి*** ప్రతిభ తైలంగాగల చాలా వత్తుల్ని వెలిగించింది. ఆంధ్రాలో జ్యోతి ప్రచురణతో కొత్త గాలి వీచింది. ధైర్యంగా నూతన మార్గాలు అవలంబించేవారికి ఒక నమ్మదగిన వేదిక లభించింది. ఇతర పత్రికలు వేయని రచనలు – చలం రచనలు వగైరా – జ్యోతిలో చోటుచేసుకున్నాయి! ***జ్యోతి*** పత్రిక ***రేషనలిష్టు*** పత్రికగా పేరు గడించింది. కొన్ని రంగాలలో ఇతర పత్రికలు చేయని, చేయజాలని పాత్ర నిర్వహించింది. రేడియో ప్రసారాలను, దినపత్రికల నాయకత్వాన్ని నిశితంగా పరిశీలించి విమర్శనాత్మక వ్యాసాలు వ్రాయ మొదలెట్టింది.

రవీంద్రనాథ్ అనేకమంది రచయితలకు అభివ్యక్తి కల్పించారు. ఎవ్వరికీ తెలియక అడవిలో పడి వున్న రచయితలను వెలుగులోనికి తెచ్చి, అడవి కళాఖండాలను




రసాస్వాదుల దృష్టికి తెచ్చారు. ***శారద*** రచనలు అలా వెలుగు చూచినవే. ఒక్క శారదే కాదు, ఈ నాటి ప్రసిద్ధ రచయిత, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత శ్రీ రావూరి భరద్వాజ గారు కూడా ఆ కోవలోనికి చెందినవారే! వారి రచన ***అలవాటైన ప్రాణం*** చరిత్ర సృష్టించిన విషయం పాఠకులకు విదితమే. ఆలూరి భుజంగరావు, ప్రకాశరావు, శార్వరి, అమరశ్రీ, తాళ్ళూరి నాగేశ్వరరావు, హితశ్రీ, కొలను బ్రహ్మానందరావు, సన్నపనేని సుబ్బారావు, పోలవరపు శ్రీహరిరావు ఇత్యాదులంతా రవీంద్రనాథ్ ప్రోత్సాహంతో ప్రసిద్ధులైనవారే! వీరిని పైకి తీసుకురావడంలో రవీంద్రనాథ్ ఒక కొలమానాన్ని వాడారు. అదే! "రచన బాగా ఉండటం ఉండక పోవడమే"! ఆ కొలబద్దను ఆయన కఠినంగా అమలు పరచారు.

***జ్యోతి*** ప్రధానంగా కథల పత్రిక (పక్ష పత్రిక). అయినా, అందులోను కవితలు, వ్యాసాలు, నాటికలు, విమర్శలు కూడా ప్రచురితమయ్యేవి. ఆనాటి ప్రసిద్ధ కథకులు చాలామంది ***జ్యోతి*** కి వ్రాసేవారు. చలం, కుటుంబ రావు, గోపీచంద్, మల్లాది రామకృష్ణ శాస్త్రి, పి.వి.సుబ్బారావు, జి.వి. కృష్ణారావులాంటివారు జ్యోతికి తమ రచనలు పంపేవారు. అలాగే, శివం, శ్రీనివాసరావు, శారద, శార్వరి, ప్రకాశరావు, హితశ్రీలాంటి వారెందరో జ్యోతికి వ్రాసేవారు. ***రేరాణి*** తెనాలి నుండి ప్రచురించిన తొలి మనోవైజ్ఞానిక మాసపత్రిక. అది రవీంద్రనాథ్ సంపాదకత్వంలోనే వెలువడింది. సిగ్మండ్ ఫ్రాయిడ్, హావలాక్ ఎల్లీస్, మేరీ స్టోప్స్‌వంటి రచయితలను తెలుగువారికి పరిచయం చేసిన ఘనత డా. రవీంద్రనాథ్ గారికే చెందుతుంది. ఆ రోజుల్లో ***రేరాణి*** ప్రతి సంచికలోను చలం కథో, చౌడేశ్వరిగారి రచనో తప్పక చోటుచేసుకొనేది. చాలాకాలం ధనికొండ హనుమంతరావు రేరాణి పత్రికలో పనిచేశారు. తర్వాత ***అభిసారిక*** అనే పత్రిక సొంతంగా మొదలెట్టారు. ***రేరాణి*** లో ప్రచురితమైన భరద్వాజగారి రచన ***అలవాటైన ప్రాణం*** చరిత్రను సృష్టించిన విషయం ఇదివరకే ఉల్లేఖించాం. లైంగిక విషయాల ప్రస్తావనే బూతుగా, అశ్లీలంగా పరిగణించే రోజుల్లోనే అత్యంత సాహసంతో హావలాక్ ఎల్లీస్ రచనల అనువాదాలు ***రేరాణి*** లో రవీంద్రనాథ్‌గారు ప్రచురించి, ఆయన వైజ్ఞానిక దృక్పథాన్ని, ముందుచూపును, ప్రగతి శీలతను వెల్లడించారు. ***రేరాణి*** నిజానికి శాస్త్రీయ లైంగిక విజ్ఞాన పత్రికగా కూడా పేరు తెచ్చుకుంది. ఈ నాడు అందరు ఆర్భాటం చేస్తున్న అనేక సమస్యలను గురించి దాదాపు 60 సంవత్సరాల క్రితమే మంచి మంచి వ్యాసములు ***జ్యోతి, రేరాణి*** పత్రికలలో ప్రచురించి భవిష్యత్తుకు మార్గదర్శకులయ్యారు రవీంద్రనాథ్ గారు. అలాగే ***సినిమా*** పత్రిక మూలంగా మంచి సినిమాలను, మంచి నటులను గూర్చిన అనేక వ్యాసాలు ప్రచురించి సినిమా రంగానికి కూడా గొప్ప సేవ జేశారు రవీంద్రనాథ్ గారు. తెనాలి నుండి వెలువడిన తొలి సినిమా మాస పత్రిక ***సినిమా.***

**చతుర్ముఖ జ్యోతి – నాల్గవ పాయ – *మిసిమి* :**

"రవీంద్రనాథ్ అంటే ***మిసిమి***, ***మిసిమి*** అంటే రవీంద్రనాథ్. ఆ రెండు అవిభాజ్యం". అందుకేనేమో ***రవీంద్ర స్మృతి*** సంపుటికి తమ తమ రచనలందించినవారిలో అత్యధిక భాగం రచయితలు ***మిసిమి*** ని గూర్చి ఏవో కొన్ని విషయాలు ఉల్లేఖించుట తప్పనిసరియైనది! అందుకే ఈ వ్యాసంలో ఒక ప్రముఖ పాయగా ***మిసిమి*** నిగూర్చి వ్రాయుడమైనది. సాధ్యమైనంతమేరకు, రచయితల అభిప్రాయాలను ఇందు పొందుపరచడమైనది. కొన్ని సందర్భాలలో రచయితల మాటల్లోనే వారి భావపరంపర వ్యక్తపరిచే ప్రయత్నం జరిగింది. సహవాసి గారి దృష్టిలో ***మిసిమి*** వెనుక రవీంద్రనాథ్ గారి తపన ఉంది. మొట్ట మొదట్లో ఆయన ***మిసిమి*** ని ఏ ఉద్దేశ్యంతో ప్రారంభించినప్పటికీ, ఆలోచనాపరులైన పాఠకులకు, జిజ్ఞాసువులకు, పరిశోధకులకు, మేధావులకు మహోపకారమే జరిగింది.

ఇది వరకు ఏ పత్రికకు లేనటువంటిది, కుడి, ఎడముల (ఎటువైపు నుండి చదివినా) తేడా రానిది ***మిసిమి*** అనే పేరు! పత్రికకు ఈ పేరును సూచించినవారు బూదరాజు రాధాకృష్ణ గారు. ***మిసిమి*** అంటే నూతన కాంతి, నవనీతం (వెన్న) అని, వెన్నెల అనీ అర్థాలు. ఆ పదం, దాని అర్థం సప్రమాణంగా చూపనిదే రవీంద్రనాథ్‌గారికి సంతృప్తి కలుగలేదు. అందుకే ఈ పదప్రయోగానికి నిదర్శనంగా అల్లసాని పెద్దనగారి మనుచరిత్ర నుండి – ***"మిసిమి పర సీమ వల రాజు మేనమామ / వే వెలుంగుల దొర జోదు రే వెలుంగు"***

అనే పద్యంలోని వాక్యాలు ఉల్లేఖించడం జరిగింది. అలాగే నవనీతం అనే అర్థంలో ఎవరు ఎక్కడ వాడారో కూడా ఉదాహరణపూర్వకంగా వివరించారు శ్రీ బూదరాజు

రాధాకృష్ణగారు. ***"మిణుకు టూర్పుల వాని / మిసిమి మేతల వాని / మెరుగు ఛామన ఛాయ మేని వాని ..."*** అలాగే నవనీతం అనే అర్థంలో తెనాలి రామకృష్ణ కవి తన ***పాండురంగ మహత్యం*** అన్న కావ్యంలో పైన ఉదహరించిన వాక్యాలలో వాడారు.

***మిసిమి*** అన్న పేరు రవీంద్రనాథ్ సంపాదకత్వంతో సార్థకమైనది. ***మిసిమి*** మాసపత్రిక ప్రచురించి సంపాదకునిగా పనిచేసి డా. రవీంద్రనాథ్‌గారు గడించిన కీర్తిప్రతిష్టలు కాలం చెరపలేనివి.

***మిసిమి*** పక్ష పత్రికగా ఆరంభమై, తర్వాత మాసపత్రికగా మారింది. జ్యోతి (కళాజ్యోతి) ప్రెస్‌కు విదేశాల నుండి నాణ్యమైన కాగితం తెప్పించాలంటే పత్రిక పేరిట కోటా సాధ్యమనే దృష్టితో పక్ష పత్రికను ఆరంభించారు రవీంద్రనాథ్ గారు. పత్రికకు తగిన వ్యాసాల విషయంలో డా. ఎన్. ఇన్నయ్యగారు సహకరించారు. నాలుగు సంచికలు వచ్చేసరికి, పత్రిక ఆపేయాలా, కొనసాగించాలా అనే ప్రశ్న ఎదురైంది. రవీంద్రనాథ్ గారి కుమారులు ఆయన్ను ప్రోత్సహించి, పత్రికను ఆపరాదనే నిర్ణయానికి కారకులయ్యారు. ఆ విధంగా ***మిసిమి*** నిలదొక్కుకొని మాసపత్రికగా మారింది. రవీంద్రనాథ్‌గారు తమ పూర్తి సమయాన్ని వినియోగించి ***మిసిమి*** ని ఒక ప్రామాణిక పత్రికగా రూపొందించారు. రవీంద్రనాథ్ ***మిసిమి*** కి రూపకల్పన చేసి జవజీవాలు నింపిన సంపాదకుడు మాత్రమే కాదు ఆ ***మిసిమి*** ని అందరికీ వెలుగునందించే ***'పసిమి'*** గా తీర్చిదిద్దారు. రవీంద్రనాథ్ గారి లక్ష్యశుద్ధి మహత్యంవలన ఇప్పుడు ***మిసిమి*** రజతోత్సవం కూడా జరుపుకుని ముందుకు సాగుతోంది.

"***మిసిమి*** అందరికి అందుబాటులో ఉండదు. అంటే, ***మిసిమి*** లో ప్రచురితమయ్యే కొన్నికొన్ని రచనలు అందరికీ మింగుడు పడవు! వాటి ***స్థాయి*** ఒక కనీస స్థాయిని అధిగమించినవారికే అందుబాటులో ఉంటుంది. వారినే మేధావి పాఠకులంటున్నాము. మేధావులు, మేధావి పాఠకులు ఒకటే కారు. మేధావుల పాఠకులు మేధావి పాఠకులు" (చలసాని ప్రసాదరావు). ***మిసిమి*** మేధావుల పత్రిక. మేధావి పాఠకుల పత్రిక. ఆ పాఠకుల కోసం ఈ మేధావుల కలం పట్టించిన సంపాదకుడు డా. రవీంద్రనాథ్. ఆ పని కూడా గతంలో ఎవరు చేయని స్థాయిలో, ఊహించని రీతిలో చేశారాయన. తనతో పాటు ***మిసిమి*** కూడా ***'పసిమి'*** గా వెలిగి పోయేటట్లు చేశారు. విద్యావంతులైన ఆధునిక తెలుగు పాఠకుల కంటికి పంచరంగుల పసిమిగా మేధకు బరువైన మేతగా, హస్తభూషణంగా కూడా తీర్చిదిద్దారాయన. ***మిసిమి*** ముందు, వెనుకా ఎన్నెన్ని, ఎందరెందరు ప్రసిద్ధ చిత్రకారుల అపురూప కళాఖండాలు మిలమిలలాడాయి!? వాటి ముద్రణలో ఏ పాశ్చాత్య ముద్రణకు తీసిపోని నైపుణ్యాన్ని ఎంతగానో సాధించారు. ఉన్నవి కాసిన్ని పేజిలే, అయినా ఎంత బరువైనది ***మిసిమి*** ?!

''నేర్చుకొనిన దేనినైనా స్వీయానుభవాలతో సమీక్షించుకుని స్వీయసమాజావసరాలకు అనువర్తింప చేయడం సృజనశీలుర పని. ఈ అంశాన్ని గురించి ఒకసారి రవీంద్రనాథ్‌గారితో చర్చించినప్పుడు "అలా రాసేవారూ, రాయగలవారు ఉండాలి కదా?" అన్నారాయన" (చలసాని). అలాంటి మౌలిక రచనలు కనబడినప్పుడు, వాటి రచయితలనుగూర్చి వాకబు చేసి, వారిచేత రచనలు చేయించి ప్రముఖంగా ప్రచురించిన సంపాదకుడు రవీంద్రనాథ్. సంపాదకుడంటే... ఏదో, వచ్చిన రచనల్లోంచి పనికివస్తాయనుకున్నవి నాలుగు ఎన్నికచేసి అచ్చుకిచ్చే ప్రచురణకర్తగా ఉండిపోకూడదు. తమ పాఠకులకు ఏం అందించాలని ఆశిస్తున్నారో, అలాంటి రచనలకు ప్రణాళిక రూపొందించి, ఆ ప్రకారం, ఆయా రచనలను సమర్థులనుకొన్నవారిచేత రాయించి ప్రచురించేవాడే నిజమైన సంపాదకుడు. అలాంటి సంపాదకుడు డా. రవీంద్రనాథ్. అందుచేతనే ***మిసిమి*** కి అంతటి స్థాయి వచ్చింది. ఆ స్థాయి నిలుపుదలకే తమ సంపూర్ణ శక్తిసామర్థ్యాలను వాడుతున్నారు ప్రస్తుత సంపాదకులు. రవీంద్రనాథ్ రచయితలకు స్వయంగా ఫోనులు చేసి వ్యాసాలు తెప్పించడమేకాక, స్టేట్స్‌మన్, టైంలాంటి పత్రికలలో వచ్చిన సమాచారం అనువాదం చేయించి చక్కటి తెలుగు శీర్షికలుగా ప్రచురించడం, సుప్రసిద్ధ మానవతావాది ఎంబ్రోసు వ్రాసిన Devils Dictionary వరుసగా ***మిసిమి*** లో ప్రచురించారు. ఫోను ద్వారా ఎందరో ప్రముఖ వ్యక్తులను సంప్రదించి ***మిసిమి*** ని బాగా పెంపొందించే కార్యక్రమం చేపట్టారు. ఈ విధంగా ***మిసిమి*** కి విశిష్ట వ్యక్తిత్వం కల్పించారు. విజ్ఞుల దృష్టి ***మిసిమి*** వైపుకు మరలింది. గ్రంథాలయాలు ***మిసిమి*** కి Subscription పంప ప్రారంభించాయి. రానురాను ***మిసిమి*** ఒక ప్రముఖ సాహిత్య పత్రిక స్థానం గడించింది. తర్వాత కాలంలో 'టైం' పత్రికలో పాల్ జాన్సన్ పుస్తకం ***ఇంటలెక్చువల్స్*** పై పెద్ద రివ్యూ వచ్చింది. అది చదివిన తరువాత ఆ పుస్తకం తెప్పించి దానిలోని విశేషాలు కొన్నింటిని సీరియలుగా తెలుగు చేసి

శ్రీ అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డిగారు ***మేధావుల మెతకలు*** అనే శీర్షికతో వ్యాసాలుగా ***మిసిమి*** పాఠకులకందజేశారు. దానితో ***మిసిమి*** కీర్తి మిన్నులంటింది. అటు తర్వాత ***మిసిమి*** ప్రచురించిన రచనలలో ప్రముఖమైనవి పురాణం సుబ్రహ్మణ్య శర్మగారి ***మధురవాణి ఇంటర్వ్యూలు***. ఈ శీర్షిక క్రింద ప్రచురించబడిన రచనలు పాఠక లోకాన్ని అమితంగా ఆకర్షించాయి. పురాణం గతించిన తర్వాత భమిడిపాటి రామగోపాలం సంకలనకర్తగా పూనుకోగా, ***మధురవాణి ఇంటర్వ్యూలు*** – గ్రంథ రూపంలోకి కళాజ్యోతి పరివర్తించింది. ***మేధావుల మెతకలు, మధురవాణి ఇంటర్వ్యూలు*** – రెండూ డా. రవీంద్రనాథ్ సంపాదకత్వానికి హైలైట్లే. ఈ సమయంలోనే సాధారణంగా అడగనిదే రాయని సంజీవదేవ్ తమంతట తాము వ్యాసాలు వ్రాసి ***మిసిమి*** కి పంపించారు. ఈ విశేష చర్య డా. సంజీవదేవ్ గారికి ***మిసిమి*** పట్ల ఉన్న అభిమానానికి గీటురాయిగా పరిగణించదగినది. కళలు, సాహిత్యంతోపాటు సైకాలజీపై డా. రవీంద్రనాథ్ గారికి ప్రత్యేక దృష్టి ఉండేది. అందులో భాగంగానే సి. నరసింహరావుగారు ప్రచురించిన ***వ్యక్తిత్వ వికాసం*** నుండి కొన్ని భాగాలు ***మిసిమి*** లో ప్రచురించారు. కథలను ***మిసిమి*** లో ప్రోత్సహించకపోవుట రవీంద్రనాథ్‌గారి ప్రత్యేకత. అయినప్పటికీ, చలసాని ప్రసాదరావు, శేషగిరిరావుగార్ల కళల అంశాలు ఆయనకు నచ్చాయి. అలాగే ముఖచిత్రం, మిగిలిన అట్టలపై చిత్రాలు ఎంపికకు కాలాన్ని బాగా వినియోగించి సఫలీకృతులయ్యారు. రాజకీయ అంశాలపై పరిశోధనాత్మక వ్యాసాలు ఏటుకూరి బలరామమూర్తి మొదలైనవారు ఎవరైనా వ్రాస్తే అవి ***మిసిమి*** లో చోటుచేసుకొనేవి. ***మిసిమి*** లో పద ఔచిత్యాల విషయంలో బూదరాజు రాధాకృష్ణను, పాత ఆసక్తికర సంఘటనలకు ఆంధ్రపత్రికలో పనిచేసి రిటైర్ అయిన శర్మగారిని తరచు సంప్రతించేవారు. ***మిసిమి*** ని గురించి మేధావులు రకరకాల అభిప్రాయాలు వ్యక్తపరచారు. "***మిసిమి*** జిజ్ఞాసువుల పత్రిక. పరిశోధకుల వేదిక, మానవీయతకది భూమిక... ***మిసిమి***లోని దాదాపు అన్ని వ్యాసాలూ పరిశీలన, పరిశోధనా పత్రాలే. భావప్రదీపకాలే... పాఠకుల్లో స్వతంత్రంగా ఆలోచింపజేసే సాధనం" అని అభివర్ణించారు జస్టిస్ ఆవుల సాంబశివరావు. ఆచార్య శేషాద్రిగారి మాటల్లో – '***భారతి*** నిలిచిపోయిన తరువాత తెలుగులో అలాంటి ఉన్నత స్థాయి పత్రికలు రాలేదు. ఆ లోటును రవీంద్రనాథ్ కలలుగన్న '***మిసిమి*** పూరించసాగింది. అది (***మిసిమి***) అంతర్జాతీయంగా మేధావులు చర్చించే సమస్యలు సారస్వతంలో, కళలోగాని, సిద్ధాంతాలలోగాని, భౌతిక, మానసిక శాస్త్రాలలోగాని – అన్నింటికీ కేంద్రీ కృతం".

మేధను ప్రతిబింబించే తెలుగు పత్రికలు ఇటీవలి కాలంలో లేవనే చెప్పాలి. ఈ లోపాన్ని గుర్తించిన రవీంద్రనాథ్ ఈ లోపాన్ని తీర్చ సంకల్పించి ***మిసిమి*** ని స్థాపించి ఈ లోపాన్ని తీర్చారు. ఇందులో ఆలోచనకు, సమాలోచనకు, శాస్త్రీయ దృక్పథానికి, తాత్త్విక, తార్కిక చర్చలకూ, భౌతిక విజ్ఞాన, మనోవిజ్ఞాన, సత్యాన్వేషణలకూ వైశిష్ట్యాన్ని, వైలక్షణ్యాన్ని, వైవిధ్యాన్ని పాఠకులకు అందిస్తూ, వారి జిజ్ఞాసా జ్వాలలను ప్రజ్వలించజేయడంలో సఫలులు అయినారు.

"ఇటువంటి ప్రగాఢ పత్రికను నడపటంలో ప్రధానమైన చిక్కు ఏమంటే కల్పనా సాహిత్యాన్ని సృష్టించే రచయితలవలె ఇటువంటి మేధాసాహిత్యానికి రూపం ఇచ్చే రచయితలు ఎక్కువగా ఉండకపోవటం" అని అభిప్రాయపడ్డారు ప్రసిద్ధ కళాకారులు, కళావిమర్శకులూ డా. సంజీవ దేవ్.

'***మిసిమి*** ఒకటి రెండు రోజుల్లో చదివి అవతల పారవేసేది కాదు. అది ఆలోచనామృతాన్ని అందించేది, దాన్ని ఆస్వాదించడానికి తీరుబడి కావాలంటే తన కృషి సఫలమైందని భావిస్తూ, చిరునవ్వు చిందించేవారు డా. రవీంద్రనాథ్'' అని పేర్కొన్నారు ప్రఖ్యాత హిందీ సాహిత్యవేత్త డా. భీమ్ సేన్ నిర్మల్.

"It does one's heart good to see a serious periodical like MISIMI, not only serving but marching from strength to strength, month by month. It is not a matter of Circulation but Celebration. Even if there are a thousand readers influenced by its content, it will be a substantial gain to the intellectual life of the Telugu - speaking public! says Dr. D. Anjaneyulu (Author and Journalist).

ప్రసిద్ధ మేధావులేగాక, పత్రికలు కూడా ప్రశంసలు గుప్పించాయి ***మిసిమి*** పై. మహానగర్ దినపత్రిక 22-07-1995 సంపాదకీయంలో ***హుస్సేన్ సాగరు*** లో ఒక కలువ పువ్వు కనిపిస్తే ఎలా వుంటుంది? గంజాయి వనంలో ఒక తులసి మొక్క కనిపిస్తే అప్పుడు ఎలా వుంటుంది? కాకుల గోల మధ్య ఒక కోయిల పాట వినిపించితే ఎలా వుంటుంది? తెలుగు వ్యాపార, వ్యవహార పత్రికల మధ్య ***మిసిమి*** అనే బంగారు పత్రికను చూచినప్పుడు ఖచ్చితంగా అలాగే వుంటుంది. పాఠకులు కొని చదువుకునే పత్రికలకూ చదువుకున్నవారు చదువుకునే పత్రికకూ వున్న తేడా తెలిస్తే,

***మిసిమి*** విశిష్టత అర్థం అవుతుంది" అని శ్లాఘించింది. అలాగే తెలుగు విద్యార్థి తన ఆగష్టు 1995 సంచికలో ఈ విధంగా వ్రాసింది. "పురుషులందు పుణ్యపురుషులు వేరయా – అన్నాడు వేమన. పత్రికలందు పుణ్య పత్రికలు వేరయా అంటాం మన మందరము కూడా ***మిసిమి*** పత్రిక సంచికలు రెండు మూడు చదివితే. ***మిసిమి*** ఒక విలువైన మాసపత్రిక... అసలది చూచేటప్పటికి రసజ్ఞులైన పాఠకుల హృదయాలు పులకిస్తాయి. ఇక విషయానికి వస్తే... భారతీయ దర్శనాలు పరిచయం చేయబడతాయి – ఒక సంచికలో తాత్త్వికులు జిడ్డు కృష్ణమూర్తితో ముఖాముఖి – మరో సంచికలో చార్వాక దర్శనం మీద విమర్శ ఉంటుంది... కాలక్షేపానికి చదివే పత్రిక కాదు ***మిసిమి***. సాహిత్యం, వేదాంతం, తత్త్వశాస్త్రం, మనోవైజ్ఞానిక శాస్త్రం, మన దర్శనాలు, సామాజిక సిద్ధాంతాలు – ఇటువంటి లోతైన అంశాలకు సంబంధించిన దుర్గ్రాహ్యమైన విషయాలను కూడా, సులభ గ్రాహ్యంగా అందిస్తుంది ***మిసిమి*** .... ***మేధావుల మెతకలు***, ***మధురవాణి ఇంటర్వ్యూలు*** తో పాఠకలోకం ఆలోచనా స్రవంతిని మలుపు త్రిప్పిన రవీంద్రనాథ్ అనేక వినూత్న శీర్షికలను ***మిసిమి*** పాఠకులకు అందించారు".

దక్షిణదేశంలో ఉత్తమోత్తమ ఆంగ్ల దినపత్రికగా ప్రసిద్ధికెక్కిన హిందూ దిన పత్రిక దృష్టిలో "MISIMI is one of those rarest of rare gems in terms of literary value which is difficult to be found in the contemporary scene, however deep one may fathom ...... Misimi is not a run of the mill magazine. ...... It is not often, that one comes across quality printing with quality features on quality subjects. MISIMI - Lustre, resplendent. It is a monthly, which contains everything a curious mind wants to know". ......

ఇంతకంటే గొప్ప కితాబులేముంటాయి! అందుకే, 1995వ సంవత్సరంలో కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం రవీంద్రనాథ్‌గారికి గౌరవ డాక్టరేటు ప్రదానం చేసింది. మన విశ్వవిద్యాలయాలు ఇలాంటి పని చేయవు కదా?! మన పద్ధతి ఇంట గెలిచి రచ్చ గెలుచుట కాదు. రచ్చ గెలిచి ఇంటి గౌరవాన్ని ఆశించుట. ఇంతటితో ***మిసిమి*** అభినందన మాలను ముగిస్తూ ఈ నాలుగవ స్రవంతిని సంపూర్ణం చేయడమైనది. తండ్రిపై పిల్లల ఆదరాభిమానాలు మూల్యాంకణాతీతమైనవి! ఆ దృష్టితో చూస్తే, రవీంద్రనాథ్ గారి కుమారులు, కుమార్తె వారియందు వెల్లడించిన భావజాలం అత్యంత అమూల్యమైనది. అన్నిటికంటే గొప్ప విశేషం, తమ తండ్రిగారి మానస పుత్రిక ***మిసిమి*** ని ఎలాంటి లోటూ లేకుండా పోషించుట! అది వారికి తమ తండ్రిపైగల గాఢానురాగం చెప్పక చెబుతోంది.

ఈ వ్యాసాన్ని చతుర్ముఖ జ్యోతిగా చిత్రించాలని ఆశించాను కాని అన్ని విషయాలు ఆ నాలుగు పాయలలో ఇముడ్చలేక పోయాను. ఉదాహరణకు, ***మిసిమి*** లో ప్రచురితమైన కొన్ని ముఖ్య రచనలు, డా. రవీంద్రనాథ్ గారికి ప్రముఖులు వ్రాసిన ఉత్తరాలు, రవీంద్రనాథ్ గారు స్వర్గస్తులైన తర్వాత వారికి వారి మిత్ర మండలి (స్రవంతి) వ్యక్తపరచిన హృదయ వేదనా సందేశాలు, రవీంద్రనాథ్‌గారి అంతిమ యాత్రకు సంబంధించిన అనేక వివరాలు విశ్లేషణాత్మక వివరణ పొందలేదు. కారణం డా. రవీంద్రనాథ్ గారిని చతుర్ముఖ జ్యోతిగా చిత్రించాలన్న ప్రబల వాంఛ. అందుకు విజ్ఞులైన పాఠకులు మన్నిస్తారని ఆశిస్తా.

**ముగింపు:**

డా. రవీంద్రనాథ్ గారు ప్రముఖ వ్యక్తి, సౌజన్య మూర్తి, సంభాషణా చతురుడు, దాతృత్వంలో ఎముక లేని చేయి. జీవితాన్ని సమ్యక్ దృష్టితో దర్శించి, మంచిని పెంచి, జ్ఞానాన్ని పంచి, మానవతను ఎల్లవేళలా మరవక, అందరికి అందుబాటులో ఉండి తారతమ్యాలు విసర్జించి, అజాత శత్రువుగా ప్రసిద్ధికెక్కారు. వారు తెలుగు పత్రికా రంగానికి, తెలుగు జాతి వికాసానికి, అనేక విధాల సేవ చేసిన మేధావి, వదాన్యుడు. ఇంతమంది ప్రముఖులు ఆయన స్నేహ సౌహార్ధాన్ని తనివితీరా ఆస్వాదించారు, అమృత ఘడియలైన ఆయన జీవిత కాలంలో నివసించే అదృష్టాన్ని పొందగలిగారు. ఆ కాలంలో ఆంధ్రదేశం బయట కాలం గడిపిన నేను ఆయన వ్యక్తిగత దర్శనానికిగాని, వారితో మాట్లాడే అవకాశానికిగాని నోచుకోలేదు. అది నా దురదృష్టం. అయినప్పటికీ వారి స్మృతి సంపుటిని పరిశీలించి, వారిని గూర్చిన వివరాలు ఈ వ్యాసరూపంలో అందరి ముందు



ఉంచే అవకాశాన్ని నాకు కల్పించి, ఎనలేని సంతృప్తిని నాకు కలుగజేసినందులకు ***మిసిమి*** సంపాదకులు అశ్వినీకుమారు గారికి నా కృతజ్ఞతాపూర్వక నమః సుమస్సులందజేస్తున్నాను.

**ప్రొ. రావినూతల సత్యనారాయణ**



ఆలపాటి రవీంద్రనాథ్

# అరుదైన సంపాదకుడు ఆలపాటి

– డా. ఎన్. ఇన్నయ్య
మేరీ ల్యాండ్, యు.ఎస్.ఎ.

రవీంద్రనాథ్ విచిత్ర పరిస్థితులలో తెనాలి వచ్చారు. గోవాడవాసిగా తురుమెళ్ళలో చదువుకోడానికి వెళ్ళారు. మూడు మైళ్ళ దూరంలో ఉన్న గ్రామానికి వెళ్ళినా చదువు పూర్తి కాలేదు. చదువు ఎగ్గొట్టి పొలాల గట్లమీద ఆటలు ఆడేవారు. హైస్కూలు మంచి ప్రమాణాలుగలది. దక్షిణామూర్తి అనే హెడ్మాస్టర్ నాయకత్వాన క్రమశిక్షణకు పేరుపొందిన పాఠశాల. టీచర్లు కూడా నిష్ఠాతులే. అందుకే అనేక గ్రామాల నుండి తమ పిల్లల్ని చదువు నిమిత్తం అక్కడకు పంపారు. రవీంద్రనాథ్ ఆ క్రమశిక్షణలో యిమడలేదు. ఆకతాయితనంగా ఇద్దరు ముగ్గురు స్నేహితులు క్లాసు ఎగ్గొట్టి వరి పొలాల మధ్య ఆటలు ఆడి యింటికి చేరేవారు. ఒకనాడు క్లాసులో పంతులుగారికి ఎదురు తిరిగి, ఆయన చొక్కాపై సిరా చల్లారు. హెడ్మాస్టర్ విచారిస్తే చేసిన మాట నిజమే అని ఒప్పుకున్నారు. క్రమశిక్షణారాహిత్యత శ్రుతి మించుతున్నదని, స్కూలు నుండి తొలగించారు. చదువుకు స్వస్తి. గోవాడ గ్రామంలో గ్రంథాలయం ఉంది. కార్యకలాపాలకు కొదవ లేదు. అయినా రవీంద్రనాథ్ స్థాయికి అవి చాలలేదు. అందువలన తెనాలికి చేరుకున్నారు. ఆనాడు తెనాలి, రాష్ట్రంలో సాంస్కృతిక కేంద్రం. నాటకాలు, ప్రదర్శనలు, ప్రచురణలు, లలిత కళలు, సినిమా రంగం, ప్రింటింగ్ ప్రెస్‌లు విరివిగా ఉండేవి. ఆంధ్ర పారిస్ అని పేరొందిన తెనాలికి చేరుకున్న రవీంద్రనాథ్‌కు కావలసినంత అవకాశం కనిపించింది. అప్పటికే ఎం.ఎన్. రాయ్ నాయకత్వాన మానవవాద ఉద్యమం ముమ్మరంగా సాగుతున్నది. రాడికల్ పత్రిక వెలువడుతున్నది. కార్మికుల పక్షాన గుత్తికొండ నరహరి ఒక పత్రికను, విద్యార్థులకు కృష్ణ చౌదరి ఒక పత్రికను నడిపారు. కోగంటి రాధాకృష్ణమూర్తి కవిరాజ ప్రచురణలు నిర్వహించారు. త్రిపురనేని గోపీచంద్ రాడికల్ ఉద్యమ రాష్ట్ర కార్యదర్శిగా కథలు, వ్యాసాలు దంచేస్తున్న రోజులవి. ఆవుల గోపాలకృష్ణమూర్తి రాడికల్ పత్రిక నడుపుతున్నారు.

అలాంటి సమయంలో త్రిపురనేని రామస్వామి సంస్కరణ ఉద్యమం సాగిస్తూ, పురోహితులు లేని పెళ్ళిళ్ళు జరిపిస్తున్నారు. రవీంద్రనాథ్‌కు ఇష్టమైన వాతావరణం అది. కనుక తెనాలిలో స్థిరపడి, ప్రింటింగ్ ప్రెస్‌తో తన కార్యకలాపాలు మొదలుపెట్టారు. ప్రెస్ ఉన్నందున, *జ్యోతి* పత్రిక మొదలు పెట్టారు. *జ్యోతి* పత్రికలో రవీంద్రనాథ్‌కు ధనికొండ హనుమంతరావు సహాయపడేవారు. తరువాత పెట్టిన *రేరాణి* పత్రికకు అసిస్టెంట్ ఎడిటర్‌గా పని చేశారు. రవీంద్రనాథ్ పెట్టిన మరో పత్రిక *సినిమా.* సినిమాతో తెనాలికి ఉన్న సినిమా సంబంధాలవలన *సినిమా* పత్రిక అందరినీ ఆకర్షించింది. రవీంద్రనాథ్ చేసిన ఒక వినూత్న ప్రయోగం సెక్స్ విద్యను ప్రజలకు వైజ్ఞానికంగా, ఆకర్షణీయంగా చెప్పడం. ప్రశ్నలు సమాధానాలు శాస్త్రీయంగా ఉండాలని డాక్టర్ల సలహాలు, సహాయం స్వీకరించేవారు. జ్యోతి ప్రెస్‌కు టైప్‌రైటర్‌ను ఆలపాటి కృష్ణకుమార్ అమెరికా నుండి తెచ్చి బహూకరించారు. అప్పుడు అది తెనాలికే అపురూపం! తెనాలి నుండి అప్పటికే కాంచనమాల, వరలక్ష్మివంటివారు సినిమా రంగంలో ఉన్నారు. తెనాలి జీవితంలో 10 ఏళ్ళపాటు రవీంద్రనాథ్ చరిత్ర మలుపులు తిప్పారు. మానవవాద ఉద్యమంలో సాంస్కృతిక విభాగానికి తిరుగులేని బాటలు వేశారు. ఆయన పెళ్ళి కూడా సుప్రసిద్ధులైన

త్రిపురనేని రామస్వామి, తాపీ ధర్మారావు నిర్వహించారు. ఎం.ఎన్. రాయ్ తరచు తెనాలి వస్తూ పోతూ ఉండడం కూడా రవీంద్రనాథ్‌పై ఆయన ప్రభావం కొంతవరకు ఉంది. రవీంద్రనాథ్ ప్రోత్సహించినవారిలో రావూరి భరద్వాజ, శార్వరి, శారద వెలుగులోకి వచ్చారు. అది ఒక పునర్వికాస దశాబ్దంగా వెలిగిన సందర్భం. ఆ తరువాత రవీంద్రనాథ్ హైదరాబాద్‌లో కుదుట పడ్డారు. మానవవాద ఉద్యమంలో సాంస్కృతిక ప్రతినిధిగా ఆలపాటిని చెప్పుకోవాలి. బౌద్ధాన్ని అధ్యయనం చేసి, సిలోన్, టిబెట్, థాయ్‌లాండ్ నుండి విశిష్ట గ్రంథ సేకరణ చేశారు. అమెరికా నుండి 40 ఏళ్ళపాటు టైం మాగజైన్ తెప్పించారు. ఎవర్ గ్రీన్ పత్రిక తెప్పించారు. అనేకమందిని కలవడం, తన సొంత లైబ్రరీకి పుస్తకాలను సంతరించుకోవడం నిత్యకృత్యంగా పెట్టుకున్నారు. ఆ సమయంలోనే ఒక పక్షపత్రిక పెట్టాలని మిత్రులతో చర్చించి నిర్ణయించుకున్నారు. ఆ చర్చలలో ఆ పత్రిక పేరు *మిసిమి* అని నామకరణం జరిగింది. అందుకు బూదరాజు రాధాకృష్ణ, చలసాని ప్రసాద్, సి. ధర్మారావు ప్రోత్సహించారు. ఆ తర్వాత అది మాసపత్రికగా మారింది. రవీంద్రనాథ్ సంపాదకునిగా పూర్తి సమయం కేటాయించారు. ఆయన కుమారులు వెంకట్, బాపన్నగార్లు ఆయనను ప్రోత్సహించగా ఈ మాసపత్రిక ఆయన మానస పుత్రికగా ఎదిగింది. రవీంద్రనాథ్ సిసలైన మానవవాది. అందులో రామణీయకతలపై బాగా దృష్టి పెట్టినవాడు. తెనాలి అనుభవాల దృష్ట్యా అలాగే కొనసాగించాలని తలపెట్టారు. వివిధ రచయితలను సంప్రదించడం, శీర్షికలు చర్చించడం ఆయనకు కొట్టిన పిండి. రచయితలకు పుస్తకాలు, సమాచారం అందించి, వాటి ఆధారంగా రాయమనేవారు. *మిసిమి* పాలసీగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. *మిసిమి* లో కథలు, గేయాలు, నాటకాలు వద్దనుకున్నారు. మానవ విలువలలో రామణీయకత ప్రాధాన్యత ఉండాలని అనేవారు. మంచి పుస్తకాలు కొని తగిన రచయితల్ని ఎంపిక చేసి వ్యాసాలు వ్రాయించేవారు. *సూటబుల్ బాయ్* అనే పెద్ద పుస్తకం కొని, వెనిగళ్ళ కోమలకు ఇచ్చి రివ్యూ రాయించారు. ఆధునిక తాత్విక మహాశయులు బెర్ట్రాండ్ రస్సెల్‌వంటివారిపై నేను వ్యాసాలు రాసేవాడిని. సంజీవదేవ్‌వంటివారితో బౌద్ధం, రామణీయకతల గురించి చర్చించేవారు.

*మిసిమి* పత్రిక ప్రశంసలకు పాత్రమైంది. *ఈనాడు, హిందూ* దినపత్రికలు గుణాత్మకంగా మెచ్చుకున్నాయి.

రవీంద్రనాథ్ ఎటువంటి సిద్ధాంతాల, విశ్వాసాల ముద్ర వేసుకోలేదు. తెనాలి జ్యోతి పత్రికల నుండి *మిసిమి* వరకు మానవవాద, రామణీయకత, సంస్కృతితో నడిపారు.

ఆలపాటి రవీంద్రనాథ్ పత్రికా జర్నలిజంలో ప్రామాణిక ఒరవడి ఏర్పరచిన ప్రముఖులు. వారి శతజయంతి సందర్భం వారితో చిరకాల సాన్నిహిత్యంగల నాకు ఎంతో సంతోషం.

**డా. ఎన్. ఇన్నయ్య, మేరీ ల్యాండ్, యు.ఎస్.ఎ.**

---

## *మిసిమి* వ్యవస్థాపకులు



ఆలపాటి రవీంద్రనాథ్

*మిసిమి* వ్యవస్థాపకులు రవీంద్రనాథ్ గారు గొప్ప మనిషి. లోకమనే ఈ విశ్వవిద్యాలయం నుండి అనుభవ వరంవరతో ఎందరో మహనీయుల సన్నిహితత్వంతో – అనంతమైన ప్రతిభను సాధించుకున్న సంస్కారశీలి. ప్రాచీనమైన సౌందర్యాన్ని ఆధునికం వైపు నడిపించిన కార్యశీలి. *మిసిమి* పత్రిక కేవలం సాహిత్యమే కాదు, ఎన్నో గొప్ప విషయాలతో వివిధ శాస్త్ర, సాంకేతిక, గాన, చిత్రకళా రీతులకు ప్రాధాన్యమిస్తున్న పత్రిక *మిసిమి*. ఇదంతా రవీంద్రనాథ్ గారి సంకల్పబలం. తెలుగువారి ఆశాకిరణం. సముజ్వలమైన ఆంధ్ర దేశ ప్రగతిలో రవీంద్రనాథ్ సదా జీవిస్తూనే ఉంటారు. *మిసిమి* చేసుకున్న అదృష్టం అశ్వినీకుమార్‌వంటివారు సాధక బాధ్యతలు చేపట్టడం – శ్రీ బాపన్నగారి క్రియాశీలక పాత్ర – ఇవన్నీ ఏకమై *మిసిమి* భవితకు బంగారు బాటలు వేస్తున్నారనటంలో సందేహం లేదు. ధన్యవాదాలు...

**చెరుకువాడ వెంకట్రామయ్య, విస్సాకోడేరు. ఫోన్: 954 211 8184.**

# నా తలపులలో నాన్నగారు

– దుర్గ నన్నపనేని

ఊహ తెలిసినప్పటి నుంచీ నాన్నగారికి బాగా దగ్గర నేనే. ముగ్గురు బిడ్డల తరువాత పుట్టిన ఆడపిల్లనని నేనంటే గారాబం. తెనాలిలో ఉండగా రోజూ టెన్నిస్ ఆడటానికి వెళ్తూ నన్ను వెంట తీసుకుని వెళ్లేవారు. హైదరాబాద్ వచ్చి సెటిలయ్యాక సికింద్రాబాద్ క్లబ్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో నాన్నగారు నాకు ఈత నేర్పించారు.

అన్నయ్యలెవ్వరూ నాన్నగారి ముందు నిలబడి మాట్లాడడానికి సాహసించేవారు కాదు. నాన్నగారితో నాకు ఉన్న చనువునుబట్టి ఏ విషయమైనా నిర్భయంగా, నిస్సంకోచంగా మాట్లాడేదాన్ని. ఎదురు చెప్పాల్సి వచ్చిన సందర్భాలలో కూడా ఏమాత్రం అదురూ బెదురూ ఉండేది కాదు. ఆయన పుస్తక పఠనంలో లీనమైనప్పుడు మాత్రం చాలా జాగ్రత్తగా మెలిగేవాళ్లం. పిన్‌డ్రాప్ సైలెన్స్ కోరుకొనేవారు. పుస్తకాలు, స్నేహితులే ఆయన ప్రపంచం. నాయనమ్మగారు కూడా కనపడ్డ పుస్తకమల్లా చదివేవారట! నాన్నగారి ఆలనా పాలనా నాయనమ్మగారే చూసేవారట! బహుశా నాన్నగారి పుస్తక పఠనాభిలాష మా నాన్నమ్మగారి నుంచే అలవడి ఉంటుంది. ఆయన హైస్కూలు చదువు కారణాంతరాల వల్ల అర్థాంతరంగా ఆగిపోయినా, ప్రైవేట్ టీచర్‌ను పెట్టుకొని ఇంగ్లీషు చెప్పించుకున్నారని మా పెద్దవాళ్ల ద్వారా విన్నాను.

మా మేనత్త సునందా దేవి అంటే మా నాన్నగారి చెల్లెలు ఒక సంఘటనను ప్రస్తావిస్తూ ఉండేవారు. నాన్నగారు తురుమెళ్ళ హైస్కూలులో చదువుతుండే రోజుల్లో తురుమెళ్ల నుంచి గోవాడ వస్తూ దారిలో సిగరెట్ కాల్చారట. ఆ సంగతి మా తాతగారి చెవిన వేశారు ఒక శ్రేయోభిలాషి! మా తాతగారు కోపంగా నాన్నగారి మీద దెబ్బ వేశారట. దాంతో నాన్నగారు కోపగించుకొని "నా భాగం నాకు పంచివ్వండి" అన్నారట.

"భాగం పంచుకుని ఏం చేస్తావు?" అని అడిగారు తాతగారు.

"పుస్తకాల షాపు పెట్టుకుంటా" అని నాన్నగారి జవాబు.

చిన్నతనం నుంచే నాన్నగారికి పుస్తకాలంటే ఎంత గాఢమైన అనురక్తో చెప్పడానికే ఈ ప్రస్తావన. తనలాగే నేను కూడా సాహిత్యాభిమానిని కావాలని నా చేత రవీంద్రనాథ్ ఠాగూర్, శరత్‌బాబుల సాహిత్యం చదివించాలని ఆయన ప్రయత్నించారు. నాలో ఆ అభిలాష నాటుకోకపోయినా మా పెద్దబ్బాయి రాజీవ్ తాతగారి పుస్తక పఠనాభిలాషను, సాహిత్యాభిరుచిని పుణికి పుచ్చుకున్నాడు. జీన్స్ ప్రభావం అనుకుంటాను.

నా వివాహం నా 16వ ఏటే జరిగింది. అప్పటికి నేను మెట్రిక్ పాసయ్యాను. పిన్న వయసులోనే పెళ్లిళ్లు ఆ రోజుల్లో సహజమే. మా నాన్నగారు తన 18వ ఏటే వివాహం చేసుకున్నారు. నా విషయంలో ఆయన వైఖరి వేరు. నేను ఇంకా కొన్నాళ్లు చదువు కొనసాగించాలని ఆయన కోరిక. పరిస్థితులు తోసుకువచ్చి అమెరికాలో చదువు పూర్తి చేసి సంపాదనలో పడ్డ నన్నపనేని చౌదరిగారితో నా వివాహం జరిగింది. నేను అమెరికా వెళ్ళిపోయాను. చౌదరి గారు మాకు దగ్గర బంధువులే.

నేనక్కడ ఉన్నానని నాన్నగారు అమెరికా సందర్శించారు. నెల రోజులు గడిపారు. చికాగో వగైరా నగరాల్ని ఆయన ఒక్కరే వెళ్లి చూసి వచ్చారు. నయాగరా జలపాతం చూడటానికి వెళ్లినప్పుడు నేను కూడా నాన్నగారితో పాటు వెళ్లాను. ఫ్లోరిడా రాష్ట్రంలోని మయామి బీచ్ సందర్శించి, కొద్ది రోజులు కులాసాగా గడిపి వచ్చారు.

నాన్నగారు శరీర పోషణ, ఆరోగ్యం విషయంలో అమిత శ్రద్ధ తీసుకునేవారు. వ్యాయామం, నడక, టెన్నిస్ దినచర్యలో భాగం. మా అమ్మ మరణం నాన్నగారిపై చాలా ప్రభావం

చూపింది. వారిద్దరూ ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. అమ్మకు ఆయన భగవత్ స్వరూపుడు. ఆయనకు ఏ లోటూ రాకుండా ఆమె చూసుకునేవారు. ఆమె పోయాక నాన్నగారిలో మార్పు వచ్చింది. ఒంటరితనంలోని బాధ కావచ్చు. పైపెచ్చు స్కిన్ ఎలెర్జీ వచ్చి ఆయనను కృంగదీసింది. తన చక్కదనం, మేనిఛాయ చెడకుండా కాపాడుకునే నాన్నగారు కొన్ని మందుల వాడకం వల్ల కలిగిన దుష్ప్రభావం ఫలితంగా సంభవించిన అలర్జీ ఆయనకు కొద్ది నెలలు మనఃశాంతి లేకుండా చేసింది. నన్ను కూడా తన గదిలోకి రానిచ్చేవారు కాదు.

*మిసిమి* పత్రిక నాన్నగారికి గొప్ప సాంత్వన కలిగించింది. దానికి విద్యావంతుల నుంచి, మేధావుల నుంచి వచ్చిన గుర్తింపు ఆయనకు సంతృప్తినిచ్చింది. జీవిత చరమాంకంలో *మిసిమి* ఆయనకు సర్వస్వమైంది. కాని ఆయనలో కలిగిన కొన్న మార్పులు నాకు సంతోషం కలిగించలేదు. అయినవాళ్లకు దూరంగా గిరిగీసుకొని కూర్చుంటే ఎలా అని నాకు బాధ కలిగేది. ఇతరులెవ్వరికీ తన కారణంగా ఇబ్బంది కలగకూడదని తన భోజనం తానే వండించుకొని తినేవారు. తను ఇతరులెవరి మీదా దేనికీ ఆధారపడకూడదన్న ఫీలింగ్ ఆయనకుండేది.

నా వరకు నేను నా ఇద్దరు పిల్లలకు దగ్గరగా ఉండాలని, నా వాత్సల్యాన్ని వారికి పంచివ్వాలని వాళ్లూ అమ్మానాన్నల అనురాగ మాధుర్యం ఆస్వాదించాలని అందరం ఒకేచోట కలిసి ఉండే ఏర్పాటు చేశాను. కుటుంబానికి సంబంధించి మా ఇద్దరి దృక్పథాలు ఒకటి కాకపోవచ్చు. ఆయన మా అందరికీ ప్రేమాస్పదుడే.



ఆలపాటి రవీంద్రనాథ్ - కళావతి దంపతులు

ఆయన 1996 ఫిబ్రవరిలో హాస్పిటల్‌లో ఉన్న పది రోజులూ నేను ఆయన దగ్గరే ఉన్నాను. ఆయనని కనిపెట్టుకునే ఉన్నాను. ఒక రోజు ఆయన నన్ను ఇంట్లో ఏం కూర చేశావని అడిగారు. తోటకూర పప్పు అని చెప్పాను. అదంటే నాన్నగారికి ఎంతిష్టమో! నాన్నగారు హాస్పిటల్‌లో చేరడానికి ముందు నేననుకునేదాన్ని - ఆయన మరో పదేళ్లు జీవించి ఉంటారని. కాని చివరి దశలోని విషాదానుభవాలు, హృదయఘాతాలు, కొన్ని మందుల రియాక్షన్, అలెర్జీ, శ్వాసకోశ రుగ్మత - అన్నీ కూడి ఆయన ఆయుష్షు కుదించాయి. కాకుంటే ఆయన అంత ముందుగా మాకు దూరమయ్యేవారు కాదు.

దూరమయ్యారని భావించడం సరికాదేమో! జ్ఞాపకాల రూపంలో, నెలకొల్పిన సంస్థల రూపంలో నాన్నగారు మా మధ్య నిలిచే ఉన్నారు!

దుర్గ నన్నపనేని

రవీంద్రనాథ్ ఏకైక తనయ - నాట్కో చౌదరిగారి అర్థాంగి.

'రవీంద్ర స్మృతి' నుంచి

---

## కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు

*ఆలపాటి రవీంద్రనాథ్ నాకు బాల్యమిత్రుడు. మా ఇద్దరిదీ గోవాడే. ఆరడుగులకు పైచిలుకు ఎత్తు, స్ఫురద్రూపి, ఆకర్షణీయ ధోరణి. అందువల్ల అందర్నీ ఆకట్టుకోగల శక్తిసామర్థ్యాలు మొదటి నుండీ ఉండేవి. మా ఇద్దరి చదువు సంధ్యలు దగ్గరలోని తురుమెళ్ల హైస్కూల్‌వరకే పరిమితమయ్యాయి. దీనికి కొన్ని కారణాలున్నాయి. మొదటి నుంచీ మా గ్రామం జాతీయోద్యమానికి పట్టుగొమ్మ. అందునా వీరి తాత తండ్రులంతా సంపన్న రైతు కుటుంబీకులైనా దేశభక్తి, సేవాదృక్పథం కలిగినవారు కావడం ఒక విధంగా మంచిదైనా చదువు సంధ్యలకు కాస్త ఆటంకం కలిగించిందనే చెప్పాలి. మా చిన్నతనంలోనే మా గ్రామం జాతీయోద్యమానికి ముఖ్యంగా జాతిపిత గాంధీజీని నెత్తిమీద పెట్టుకొంది. ఈ స్ఫూర్తితోనే వీరి తండ్రిగారైనా శ్రీ వెంకట్రామయ్యగారు గోవాడ గ్రామంలో గ్రంథాలయాన్ని స్థాపించారు. ఇది ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరమైన ఆలోచన. రవీంద్రనాథ్‌గారు చిన్నప్పటి నుంచే సీరియస్ పత్రికలు, రచనలను చదువుతుండేవారు. 1939 ప్రాంతంలో తాపీ ధర్మారావుగారి సంపాదకత్వంలో కాగడా*

*- స్వర్గీయ పావులూరి శివరామకృష్ణయ్య*

*ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, గోవాడ*

మిగతాది 36వ పుటలో...



రవీంద్రనాథ్

# స్మృతి సమీరం

*– డా. అవధానం రఘుకుమార్*

నాకు *మిసిమి* పత్రిక గురించి చాలా కాలంగా తెలిసినా, తెప్పించుకుని చదవడం అనేది ఓ రెండు, మూడు సంవత్సరాలుగానే. తెలుగు సాహిత్యం, పత్రికలు అంటే ఎందుకో నాకు ఓ రకమైన విముఖత (నిజం చెప్పాలంటే సాహిత్యం అంటేనే మొత్తంగా). 1980ల చివర నుండి ఈ సమస్య మొదలయ్యింది. మళ్ళీ 2012–13లలో మా తార్నాకా సాహిత్య మిత్రులు నన్ను "స్ప్రెడింగ్ లైట్" అనే గ్రూపుతో పరిచయం చేసేదాకా నేను తెలుగు సాహిత్యాన్ని, పత్రికలనూ పెద్దగా చూడలేదు, చదవలేదు. రావెల సోమయ్య గారు అడపాదడపా *మిసిమి* చదవమని సలహా ఇస్తూ ఉండేవారు. 2018ల నుండి *మిసిమి* ని శ్రద్ధగానే చదువుతున్నాను.

*మిసిమి* అనే పేరే పలకడానికి, వినడానికి చాలా అందంగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. అశ్వినీ కుమార్ గారు "రవీంద్ర స్మృతి" ఇచ్చి, చదివి స్పందించమన్నారు? చదవడం వరకూ బాగానే ఉంది, స్పందించేందుకు నాకున్న అర్హతలేమిటి? రవీంద్రనాథ్ గారిని నేను ప్రత్యక్షంగా ఏనాడూ చూడనూ లేదు, కలసి మాట్లాడింది లేదు. కానీ "రవీంద్ర స్మృతి" చదువుతూంటే వీరి వ్యక్తిత్వం గురించి, జీవితం గురించి అంతమంది పెద్దవారు, అంత విభిన్న ఆలోచనా ధోరణులూ, ఆచరణలూ ఉన్నవారు వ్రాసిన మాటలు చదువుతూ ఉంటే – ఒక వ్యక్తి జీవిస్తే ఇంత అందంగా, ఇంత సమన్వయంతో జీవించాలేమో అన్న భావన కలిగింది.

డా. సి.నా.రె., జస్టిస్ పి.ఏ. చౌదరి, డా. జయప్రకాశ్ నారాయణ, అబ్బూరి ఛాయాదేవి, రామలక్ష్మి ఆరుద్ర.... ఇలా అనేకమంది వారి ''స్మృతి''లో వారి, వారి హృదయావిష్కరణలు చేస్తుంటే, ఆ వ్యక్తి ఎంత ప్రభావశీలో అర్థం అయ్యింది.

*మిసిమి* పేరు రూపుదిద్దుకోవడం వెనకాల డా. బూదరాజు రాధాకృష్ణ, ఆలపాటి రవీంద్రనాథ్ గారి మధ్య జరిగిన చర్చ, ఆ పదానికి అర్థం, వ్యుత్పత్తి, ప్రయోగాలు తెలిపే, తెలుసుకునే ఆ ఇరువురి ప్రయత్నం అర్థం అయ్యింది. అన్నపురెడ్డి వెంకటేశ్వర రెడ్డి గారి "ఆల్టర్ ఇగో"లో ఒక "సౌందర్య పిపాసిని, కళాభిమానిని, సాహిత్యాభిమానిని, రాసాస్వాదిని, సరసుని, మానవీయతకు ప్రతీకను, దేవుని కాదన్నవానిని, యుక్తి (Reason), సహుని, మర్యాద మన్ననలు ఎరిగినవానిని, మధిరాపాన నిష్ణాతుని, జ్ఞాన పిపాసిని, ఒక బౌద్ధుని, చతురుని, విమర్శకుని, సమయపాలకుని, రచనా, కళాభివ్యక్తులకు దోహదకారిని, స్నేహపిచ్చులుని" చూశారట! మల్లాది సుబ్బమ్మగారేమో "మితభాషి, ఆత్మాభిమాని, అభ్యుదయవాది, నిర్మొహమాటి, స్నేహప్రియుడు, వదాన్యుడు, స్ఫురద్రూపి, హేతువాది, హ్యూమనిస్ట్"ను చూశారు.

*కేయూరాణి న భూషయంతి / పురుషం హార న చన్ద్రో జ్వలా*
*నస్నానం న విలేపనం న కుసుమం / నాలంకృతా మూర్ధజా...*

అన్న శ్లోకం నోట ఆలపిస్తూనే, తమ ముందు గౌరవప్రదంగా వస్త్రధారణ లేని వాడి విద్వత్తును గుర్తించలేని "శ్లేష" జీవితాన్ని జీవించే జ్ఞానులున్న ఈ సమాజంలో "ఆయన ఎంతోమంది 'అడవి' రచయితలను వెలుగులోనికి తెచ్చారు. తెనాలి మారిస్‌పేటలో ఇప్పుడున్న అలంకార్ సినిమా హౌస్ సమీప వీధి మలుపులో, బాణలి పెట్టుకొని పునుగులు అమ్ముకొనే 'శారద' (నటరాజన్)ను ప్రపంచానికి జ్యోతి ద్వారా పరిచయం చేసిన ఖ్యాతి రవీంద్రనాథ్‌కే దక్కుతుంది" "జ్యోతి" అది "పక్షపత్రిక", కానీ "నిష్పాక్షికం." అలాగే ఎంతోమంది కొత్త రచయితలు డా. రావూరి భరద్వాజ, శార్వరి, శివం, చౌడేశ్వరీ దేవి, ఆలూరి

భుజంగరావు... రవీంద్ర శిల్పాలు. టి. రవిచంద్ గారు "ఆయన కవి కాదు, రచయితా కాదు, సంపాదకుడూ కాదు, ఆయన ఒక మంచి సాహితీ ప్రియుడు, ఒక సీరియస్ పాఠకుడు," అంటారు. ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలతో ఎదుటివారు ఏకీభవిస్తున్నారా, లేదా అని ఎదురు చూసేవేళ, శ్రీ రవీంద్రనాథ్ గారు మాత్రం ఎదుటివారి అభిప్రాయాలతో తానెంతవరకు ఏకీభవించగలనోనని బేరీజు వేసుకుంటారట (సి. నరసింహ రావు). "ఎవరైనాగానీ స్వయం ప్రకాశం కలిగి ఉండాలేగానీ ఛాయాగ్రహాలుగా ఉండటం ఆయనకు గిట్టదు" అన్నారు డి. శేషగిరి రావు. అచ్యుతరామ్ గారి మాటలలో "మానవ విలువలతో హేతుబద్ధమైన ఆలోచనలతో నూతన సమాజ ఆవిష్కరణ జరగాలని భావిస్తూ – ఆ పరిణామ క్రమంలో ''స్కూల్ ఆఫ్ థాట్'', ''కంపార్ట్‌మెంటల్ థింకింగ్''లాంటి ప్రాకారాలను అధిగమిస్తూ, మూసలో పోసిన ఊసులు భావాలు వద్దంటూ (దీన్నే indoctrination అంటారు) సమాజహిత భావ సమ్యగ్దర్శనంతో, భావుక సమన్వయత్వంతో కథాకథనం సాగించాలన్న ధోరణి (ఆయనలో) ప్రవర్ధమానమయింది''

''నాకు పత్రికా నిర్వహణే వ్యసనం'' అని పెన్మత్స హరిశ్చంద్ర రాజుతో అన్నారట. అంతేకాదు 'పేరుకే నేను ఎడిటర్‌ని, వాస్తవంలో పాఠకుడిని మాత్రమే" అనడంలో "నేను వృత్తిరిత్యా జర్నలిస్టును కాను" అని చెప్పడమే అన్నారు వెనిగళ్ళ వెంకటరత్నం. "జ్యోతి"లో తమ కథ ప్రచురితం కావడం గౌరవప్రద విషయంగా, ఘనంగా చెప్పుకునేవారు ఆనాటి సుప్రసిద్ధ రచయితలు కొడవటిగంటి కుటుంబరావు, గోపీచంద్, చలంలాంటి హేమాహేమీలు. ఈనాటి *మిసిమి* సంగతి సరే సరి.

"జీవిత సంధ్యలో హృదయానికి తీవ్ర అఘాతాలు తగిలాయి... జీవితం కళ తప్పినట్లయింది" (తుమ్మల ప్రసాద్). అయితే జీవితంలోని సన్మానాదుల ప్రసంగం వస్తే ఒకసారి డా. బూదరాజు రాధాకృష్ణగారు రవీంద్రనాథ్ గారికి భర్తహరి వైరాగ్య శతకంలోని శ్లోకం చదివి వినిపించారట! తాను సాధించింది ఏమీ లేదని చేప్తూ "మాతుః కేవలమేవ యౌవన వనచ్ఛేదే కుఠారా వయమ్" అని

[పూర్తి పాఠం:
***న ధ్యాతం పద మీశ్వరస్య విధివ త్సంసార విచ్ఛిత్తయే***
***స్వర్గ ద్వార కవాట పాటన పటుర్ధర్మోపి నోపార్జితః***
***నారీపీనపయోధ రోరుయుగళం స్వప్నే నాలిఙ్గితం***
***మాతుఃకేవల మేవ యౌవనవనచ్ఛేదే కుఠారా వయం***]

(సంసార చక్రబంధనం తప్పించే మోక్షానికిగాని, స్వర్గానికి చేర్చే ధర్మానికిగాని, ప్రౌఢ స్త్రీ ఆలింగనా సుఖానికిగాని స్వప్నంలోనైనా నోచుకోలేకపోయాం. కాని తల్లుల యౌవనోద్యానాన్ని మాత్రం పాడు చేయగలిగాము) (భర్త హరి వైరాగ్య శతి : 45 శ్రీ చెప్యాల రామకృష్ణారావు పద్యానువాదము, డా. ఆశావాది ప్రకాశరావు తాత్పర్య సహిత వ్యాఖ్య, క్షీరసాగర సాహితీ సమితి, హైదరాబాదు).

సంక్లిప్తంగా ఉన్న ''రవీంద్ర స్మృతి''ని చదవమని అశ్వినీకుమార్‌గారంటే కొంత ఇబ్బంది పడిన మాట వాస్తవం. ఎందుకంటే అలాంటి సంకలనాలలో సహజంగానే గుణకీర్తి ఎక్కువగానూ, విమర్శనాత్మక విశ్లేషణ అరుదుగానూ ఉంటుంది. అంతేకాక నాకు తెలియని వ్యక్తుల, సంగతులపైన అప్పటికప్పుడు ఒక పరిచయ పుస్తకాన్ని చదివి స్పందించడం నా నైజానికి వ్యతిరేకం. అయితే నిజాం వేంకటేష్‌గారితో మాట్లాడుతుంటే ఆయన వెంటనే నవంబరు 2001న ప్రచురించిన 320 పేజీల పుస్తకం (రవీంద్ర స్మృతి) ఇచ్చి, చదవమన్నారు. అప్పుడు అర్థం అయ్యింది – నిజంగానే రవీంద్రనాథ్‌గారి మూర్తిత్వం, వ్యక్తిత్వం, జీవితం, అనుభవాలు చాలా విభిన్నమైనవి, విశిష్టమైనవి అని. అంతమంది మహానుభావులను ఆయన ప్రేరేపించిన విషయం, అందరూ తమ హృదయావిష్కరణలు చేసిన విధానం చాలా గొప్పగా ఉంది.

"ఇదే జీవితాన్ని, ఇదే పరిస్థితులతో జీవించే అవకాశం లభిస్తే, అవునంటారా? కాదంటారా?" అన్న అన్నపరెడ్డి గారి ప్రశ్నకు, రవీంద్రనాథ్‌గారిచ్చిన జవాబు: "నిరభ్యంతరంగా.... దాని అసంపూర్ణతలతోనే నా జీవితాన్ని తిరిగి నే జీవిస్తాను." చాలామంది అలాంటి అవకాశం వస్తే గతంలో చేసిన తప్పులని సర్దుకుంటాం అంటారు. కానీ ఆ పనులు ''కాన్సియస్'' నిర్ణయాలు అయినప్పుడు అవి తత్కాలీన సామాజిక పరిస్థితులలో వైఫల్యం చెందినా, తిరిగి అవే చేయడం ఒక్కోసారి అవసరమే! అలాంటి ప్రయత్నాలు మిగిలించే అసంపూర్ణతలు కూడా కొంతమేరకు ముందుగా ఊహించినవే కదా? అప్పుడు విఫలమైన ఆశయాలను తిరిగి ప్రయత్నించడమే జీవితంపట్ల మెరుగైన అవగాహన. ఏ వ్యక్తి చరిత్రకూ, చారిత్రిక అనుభవాలకు, తన జీవిత కాలంలోని భౌతిక, జ్ఞాన, అధ్యాత్మికతలకు అతీతంగా నిర్మించబడరు. "కాలాతీత" వ్యక్తులు ఎవ్వరూ ఉండరు, ఒక్క "భగవంతుడు" తప్ప (భగవంతుడూ అంటూ ఉంటే?) "కలడు కలండను వాడు కలడో లేడో?" అని ఆ గజేంద్రుడు ద్వారా పోతనకొచ్చిన

సందేహాన్ని పరిష్కరించే శక్తి నాకైతే లేదు. ఆనాటి రాజకీయ, సైద్ధాంతిక ప్రభావాలు ఎవ్వరినీ స్పృశించక వదలలేదు. మార్క్స్, గాంధీ, నెహ్రూ, ఎం.ఎన్. రాయ్, లోహియా, అంబేడ్కర్... ఇలా ఆనాటి దేశపటం అనేక తాత్విక సంఘర్షణలకు నెలవు. భారతదేశ చరిత్రలో 1850-1950 ఒక మహత్తర ఘట్టం. అనేక సాంఘిక, సాంస్కృతిక, సైద్ధాంతిక ఉద్యమాల సమాహారం. కానీ నాకు చాలా గొప్పగా అనిపించింది - అన్ని ఘర్షణల మధ్య రవీంద్రనాథ్ గారు ప్రదర్శించిన సమన్వయం, తాత్విక తటస్థత. గాంధీ, ఏం.ఎన్. రాయ్, నార్ల ఇలా అనేక విషయాలలో నాకు రవీంద్రనాథ్ గారిలో ఆ స్థిత ప్రజ్ఞత కనిపించింది. ఆనాటి చాలామంది జ్ఞానులలో, పత్రికాధిపతులలో కనబడని సంయమన ప్రతిస్పందన. మధురవాణి రెచ్చగొట్టినా, "నేను సైలెంట్ వర్కర్ని. కొద్దిపాటి చదువు మాత్రమే చదువుకున్నవాడిని. నాకు పుష్పగుచ్చాలు అక్కరలేదు. పన్నీటి జల్లులూ అవసరం లేదు" అని రవీంద్రనాథ్ గారు అన్నా మనం తెలుగు వాళ్ళం ఉరుకుంటామా? పుష్పగుచ్చాలతో, పన్నీటి జల్లులతో ముంచెత్తమూ? విగ్రహాలను వ్యతిరేకించిన వారిని విగ్రహాలతో, పూజలను, ఆరాధనలనూ వద్దన్నవారిని స్తోత్రాలతో రుణం తీర్చుకునే అలవాటు ఉన్న తెలుగువారం.

డా. అవధానం రఘుకుమార్
హైదరాబాద్. ఫోన్: 944 101 5709.

---

*33వ పుట తరువాయి*

## కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు

*పత్రిక యువకుల్లో ప్రాచుర్యం పొందింది. రవీంద్రనాథ్‌గారు 'కాగడా' చదువుతూ తనకు ఆసక్తి కలిగించే అంశాలను నోట్ చేసుకునేవారు. ఆయన మీద 'కాగడా' పత్రిక ప్రభావం ఉండేది. రవీంద్రనాథ్ వివాహానికి తాపీ ధర్మారావుగారు కూడా ఆధ్వర్యం వహించారు. గాంధీజీ, రంగాజీ తదితర జాతీయ నాయకుల ఆలోచనల ప్రభావం పడింది. మా గ్రామం హెచ్చుగా రంగాగారి యెడ భక్తిప్రపత్తులు కలిగి ఉంది. శ్రీ సూర్యనారాయణ, రవీంద్రనాథ్‌గార్లు అభిమానించిన ఎం.ఎన్. రాయ్‌గారి రాడికల్ పార్టీ పోకడలకు మా గ్రామం అభ్యంతరం పెట్టలేదు. ఆనాడే ఆయన రాడికల్ పార్టీ యూత్ వింగ్‌ని మా ఊళ్లో ఆర్గనైజ్ చేశారు. ఊరు ఊరంతా జాతీయ వాద చైతన్యంతో ఉప్పొంగిపోతుంటే, ఆయన తద్భిన్నంగా ప్రజాయుద్ధ (రెండవ ప్రపంచ యుద్ధ) నినాదం పట్టుకున్నారు. తాను నమ్మిన సిద్ధాంతాన్ని ఇతరులెవ్వరూ బలపరచకపోయినా ఆయన ఒక్కడే నిర్భీతితో దానికి నిబద్ధుడై కార్యకలాపాలు నిర్వహించేవారు. పదుగురాడు మాటమీదకన్నా సొంత ఆలోచనలు, విశ్వాసం పైనే ఆయనకు గురి. ప్రజాయుద్ధమన్న ఆలోచనను మేమంతా తీవ్రంగా విమర్శించి, వ్యతిరేకించాము కూడా. ఐనా మా మధ్య ఎలాంటి పొరపొచ్చాలూ రాలేదు. ఆవేశకావేశాలు వెదజల్లలేదు. దీనికి కారణం మనుష్యుల్లో ఉన్న సంస్కార భావం, సామరస్య ధోరణి.*

*రవీంద్రనాథ్ గోవాడ విడిచిపెట్టి తెనాలిలో ప్రింటింగ్ ప్రెస్‌ను స్థాపించి జ్యోతి, రేరాణి, సినిమా మొదలైన పత్రికలను విజయవంతంగా నడిపారు. వీటికి కారణం వీరి పినతండ్రి ఆలపాటి సూర్యనారాయణగారు మద్రాసు నుండి ప్రారంభించిన విహారి పత్రికే. ఆ సందర్భంలో మేమంతా ప్రభుత్వానికి వ్యతిరేకమైన నవశక్తి, ప్రజాబంధు, కృష్ణా పత్రికలను చదువుతూ ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమానికి తోడ్పడుతూ ఉండేవారము.*

*రవీంద్రనాథ్‌గారు ఎం.ఎన్. రాయ్, త్రిపురనేని రామస్వామి చౌదరిగార్ల సాహిత్యం, అభ్యుదయ భావాలతో ప్రభావితులైన సామాజిక సేవకు మద్దతిస్తుండేవారు. ఇంతలో హైదరాబాద్‌కు రంగం మారింది. పాత ధోరణితోనే నూతన అభ్యుదయ భావాలను ప్రచారం చేసేదానికి **మిసిమి** అనే పత్రికను స్థాపించి పత్రికా రంగంలో ఒక వినూత్న ప్రయోగాన్ని చేసి అనతి కాలంలోనే మేధావంతుల ఆదరాభిమానాల్ని చూరగొన్నారు. దీని కీర్తి ప్రతిష్టలు ఆంధ్రదేశపు హద్దులను దాటి అమెరికా వరకు వ్యాపించాయి. దీని ఫలితమే అమెరికాలోని ఇంటర్నేషనల్ ఆఫ్ కాలిఫోర్నియా వారు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయటం చాలా అభినందనీయం. ఆంధ్రజాతికి కూడా గౌరవనీయమైన విషయమే. "కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు - మహాపురుషులవుతారు" అన్నట్లుగా రవీంద్రనాథ్‌గారు పట్టుదలతో నిరంతర పఠనంతో, మేధావుల సాంగత్యంలో తమ సహాయాన్నంతా వినియోగించుకొని పత్రికా రంగంలో కొత్త ఒరవడిలో ఉన్నత శిఖరాలనధిష్టించగలిగారు. సమాజానికి నూతన వెలుగును ప్రసాదించి - సాంఘిక విప్లవానికి స్వాగతం పలికారు. తన కృషి, చింతనలతో వర్తమాన, భావితరాలకు స్ఫూర్తిమంతులయ్యారు.*

రవీంద్ర స్మృతి నుంచి

# జయదేవుని అష్టపదులు

– ఆచార్య పప్పు వేణుగోపాలరావు

భారతీయ చరిత్రలో ఎందరో మహనీయులైన వాగ్గేయకారులు వారి సంగీత సాహిత్యాలతో భక్తితో సంస్కృతిని సుసంపన్నం చేశారు. వారిలో ప్రప్రథముడు జయదేవుడు. సంస్కృతంలో వ్రాసినా తెలుగువారికి అత్యంత ప్రీతిపాత్రుడు. భక్త జయదేవుని పేర భారతదేశంలో ఎవ్వరూ రెండు సినిమాలు తీయలేదు ఆ ఘనత తెలుగు వారిది. 1938లో భక్త జయదేవ సినిమా రెండుచింతల, సురభి కమలాబాయితో తీశారు. 1961లో అక్కినేని అంజలితో సాలూరు రాజేశ్వరరావు సంగీత దర్శకత్వంతో మరొక సినిమా తీశారు. ఒకే వాగ్గేయకారుడి మీద రెండు సినిమాలేందుకు. అసలు వాగ్గేయకారుడంటే ఎవరు?

వాక్ అంటే మాట, గేయ అంటే పాట. అంటే తనే పాట వ్రాసి దానికి తనే స్వరపరిచి సంగీతం చేస్తే ఆ కవిని వాక్ గేయ కారుడు అంటారు. ఇది స్థూలంగా వాగ్గేయకారుడికి నిర్వచనం. ఈ నిర్వచనం లోతుపాతులు రానురాను తెలుసుకుందాం. త్యాగరాజస్వామి, భద్రాచల రామదాసు, నారాయణ తీర్థులు, అన్నమయ్య, క్షేత్రయ్య వీళ్ళందరూ వాగ్గేయకారులు. వీరందరికీ మార్గదర్శకుడు, తొలి వాగ్గేయకారుడు జయదేవుడు. ఆయన తెలుగులో వ్రాయలేదు. సంస్కృతంలో వ్రాశాడు. కాని తెలుగు దేశంతో సంబంధం ఉన్నవాడు. ఓఢ్ర దేశానికి చెందినవాడు.

జయదేవుని గొప్పతనం ఏమిటి. ఆయన ఎన్ని కీర్తనలు వ్రాశాడు. ఎందుకాయన ఇంత ప్రఖ్యాతి పొందాడు, ఏ కాలానికి చెందినవాడు, అసలు ఏం వ్రాశాడో ఈ వ్యాసంలో చూద్దాం.

ఆయన వ్రాసిన గ్రంథం పేరు *గీతగోవిందం.* అందులో ఆయన ఇరవై నాలుగు పాటలే వ్రాశాడు. రాధాకృష్ణుల ప్రేమ, వస్తువు. ఒక్కొక్క పాటలో ఎనిమిదేసి చరణాలుంటాయి గనక ఈ పాటలని అష్టపదులు అంటాం. అష్ట అంటే ఎనిమిది పద అంటే చరణం అని కూడా అర్థం ఉంది. పదం అన్నది విచిత్రమైన మాట. పదం అంటే ఒక మాట, పదం అంటే ఒక పాదం అంటే ఒక లైను. పదం అంటే ఈ అష్టపదుల విషయంలో చరణం, సాధారణగా పదం అంటే పాట. క్షేత్రయ్య వ్రాసినవన్నీ పదాలు, అన్నమయ్య పదకవితా పితామహుడు. కన్నడంలో కొన్ని లక్షలు దాసర పదగళు అని దాసకూటమి వాగ్గేయకారులు, పురందరదాసు మొదలైన వాళ్ళు వ్రాసిన పదాలున్నాయి. అంతగొప్ప పదం పదం!

జయదేవుడు 13వ శతాబ్దానికి చెందినవాడు. ఎనిమిదివందల సంవత్సరాల క్రిందటివాడు. వ్రాసినవి ఇరవైనాలుగు పాటలే. గొప్పదనం ఎక్కడుందంటే ఈ పాటలు కర్ణాటక సంగీత కచేరీలలో వింటాం, హిందూస్థానీ సంగీత కచేరీలలోను వినిపిస్తాయి. దేశంలో అన్ని రాష్ట్రాల దేశీయ, జానపద భజన సంప్రదాయాలలోనూ వినిపిస్తాయి. సినీమాలలోను, లలిత సంగీతంలోను వినిపిస్తాయి. అన్ని శాస్త్రీయ నృత్యాలలోనూ, అంటే భరత నాట్యం అవనివ్వండి, కథక్, మణిపురి, మోహినిఆట్టం ఏదేనా అవనివ్వండి అందరూ ప్రదర్శిస్తారు. ఒడిస్సీ నృత్యానికయితే ఇది ఊపోరి.

సినీమాలలో లెక్కలేనన్ని. ఇంతకుముందే చెప్పినట్టు తెలుగువాళ్ళే భక్త జయదేవుడు పేర రెండు సినిమాలు తీశారు. ఇంక మిగతా సినీమాల విషయానికి వస్తే, 1938లో తీసిన *మాలపిల్ల* లో, రాధిక తవ విరహే అనే అష్టపది, 1940లో *మీరాబాయి* లో పశ్యతి దిశి దిశి, 1960 *జగన్నాటకం* లో ధీర సమీరే యమునాతీరే ఇలా ఎన్నో. 1946లో త్యాగయ్య సినిమాలో రాధిక తవ విరహే అనే అష్టపదిని ప్రముఖ సంగీత విదుషీమణి డి.కె. పట్టమ్మాళ్ పాడారు. 1956లో వచ్చిన తెనాలి రామకృష్ణ సినిమాలో చందన చర్చిత నీల కళేబరని జయలలిత తల్లిగారు శ్రీమతి సంధ్య మీద చిత్రీకరించారు. 1954లో వచ్చిన విప్రనారాయణలో దేవదేవిగ నటించిన భానుమతిగారు సా విరహే తవ దీన అనే అష్టపది పాడి విప్రనారాయణను

వశపర్చుకోడానికి ప్రయత్నించడం చిత్రీకరించబడింది. 1982లో దాసరి నారాయణరావుగారు దర్శకత్వం వహించిన మేఘసందేశం అష్టపదులకు పట్టాభిషేకం. ఇందులో పాలగుమ్మి పద్మరాజుగారు ప్రియే చారుశీలేకి ప్రతి చరణం తెలుగు చేయ్యడం మరపురాని అనుభూతి. ప్రియే చారుశీలే 19వ అష్టపది దానికో కథ ఉంది తరువాత చెప్తాను. ఆ పాట ఎలా తెలుగు చేశారో ఉదాహరణకి చూడండి.

మూలం : *వదసి యది కించిదపి దంతరుచి కౌముది*
*హరతిదర తిమిర మతిఘోరం*

**పాలగుమ్మి పద్మరాజు గారి అనువాదం మేఘసందేశం సినీమాలో:**

***పలికితే చాలు నీ పలువరస వెన్నెలలు***
***కలికి నా ఎడద చీకటులు పోద్రోలు***

ఈ చిత్రానికి సంగీత సమకూర్చినవారు రమేష్ నాయుడు గారు అష్టపదుల స్వరపర్చడంలో మంచి నైపుణ్యం చూపించారు. అష్టపదులలో మొదటిది దశావతార కీర్తన, ప్రళయ పయోధి జలే అనే పాట. ఈ పాట 1952లో బెంగాలీలో తీసిన ఆనందమఠ్ సినిమాలో హేమంత కుమార్, గీత రాయ్ పాడారు. అజరామరమైన కీర్తి ప్రశంసలు పొందినది ఈ పాట.

జయదేవుని అష్టపదులకి విశిష్టత ఏమిటి. *గీతగోవిందం* గ్రంథం ప్రత్యేకత ఏమిటో పరిశీలిద్దాం.

జయదేవుని *గీతగోవిందం* లో మూడే మూడు పాత్రలు. రాధ, కృష్ణుడు, సఖి. 13వ శతాబ్దం నాటికి రాధ పాత్ర సాహిత్యంలో అంతగా కనిపించదు. రాధ భారతంలో, భాగవతంలో మరే ప్రాచీన పురాణాలలో కనిపించదు. అలాంటి రాధని శ్రీకృష్ణుడికి నాయిక చేసిన ఘనత జయదేవుడిది. 13వ శతాబ్దం వరకు విష్ణువుని పూజించడమే అధికంగా ఉండేది. శ్రీకృష్ణుడు అవతార పురుషుడే ఆయన మీద కావ్యాలు, పురాణాలు ఉన్నాయి, నిజానికి భాగవతం దశమ స్కందం రెండు భాగాలు ఆయునే. కాని దేవాలయాలలో పూజలలో తక్కువ. జయదేవుడు శ్రీకృష్ణ తత్త్వాన్ని ప్రజలకు మరింత పటిష్టంగా పరిచయం చేశాడు. నాలుగు చేతులు, శంఖ చక్రాలు ఉన్న విష్ణువు స్థానంలో పిల్లనగ్రోవి వాయిస్తున్న కృష్ణుడు, ఆయన వెనుక ఒక గోవు, చేరువగా రాధ అనే చిత్రం మనసులో మెదలడానికి జయదేవుని రచనలు కారణం.

జయదేవుడు కావ్యం మొదటిలోనే ఇలా ప్రారంభించాడు.

మీకు హరిస్మరణ మీద మనసుంటే, ఆయన విలాస కళల మీద కుతూహలం ఉంటే, మృదువైన, మధురము, కోమలము అయిన పదములయందు మక్కువ ఉంటె అప్పుడు ఈ జయదేవుడు వ్రాసిన కావ్యం చదవండి అంటాడు.

***యది హరిస్మరణే సరసం మనో / యది విలాస కలాసు కుతూహలం***
***మధుర కోమల కాంత పదావలీం / శృణు తదా జయదేవ సరస్వతీం***
– అని

ఇలా కావ్యం ప్రారంభించడమే ఒక వినూత్న ప్రక్రియ.

వైష్ణవంలో రాధాకృష్ణ తత్త్వం, ఇస్కాన్ వీటికి ప్రోత్సాహం జయదేవుని *గీతగోవిందం.* నింబార్కుడు, అంతవరకూ ఆచార్యలు చెప్పిన భక్తికి ప్రేమతత్త్వాన్ని జోడించి ఒక మలుపు త్రిప్పినవాడు జయదేవుడు. జయదేవుని దృష్టిలో దశావతారాలు ఎత్తినది విష్ణువు కాదు, శ్రీకృష్ణుడు! దశావతార అష్టపదిలో ఒక శ్లోకంలో ఇది సుస్పష్టంగా చెప్పాడు జయదేవుడు. వేదాలనుద్ధరించి, జగాన్ని మోసి, భూమిని వెలికి తీసి, రాక్షసులను చంపి, బలిని అణిచి, క్షత్రియులను నాశనం చేసి, రావణుని చంపి, నాగలి చేతపట్టి, కరుణతో ప్రజలనాదరించి, మ్లేచ్ఛులను ఓడించి ఇలా పది అవతారాలు ఎత్తిన శ్రీ కృష్ణా నీకు నమస్కారం అంటాడు. ఆ శ్లోకం ఇది:

***వేదానుద్ధరతే జగం నివహతే భూగోళ ముద్బిభ్రతే***
***దైత్యాన్ దారయతే బలిం చలయతే క్షత్రక్షయం కుర్వతే***
***పౌలస్త్యం జయతే హలం కలయతే కారుణ్య మాతన్వతే***
***మ్లేచ్ఛాన్ మూర్ఛయతే దశాకృతికృతే కృష్ణాయ తుభ్యం నమః***

ఈ *గీతగోవిందం* సంస్కృత సాహిత్య చరిత్రలో ఒక విప్లవం. దీనికి 13 నుంచి – 21 వశతాబ్దం, ఈ ఎనిమిది వందల సంవత్సరాలలో 132 అనుకరణలు తయారవడం విశేషం. ఇదే శైలిలో పోకడలో రాధాకృష్ణులకు బదులు, పార్వతీ పరమేశ్వరులు, సుబ్రహ్మణ్య స్వామి, వల్లీ దేవసేనలు, రాముడు, కృష్ణుడు, ఇలా దాదాపు 150 రచనలు కనిపిస్తాయి. వ్రాసినవారు మహాకవులు. యతీంద్రులు కూడా. కంచి పరమాచార్యులు విరచించిన శివాష్టపది కూడా ఒకటి.. సంగీతంలో రాగాలకు 72 మేలకర్తల పద్ధతి ప్రవేశపెట్టిన వెంకటమఖి త్యాగారాజేశ్వర అష్టపది, స్కందాష్టపది అని రెండు గ్రంథాలు, 1704– 1713 మధ్య మైసూరు ఆస్థాన విద్వాంసుడు కలువ వీర రాజు సంగీత గంగాధరం, ఇందులో శివపార్వతులు, నాయక నాయికలు. ఇలా ఎన్నో.

అయితే ఒక్క పుస్తకానికీ గీతగోవిందానికి వచ్చిన కీర్తి ప్రతిష్ఠలు రాలేదు. ఏ అనుకరణా దీని ముంది నిలువలేదు.

భారతీయ భాషలలో అనువాదాలు, వ్యాఖ్యానాలు ప్రచురణలు 180 వరకు ఉన్నాయి. ఎన్నో విదేశీ భాషలలోకి అనువాదం పొందింది. ఇంగ్లీషు, డచ్. ఫ్రెంచ్, లాటిన్, హంగెరియాన్, సింహాలీస్, ఇలా. 1792లో సర్ విల్లిం జోన్స్, 1875లో సర్ ఎడ్విన్ ఆర్నాల్డ్ ఆంగ్లంలోకి అనువదించారు. 1836లో ఫ్రెడరిక్ రూకర్ట్ అనే ఆయన జర్మనీ భాషలోకి, అదే సంవత్సరంలో లాసేన్ అనే ఆయన లాటిన్ భాషలోకి అనువదించారు. 1904లో కోర్త్‌లిఎర్ ఫ్రెంచ్ భాషలోకీ అనువదించాడు. ఆంగ్లంలోను, వివిధ భారతీయ భాషలలోను కోకొల్లలుగా అనువదించబడింది. తెలుగులో మొదటి అనువాదం కార్వేటి నగరానికి చెందిన ఋగ్వేది వేంకటాచల కవి, 1800లో, తరువాత ఉయ్యూరు జమీందారు రాజ వెంకటప్పయ్య , 1956లో చల్ల పిచ్చయ్య శాస్త్రి ఇంకా ఎందరెందరో తెలుగులోకి వ్యాఖ్యానం అనువాదం రెండూ చేశారు. 1936లో చెన్నాప్రగ్గడ భానుమూర్తి అనే ఆయన జయదేవుడి జీవిత చరిత్ర పద్య కావ్యం వెలయించారు.

ఆరవీటి తిరుమల రాయని ఆస్థానంలో ఉండే చెరుకూరి లక్ష్మీధర పండితుడు వ్యాఖ్యానం వ్రాశాడు. దాదాపు భారతీయ భాషలలో సుమారు 54కి పైన వ్యాఖ్యానాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికీ ఇంకా దేశం నలుమూలలా సుమారు 1500కు పైగా వ్రాతప్రతులు, తాళపత్ర గ్రంథాలు కనిపిస్తున్నాయి. ఏనుగు దంతంపై చెక్కబడిన ఒక గీతగోవింద ప్రతి, జాతీయ నిధిగా ప్రకటించబడింది. పూరి జగన్నాథ దేవాలయం మహాద్వారం తలుపు వెనుక క్రీ.శ. 1499లో ఒక శాసనం ఉంది. *గీతగోవిందం* నిత్య పూజలో ఒక భాగంగా జగన్నాథునికి సంపర్పించడం ఈ శాసనంలో పేర్కొనబడింది. అసలు మొదటి శాసనం క్రీ.శ. 1291లో మనకి గుజరాత్‌లో అనహిల్ల పట్టణంలో కనిపిస్తుంది. ఆ దేశపు రాజు సారంగదేవ వాఘెలచే *గీతగోవిందం* లో మొదటి అష్టపది దశావతార కృతి పేర్కొనబడింది. బంగాల దేశంలో కేందులి గ్రామం జయదేవుడి జన్మస్థలం అని వారి నమ్మిక. ఇక్కడ వసంతోత్సవంలో అష్టపదులు ఏట ఆలపిస్తారు. నీపాల దేశంలో వసంతోత్సవంలో అష్టపదులు రతీమన్మథుల ఆరాధనలో ఆలపిస్తారు. అసలు జయదేవుడు పూరీ సమీపంలో కిందు బిల్వం అనే గ్రామానికి చెందినవాడు. బెంగాలీలు ఆయన బంగాళంలో కేందులి గ్రామానికి చెందినవాడని నమ్ముతారు. పరిశోధకులు ఒరిస్సాకి చెందినవాడనే నిర్ధరించారు. అయితే ఈయన వంగదేశము పరిపాలించిన లక్ష్మణ సేన మాహారాజు ఆస్థాన పండితుడని ఒక కథనం ఉంది.


జయదేవుడు

*గీతగోవిందం* లో ఇతివృత్తం ఒక మాటలో చెప్పాలంటే రాధాకృష్ణుల ప్రేమ, వారి విరహం, కలయిక. పైకి చాలా సాధారణంగా కనిపించే ఈ కావ్యంలో 24 పాటలున్నాయి. 12 సర్గాలున్నాయి. మనం అనుసరించే ప్రతిని బట్టి, ఇందులో 70 నుంచి 92 శ్లోకాలున్నాయి. ఆ సర్గాలకి జయదేవుడు అద్భుతమైన పేర్లు పెట్టాడు. అవి ఇవి.

| సర్గ | పేరు | అష్టపదులు | శ్లోక సంఖ్య |
|---|---|---|---|
| 1. | సామోద దామోదరం | 1-4 | 13 |
| 2. | అక్లేశ కేశవం | 5-6 | 5 |
| 3. | ముగ్ధ మధుసూదనం | 7 | 8 |
| 4. | స్నిగ్ధ మధుసూదనం | 8-9 | 7 |
| 5. | సకాంక్ష పుండరీకం | 10-11 | 3 |
| 6. | కుంఠ వైకుంఠం | 12 | 11 |
| 7. | నగర నారాయణం | 13-16 | 3 |
| 8. | విలక్ష్య లక్ష్మీపతి | 17 | 3 |
| 9. | మంద ముకుందం | 18 | 8 |
| 10. | చతుర చతుర్భుజం | 19 | 10 |
| 11. | సానంద దామోదరం | 20-22 | 10 |
| 12. | సుప్రీత పీతాంబరం | 23-24 | 14 |

మొత్తం 24 అష్టపదులు, 92 శ్లోకాలు. ఈ శ్లోకాలు వివిధ ఛందస్సులలో నడుస్తాయి, శార్దూలం నుంచి అనుష్టుప్ వరకు రకరకాల ఛందస్సులు ఉన్నాయి.

అష్టపదులలోనూ ఛందస్సు ఉంది అది మాత్రా ఛందస్సు అంటే గురువుకి 2 మాత్రలు, లఘువుకి ఒక మాత్ర లెక్కన 24 అష్టపదులలో 19 అష్టపదులకు ఒకే ఛందస్సు. పాదానికి 7×4=28 మాత్రలు.

కొన్ని ఉదాహరణలు చూడండి. ఇక్కడ ఒక మూడు అష్టపదులు పేర్కొంటున్నాను, పదాలను నాలుగేసి

మాత్రలుగా విభజిస్తున్నాను.

చందన - చర్చిత - నీలక - ళేబర - పీతవ - సనవన - మాలీ

నిందతి - చందన - మిందుకి - రణమివ - విస్తతి - ఖేదమ - ధీరం

సంచర - దధరసు - దామదు - రధ్వని- ముఖరిత - మోహన - వంశం

జయదేవుని రచనా వైదుష్యం ఆయన వాడిన ఛందస్సులోను, పాత్ర పోషణలోను, ప్రయోగించిన మధురమైన పదబంధాలలోను ఉంది.

దేహి ముఖ కమల మధుపానం - అంటాడు. నీ ముఖకమలంలోని తేనె కావాలని.

వ్రతమివ తవ పరిరంభ సుఖాయ - అంటాడు, నీ కౌగిలికోసం ఒక తపసు చేసేను అని,

త్యజతి న పాణి తలెన కపోలం - ఆమె - ఆయనా ఆలోచనలలో బుగ్గన చేయ్యివేసుకును ఉండిపోయిందట, శిష్యతి కామపి చుమ్బతి కామపి రమయతి కామపి రామం - శ్రీకృష్ణుడు ఒకరిని కౌగలించుకుంటాడు, ఇంకొక గోపికని ముద్దు చేస్తాడు, మరొక ఆమెతో శృంగారం చేస్తాడట.

రాధ శ్రీకృష్ణుని అడుగుతుంది.. నా చనుదోయి మంగళ కలశాలలా ఉంది వాటిపై చందనం రాయి, అంటుంది..

***కురు యదునందన చందన శిశిరతరేణ కరేణ పయోధరే***
***మృగమదపత్రక మత్ర మనోభవ మంగలకలశ సదరే***

19వ అష్టపది ప్రియే చారుశీలే .. దీనికి సంబంధించిన కథ ఒకటి ఉంది. ఇందులో 7వ చరణం జయదేవుడు ఇలా వ్రాశాడు.. మన్మథ విషాన్ని బాపి మన్మథుని క్రూరమైన యుద్ధపు అగ్నిజ్వాలలను పోగొట్టాలంటే నీ లేత చిగురువంటి పదాన్ని నా తలపై మోపు.. అని. ఇలా వ్రాసి అయ్యో ఏదో కవితా ప్రవాహంలో పడి హద్దులు దాటేనేమో.. లేకపోతే శ్రీకృష్ణ పరమాత్మ నెత్తిమీద రాధ పాదం మోపడం ఏమిటి.. అని ఆ వ్రాసినది చెరిపివేసి, స్నానానికి వెళ్ళాడట. స్వయంగా భగవంతుడే జయదేవుని రూపంలో వచ్చి ఆయన వ్రాసిన పాదాలనే ఖరారు చేశాడట. ఆ పాదం ఇది

***స్మర గరళ ఖండనం మమ శిరసి మండనం***
***దేహి పదపల్లవ ముదారం***
***జ్వలతి మయిదారుణో మదన కదనానలో***
***హరతు తదుపాహిత వికారం... ప్రియే చారుశీలే..***

మొత్తమంతా పరమ శృంగారభరితమైన రచన. దీనిమీద పూర్వ కవులేందరో పొగుడుతూ వ్రాశారు, ఇది అశ్లీలమైన పరమ పచ్చి శృంగారం అని మదించిన ఏనుగువలె విచ్చలవిడిగా సంచరించిన మోటు రచన అనీ విమర్శించారు. కానీ దీని ప్రభావాన్నుంచి ఎవరూ తప్పించుకోలేకపోయారు. శాసనాలను పరిశీలిస్తే ముఖ్యంగా రెండు ముఖ్యమైన విషయాలు తెలుస్తున్నాయి. ఒక శాసనం ఒరిస్సాలో మధుకరేశ్వర దేవాలయంలోనిది, మరొకటి సింహాచలంలోనిది. ఓఢ్ర దేశపు పండితుడు సత్యనారాయణ రాజగురు వీటిని పరిశీలించి చెప్పిన విషయాలివి.

1. జయదేవుడు శ్రీకూర్మంలో అధ్యాపకుడు. అప్పుడే ఆయన కవిత్వం, నాట్యము, సంగీతము నేర్చుకుని కొంతమంది నర్తకులను తనవెంట ఒరిస్సాకు తీసుకొనివెళ్లి పూరి జగన్నాథ స్వామి దేవాలయంలో ప్రదర్శనలు ఇచ్చి ఉండాలి.

2. ఆయన వివాహం చేసుకున్న పద్మావతి పర్లాకమిడికి చెందిన బ్రాహ్మణ పిల్ల. జయదేవుడు వ్రాస్తూ ఉంటే ఆమె నృత్యం చేసేదట. జయదేవుడు తనని తాను 'పద్మావతీ చరణ చారణ చక్రవర్తి' అని చెప్పుకున్నాడు. జయదేవుడు తాను రచించిన అష్టపదులు 24కి రాగాలు నిర్ధరించాడు. అందులో కొన్ని ఈనాడు లేవు, పేర్లు మారి ఉండవచ్చు, అయినా మనం ఈనాడు ఆయా రాగాలలో పాడడం లేదు. కొన్ని రాగాల పేర్లు చూడండి. మాళవ, వసంత, ఘూర్జరి, దేశవరాలి, భైరవి, విభాస, రామక్రియ, మాలవగౌడ మొదలైనవి. వాటిని తమిళనాట మొదట 17వ శతాబ్దంలో రాముడు భాగవతార్ అనే ఆయన వేరు-వేరు రాగాలలో స్వరపరచి తమిళనాట ప్రచారం చేశారు. కేరళలో ముందే సోపాన సంగీతంలో అష్టపదులు చోటుచేసుకున్నాయి. 1962లో సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ చేసిన రాగాలతో తిరుపనితుర సంస్కృత కళాశాల ప్రచురించింది. మా గురువులు శ్రీ మంగళంపల్లి బాలమురళీ కృష్ణగారు 1964లోను 1970లోను ఒక పది అష్టపదులు స్వరపరచి గానం చేసి ప్రచురించారు. భజన సంప్రదాయంలో ఉన్న రాగాలతో రికార్డులు లభిస్తున్నాయి. 1930లో మునుగంటి వెంకటరావుగారు ధీర సమీరే యమునా తీరే రికార్డు చేశారు. వింజమూరి అనసూయగారు 1933లో చందన చర్చిత నీల కళేబర రికార్డు చేశారు. 1946లో మంచాల జగన్నాథ



పూరీ జగన్నాథ స్వామి ఆలయం

రావుగారు స్వరపరచిన సావిరహే తవ దీనను టంగుటూరి సూర్యకుమారి గారు పాడారు. 64లో మా గురువుగారు యామిహే పాడారు, ఘంటసాలగారు ప్రవిశ రాధే పాడారు. ఈ రికార్డులన్నీ మిత్రులు వి.ఎ.కె. రంగారావుగారు ఒకసారి నా పరిశోధన ఉపన్యాసానికి నాకు కాపీ చేసి ఇచ్చారు. వీటిలో ముఖ్యంగా చెప్పుకోదగినది మిత్రులు రఘునాథ్ పాణిగ్రాహిగారు పాడిన శ్రితకమలాకుచ మండల.

ఇంక నృత్యానికి వస్తే ముందు కేరళలో దేవాలయాలలో మిగిలిన దేశమంతట రాజ ఆస్థానాలలో అష్టపదులు చోటుచేసుకున్నాయి. ఆంధ్రదేశంలో కూచిపూడి వారు ముందు దశావతార అష్టపది ప్రలయపయోధి జలేతో ప్రారంభించారు. వెంపటి చిన్న సత్యంగారు వారి గురువులు వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రిగారు దాదాపు 10 అష్టపదులు కూచిపూడిలో ప్రవేశపెట్టారు. సావిరహే తవ దీన, యా రమితా వనమాలినా, రాధికా కృష్ణా, సంచరదధర సుధా మధుర ధ్వని చాలా సున్నితమైన నృత్యరచనతో ప్రపంచం నలుమూలల ప్రాచుర్యం పొందాయి. ఇవన్నీ ఒక ఎత్తు, ఒడిస్సీలో అష్టపదులు ఒక ఎత్తు. అష్టపదిలేని ఒడిస్సీ నృత్యం అసంపూర్ణం అంటే అతిశయోక్తి కాదు. నాకు ఆప్త మిత్రులు కేలుచరణ్ మొహాపాత్రో అష్టపదులకు పెట్టినది పేరు. ఆయన కురుయదునందన చేస్తో ఉంటే చూసి తరించవలసిందే. ఒరిస్సాలో జగన్నాథస్వామి ఆలయంలో ప్రతిరోజూ అష్టపది ప్రదర్శన జరుగుతుంది. శృంగార భక్తి ఎలా ఉంటుందో చూడాలంటే ఆ విశిష్టమైన శైలిలో నృత్యం చూడవలసినదే.

రాధ రాత్రంతా కృష్ణుని కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. ఆయన తెల్లతెల్లవారుతూ ఉండగా ఇంకొక స్త్రీతో రాత్రి గడిపిన గుర్తులతో ఇల్లు చేరుతాడు. రాధ వెళ్లిపోమంటుంది. అనవసరంగా వాదించకు అంటుంది.

నీ కెవతె సుఖం ఇచ్చిందో దాని దగ్గిరకే వెళ్ళు అంటుంది. ఆ అష్టపది ఇది..


*యాహి మాధవ*
*యాహి కేశవ మా*
*వదకైతవ వాదం*
*తాం అనుసర*
*సరసీరుహ లోచన*
*యా తవ హరతి*
*విషాదం ..*

ఆ అష్టపది పూరీ ఆలయంలో చేసే విధానం ఈ చిత్రంలో చూడండి.




పూరీ దేవాలయంలో యాహి మాధవకు నృత్యం

*గీతగోవిందం* 1836లో ఫ్రాన్సులో ప్రచురించారు. ఒరియాలో 1840లో ముద్రణ చెందింది. ఇవిగో ఆ ప్రతులు.




ఫ్రెంచ్‌లో ముద్రణ




తొలి ఒరియా ముద్రణ

*గీతగోవిందం* ఒక తాళపత్ర గ్రంథం రంగులలో చిత్రాలతో లిఖింపబడింది. ఇది 18వ శతాబ్దానికి చెందింది. ఆ చిత్రం చూడండి. *గీతగోవిందం* 15వ శతాబ్దంనాటికే వర్ణచిత్రాలుగా అవతరించింది. ఈ పెయింటింగులు రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, పంజాబ్ గుజరాత్‌లలో అనేక రకాల పెయింటింగు శాఖలవారు చిత్రించడం విశేషం. ఇందులో మొదటి చిత్రీకరణ 14 50 ప్రాంతంలో



తాళపత్ర గ్రంథం


మేఘైర్ మేదురమంబరం


ధీర సమీరే


లలితలవంగ


సంచరదధర సుధామధుర ధ్వని


సా విరహే తవ దీనా


రాధికా తవ విరహే కేశవా


రచయిత, అక్కినేని, అంజలి


మేఘ సందేశం లో రాధిక తవ విరహే

గుజరాతులో ప్రారంభం అయింది. కాంగ్రా, భాశోలి పెయింటింగులు అతి ముఖ్యమైనవి అందులో కొన్ని: తెలుగువాళ్ళు ఆరాధించే పదకవిత పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యులు 1408-1503 ప్రాంతంలో జీవించారు. ఆయన *సంకీర్తన లక్షణం* అనే ఒక లక్షణ గ్రంథం సంస్కృతంలో రచించారు. వారి మనుమడు చిన తిరుమలయ్య దానిని తెనిగించాడు. సంస్కృత మూలం అలభ్యం. కాని తెనుగు అనువాదం ఈనాడు మనకు లభిస్తున్నది. అన్నమయ్య తనకు ముందున్న వాగ్గేయకారులుగా ఇద్దరినే పేర్కొన్నాడు. ఒకరు సింహగిరి నరహరి వచనములు వ్రాసిన కృష్ణమాచార్యులు, రెండవవాడు జయదేవుడు. అన్నమయ్య *సంకీర్తన లక్షణం* లో జయదేవుడిని పెర్కొండడం విశేషం 46వ పద్యంలో అన్నమయ్య ఇలా అన్నారు.

***ఘనత మీరంగ జయదేవ కవి వరేణ్యు / డంద మైనట్టి గీత గోవింద మందు / నంచి తాష్ట పదులు వల్మె నట్ల పదము / బరగు నెనిమిది పదములు పల్లవియును*** – జయదేవుని అష్టపదుల లక్షణాన్ని ఇక్కడ వివరించారు. సంగీత త్రిమూర్తులు అని పిలువబడే త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామ శాస్త్రులకు ముందున్న ఇంకొక వాగ్గేయకారుడు ఊతుక్కాడు వెంకటకవి. ఆయన ప్రసిద్ధమైన పూర్వికల్యాణి రాగంలో రచించిన 'పద్మావతీ రమణం' అనే కీర్తనలో జయదేవుని ఆయన రచించిన గీతగోవిందాన్ని కొనియాడారు.

వానకు తడవారున్నరేమో జయదేవుని అష్టపదులకు లోనుగానివారు లేరు అంటే అతిశయోక్తి కాదు. అంతటి మహాకవి జయదేవుడు. ఎన్ని సంవత్సరాలయినా చెక్కు చదరని చిత్రం భక్త జయదేవ. ఇందులో అక్కినేని నాగేశ్వర రావు, అంజలి గార్లు నటించారు. అది ఒక దృశ్య కావ్యం. జయదేవ చిత్రంలో ఒక చిత్రం, మేఘసందేశంలో ఒకటి:

జయదేవుడు తన మాటలలోనే *గీతగోవిందం* గురించి ఇలా చెప్పాడు.

***వాగ్దేవతా చరిత చిత్రిత చిత్త సద్మ – పద్మావతీ చరణ చారణ చక్రవర్తీ / శ్రీ వాసుదేవ రతికేళి కథా సమేతం – ఏతం కరోతి జయదేవకవిః ప్రబంధం***

జయదేవకవి శ్రీకృష్ణుని రతికేళిని కథతో సమేతంగా పద్మావతి నాట్యమాడుచుండగా తన మనసున సరస్వతిని నిలుపుకుని రచించాడు.

అజరామరమైన వాగ్గేయకారుడు జయదేవకవి.

**ఆచార్య పప్పు వేణుగోపాల రావు**
చెన్నై. ఇ-మెయిల్: pappuvenu@gmail.com

# బహిరంగ కళ

*– తంగెడ విశ్వేశ్వర ప్రసాద్*

బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శనకొరకు ప్రత్యేకంగా రూపొందించబడిన కళాక్రియలన్నీ పబ్లిక్ ఆర్ట్ కిందికే వస్తాయి. జ్ఞాపక చిహ్నాలు, విగ్రహాలు, కుడ్యచిత్రాలు, పోస్టర్లు మొదలైన బహిరంగ కళారూపాల ముఖ్య ఉద్దేశం ప్రజలను రంజింపజేయడం. తరచుగా బహిరంగ కళ రాజకీయ ప్రయోజనాల సాధనకు ఉపయోగపడడం కూడా జరుగుతుంది. పోస్టర్లు, విగ్రహాలు, కుడ్య చిత్రాలు రష్యా, నార్వే, ఐర్లాండు దేశాల్లో ప్రజా నిరసనను తెలపడానికైతే న్యూయార్క్ సబ్‌వే కుడ్య చిత్రాలు, వెనిస్, వెరోనా, లండన్ లాంటి నగరాల్లో నదులు, కాలవల పక్కన కన్పించే ప్రకృతి దృశ్యాల పెయింటింగులు మానసికోల్లాసాన్ని కలగించడానికి వుద్దేశించబడినవి. మతానికి పబ్లిక్ ఆర్ట్‌కు వున్న సంబంధం విడదీయరానిది. చర్చీలు, హిందూ దేవాలయాలు, బుద్ధ విగ్రహాలు, గ్రీకు పిరమిడ్లు, మసీదులు, జైన మందిరాలు అన్నీ కళాసంపదకు నిలయాలు.

ఒక దేశ సంస్కృతీ, సౌందర్య, ఆర్థిక విలువలను ప్రతిఫలిస్తుంది బహిరంగ కళ. ఆ ప్రాంత ప్రజల ఆర్థిక పుష్టిని, జీవన స్థాయిని అభిరుచిని ప్రదర్శించడమేకాక వారికి గర్వకారణంగా నిలుస్తుంది. పర్యాటకులనాకర్షించే ప్రపంచ స్థాయి ప్రత్యేకతలు కలిగి ఉంటుంది. ఏ రకమైన కళాకృతి అయినా ప్రజల ఆనందంకొరకు స్థాపించబడితే అది పబ్లిక్ ఆర్ట్ అవుతుంది. ఆధునిక కాలంలో బాగా వ్యాప్తిలోకి వచ్చిన కళా ప్రక్రియ యిది. బహిరంగ కళారూపాల్ని సృష్టించడం అత్యంత సృజన, శ్రమ, ఊహించలేనంత ఖర్చుతో కూడుకున్న పని. అందువల్ల కొన్ని సందర్భాల్లో వాటి సృష్టిలో, స్థాపన, నిర్వహణలో ప్రభుత్వ బాధ్యత తప్పనిసరి అవుతుంది. చాలా బహిరంగ కళారూపాల్ని ఉచితంగా చూడవచ్చు. కొన్నింటిని ప్రైవేట్ సంస్థలు నిర్వహిస్తాయి. పారిస్ ఈఫిల్ టవర్, న్యూయార్క్ స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ. జర్మనీ బెర్లిన్ గోడ స్పెయిన్ వప్రీ, నార్వే శిల్పారామం, ప్రాగ్ కాఫ్కా ముఖం మొదలైనవి విదేశాల్లోని బహిరంగ కళారూపాలు కాగా మన దేశంలో నిర్మితమైన నిన్న మొన్నటి సర్దార్ పటేల్ భారీ విగ్రహం (ది స్టాచ్యూ ఆఫ్ యూనిటీ) ఇటీవలి పబ్లిక్ ఆర్ట్. మనదేశ గౌరవాన్ని ఇనుమడింపజేసే కళారూపాలు కోకొల్లలు. శిల్ప సంపదకు నిలయాలైన హలిబేడు, బేలూరు, ఖజురహో, కోణార్క్, రామప్ప దేవాలయాలు; ఢిల్లీ ఉక్కుస్తంభం, కుతుబ్‌మినార్, శ్రావణ బెళగొళ, గోమతేశ్వర్, అజంతా, ఎల్లోరా శిల్ప చిత్ర సంపద, తాజ్ మహల్, చార్‌మినార్, మైసూరు బృందావన్ గార్డెన్స్, కన్యాకుమారి, వివేకానంద స్మారక మందిరం, తిరువళ్లువార్ రాతి విగ్రహం, నిన్నమొన్నటిదాకా టాంక్‌బండ్ ఆకర్షణలుగా నిలిచిన ప్రముఖుల విగ్రహాలు మొదలైవి కోకొల్లలు. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన పబ్లిక్ ఆర్ట్ రూపాలు ఆయా దేశాలకు ప్రత్యేక ఆకర్షణలుగా నిలుస్తాయి. డజన్లకొద్దీ ఉన్న కళారూపాల్లో కొన్నింటిని గురించిన వివరాలు.

**క్లౌడ్‌గేట్–(Cloud Gate) షికాగో:**

షికాగో మిలీనయం పార్కులో 2004లో నిర్మించబడిన కళారూపం, క్లౌడ్‌గేట్. దీని రూపకర్త భారత మూలాలున్న, అనీష్‌కపూర్, బ్రిటిష్ ప్రభుత్వ నుండి 'సర్' బిరుదు అందుకున్న కళాకారుడు. 66' అడుగుల పొడవు, 42' అడుగుల వెడల్పు,



33' అడుగుల ఎత్తున్న భారీ స్టీలు నిర్మాణం. బరువు 110 టన్నులు, పది ఏనుగుల బరువుకు సమానం. దీనిపైన బడే చుట్టూ ఉన్న ఆకాశ హర్మ్యాల ప్రతిబింబాలను చూడడానికి జనం గుమిగూడతారు. ఆకారాన్ని బట్టి దీన్ని స్థానికులు 'బీన్' అని పిలుచుకుంటారు. అండాకారంలో ఉండే ఈ నిర్మాణంలో ఎక్కడా వెల్డింగ్ చేసిన ఆనవాళ్ళు కనిపించవు. భారీ స్టీలు ప్లేట్ల మధ్య అతుకులు కన్పించకుండా బాగా పాలిష్ చేసిన దీని వాస్తు నిర్మాణ చాతుర్యం అద్భుతం. నాలుగువైపులా నేలను తాకుతూ 33 అడుగుల ఎత్తున్న ఈ కుంభాకార ఉపరితలం అంతా వెండిపూత పూసినట్లుగా మెరిసిపోతూ ఉంటుంది. చుట్టూ ఉన్న భవనాలు 80 శాతం దీనిపైన వంపులు తిరిగి ప్రతిఫలిస్తుంటాయి. ప్రపంచంలోని బహిరంగ ప్రదేశాలలో నెలకొల్పబడిన భారీ నిర్మాణాల్లో ఇదీ ఒకటి. నగరం మధ్యలో వెలసిన ఈ కళాకృతి అధికారిక నామం క్లౌడ్ గేట్. 2005లో ఒకసారి, 2009లో మరోసారి పార్క్, క్లౌడ్ గేట్‌తో సహా అద్దెకు యివ్వబడింది. మొదటిసారి 8 లక్షలు, రెండవసారి 7 లక్షలు అద్దె రూపాన ఆర్జించింది. పాదరసం బుడగ ఆకారంలో ఉండే ఈ కళాఖండం చుట్టూ, మధ్యన, నాలుగు వైపులా ఉన్న ఆర్చీల కింది నుండి తిరగవచ్చు. 12' అడుగుల ఆర్జీల మధ్యలో నిర్మాణం మధ్యన మరో పుటాకారపు హాలు ఉంటుంది. ఈ వింత కళాకృతిని చూడడానికి రోజూ వందలాదిమంది సందర్శకులు ఫోటోలు తీసుకుంటూ కన్పిస్తారు.

ముప్పైమంది పాల్గొన్న డిజైన్ పోటీలో అనీష్ కపూర్ డిజైన్ చేసిన ఈ క్లౌడ్‌గేట్ ఎంపిక చేయబడతుంది. దీని నిర్మాణంలో అనేక సమస్యలు ఎదుర్కోవలసిరాగా, తర్వాత దీని నిర్వహణ మరో సమస్య అవుతుంది. మొదట్లో కొందరు సలహాదార్లు, ఇంజనీర్లు దీని నిర్మాణం అసాధ్యం అని తేల్చిచెప్తారు. అన్ని సమస్యలనూ అధిగమించి నిర్మాణం అనుకున్న దానికన్నా ఎక్కువ సమయం తీసుకున్నప్పటికీ 2006 మేలో పూర్తి చేయబడుతుంది. అది మొదలు క్లౌడ్‌గేట్ దేశీయంగా, అంతర్జాతీయంగా ఖ్యాతికెక్కింది.

**నిర్మాణ విశేషాలు:**

ఒక్కొక్కటి 450 నుండి 910 కిలోల బరువుండే భారీ స్టీలు ప్లేట్లను అతుకులు కన్పించకుండా వెల్డింగ్ చేయడం, 10 మి.మీ.ల మందపు 168 పలకలను మధ్యలో ఏ ఆధారం లేకుండా నిలబెట్టడం, స్టెయిన్‌లెస్ స్టీల్‌ను మెరిసిపోయేంతగా పాలిష్ చేయడం ఒక యెత్తు కాగా, తీవ్రమైన వాతావరణ మార్పులను తట్టుకుని నిలబడగలిగిన సామర్థ్యం, పక్షుల రెట్టలు, సందర్శకుల వేలిముద్రలు పడకుండా చూడడం మరీ పెద్ద సమస్యఅవుతుంది. పైవాటిని మించిన అసలు సమస్య నిర్మాణ వ్యయం. 6 మిలియన్ డాలర్ల అంచనాతో మొదలైన నిర్మాణ వ్యయం 2004 నాటికి 11.5 మిలియన్ డాలర్లకు పెరిగిపోతుంది. 2006లో నిర్మాణం పూర్తి స్థాయికి చేరుకునేసరికి 23 మిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. ప్రభుత్వ సాయం లేకుండా డొనేషన్లు, కార్పోరేట్ సంస్థల విరాళాల ద్వారా నిర్మాణం పూర్తికావడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

**నిర్మాణ శుభ్రత:**

ఇది ప్రకృతి వైపరీత్యాలను, సందర్శకుల తాకిడిని తట్టుకుని వెయ్యి సంవత్సరాలు మనగలదని అంచనా. అంతకాలం నిత్యం వేల సంఖ్యలో సందర్శకులు దీనిచుట్టూ తిరుగుతూ ముట్టుకోవడంవల్ల ఆరడుగుల ఎత్తువరకూ అయ్యే మురికిని, వేలిముద్రలను ఏ రోజుకారోజు రెండుసార్లు, మొత్తం నిర్మాణాన్ని ఏడాదికి రెండుసార్లు శుభ్రం చేస్తారు. 2009 ఫిబ్రవరిలో జరిగిన అసాధారణమైన సంఘటన– క్లౌడ్‌గేట్ పైన అంగుళం మందంలో తొలచబడ్డ రెండు పేర్లను, నిర్మాణ సంస్థే రిపేర్ చేసి పూర్వ రూపానికి తీసుకువచ్చింది. ప్రస్తుతం క్లౌడ్ గేట్ బాగా ఖ్యాతి గడించడంవల్ల, దీని బొమ్మలతో సూవనీర్లు, పోస్టుకార్డులు, టీషర్టులు, పోస్టర్ల వ్యాపారం ముమ్మరంగా సాగుతోంది. ఇప్పుడది గొప్ప కళాఖండంగానే కాకుండా, తప్పకుండా ఫోటోలు తీసుకోదగిన ప్రదేశంగా మారింది. ఇది యాత్రీకుల ఆకర్షణ (టూరిస్ట్ మాగ్నెట్) అనీ, గొప్ప విరూప కళాఖండం అనీ 'న్యూయర్క్ టైమ్స్' పత్రిక (యు.ఎస్.ఏ.) కొనియాడింది. తను పెట్టిన పేరు 'క్లౌడ్ గేట్'ను కాదని జనం బీన్ అని పిలవడం అనీష్ కపూర్‌కు బొత్తిగా ఇష్టం లేకపోయినా ప్రజాభీష్టానికి తలవంచక తప్పలేదు.

**పప్పీ (Pulbic Art)– బిల్‌బో నగరం:**

అమెరికా దేశీయుడు 'జెఫ్ కూన్స్' జనరంజక కళాఖండాల సృష్టికర్తగా విశేష ఖ్యాతినార్జించాడు. నిత్యజీవితంలోని సాధారణ వస్తువులకు, జంతువులకు శిల్పరూపాలు కల్పించడంలో మేటి. స్టెయిన్‌లెస్ స్టీలు బెలూన్ జంతువులకు అద్దంలా మెరిసే నున్నటి రూపాలు ఇచ్చాడు.

**పప్పీ:**

ఉద్యానవన కళకు శిల్పచాతుర్యాన్ని జోడించగా రూపొందిన కళాఖండం, పాత కొత్తల మేలుకలయిక. పువ్వులతో కుక్క పిల్ల (పప్పీ) అదీ అసాధారణ పరిమాణంలో

వర్తమాన సంస్కృతికి ప్రతీకగా నిలిచే గొప్ప సృష్టి. స్పెయిన్ బిల్‌బో నగరంలో 'గూగెన్ హెయిమ్ మ్యూజియం' ముందు ప్రతిష్టించబడింది. మ్యూజియానికి నిరంతరం కాపలా కాస్తున్నట్లుగా ఉంటుంది. ప్రజలను విపరీతంగా ఆకర్షిస్తూ ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని కలిగించే ఆకర్షణీయ కళాకృతి ఇది. స్టెయిన్‌లెస్ స్టీలు చట్రం చుట్టూ పూలకుండీలను అమర్చి పప్పీ ఆకారాన్ని సృజించాడు దీని రూపకర్త. 48 అడుగుల ఎత్తు, 27 అడుగుల వెడల్పు, 29 అడుగుల పొడవున ఉన్న భారీ ఆకారం, లక్షలాది 'పాన్సీ' పూలతో నిండి ఉండే ఈ కుక్కపిల్ల బరువు 16 టన్నులు. 1997లో మ్యూజియం ముందు ప్రతిష్టించబడిన దగ్గర్నుండి ఋతువులకు తగ్గట్టుగా రంగులు మార్చుకుంటూ గత పాతిక సంవత్సరాలుగా సందర్శకులను అలరిస్తూ ఉంది. ఈ భారీ కుక్కపిల్లను దగ్గర్నుంచి చూడడంకన్నా దూరంగా ఉండి చూస్తేనే దాని అందాన్ని ఆస్వాదించగలుగుతాము. అయినా సందర్శకులకు దాని దగ్గరకుపోయి ముట్టుకుని, ఆనుకుని, సెల్ఫీలు తీసుకోవడంతో మురిసిపోతారు. దీనిచుట్టూ ఎలాంటి రక్షణ ఉండదు. పూలతో నిండి ఉన్న పప్పీని నిమురుతూ ఆనందించడానికి ఏ అడ్డంకీ ఉండదు.

**డిజైన్:**

ఈ పప్పీ సృష్టి ఏ కుక్కపిల్లనూ చూసి చేసింది కాదు. కానీ ఏ కుక్కపిల్ల రూపాన్నైనా దీనిలో చూడవచ్చు. పొడవైన తల, మెరిసే కళ్ళు ఎప్పుడూ కూర్చుని ఉన్న భంగిమలో ఆకర్షణీయంగా ఉంటుంది. నిజానికి పప్పీ అక్కడ పుట్టింది కాదు. జర్మనీలో తయారై ఇక్కడికి చేరుకుంది. దీన్ని కూన్స్ సిడ్నీలోని మ్యూజియానికి బహుమతిగా యిస్తే, దాన్ని గూగెన్ హెయిన్ ఫౌండేషన్ పన్నెండు లక్షల డాలర్లకు కొని మ్యూజియం ముందు ప్రతిష్టించింది. పప్పీ విలువ ఇప్పుడు 54 మిలియన్ డాలర్లు.

**లోపలి భాగం:**

పప్పీ లోపలి భాగం అంతా మట్టి, ఎరువు నిండిన పూలకుండీలు, క్లిష్టమైన నీటి సరఫరా విభాగం, కాలానుగుణంగా ఎరువును వేసే వ్యవస్థను కలిగి ఉంటుంది. మొక్కలన్నీ పూలు పూస్తూ ఆరు నెలలపాటు కళకళలాడేట్లు చూసుకునే యంత్రాంగం ఉంటుంది. మొక్కల పూలకుండీలకు ఆధారంగా 16 టన్నుల లోహచట్రం అమర్చబడి ఉంటుంది.

**నిర్వహణ:**

పప్పీ రూపాన్ని, ఆకారంలోని వంపుసొంపుల్ని కాపాడే బాధ్యత ప్రత్యేక బృందం చూసుకుంటుంది. అందులో సాంకేతిక నిపుణులు, ఉద్యానవన శాస్త్రవేత్తలు ఉంటారు. ముప్పైఏడు వేల పూలమొక్కలు ఏటా రెండుసార్లు మార్చబడతాయి. రాబోయే ఆరు నెలలకు కావలసిన పూలమొక్కల్ని తయారుగా ఉంచుతారు. అక్టోబర్ చలినీ, మే ఎండల్నీ తట్టుకోగలిగి, ఆయా ఋతువులో వికసించే పూలమొక్కల్ని పెంచుతారు. ఎరుపు, నారింజ, పింక్, తెలుపు ముదురు రంగుల్లో పూచే మొక్కలు దీని కోసం ప్రత్యేకంగా పెంచబడతాయి. ముప్పైమంది పనివాళ్ళు నిరంతంగా పూల అమరికను చూసుకుంటారు. అందమైన రూపం, ఆకర్షణీయమైన రంగుల్లో కన్పించే పప్పీ అందరికీ ప్రీతిపాత్రమైన పెట్. దీన్ని ఆశావాదానికి, నమ్మకానికి, భద్రతకు ప్రతీకగా భావిస్తారు. 13 మీటర్ల ఎత్తై పప్పీ అంతర్జాతీయ ఆకర్షణ.

**మెటామోర్ఫసిస్ చలన శిల్పం - ప్రాగ్ (Prague):**

ప్రాగ్‌లో ఫ్రాంజ్ కాఫ్కా మ్యూజియం, కాఫ్కా జీవితానికి, రచనలకు అంకితమైనది. 20వ శతాబ్దపు గొప్ప రచయితల్లో ఒకరైన ఫ్రాంజ్ కాఫ్కా పుట్టి పెరిగింది ప్రాగ్ నగరంలోనే. ప్రాగ్‌లోని ముఖ్య ఆకర్షణ మ్యూజియం అయితే ఇంకొక ఆకర్షణ కూడా కాఫ్కానే కావడం విశేషం. క్షణక్షణం మార్చుకునే అత్యంత ఆధునిక భారీ స్టీలు శిల్పం, కెనెటిక్ ఆరు (Kinetic Art) కాఫ్కా శిరస్సు. డేవిడ్ సెర్నీ చెక్ దేశస్థుడు. విరివిగా శిల్పాలు సృష్టించడంలో అసమానమైన సాంకేతిక ప్రతిభను ప్రదర్శించాడు. వివాదాల, సాంప్రదాయ విరుద్ధమైన కళాఖండాలు సృష్టించి ఖ్యాతిగాంచాడు. జర్మనీ సాహితీ దిగ్గజం కాఫ్కా గౌరవార్థం మెటామార్ఫొసిస్ సృష్టించాడు. నగరం మధ్యలో ఉన్న వ్యాపార కూడలిలో కనువిందు చేసే వర్తమాన కళారూపం-చుట్టూ ఉన్న కెఫేలలో కూర్చుని అనుక్షణం రూపం మార్చుకునే కాఫ్కా ముఖాన్ని చూడడం గొప్ప అనుభవం. ఉండీ ఉండీ కాఫ్కా ముఖం పూర్తిగా కన్పించి, మరుక్షణంలో రూపం మార్చుకోవడం దీని ప్రత్యేకత. ఈ శిల్పకళాఖండాన్ని ఎవరైనా ఇష్టపడటానికి దాన్ని గురించిన అవగాహనగానీ, కళాపిపాసగానీ అవసరం ఉండదు. కాఫ్కాను చదివి ఉంటే, ఆ ముఖ రూపం అలా ఎందుకు మార్పు చెందుతుందో బాగా బోధపడుతుంది. ఐరోపాలోని చాలా బహిరంగ కళాకృతులకన్నా భిన్నమైనది ఈ శిల్పం. సందర్శకులను విభ్రమకు గురిచేసే ఈ కళాఖండాన్ని (ఎవరైనా) ఉచితంగా చూడవచ్చు. బాగా రద్దీగా ఉండే సిటీ షాపింగ్ సెంటర్లో ప్రతిష్టించబడిన 11

మీటర్ల ఎత్తైన స్టీలు శిల్పం. దీనిని కాఫ్కా శిరస్సు అనీ, లేదా కాఫ్కా శిల్పం అనే పేర్లతో పిలుస్తారు. 42 లోహపు పలకలు, ఒకదానికొకటి సంబంధం లేని పరిమాణంలో ఒకదానిపైన ఒకటి పేర్చబడి స్వతంత్రంగా, ఉక్కు తీగల ఆధారంగా గుండ్రంగా తిరుగుతుంటాయి. అలా తిరిగే క్రమంలో ఒక నిర్దిష్టమైన దశలో కాఫ్కా ముఖం కనువిందు చేసి మరుక్షణంలో మాయమవుతుంది. కదిలే ముఖంలో రకరకాల రూపాలు కన్పిస్తాయి. తళతళ మెరిసే స్టీలు పలకలు కాంతి పడి మెరిసిపోతుంటాయి. ఇది అత్యంత క్లిష్టమైన చలన (కైనెటిక్) శిల్పం. 2014లో స్థాపించబడిన ఈ విగ్రహంలో అమర్చిన భారీ పలకల బరువు 25 టన్నులు, ఉక్కు తీగలు అన్నీ కలిసి కిలోమీటరు పొడవూ, విగ్రహం ఎత్తు 11 మీటర్లూ ఉంటుంది. కాఫ్కా ముఖం ఎదురుగా ఉన్న సిటీహాల్‌వైపు చూస్తున్నట్లుగా ఉంటుంది. కాఫ్కా అక్కడి ఇన్సూరెన్స్ కంపెనీలో కొంతకాలం క్లర్కుగా పనిచేశాడు. ''తమ అసమర్థతవల్ల ఉద్యోగులు పూర్తిగా నిష్ప్రయోజకులైనపుడు ఈ విగ్రహం కాఫ్కాను గుర్తుచేస్తుంది." అంటాడు దీని సృష్టికర్త డేవిడ్ సెర్నీ. 20వ శతాబ్దంలో కాఫ్కా ఎంత ప్రముఖ సాహితీవేత్తగా గుర్తింపు పొందాడు. ఆధునిక కాలానికి అత్యంత సాంకేతిక ప్రతి కలిగిన కాఫ్కా శిల్పం కూడా అంతగా గుర్తింపు తెచ్చుకుంది (యూట్యూబ్‌లో కాఫ్కా ఫేస్) చూస్తే విగ్రహ ఆకారం, నిర్మాణ విశేషాలు తెలుస్తాయి. వీడియో చెక్ భాషలో ఉన్నా ఇంగ్లీషు సబ్–టైటిల్స్ ఉంటాయి.

**నిరంతర ప్రయాణీకులు (Les Voyageurs)– మార్సెల్ (Marsille)**

2013లో సంవత్సరం పొడువునా జరిగిన మార్సెల్ సాంస్కృతికోత్సవాల్లో బ్రూనో కాటలోనో (Bruno Catalano) తాను ఎంతగానో ప్రేమించే మార్సెల్ పట్టణంలో తన శిల్పాలను ప్రదర్శించాడు. శిల్పాలకు అతడు పెట్టిన పేరు Les Voyegeurs అంటే 'ద ట్రావెలర్స్.' బ్రూనో తన శిల్పాలను సెప్టెంబర్ 5 నుండి 30 వరకూ ప్రదర్శించాలనీ, వాటిని స్థిరంగా ప్రదర్శించడానికి అనువైన ప్రదేశం దొరికేవరకు తన శిల్పాల ప్రదర్శన మార్సెల్‌లోనే కొనసాగుతుందని అనుకున్నాడు. మార్సెల్ ఆర్ట్ పెవిలియన్ ముందు పదికిపైగా ప్రదర్శించబడిన అధిభౌతిక శిల్పాకృతులు సందర్శకులను విపరీతంగా ఆకర్షిస్తాయి. భూమ్యాకర్షణను ధిక్కరిస్తున్నట్లుగా విగ్రహాల పై భాగాలు ఏ ఆధారం లేకుండా గాలిలో నిలబడినట్టు ఉంటాయి. కింది భాగంలో కాళ్ళు, శరీరవ పై భాగంలో తల, భుజాలు, మధ్యలో శూన్యం, చేతిలో సూట్‌కేస్ పట్టుకున్న ఆకారాలు చూపరులకు ఆశ్చర్యం కలిగిస్తాయి. "అందంగా కనిపించాలంటే ఆకారంలో కొంత నష్టపోవలసి వస్తుంది" అని ప్రారంభోత్సవ సభల్లో చెప్పిన బ్రూనో మాటలకు అవి ప్రత్యక్ష నిదర్శనాలు. మొరాకో సిసిలియన్ కుటుంబంలో 1960లో జన్మించిన బ్రూనో కాటలానో ఫ్రాన్స్‌లో పెరిగి ఇరవై సంవత్సరాల వయసులో నావికుడవుతాడు. ఆ అనుభవం 'ప్రయాణం' అంశంగా శిల్పాలు సృష్టించడానికి ప్రేరణ అవుతుంది. చేతిలో ఒక సూట్‌కేసు తప్ప ఇంకేమీ వస్తువులు లేకుండా కన్పించే లోహ విగ్రహాల్లో ఏ బంధనాలు లేని ప్రపంచ పర్యాటకుడు కన్పిస్తాడు. ఆశ్చర్యం కలిగించే సాంకేతిక ప్రతిభ. కళాత్మకతతో శరీర మధ్యభాగం లేని ఆకారాలు ఊహకు పని కల్పిస్తాయి. కొన్ని శిల్పాలు మనకు దూరంగా వెళ్ళిపోతున్నట్లుగా, కొన్ని మనవైపు వస్తున్నట్లుగా ఉంటాయి. శిల్పాలు కొన్నింటిలో మధ్యభాగం శూన్యం, కొన్నింటిలో పైభాగం శూన్యం తల కన్పించదు. ఇంకొక శిల్పం అన్నీ కోల్పోయి రెండు పాదాలు, పక్కన సూట్‌కేసు మాత్రమే కలిగి ఉంటుంది. ప్రపంచ పర్యాటకునికి స్వంత ఆస్తి అతని చేతిలోని సూట్‌కేస్ ఒక్కటే అన్న సందేశం యిస్తున్నట్లుగా ఉంటాయి. 2004లో బ్రూనో సృష్టించిన లోహ శిల్పంలో కన్పించిన లోపంవల్ల అందులోని మధ్యభాగాన్ని తీసివేయవలసి వస్తుంది. లోపించిన భాగంతో ఉన్న శిల్పం, శిల్పకళలో నూతన ధోరణికి మార్గం చూపిస్తుంది. ఆ రకంగా సృష్టించిన శిల్పాలు మార్సెల్ ప్రదర్శనలో ఘనవిజయం సాధిస్తాయి. బ్రూనో



నిరంతర యాత్రికులు

పేరు మారు మోగిపోతుంది. 2019లో వెనిస్ 58వ అంతర్జాతీయ ద్వైవార్షిక కళా ప్రదర్శనలలో మరొకసారి బ్రూనో కాటలోనో శిల్పాలు 30 దాకా దర్శనమిచ్చాయి. వెనిస్ ఆర్టు గాలరీ సహకారంతో నగరంలోని ముఖ్యమైన ప్రదేశాలు – గ్రాండ్ కెనాల్ వెంట, చర్చి, గోల్డెన్ థియేటర్, రాజభవనం, మ్యూజియాలవద్ద అవి కన్పించి సందర్శకులను అలరించాయి. శిల్పాలన్నీ అసమగ్రమైనవి. మధ్యభాగంలో ఏమీ లేకున్నా గాలిలో నిలబడినట్లుగా చేతిలో సూట్‌కేసుతో నిరంతర ప్రయాణీకునికి సంకేతంగా ఉంటాయి. తోడి కళాకారుల ప్రశంసలందుకున్నాయి.

**వివాదస్పద మార్లిన్ మన్రో – పామ్ స్ప్రింగ్స్:**

మార్లిన్ మన్రో 26 అడుగుల భారీ విగ్రహం పామ్ స్ప్రింగ్స్ ఆర్ట్ మ్యూజియం ఎదురుగా స్థాపించబడి వివాదానికి తెరలేపింది. మ్యూజియం ట్రస్టీ ఈ విగ్రహ ప్రతిష్టకు అభ్యంతరం తెలియజేసింది. విగ్రహం అనారోగ్యకమైన, అసభ్యమైన స్త్రీ ప్రవర్తనను సూచిస్తుంది అని సిటీ కౌన్సిల్‌ను హెచ్చరించింది. విగ్రహ ప్రతిష్టను గురించి మ్యూజియం, సిటీ కౌన్సిల్‌ల మధ్యన తలెత్తిన వివాదం న్యాయ పోరాటానికి దారితీసింది. “రివర్ సైడ్ కౌంటీ జడ్జి తీర్పు – 26 అడుగుల ఎత్తు, మూడు వేల పౌండ్ల బరువు ఉన్న మన్రో ఫరెవర్ (Manroe Forever) విగ్రహాన్ని పామ్‌స్ప్రింగ్ మ్యూజియం దగ్గర స్థాపించవచ్చు, వివాదం ముగిసింది” అని స్థానిక పత్రికల్లో ఏప్రిల్ 8, 2021లో వార్త ప్రచురించబడింది. కానీ అసలు వివాదం ఇక్కడి నుండే మొదలయింది. ప్రముఖ హాలీవుడ్ నటి లక్షలాది అభిమానుల ఆరాధ్య దేవత మార్లిన్ మాన్రో నటించిన ‘ద సెవన్ ఇయర్ ఇచ్’ (The Seven Year Itch) సినిమాలోని ఒక దృశ్యంలో కన్పించే ఆమె రూపానికి అపురూపమైన శాశ్వతత్వం కలిగించాడు. పబ్లిక్ ఆర్ట్ సృష్టికర్త సివార్డ్ జాన్సన్. ఈ విగ్రహం మ్యూజియం ఎదురుగా ఉండడంతో మ్యూజియం సందర్శకులను ముందుగా ఆకర్షించేది మార్లిన్ మన్రో విగ్రహమే. గాలికి ఎగిరే స్కర్టు ముందుభాగాన్ని రెండు చేతుల్తో అదిమపెట్టుకుని ఉంటే మన్రో వెనకభాగం అంతా లోదుస్తులు, తొడలతో సహా కన్పిస్తుంది. “ప్రతి సంవత్సరం లక్షకు పైగా పాఠశాల విద్యార్థులు మ్యూజియం చూడడానికి వస్తారు. అశ్లీలంగా, అమర్యాదకరంగా ఉండే ఈ స్త్రీమూర్తి వారికి యిచ్చే సందేశం ఏమిటి?” అని మ్యూజియం సంచాలకుడు లూయీ గ్రాకోస్ కౌన్సిల్‌ను ప్రశ్నిస్తాడు.



మార్లిన్ మన్రో

**పూర్వరంగం:**

సివార్డ్ జాన్సన్ 2011లో మార్లిన్ మన్రో భారీ విగ్రహాన్ని రూపొందిస్తాడు. స్టీలు, అల్యూమినియం మిశ్రమాలతో తయారైన విగ్రహం ఎత్తు 26 అడుగులు, బరువు 34 వేల పౌండ్లు, తెల్లని దుస్తుల్లో అలంకరించబడి ఉంటుంది. మార్లిన్ మన్రోకు నివాళిగా, ఆమె నటించిన సినిమాలోని దృశ్యానికి పునఃసృష్టి చేశాడు. ఆ తర్వాత మన్రోవిగ్రహం అనేక ప్రదేశాల్లో– షికాగో మాగ్నిఫిసెంట్ మైలులో 2011–12లో, పామ్‌స్ప్రింగ్ లో 2012–14లోనూ, హామిల్టన్ 42 ఎకరాల మైదానంలో 2014–15లోనూ, బెండిగో, ఆస్ట్రేలియా రోజలిండ్ పార్కులో 2016లోనూ కనెక్టికట్ స్టాన్‌ఫర్డ్‌లో 2018లోనూ ప్రదర్శించబడి లక్షలాది అభిమానులను అలరించింది. స్టాన్‌ఫర్డ్ ప్రదర్శనలో ముప్పయ్యారు (36) భారీ విగ్రహాలు ప్రదర్శించబడితే వాటన్నింటినీ తలదన్ని మార్లిన్ మన్రో విగ్రహం ముఖ్య ఆకర్షణగా నిలిచింది. ఆ ప్రదర్శనలోనే మన్రో విగ్రహం అంతర్జాతీయ వివాదానికి దారితీసింది. 2019లో పామ్‌స్ప్రింగ్ మేయర్ మన్రో విగ్రహం మ్యూజియానికి వెళ్లేదారిలో శాశ్వతంగా ప్రతిష్టించబడుతుంది అని ప్రకటిస్తాడు. ఏప్రిల్ 18ని ప్రతిష్ట తేదీగా ప్రకటించడంతో స్థానికులు కొందరు దాన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తారు. ఫలితంగా తాత్కాలిక ప్రాతిపదికన విగ్రహం మూడేళ్ళపాటు అక్కడే ఉంటుంది. తర్వాత ప్రజాభిప్రాయం ప్రకారం దాన్ని ఎక్కడ ప్రతిష్టించాలన్నది నిర్ణయించబడుతుంది అంటాడు. ఈలోగా కొందరు స్వచ్ఛందంగా న్యాయ పోరాటానికి దిగుతారు. వివాదం న్యాయస్థానానికి చేరుకుని వాద ప్రతివాదాల తర్వాత విగ్రహం అక్కడే ఉండడానికి అనుమతిస్తూ ‘వివాదం ముగిసిపోయింది’ అని న్యాయస్థానం తీర్పు ఇస్తుంది. ఆ తీర్పు కూడా వివాదానికి దారితీస్తుంది. ‘సాంస్కృతిక కేంద్రాలు, సంస్కృతిని పరిరక్షించే బాధ్యత

కలిగిన మ్యూజియంలాంటి సంస్థలే స్త్రీ అసభ్యతను అంగీకరించినట్లవుతుంది. విగ్రహాన్ని మ్యూజియం ముందు స్థాపిస్తే దానికి మ్యూజియం అంగీకారం తెలిపిందన్న తప్పుడు సంకేతం ఇచ్చినట్లవుతుంది.' అన్నది మ్యూజియం నిర్వాహకుల అభ్యంతరం- పామ్‌స్ప్రింగ్‌లో మార్లిన్ మన్రో కొంతకాలం నివసించినందున అక్కడి అభిమానులకు మన్రో ఆరాధ్యదేవత. వారు మన్రో విగ్రహాన్ని అక్కడే ప్రదర్శించాలని కోరుకుంటారు. మరోవైపు పామ్‌స్ప్రింగ్ హోటల్ యజమానులు 2020లో మార్లిన్ మన్రోవిగ్రహాన్ని 'మన్రో విగ్రహసంస్థ' నుండి పది లక్షల డాలర్లకు కొని సొంతం చేసుకంటారు. టూరిజం, వ్యాపారం అభివృద్ధి చెందుతాయని వ్యాపార దిగ్గజాలు, హోటల్ యజమానులు విగ్రహాన్ని శాశ్వతంగా సిటీ సెంటర్‌లో ప్రతిష్టించడానికి, సిటీ కౌన్సిల్ మద్దతు సంపాదిస్తారు. కొందరు స్థానికుల మద్దతులో మ్యూజియ యాజమాన్యం విగ్రహ ప్రతిష్టను వ్యతిరేకిస్తే, నగర మేయర్ వ్యాపారులు విగ్రహాన్ని అక్కడే ఉంచాలని పట్టుదలకు పోతారు. అదే జరిగితే మ్యూజియం చారిత్రక ప్రాధాన్యత కోల్పోతుందని కొందరు విమర్శకులు అభిప్రాయపడతారు. మొత్తం మీద మన్రో భవిష్యత్తు కోర్టు తీర్పు, ప్రజాభిప్రాయాల మధ్య నలిగిపోతోంది. ఫలితం కోసం మూడేళ్ళు వేచిచూడక తప్పదు.



బిగ్ బ్లూవేల్

**నేక్‌చంద్ రాక్ గార్డెన్ - చండీగర్:**

ఇంతవరకూ విదేశాలలోని పబ్లిక్ ఆర్టు విశేషాలు కొన్ని తెలుసుకొన్నాం. మన దేశంలో కూడా బహిరంగ కళారూపాలకు కొదవలేదు. మచ్చుకు ఒకటి చూద్దాం. చండీగర్‌లో ఉన్న రాక్ గార్డెన్ శిల్ప సముదాయం, అయితే ఇందులోని విశేషం శిల్పాలు రాతివిగాని లోహపువిగానీ కాకపోవడం, శిల్పాలన్నీ వేర్వేరు పదార్థాలతో తయారు చేయబడడం. దీన్నే నేక్‌చంద్ రాక్ గార్డెన్ అని కూడా అంటారు. దీని సృష్టికర్త నేక్‌చంద్ సయినీ, ప్రభుత్వోద్యోగి. తీరికవేళల్లో ఈ గార్డెన్‌ను రూపొందించాడు. రాక్ గార్డెన్ 40 ఎకరాల స్థలంలో ఉంటుంది. ఇందులోని శిల్పాలన్నీ పూర్తిగా పరిశ్రమల వ్యర్థ పదార్థాల నుండి నిర్మించబడినవి. నేక్‌చంద్ సృజనాత్మకత నుండి పుట్టిన దృశ్య కావ్యం, అద్భుత సృష్టి. పింగాణీ ముక్కలు, గాజుముక్కలు, గాజులు, ఇటుకలు, విరిగిపోయిన ట్యూబులైట్లు, పై పుముక్కలు మొదలైన వ్యర్థ పదార్థాలు అపురూప కళారూపాలుగా దర్శనమిస్తాయి. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే తీరిక సమయంలో చండీగర్ చుట్టుపక్కల కూలగొట్టిన, నిర్మాణంలో ఉన్న భవనాల నుండి వ్యర్థ పదార్థాలను సేకరించి వాటినే తన ప్రతిభతో రకరకాల శిల్పాలుగా, కళాకృతులుగా తయారు చేశాడు. తన కలల ప్రపంచం 'సుకర్ణి'ని (దివ్య లోకాన్ని) ఈ రకంగా నిజం చేసుకున్నాడు. తన కలల రూపాన్ని సాకారం చేసుకోవడానికి నేక్‌చంద్ చండీగర్ సుఖానా చెరువు దగ్గరలో ఉన్న అటవీ ప్రాంతాన్ని ఎంచుకున్నాడు. నాటికి అది తటస్త అటవీ ప్రాంతం. అందులో ఏ నిర్మాణమైనా చట్టవిరుద్ధం. అయినా నేక్‌చంద్ అతి రహస్యంగా 18 సంవత్సరాలు అధికారుల దృష్టిలో పడకుండా జాగ్రత్తలు తీసుకుని తలపెట్టిన పనిని కొనసాగించాడు. 1975లో అది అధికారుల దృష్టిలో పడేనాటికి రాక్ గార్డెన్ 12 ఎకరాల స్థలంలో వ్యాపించింది. గార్డెన్ అంతా నడవలు, వేలాదిగా డాన్సర్లవీ, సంగీత వాద్యకారులవీ, జంతువులవీ కాంక్రీటు శిల్పాలలో నిండి ఉంటుంది. గార్డెన్‌ను తొలగిస్తే తన కష్టమంతా నిర్మూలమై పోతుందని భయపడ్డాడు. కానీ ప్రజాభిప్రాయం అతనివైపు ఉండటం చేత, అధికారులు దాన్ని 1976లో బహిరంగ కళాప్రదర్శనా ప్రదేశంగా ప్రకటించి నేక్‌చంద్‌కు నెల జీతం ఏర్పాటు చేసి, యాభైమంది పనివాళ్ళనూ యిస్తారు. నేక్‌చంద్ సబ్‌డివిజనల్ ఇంజనీరు హోదాలో రాక్ గార్డెన్ నిర్వహణను చేపడతాడు. 1983లో భారత తపాలాశాఖ రాక్ గార్డెన్‌తో స్టాంపు విడుదల చేసింది. ప్రభుత్వ సహకారంతో ప్రజలు సేకరించి ఇచ్చిన మరికొన్ని పనికిరాని వస్తువులతో రాక్ గార్డెన్‌ను మరింత అభివృద్ధి చేశాడు. నేక్‌చంద్ విదేశీ పర్యటనలో ఉండగా (తన అనుభవాలతో ఉపన్యాసాలు ఇవ్వడానికి) దుండగులు కొందరు గార్డెన్‌ను పాడు చేస్తారు. రాక్ గార్డెన్


నేక్‌చంద్ రాక్ గార్డెన్ - చండీగర్

సొసైటీ ఏర్పడి గార్డెన్ నిర్వహణ బాధ్యతను చేపట్టి దాన్ని మరింతగా అభివృద్ధి చేస్తుంది. గార్డెన్‌లోని అపురూప, రమణీయ కళాకృతులను చూడటానికి ప్రతి రోజూ వచ్చేవారి సంఖ్య వందలల్లో ఉంటుంది. ఇప్పటివరకూ కోటికి పైగా సందర్శకులు దీన్ని చూసి ఉంటారని అంచనా. గార్డెన్‌లోనే ఆటబొమ్మల మ్యూజియం కూడా ఉంది. నేక్‌చెంద్ రెండవ వర్ధంతి సందర్భంగా దీన్ని ప్రారంభించారు. రెండు వందల గుడ్డ బొమ్మలు అవి అన్నీ నేక్‌చంద్ తయారు చేసినవే కావడం వాటిలోని ప్రత్యేకత. వ్యర్థ వస్తువులతో తయారైన గార్డెన్‌లో అడుగుపెట్టడం ఏదో వింత లోకంలో అడుగు పెట్టినట్లుంటుంది. ఇంగ్లండు ఆర్ట్ మాగజైన్ 'పయనీర్ ఇన్ ఆర్ట్' 50వ సంచిక (2005) నేక్‌చంద్ రాక్ గార్డెన్‌ను ముఖచిత్రంగా ప్రచురించి, బహిరంగ కళకు భారతదేశం చేసిన గొప్ప సేవ అని గౌరవించింది. (ఆసియా అంతటికీ పెద్దదిగా పేరు పొందిన 'రోజ్ గార్డెన్ చండీగర్‌లోని మరో ముఖ్య ఆకర్షణ) ప్రపంచ స్థాయి సైకత శిల్పి పూరీకి చెందిన సుదర్శన్ పట్నాయక్ మన దేశపు మరొక గొప్ప పబ్లిక్ ఆర్ట్ కళాకారుడు. తాజ్‌మహల్, మాస్క్ ఇండియా, ప్రపంచశాంతి మొదలైన వందలాది సైకత శిల్పాల సృష్టికర్త.

**బిగ్ బ్లూవేల్ – మొట్టమొదటి సంచార కళాఖండం:**

*"2018లో బెల్జియం సిటీ బ్రూజ్ సందర్శకులు 36 అడుగుల పొడవైన (ఎత్తైన) పెద్ద నీలి తిమింగిలం పక్కనే వున్న కాలవ నుండి పైకెగురుతున్న దృశ్యాన్ని చూశారు. పూర్తిగా ప్లాస్టిక్ వ్యర్థాల నుండి తయారైన ఈ భారీ నిర్మాణం కెసిఏ స్టూడియో వాస్తు శిల్పుల కృషి ఫలితం. ప్రజలకు పరిసరాల కాలుష్యం గురించిన అవగాహన కలిగించడం కోసమని జాసన్ డెక్లిమోస్కీ, లెస్లీ చాంగ్ ఆర్కిటెక్టులు హవాయి తీర ప్రాంతం నుండి సేకరించిన లాండ్రీ బాస్కెట్లు, పైపులు, గొట్టాలు, బక్కెట్లు, స్ప్రే బాటిళ్ళు మొదలైన ప్లాసిక్ వ్యర్థాలు వాటినుండి దీన్ని నిర్మించారు. సముద్రాలన్నీ 150 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. వాటిలో నీలి తిమింగిల నిర్మాణానికి ఐదు టన్నులు మాత్రమే ఉపయోగించబడ్డాయి".*

*–రీడర్స్ డైజెస్ట్; ఆగస్ట్, 2021 – యుకె ఎడిషన్*

12 మీటర్ల ఎత్తైన పెద్ద తిమిగిల శిల్పం, పూర్తిగా ప్లాస్టిక్ వ్యర్థాల నుండి తయారైన పబ్లిక్ ఆర్ట్ కళాఖండం (ఫ్లెమిష్) బెల్జియం బ్రూజ్ పట్టణంలో ప్రతి మూడు సంవత్సరాలకొకసారి జరిగే సాంస్కృతిక సంబరాల సందర్భంగా ఈ భారీ తిమింగిల శిల్పం మొదటిసారిగా 2018లో ప్రదర్శించబడింది. ప్రముఖ చిత్రకారుడు జాన్ వాన్ ఐక్ విగ్రహం ఉన్న ప్రదేశంలో ఆర్టు సైన్స్ మ్యూజియం దగ్గర కాలువలో నుండి బయటికి దుముకుతున్న భంగిమలో దీని ప్రదర్శన చోటుచేసుకుంది. సుమారు నాలుగు లక్షలమంది సందర్శకులు ఈ వింత శిల్పాన్ని చూసి దాని లక్షలాది ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు.

ఒక నిర్దిష్ట ప్రయోజనంకొరకు నిర్మించబడి, ప్రదర్శించబడిన మొట్టమొదటి పబ్లిక్ ఆర్టు కూడా ఇదే కావడం దీని ప్రత్యేకత. ఇది ఆకాశ హర్మ్యమంత ఎత్తులో ఉండడం చేత 'స్కై స్క్రేపర్' అనేది దీని మరోపేరు. మానవాళి విచక్షణారహితంగా ప్లాస్టిక్ వస్తువుల్ని సముద్ర జలాల్లోకి వదిలివేయడంవల్ల సముద్ర జీవుల ఉనికికి ప్రమాదం ఏర్పడుతుందని, 2018 నాటికే 150 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్ర జలాల్లో తేలియాడుతున్నాయనీ, ఈ సంఖ్య సముద్రాల్లో ఉండే మొత్తం తిమింగలాల సంఖ్యను మించిపోయిందని లెక్క తేలింది. పరిస్థితి తీవ్రతను తెలియజేస్తూ, ప్రపంచ వ్యాప్తంగా ముంచుకొస్తున్న ఉపద్రవం నుండి జాగ్రత్త పడాలన్న అవగాహన కల్పించడం కోసం న్యూయార్క్ భవన నిర్మాణ సంస్థ విభాగం కెసిఏ స్టూడియో ఈ భారీ ప్లాస్టిక్ తిమింగిలానికి రూపకల్పన చేసింది. హవాయి ద్వీపం దగ్గర పసిఫిక్ మహాసముద్రం నుండి నాలుగు నెలల్లోనే సేకరించిన అయిదు టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాల నుండి ఈ భారీ తిమింగిల శిల్పం తయారైంది. అంతర్గతంగా ఉన్న స్టీలు ఫ్రేమ్ చుట్టూ సేకరించిన ప్లాస్టిక్ వస్తువులను అందంగా పేర్చడంతో ఇంత పెద్ద తిమింగిలం రూపుదిద్దుకుంది. మొదట బ్రూజ్‌లో ప్రదర్శించిన తర్వాత వెదర్లాండులో ఉట్రెన్ పట్టణ, ఉట్రెన్ విశ్వవిద్యాలయ సహకారంతో 2019లో ప్రదర్శించబడింది. ప్రజలకు అవగాహన కలిగించడంలో ప్రదర్శన విజయవంతమైంది. ఆసియా ఖండం మొదటిసారిగా ప్రదర్శించబడిన తర్వాత మిగతా ప్రపంచ దేశాలలో పర్యటిస్తుంది. సింగపూర్‌లో 2019 నవంబర్ నుండి 2020 జనవరివరకు ప్రదర్శించబడిన తర్వాత మిగతా ఆసియా దేశాల ముఖ్య పట్టణాల్లో, ప్రపంచ దేశాల్లో పర్యటిస్తుంది. విచక్షణారహితంగా జరుగుతున్న ప్రకృతి విధ్వంసంవల్ల పొంచివున్న ప్రమాదాన్ని హెచ్చరించడానికి చేసిన వినూత్న ప్రయత్నమే ఈ స్కై స్క్రేపర్ నిర్మాణం.

టి. విశ్వేశ్వర ప్రసాద్
హైదరాబాద్. ఫోన్: 798 139 8250.



గాజుల లక్ష్మీనర్సు శెట్టి

# గాజుల లక్ష్మీనర్సు శెట్టి

*– సరోజినీ ప్రేమ్‌చంద్*

మన దేశం ఈస్ట్ ఇండియా కంపెనీవారి పాలనలో ఉన్నప్పుడు వారితో రాజకీయ పోరాటం చేసిన ఆంధ్రుల్లో ప్రథముడు గాజుల లక్ష్మీనర్సు శెట్టి అనడంలో అతిశయోక్తి లేదు. ఇంగ్లీషులో పత్రిక నడిపిన మొట్టమొదటి తెలుగువాడు అనే గౌరవం కూడా అతనికే చెందుతుంది. మద్రాసు ప్రెసిడెన్సీలో నివసిస్తున్న ప్రజల మత ధర్మాన్ని, వారి ఆచార సంప్రదాయాలను, వారి వర్తక వాణిజ్యాలను రక్షించడానికి, వారిలో విద్యావకాశాలు కలిగించడానికి, లక్ష్మీనర్సు తన జీవితకాలమంతా పాటుపడ్డాడు.

ఒకానొక కాలంలో చెన్నపట్నం అనీ, ఆ తర్వాత మద్రాస్ అనీ, మళ్ళీ ఇప్పుడు చెన్నై అనీ పిలువబడుతున్న ఈ నగరంలో 1806లో లక్ష్మీనర్సు జన్మించాడు.

మద్రాసు, చెన్నపట్నం, చెన్నపురి అనే ఈ పేర్ల గురించి రకరకాలైన వాదాలున్నాయి. మదరాసు తెలుగు నగరం అంటూ టంగుటూరి ప్రకాశం గారు తయారు చేసిన ఒక నివేదికలో "తెలుగువాడైన చంద్రగిరి రాజుది. ఆ రాజు పేరు మాదిరాజు. అతడు విజయనగర రాజుల క్రింద సామంత రాజు. అతడి పేరు మీదే మాదిరాజు పట్టణం అనే పేరు ఈ నగరానికి వచ్చింది" అని ప్రకాశం గారు రాశారు. వాడుకలో అది మద్రాసు పట్టణంగా మార్పు చెందింది (ఈ నివేదికను మదరాసు ఆంధ్రా వెల్ఫేర్ లీగ్‌వారు ప్రచురించారు. ప్రథమ ముద్రణ 12-12-1952; వెల: రూ. 4/- 28/29, కోరల్ మర్చంట్ వీధి). చంద్రగిరి రాజుకు సామంతుడు పూనమల్లి నాయకుడు. అతడు సముద్ర తీరం వెంట 5 మైళ్ళ పొడుగు, కొన్ని మైళ్ల వెడల్పుగల ఒక చీలికను మంజూరు చేసి, ఈస్టిండియా కంపెనీ ప్రతినిధి అయిన ఫ్రాన్సిస్ డే పేరిట 1639లో దస్తావేజు రాసి ఇచ్చాడు. పూనమల్లి వేంకటప్ప నాయకుడు తన తండ్రి చెన్నప్ప నాయకుడి పేరును ఈ నగరానికి పెట్టాలని నిర్దేశించాడు. కూమ్ నదిని ఆ రోజుల్లో తిరువళిక్కేణి నది అనేవారు. ఆ నదికి ఉత్తర దిక్కున మదరాసు లేక చెన్నపట్నం నిర్మితమైంది.

ఈ చెన్నపట్టణంలో గాజుల సిద్దుల శెట్టి అనే వ్యాపారికి లక్ష్మీనర్సు జన్మించాడు. సిద్దుల శెట్టి నీలిమందు వ్యాపారం చేసేవాడు. దక్షతతో, తెలివితేటలతో వ్యాపారాన్ని బాగా వృద్ధి చేసి సిరిసంపదలు సంపాదించాడు. కుమారుడైన లక్ష్మీనర్సుకు కూడా ఆ బుద్ధికుశలత అబ్బింది. అప్పట్లో ఇంగ్లీషు నేర్పే పాఠశాలలు లేవు. తెలుగు, తమిళం, లెక్కలు నేర్పే వీధి బళ్ళు ఉండేవి. బళ్ళో లక్ష్మీనర్సు తెలుగు రాయడం, చదవడం నేర్చుకున్నాడు. అతడి చురుకుదనం చూసి ఒక పంతులుగారు ఇంగ్లీష్ అక్షరాలు కూడా నేర్పాడు. లక్ష్మీనర్సుకు మంచి వాగ్ధాటి ఉండేది. అందుచేత అప్పట్లో బయలుదేరిన భాషాభివృద్ధి సంఘాలలో చర్చలలో పాల్గొంటుండేవాడు. విషయ వివరణలో తార్కికంగా వాదించడంలో తనకుగల నైపుణ్యానికి మరింత పదును చేకూర్చున్నాడు. బడి చదువు ముగించాక తండ్రి చేసే వ్యాపారంలో తర్ఫీదు పొందాడు. తండ్రీకుమారులు కలిసి సిద్దుల శెట్టి అండ్ కంపెనీ అనే సంస్థను స్థాపించారు. ఇది విదేశాలకు వస్త్రాలను ఎగుమతిచేసే వ్యాపార సంస్థ. తండ్రి పోయాక కూడా లక్ష్మీనర్సు బాగా శ్రమించి, వ్యాపారం వృద్ధి చేసి, ప్రముఖ వర్తకునిగా పేరు సంపాదించాడు. ఇంగ్లీషు భాషా జ్ఞానం పెంపొందించుకుని, పుర ప్రముఖులలో ఒకడైనాడు.

మన దేశానికి వర్తకం చేసుకోవడం కోసం ఇంగ్లాండ్ నుండి వచ్చిన తూర్పు ఇండియా కంపెనీ (ఈస్ట్ ఇండియా కంపెనీ) క్రమక్రమంగా ఒక ప్రాంతమే స్వాధీనపరచుకుంటూ

వచ్చింది. 1700 సంవత్సరానికల్లా బ్రిటిష్ ప్రభుత్వం కంపెనీ పాలనకు తమ గుర్తింపును, సమ్మతిని ఇచ్చింది. కలకత్తా ప్రాంతానికి గవర్నర్ జనరల్‌ను బొంబాయి, మద్రాసు ప్రాంతాలకు గవర్నర్లను ఉన్నత పాలనా అధికారులుగా కంపెనీ నియమించింది. దాదాపుగా దక్షిణ భారతదేశమంతా చెన్నపట్నం రాజధానిగా మద్రాను ప్రెసిడెన్సీ అని పిలవబడుతూ గవర్నర్ అధికారం కింద పాలించబడుతూ ఉండేది. అయితే స్వదేశ సంస్థానాలై మైసూర్, హైదరాబాదు, తిరువాన్కూరు మాత్రం ఆయా రాచ కుటుంబాల ఆధీనంలో ఉండేవి.

చెన్నపట్నంలో ప్రజల పరిస్థితి ఏమిటో చూద్దాం. నూటికి తొంభైమంది ప్రజలు కంపెనీ దొరల ఎగుమతి వ్యాపారం పైన ఆధారపడిన నేతగాళ్లు, రంగుల అద్దకంవారు, రజకులు, తదితర వృత్తుల వారు, వీరికోసం గానూ వచ్చిన చిల్లర వర్తకులూ అయి ఉండేవారు. కంపెనీ వారు అతి చవకగా ఉత్పత్తిదారుల వద్ద వస్తువులు కొనుగోలు చేసేవారు. తూర్పు ఇండియా కంపెనీని వాడుకలో కుంఫిణీ అనీ, ఇంగ్లీషు వర్తకులను కుంఫిణీ దొరలని అంటూ ఉండేవారు. నెల్లూరు రుమాళ్లు, నారాయణవరం పంచెలు, శ్రీకాకుళంలో నేసే సన్న వస్త్రాలు, తెనాలి, మచిలీపట్నాలలో తయారయ్యే అద్దకం వస్త్రాలు, చవకగా కొని ఎగుమతి చేసి లాభాలు గడించేవారు కుంఫిణీ దొరలు. భాష రాకపోవడంచేత అమాయకత్వంవలన ప్రజలు ఇంగ్లీషు దొరల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడవలసి వచ్చేది. కొందరు ఇంగ్లీషు నేర్చుకొని దొరల వద్ద గుమస్తాలుగా, తర్జుమా చేసే దుబాసీలుగా (ఇంగ్లీషు నుండి తెలుగు – తెలుగు నుండి ఇంగ్లీషుకు అనువదించి చెప్పే ద్విభాషలుగా) పనిచేస్తుండేవారు. వీరు తమ పొట్ట పోషించుకోవడం కోసం అమిత భయభక్తులతో మెలగవలసి వచ్చేది.

కంపెనీవారు నగరంలోనే కాకుండా గ్రామాలలో కులవృత్తులు చేసుకొని జీవించే వారిమీద, చిల్లర వర్తకం చేసి బ్రతుకు వెళ్లదీసుకునేవారిమీద 'మోతర్పా' అనే ఒక పన్ను విధించారు. ఇది ఎంత ఘోరంగా ఉండేదంటే సాలెవాళ్ళ మగ్గాల మీద, పత్తి వడికే రాట్నాల మీద, గొర్రెల కాపరులు మీద, కమ్మరి, కంచర, వడ్రంగి, రాతి చెక్కడం చేసే పనివారి మీద కూడా ఈ పన్ను విధించేవారు. ఆఖరికి తన ఇంట్లో తన నూలు వడుక్కునే ముసలమ్మ మీద, బుట్టలో కూరగాయలు పెట్టుకుని వీధిన అమ్ముకునే పేదరాలి మీద కూడా పన్ను ఉండేది. గ్రామాల్లో, పొలాలు సాగు చేసుకునే రైతులు కట్టవలసిన శిస్తు విషయంలో కూడా అధికారులు మహా దుర్మార్గంగా ప్రవర్తిస్తూ ఉండేవారు.

ఈ అన్యాయాల నుండి దేశ ప్రజలను రక్షించాలని నడుం కట్టుకున్నాడు లక్ష్మీనర్సు. ప్రభుత్వ పరిపాలనలో సంస్కరణలు తేవాల్సిన అగత్యం గురించి ఆందోళన జరపడానికి లక్ష్మీనర్సు మద్రాస్ నేటివ్ అసోసియేషన్ అనే పేరుతో ఒక ప్రజా సంఘాన్ని స్థాపించాడు. దీనికి తానే అధ్యక్షుడిగా పనిచేశాడు. ధనవంతులైన వర్తకులు, సర్కారు ఉద్యోగాల్లో లేని పెద్దమనుషులు, ఈ సంఘంలో చేరి పని చేయసాగారు. తరచూ సభలు జరిపి, ప్రజల కష్టాలను గురించి చర్చించి, అధికారుల దృష్టికి తెస్తుండేవారు.

ఒక్క పన్నుల విషయంలోనే కాకుండా, పాఠశాలలు, చదువులు, విద్యావిధానం పట్ల కంపెనీ వ్యవహరిస్తున్న తీరు వంటి విషయాలను కూడా లక్ష్మీనర్సు ధైర్యంగా విమర్శించేవాడు. అప్పటికే రాజా రామ్మోహన్ రాయ్ బ్రిటిష్ పార్లమెంట్ పంపిన ఒక కమిటీ ముందు భారతీయుల కడగండ్లను నివేదించాడు. కలకత్తాలో బెంగాల్ బ్రిటిష్ ఇండియా సొసైటీ, బొంబాయిలో ఇండియన్ అసోసియేషన్ కూడా ఈ రంగంలో కృషి చేస్తున్నాయి. కంపెనీ వారికి ఫిర్యాదులు సమర్పిస్తున్నాయి. మద్రాసు, బొంబాయిలోని ప్రభుత్వాలు కలకత్తా ప్రభుత్వపు అధికారానికి లోబడి పని చేయాలి. కలకత్తా ప్రభుత్వం ఇంగ్లాండ్‌లో ఉన్న కంపెనీ డైరెక్టర్ల ఆదేశాలను పాటించి పనిచేయాలి. ఈ డైరెక్టర్‌ల సభ మీద బ్రిటీష్ పార్లమెంటు నియమించిన తనిఖీ సంఘపు ఆధిపత్యం ఉండేది. అందుచేత ఇక్కడ మన దేశంలో ఎన్ని ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేకపోవడంతో ఈ ప్రజాసంఘాల వారు మహజర్ల ద్వారా బ్రిటిష్ పార్లమెంటు భారతీయుల కష్టనష్టాలను విన్నవించుకునేవారు. పరిపాలనలో తేవలసిన సంస్కరణలను సూచించేవారు. ప్రజల క్షేమం గురించిన బాధ్యతను చేపట్టవలసిందిగా అభ్యర్ధనలను పంపుకునేవారు. లక్ష్మీనర్సు తన దృష్టిని వ్యాపారం మీద నుండి పూర్తిగా ప్రజాసేవవైపు మళ్లించి ఈ దేశీయ ప్రజాసంఘానికి తన సర్వశక్తులూ ధారపోయడం మొదలుపెట్టాడు.

అప్పుడు మద్రాసు ప్రెసిడెన్సీ జనాభా సుమారు 1 కోటి 20 లక్షల పైగానే ఉండేది. సామాన్య ప్రజలకు అక్షర జ్ఞానం ఉండేది కాదు. మధ్యతరగతివారు, భూస్వాములు, వర్తకులు ఎలాగో కష్టపడి వీధిబడులలో రాతకోతలు, లెక్కలు నేర్చుకునేవారు. రాష్ట్రంలో అప్పటికీ ఉన్న 12,500

పాఠశాలల్లో 750 వేదపాఠశాలలు. తక్కినవి గ్రామ పాఠశాలలు. వీటిని ప్రజలే పోషించేవారు. బడిలో పెద్దబాలశిక్షలోని విషయాలను మాత్రమే బోధించేవారు. ఆనాటి పాఠశాలల దుస్థితిని గురించి వెన్నెలకంటి సుబ్బారావు అనే తెలుగు ప్రముఖుడు 1820లోనే మద్రాస్ స్కూల్ బుక్ సొసైటీ వారికి ఒక పెద్ద లేఖను ఇంగ్లీష్‌లో రాశాడు. విద్యార్థులకు సరైన పుస్తకాలు లేవని, ఇంగ్లీషు భాష బోధించాలని, దానికి తగిన పుస్తకాలు ఏర్పాటు చేయాలని, బడి పంతుళ్లకు శిక్షణ ఇవ్వాలని – ఇలా ఎన్నో ఉపయోగకరమైన అంశాలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చాడు. పరిపాలనలోని లోపాలు పరిశీలించడానికి ప్రధాన కమిషనర్‌గా పార్లమెంటు నియమించిన సర్ థామస్ మన్రో కూడా తన నివేదికలో ఈ అంశాలను పేర్కొన్నాడు. దరిమిలా 1826లో బడి పుస్తకాల ప్రచురణ కోసం ఒక విద్యాభివృద్ధి సంఘాన్ని ప్రభుత్వం నియమించింది. చెన్నపట్నం కోటలో – అంటే ఫోర్ట్ సెయింట్ జార్జ్‌లో బడి పంతుళ్లను తయారుచేసే ఒక స్కూల్‌ను ఆరంభించారు. కంపెనీ ఉద్యోగులకు తెలుగు, తమిళం మొదలైన భాషలు నేర్పడానికి ఇతరమైన శిక్షణలు ఇవ్వడానికి ఒక కాలేజీ కోటలో నడుస్తుండేది. తెలుగు భాషకు అపారమైన సేవలందించిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ ఇటువంటి కాలేజీలోనే తెలుగు అభ్యసించాడు. కంపెనీ ఉద్యోగులుగా నియమించబడినవారు ఇంగ్లండ్ నుంచి భారతదేశానికి రాగానే వారి–వారి ఉద్యోగ ప్రాంతాల్నిబట్టి ఆయా భాషలు నేర్చుకోవడం తప్పనిసరి నియమంగా కంపెనీ అమలు పరచేది. బ్రౌన్ కడప ప్రాంతంలో రెవెన్యూ అధికారిగా నియమించబడటంవల్ల అతడు తెలుగు నేర్చుకుని, తెలుగు భాషలో నిష్ణాతుడయ్యాడు. తెలుగు-ఇంగ్లీష్, ఇంగ్లీషు–తెలుగు నిఘంటువులను సంకలనం చేయడమే కాకుండా, అనేక ప్రాచీన గ్రంథాల తాళపత్ర ప్రతులను సేకరించి, పరిష్కరించి ప్రచురించాడు. వేమన పద్యాలను సేకరించి, కొన్నింటిని ఆంగ్లంలోకి తర్జుమా చేశాడు. ఈ రకంగా తెలుగు భాషకు ఎనలేని సేవ చేసి, తెలుగు జాతికి చిరస్మరణీయుడయ్యాడు.

సెయింట్ జార్జి కోటలో ఉన్న ఈ కాలేజీ ఆవరణలోనే సభలు, సమావేశాలు జరుగుతుండేవి. అడ్వకేట్ జనరల్‌గా పని చేసి, పదవీ విరమణ తర్వాత జార్జి నార్టన్ అనే మేధావి ఒకరు పరిపాలన, రాజ్యాంగం, న్యాయవిధానంవంటి విషయాల గురించి ప్రజల్లో అవగాహన కలిగించడం కోసం తరచూ ఉపన్యాసాలిస్తుండేవారు. లక్ష్మీనర్సు తన మిత్రులైన ఏనుగుల వీరాస్వామి, వెంబాకం రాఘవాచార్యులు, కోమలేశ్వరపురం శ్రీనివాస పిళ్లైలతో పాటు జార్జి నార్టనును కూడా కలుపుకొని, హిందూ లిటరరీ సొసైటీ అనే ఒక సంఘాన్ని స్థాపించాడు. ఈ కాలేజీ ఆవరణలోనే నార్టన్ చేత మన దేశ చరిత్ర గురించి, ప్రజల హక్కుల గురించి, విద్యాభివృద్ధి జరగవలసిన అవసరం గురించి ఉపన్యాసాలను ఈ సొసైటీ వారు ఏర్పాటు చేయించారు. ఈ ఉపన్యాసాలు లక్ష్మీనర్సులో గాఢమైన ప్రేరణను, కార్యోత్సాహాన్ని ఉత్తేజితం చేశాయి. మిత్రులంతా కలసి ప్రజలకు విద్యావకాశాలు కల్పించవలసిందిగా ప్రభుత్వాన్ని రకరకాలుగా అభ్యర్థించారు.

దీని ఫలితంగానే 1841లో మద్రాసు యూనివర్సిటీ అనే ఉన్నత పాఠశాలను ప్రభుత్వం ఆరంభించింది. ఇక్కడ చదువు ముగిశాక విశ్వవిద్యాలయంలో ఆంగ్ల సారస్వతం, ప్రకృతి శాస్త్రాలు, తత్వశాస్త్రం అభ్యసించడానికి విద్యార్థులను ఈ ఉన్నత పాఠశాల సిద్ధం చేస్తుంది.

ఈలోగా క్రైస్తవ మిషనరీలు తము సొంతంగా పాఠశాలలు తెరిచి దేశీయులను ఆకర్షించసాగారు. మొదట్లో ఇది బాగానే ఉన్నా పోనుపోను నీ బళ్లలో హిందూ మతాన్ని కించపరచడం, క్రైస్తవ మత ఆధిక్యతను ప్రచారం చేయడమూ ఎక్కువైంది. మతం మార్చుకోమని విద్యార్థులను కూడా ఒత్తిడి చేస్తుండేవారు. లక్ష్మీనర్సు మొదలైనవారంతా ప్రభుత్వానికి ఎన్నో ఫిర్యాదులు చేసినా లాభం లేకపోయింది. మిషనరీలు మరింత రెచ్చిపోయి పాఠ్యగ్రంథంగా విద్యాప్రణాళికలో ప్రవేశపెట్టారు. పైగా ఈ మిషనరీలకు ప్రభుత్వంలో పలుకుబడి ఉండేది. అధికారుల్లో మత పక్షపాతం ఉండేది. ఎవరైనా మతం మార్చుకున్నా, కుటుంబంలో వారి ఆస్తి హక్కులకు భంగం వాటిల్లకూడదనే కూడదనే కొత్త చట్టాన్ని చేయడానికి పూర్వపు శాసనాల్లో మార్పులు చేయడానికి కూడా ప్రయత్నాలు జరిగాయి. దీనితో సమాజంలో గగ్గోలు రేకెత్తింది. ఈ దుష్కృత్యాలను బహిరంగంగా చర్చించడానికి ఒక పత్రిక అత్యవసరమని లక్ష్మీనర్సు భావించి, 'క్రెసెంటు' అనే ఇంగ్లీషు పత్రికను ఆరంభించాడు. నిర్మొహమాటంగా, నిర్భయంగా ప్రభుత్వాన్ని విమర్శిస్తూ వ్యాసాలు రాశాడు. క్రైస్తవ మతాచార్యుల కుట్రలను, కుతంత్రాలను తన పత్రికలో దుమ్మెత్తిపోశాడు.

1844లో అక్టోబర్ 2న 'క్రెసెంట్' మొదటి సంచిక విడుదలైంది. ఈ పత్రిక దొరలకు కంటకంగా తయారైంది. ఇది ఇంగ్లీషువారిపై దక్షిణ భారతదేశంలో ఎగరవేసిన మొట్టమొదటి తిరుగుబాటు బావుటా. ప్రజల కోసం లక్ష్మీనర్సు

చేపట్టిన సాహస కార్యం. తక్కిన వార పత్రికలకు ఇచ్చే స్వల్ప సహాయము, సౌకర్యాలూ 'క్రేసెంట్' పత్రికకు ఇవ్వకుండా ప్రభుత్వం ఆపివేసింది. అయినా లక్ష్మీనర్సు వెనకంజ వేయలేదు.

పత్రికలో విమర్శలతో ఆగకుండా చెన్నపట్నంలో ఒక పురజనుల మహాసభను ఏర్పాటు చేశాడు. 1845లో ఏప్రిల్ 9వ తేదీన ఇది జరిగింది. 'ప్రజల ధర్మశాస్త్రానికి, సాంఘికాచారాలకు విరుద్ధంగా శాసనాలు చేయడానికి తమ అసమ్మతి'ని తెలుపుతూ ఆ సభలో ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. ఒక మహజర్‌ను – అంటే పిటిషన్‌ను రాసి ఇంగ్లండ్‌కు పంపించారు. కలకత్తాలో ఉన్న గవర్నర్ జనరల్‌కు కూడా పంపారు. కలకత్తా ప్రభుత్వం మద్రాసు గవర్నర్‌తో సంప్రదింపులు జరిపి, ఇటువంటి శాసనం చేయబోవడంలేదని హామీ ఇచ్చింది. ఈ విధంగా లక్ష్మీనర్సు నడుపుతున్న స్వదేశీ సంఘానికి ప్రథమ విజయం లభించింది.

మళ్లీ 1846లో పచ్చయప్ప పాఠశాల భవనంలో పురజనుల బహిరంగ సభ ఒకటి ఏర్పాటు చేశారు. దీనిని 'మహానాడు' అన్నారు. అంటే అన్ని వర్గాల ప్రజలు హాజరైన సభ, కేవలం క్రైస్తవ మత ప్రచారంవల్లనేకాక పరిపాలనలో ఇతర లోపాల కారణంగా ప్రజలు పడుతున్న కష్టాలను కూడా తూర్పు ఇండియా కంపెనీ డైరెక్టర్లకు తెలుపుతూ ఒక మహాజరును పంపాలని ఆ సభ తీర్మానించింది. ఇది మద్రాసులో జరిగిన మొట్టమొదటి రాజకీయ సభ అని పేర్కొనవచ్చు. రాష్ట్రమంతటా ఆధునిక విద్యావిధానంలో చదువు నేర్పే పాఠశాలలు నెలకొల్పాలని, ఆ విధంగా భారతీయులకు ప్రభుత్వోద్యోగాలు చేసే అర్హత కలిగించమనీ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ఈ మహాజనసభ చాలా సక్రమ రీతిలో ప్రశాంతంగా జరిగింది. పన్నెండువేల మంది ఈ మహాజరుపై సంతకాలు చేశారు. దీనివలన జరిగిన ఫలితం ఏమిటంటే సర్కారు పాఠశాలల్లో బైబిలును పాఠ్యగ్రంథంగా చదివించడం నిలిపివేశారు.

మద్రాసు నేటివ్ అసోసియేషన్ వారు పంపిన మరొక మహజరు ఉప్పు పన్ను గురించి. 1852లో ఈ మహాజరును ఇంగ్లాండ్‌లో ఉన్న కామన్స్ సభకు పంపారు. బ్రిటిష్ పార్లమెంట్‌కు రెండు సభలు ఉంటాయి. ఒకటి కామన్సు సభ, రెండవది లార్డ్స్ సభ. అంటే ఉప్పు కథ 1850లకే ఆరంభమైందన్నమాట. మహాత్మాగాంధీ 1930లో 'దండి' సముద్ర తీరాన ఉప్పు సత్యాగ్రహం చేసి బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించాడని మనకు తెలుసు.

వెనుకకు ఒకసారి వెళ్లి చూస్తే ఉప్పు గురించిన కథ ఏమిటో మనకు అర్థమవుతుంది. ఉప్పు ఉత్పత్తిని, అమ్మకాన్నీ తమ అధీనంలోకి తెచ్చుకోవాలని తూర్పు ఇండియా కంపెనీ 1806లోనే ఒక ప్రభుత్వ శాఖను ఏర్పరచింది. దీని ఫలితంగా ఉప్పు ధర రెండింతలు పెరిగింది. గరిశె అంటే సుమారు 144 కిలోగ్రాములు. ఒక గరిశె ఉప్పు ధర అంతకు మునుపు 70 రూపాయలు ఉండేది. ఇప్పుడు కంపెనీ జోక్యంతో అది 180 రూపాయలు అయింది. మొత్తానికి ఉప్పు వ్యాపారాన్ని వశపరచుకుని లాభాలు గడించాలని ప్రభుత్వం చూసింది. గంజిలో ఉప్పు వేసుకొని తాగే పేదవారిని ఉప్పు ధర అమితంగా బాధించింది. అందుకని కొందరు ఏదోరకంగా స్వంతంగా ఉప్పు తయారు చేసుకోవడం మొదలుపెట్టారు. దానితో ప్రభుత్వం తప్ప మరెవరూ ఉప్పు ఉత్పత్తి చేయకూడదు అనే నిషేధం అమలు చేశారు. పేదవారు రహస్యంగా ఉప్పు తయారు చేసుకుంటే వారిని కలెక్టర్లు, తహసీల్దార్లు కొట్టి జుల్మానాలు వసూలు చేసేవారు. ఈ పరిస్థితులు చూసి చలించిపోయిన స్వదేశీ సంఘంవారు లక్ష్మీనర్సు నాయకత్వంతో లండన్ కామన్స్ సభకు ఒక పిటిషన్ పెట్టుకున్నారు. అందులో భారతదేశ ప్రజల, ముఖ్యంగా దక్షిణ భారత ప్రజల కష్టాలను వివరంగా పొందుపరిచారు.

'రాకపోకలకు సరైన రోడ్లు లేవు. వంతెనలు లేవు. ప్రజలకు సరైన విద్య లేదు. అధిక పన్నుల భారం ప్రజలను పీడిస్తున్నది. అందుచేత పార్లమెంటు ఈ విషయాలను చర్చించాలి, ప్రజల మతాచారాలలో ప్రభుత్వం జోక్యం చేసుకోకూడదు' అని రాస్తూ ఒక విచారణ సంఘం ఈ దేశానికి వచ్చి విషయాలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని కూడా ఆ పిటిషన్‌లో అభ్యర్థించారు.

అప్పుడు భారతదేశానికి డేన్ బీ సేమురు అనే బ్రిటిష్ పార్లమెంట్ సభ్యుడిని విషయ పరిశీలనకు పంపించారు. అతడికి లక్ష్మీనర్సు ఆతిథ్యం ఇచ్చాడు. ఇద్దరూ కలిసి కడలూరు, కుంభకోణం, కోయంబత్తూరు మొదలైన ప్రాంతాలు దర్శించి, అక్కడి రైతుల గోడును విన్నారు. శిస్తులు కట్టలేని రైతులను చిత్రహింసలు పెట్టడం డేన్ బీ సేమూర్ ప్రత్యక్షంగా చూశాడు. అతను చూసినవన్నీ ఒక ప్రత్యక్ష సాక్షిగా బ్రిటిష్ పార్లమెంట్‌లో సేమరు వివరించి చెప్పాడు. కామన్సు సభలోను, లార్డ్స్ సభలోను కూడా వీటిని సభ్యులు తీవ్రంగా ఖండించారు. దీనితో లక్ష్మీనర్సు మీద అధికారులు, మిషనరీలు పగబట్టారు. పోలీసులు వేధించి తిప్పలు పెట్టారు.

అతడి కార్యక్రమాలకు ఆటంకాలు కలిగించారు. ఈ ప్రజాహిత కార్యాలకు, 'క్రెసెంటు' పత్రిక నిర్వహణకు, మహజరులు తయారుచేసి లండను పంపడాలను మొదలైన అన్నింటికీ లక్ష్మీనర్సు తన సొంత ధనమే ఖర్చు పెట్టేవాడు. సొంత ఖర్చుతో ఒక బాలికల పాఠశాలను కూడా నడిపించాడు. అతడికి ధన వ్యయం చాలా జరిగింది. వ్యాపారం మీద దృష్టి సన్నగిల్లడంవల్ల అక్కడా నష్టాలు వచ్చాయి. ఎన్ని చిక్కులు వచ్చినా లక్ష్మీనర్సు తన కార్యదీక్షను సడలించుకోలేదు. 1855లో కూడా 14 వేలమంది సంతకాలతో కంపెనీ పాలనను విమర్శిస్తూ మళ్ళీ ఒక మహజరును పార్లమెంట్‌కు పంపారు. అంతేకాకుండా ఇంగ్లాండ్‌లోని పెద్దలకు ఈ విషయాలను తెలుపుతూ లక్ష్మీనర్సు స్వయంగా అనేక ఉత్తరాలు రాశాడు.

1857లో విప్లవం జరిగాక – దీనిని ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం అనీ అన్నారు – సిపాయి విప్లవాన్ని అనీ అన్నారు. భారతదేశం కంపెనీ పాలన నుండి విముక్తి చెందింది. ఇప్పుడు బ్రిటీషు రాచరికానికి దేశం హస్తగతమైంది. కొత్త పరిపాలకులు లక్ష్మీనర్సు నిస్వార్థ సేవలు గుర్తించి, అతడికి లేజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యత్వం ఇచ్చారు.

1868లో దివంగతులయ్యేవరకు లక్ష్మీనర్సు అవిశ్రాంతంగా ప్రజాసేవ చేశాడు. మన దేశ చరిత్రలో చెరిగిపోని అక్షరాలతో రాసుకోవలసిన పేరు గాజుల లక్ష్మీనర్సు శెట్టిది.

సరోజినీ ప్రేమ్‌చంద్
హైదరాబాద్. ఫోన్: 040-27507732, 97057 74520.

## చిత్రకళకు చిరునామా

కీర్తిశేషులు శ్రీ ఆలపాటి రవీంద్రనాథ్ గారు మా రేపల్లె తాలూకా, గోవాడ గ్రామం వాస్తవ్యులు. ఊరు వదలి తెనాలి బస్తీలో ఉంటూ సాహిత్యం పై వారికున్న అమితమైన మక్కువ వల్ల ప్రచురణ మాధ్యమంలో చాలా సేవలందించారు.

చాలామంది సాహితీవేత్తలను పోషించారు, సహాయ సహకారాలు అందించారని వేరే చెప్పనక్కరలేదు. రావూరి భరద్వాజ గారి (జ్ఞానపీఠ బహుమతి గ్రహీత) తొలినాటి కావ్య కృషికి సహకరించి, సాయం చేసి, ప్రోత్సహించిన ఘనత వారిది.

కళా సాహిత్యాలను *మిసిమి* మాస పత్రిక ద్వారా ఒక జ్యోతిలా వెలిగించి అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలి, పాఠకులకు ఉత్తమ సాహిత్యాన్ని పరిచయం చేసిన ఘనత కూడా రవీంద్రనాథ్‌గారిదే. అనేక చిత్రాలు సేకరించి, చక్కని ముఖచిత్రాలుగా అలంకరించి చిత్రానికి పెద్ద పీటవేసి చిత్రకారులను పరోక్షంగా ప్రోత్సహించిన శ్రీ రవీంద్రనాథ్ గారి కళాభిరుచి ప్రశంసించదగినది. మొత్తం హైదరాబాద్‌లో ఉన్న ఉత్తమ స్థాయి ఆర్ట్ ప్రింటర్స్‌లో పేరెన్నికగన్న సంస్థ 'కళాజ్యోతి' వీరు ఏర్పాటు చేసినదే.

ఇక ముద్రణా యంత్రాంగంలో చక్కని రూపు రేఖలతో కళా పూర్ణత్వం సమకూర్చిన వారి కళాజ్యోతి ముద్రణాలయం సర్వ కళాభిమానులకు శోభాయమానం.

గత ముప్పైసంత్సరాలుగా *మిసిమి* మాస పత్రికను, ఉత్తమ స్థాయి సాహితీ పత్రికగా నడిపారు ఆలపాటి రవీంద్రనాథ్ గారు. వారి తరువాత ఈ కళాప్రక్రియను కొనసాగించిన వారి కుమారుడు బాపన్న గారు ఆ తరువాత పరంపర కూడా చక్కని అవగాహనతో వారి కృషి సుసంపన్నంగా కొనసాగాలని భావిస్తూ...
మా ఊరి మనిషి

మన మనిషి

మహా మనిషి అయిన ఆలపాటి రవీంద్రనాథ్ గారు జన్మించి నూరు వసంతాలు గడచిన సందర్భంగా నివాళులర్పిస్తూ .........

రాయన గిరిధర గౌడ్, చిత్రకారుడు. గరువుపాలెం. ఫోన్: 965 213 9668.

## ప్రవాస సాహిత్యం – 14

# నిడదవోలు మాలతి



నిడదవోలు మాలతి

– డా. రమేష్ ప్రసాద్ రావెళ్ల

కాల్పనిక సాహిత్యంలో నవల, కథానిక ప్రక్రియలు అక్కచెల్లెళ్ళులాంటివి. లేక ఒకవిధంగా అన్నాతమ్ముళ్ళని చెప్పాలి. ఇండియాలో మొదటి నవల బంకించంద్ర ఛటర్జీ వ్రాసిన Rajmohan s Wife (1864) ఇంగ్లీషు నవల అయితే, మొదటి కథానిక బంకించంద్ర తమ్ముడు పూర్ణచంద్ర ఛటర్జీ వ్రాసిన *మధుమతి* (1870) బెంగాలీ కథ.

అమెరికాలో నెథానియల్ హాతార్న్, మార్క్ ట్వేన్, ఎడ్గార్ ఆలన్ పో, ఫ్రాన్సులో మొపాసా, ఇంగ్లండులో చార్లెస్ డికెన్స్, థామస్ హార్డీ, ఆర్థర్ కోనన్ డొయల్ పంతొమ్మిదవ శతాబ్దం రెండో అర్ధభాగంలో కథానికని విస్తరింప చేసారు. ఆ శతాబ్దంలో అధిగమించిన వారు రష్యన్ రచయితలు గోగోల్, టాల్ స్టాయ్, దాస్టవస్కీ, చెకోవ్. వీరందరూ కథాప్రక్రియకు రూపం కల్పించి, శిల్పం చెక్కినారు, ప్రపంచస్థాయి ప్రామాణికతను ఏర్పరచినారు.

భండారు అచ్చమాంబ గారు వ్రాసిన *ధనత్రయోదశి* (1902) మొదటి తెలుగు కథ. కాని మొదటి కథగా పేరు తెచ్చుకొన్న కథ గురజాడ అప్పారావు గారి *దిద్దుబాటు* (1910). అప్పటినుండి తెలుగులో వేలకొద్దీ కథలు వచ్చాయి. వాటిలో ప్రపంచస్థాయి కథలు నూటివరకు ఉండవచ్చు. కాని సరిగ్గా బేరీజు వేయాలంటే అవి ఇతర భాషల్లోకి వెళ్ళాలి. పరభాషా పాఠకులు, సాహిత్య విమర్శకులు మెచ్చుకోవాలి. భారత దేశ భాషల్లోకి అనువాదమే కాకుండా, ఇంగ్లీషు అనువాదాలు అవసరం. అప్పుడే తెలుగు కథలు ప్రపంచవ్యాప్తంగా పాఠకులకు చేరతాయి.

తెలుగు కథలను ఇంగ్లీషులోకి అనువదించటంలో అగ్రగణ్యులు నిడదవోలు మాలతి గారు. వారు అనువదించిన కథలనన్నిటిని తమ వెబ్‌సైట్ తూలిక (thulika.net)లో ప్రచురించారు. వాటిలో ఏబది కథలను మూడు సంకలనాలుగా ప్రింటు రూపంలో తీసుకు వచ్చారు. From the Front Porch (2009) సాహిత్య అకాడెమీ ప్రచురణ. ఇందులో మాలతి గారు అనువాదం చేసిన పదునెనిమిది కథలున్నాయి. ఇందులో విశ్వనాథ సత్యనారాయణ గారి కథ The Soul Wills It (జీవుడి ఇష్టం), కాళీపట్నం రామారావుగారి The Rite of Sacrifice (యజ్ఞం), చాగంటి సోమయాజులు గారి Choices (ఎంపు), వాసా ప్రభావతి గారి Mogili, The Potter s Daughter (మొగిలి), పి. శ్రీదేవి గారి The Wake up Song They Sang (వాళ్ళు పాడిన భూపాల రాగం), యద్దనపూడి సులోచనారాణి గారి Free to Fly Away (విప్పుకున్న రెక్కలు), రాచకొండ విశ్వనాథ శాస్త్రి గారి Marigolds (పువ్వులు), మునిపల్లె రాజు గారి Royal Fighter (జెట్టీ)తోపాటు ఇంకాకొన్ని కథలు ఉన్నాయి. పాశ్చాత్య దేశాల్లో ఆర్. కె. నారాయణ్, భారతీ ముఖర్జీ, అరుంధతీ రాయ్, ఝుంపా లాహిరి వంటి ఇండియన్ రచయతలు ప్రాముఖ్యత వహించినప్పటికీ, తెలుగు రచయత లెవ్వరూ ఆ స్థాయికి చేరుకోలేదని, దానికి ఒక కారణం తెలుగు రచనలు ఇంగ్లీషు పాఠకులకు అందుబాటులో లేవని మాలతి గారు పుస్తకపరిచయంలో వ్రాశారు. మాలతి గారు నలుబది ఏళ్ల పైగా చేస్తున్న అనువాద కృషి ఆ లోటును కొంతవరకైనా తీర్చుతుంది. ఇతర రచయతలు కూడా ఈ అనువాదరంగంలో ఈమధ్య ఎంతో కృషి చేస్తున్నారు. వారి అనువాదాల గురించి కూడా ఈ వ్యాసంలో ప్రస్తావిస్తాను.

**A Spectrum of My People (2006)** సంపుటిలో మాలతి గారు అనువాదం చేసిన పదునెనిమిది కథలున్నాయి. కాళీపట్నం రామారావు (ఆర్తి), ముళ్ళపూడి వెంకటరమణ

(జనతా ఎక్స్ ప్రెస్), అబ్బూరి చాయాదేవి (విమర్శకులు), బీనాదేవి (రిబ్బను ముక్క), నాయని కృష్ణకుమారి (చీమలు), సి. ఆనందారామం (అందం), కవన శర్మ (మృత్యుంజయుడు), మధురాంతకం రాజారాం (జీవన ప్రహసనం), రాచకొండ విశ్వనాథ శాస్త్రి (మాయ), తెన్నేటి హేమలత (గాలి పడగలు, నీటి బుడగలు) ఈ సంపుటిలో కొన్ని కథలు. 1950 తరువాత అర్ధశతాబ్దంలో వెలువడిన ఈ కథలు మధ్యతరగతి జీవితాలలోని ఒడిదొడుకులను, సంసారపక్ష సమస్యలను, ఆనాటి సామాజిక వ్యవస్థలను ప్రతిబింబిస్తాయి.

**Short Stories from Andhra Pradesh** (2009) మాలతి గారి మూడో అనువాద కథల సంకలనం. ఈ మూడు సంకలనాలలోని కథలతో పాటు మాలతి గారు మొత్తం నూట నలభై పైగా తెలుగు కథలు అనువాదం చేశారు. ఈ కథలన్నీ మాలతి గారి thulika.net వెబ్‌సైట్‌లో చూడవచ్చును.

అనువాదాలు మాత్రమేకాక, మాలతి గారు వందకు పైగా కథలు వ్రాశారు. ఇందులో ఏబది కథలు కాళీపట్నం రామారావు గారు స్థాపించిన కథానిలయంలో (kathanilayam.com/writer/1690)లో లభ్యం అవుతాయి. మిగతావి ఆరు కథాసంకలనాలుగా తెలుగు తూలిక వెబ్ సైట్ (tethulika.wordpress.com)లోనూ, ఆ కథల స్వకీయానువాదాలు తూలిక వెబ్‌సైట్ (thulika.net)లో చూడవచ్చును. 'నిజానికీ ఫెమినిజానికీ మధ్య (2005)' అనే కథాసంకలనం 44 కథలతో పుస్తకరూపంగా వచ్చింది. స్వకీయానువాదాలతో All I wanted to Read and other stories (2008) సంకలనం అమెరికాలో ప్రచురింపబడినది.

కథానిలయంలో ఉన్న మాలతి గారి మొదటి కథ 'అర్థం కాని విషయం' ఆంధ్ర సచిత్ర వార పత్రికలో వచ్చింది. రవి, విష్ణు స్కూల్‌లో ఫస్ట్‌ఫారం నుండి గాఢమిత్రులు. క్లాసులో ఫస్ట్, సెకండ్ వచ్చేవారు. హైయర్ ఫారంలోకి వచ్చేటప్పటికి, విష్ణు నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ రావటంతో, వాళ్ళిద్దరి స్నేహం విడిపోవలసివస్తుంది. నేను మీ ఇంట్లో ఉండి, ఇక్కడే చదువుకోనా, మనం ఎప్పటిలాగే కలసి ఉండొచ్చు, అంటాడు విష్ణు. తన పేద ఇంట్లో విష్ణు ఉండగలడా, అనుకొంటాడు రవి. "శలవుల్లో మళ్ళీ ఈ ఊరోస్తావుగా." అంటాడు రవి. మర్నాడు విష్ణు కుటుంబంతో వెళ్ళిపోతాడు. ఆ తరువాత రవి ఇంకో స్నేహితుడు శ్రీధర్‌తో ఈ వైనం చెప్పినప్పుడు, విష్ణు వేసిన ప్రశ్నతో రవిని పరీక్షించుచున్నాడా, లేక రవియే విష్ణుని పరీక్షించుచున్నాడా అనే విషయం శ్రీధర్‌కి అర్థం కాదు.

'ఋణానుబంధ రూపేణ...' తెలుగు స్వతంత్రలో వచ్చిన కథ. స్కూల్లో చదువుకొనే కథకురాలికి బట్టలు కుట్టటం అంటే ఇష్టం. వాళ్ళ అమ్మకు తెలిసిన శంకరం ఒక సెకండ్ హాండ్ కుట్టుమిషన్ తీసుకు వస్తాడు. దానికి కొన్ని పార్టులు లేవు. రిపేర్ షాపులో ఇస్తే, వారాలకు తరబడి, అది ఇంటికి రాదు. వచ్చాక, వాళ్ల అక్క కటింగు చేస్తే, కథకురాలు అమ్మాయి రుమాళ్ళులాంటివి కుడుతుంది. చంద్రం మామయ్య వచ్చి, ఫలానావాళ్ళ అమ్మాయి పరీక్షలకి వెళ్తుందట, కుట్టుమిషన్ కావాలట, ఇస్తారా అని అడుగుతాడు. కుట్టుమిషన్ తీసుకు వెళ్తాడు. ఎనిమిది నెలలైనా మిషన్ తిరిగి రాలేదు. శంకరం వచ్చి, మిషన్ ఏదీ, ఇచ్చినవాళ్ళు అడుగుతున్నారు అంటాడు. అదేంటి, ప్రెజెంట్‌గా ఇచ్చారు గదా, అని అడిగితే, శంకరం అది వాళ్ళు రిపేర్ చేయించమని ఇస్తే, అది మీకు ఇచ్చాను అంటాడు. తరువాత ఎప్పుడో చంద్రం మామయ్య వస్తే, అమ్మాయి అడుగుతుంది. అది మర్చేపోయాను, అంటాడు. చంద్రం దగ్గర మిషన్ తీసుకొన్న ఆయన – పరీక్షలమ్మాయి తండ్రి – దివానుగారి జవాను చనిపోయాడట. మిషన్ వెనక్కు రానట్లే. వచ్చినా శంకరం తీసుకువెళ్తాడు గదా. మాలతిగారు తెలుగువారి ఇళ్ళల్లో జరిగే సగం సీరియస్, సగం హాస్యం సన్నివేశాలను సున్నితంగా చెప్పారు.

**The Small Wheel** చిరుచక్రం పేరిట ఈ కథ *ఆంధ్రజ్యోతి* 1971 ఉగాది కథల పోటీలో ప్రథమ బహుమతి గెల్చుకొన్నది. స్కూలు తనిఖీ చేయటానికి డీఈవో గారు వస్తున్నారు. స్కూలు ప్యూన్ వెంకన్న అర్ధరాత్రికే తయారయ్యి, ఇస్త్రీ చొక్కా వేసుకొని బయల్దేరతాడు. పోయన సంవత్సరం వచ్చిన ఇనస్పెక్టరు గారు తను స్కూలు చుట్టూ వేసిన పూలతోటను చూసి మెచ్చుకొన్నారు. అదంతా వెంకన్న స్వహస్తాలతో పెంచిన తోట. వెంకన్న మురిసిపోయాడు. తామరాకులో పెట్టి, పూలు ఇచ్చాడు ఇనస్పెక్టరు గారి భార్యకి. ఆమెకు అవి ఎంతో నచ్చాయి. వారం రోజుల నుండి హెడ్మాస్టరు శర్మగారు హడావుడి పడుతున్నారు. దుమ్ములు దులిపించి, స్కూలు భవనం అంతా కడిగించారు. గుర్రం బండిలో రైలు స్టేషనుకి వెళ్ళి, డీఈవోగారిని రిసీవ్ చేసుకొన్నారు. డీఈవో, వారి కూతురు, క్లర్కు, జవాను దిగారు. స్కూలులో బస ఏర్పాటు చేశారు. డీఈవో గారికి కాఫీ అందించటం, డిన్నరు ఏర్పాటు చేయటం, సిగరెట్లు పట్టుకురావటం వెంకన్న పని. డీఈవో గారి అమ్మాయి తోట

చూసి చాలా సరదా పడింది. పూలు కోసుకొన్నది. డీఈవో గారికి కూరగాయలు కోసి బుట్టలో పెట్టి ఇచ్చాడు వెంకన్న. వెంకన్న మురిసిపోయాడు. శర్మగారు మాటిమాటికి వెంకన్న మీద చిరాకు పడుతున్నారు, ప్రతిదీ ఆలస్యం అవుతుందని. వెంకన్న డీఈవో గారి రూములో యాష్ ట్రే పెట్టలేదని, శర్మగారు అయిదు రూపాయిల ఫైను వేశారు వెంకన్నకి. మరునాడు డీఈవో గారి తనిఖీ అంతా బాగా జరిగింది. డీఈవో గారు వెళ్ళిపోయాక, వెంకన్న ఇంటికి వెళ్లి, రెండురోజుల తరువాత, సంతసంగా భోంచేశాడు. డీఈవో గారి అమ్మాయికి తన తోట బాగా నచ్చినదనీ, పువ్వులు లౌలీ అన్నదనీ, కూరగాయలు కోసి బుట్టలో పెట్టి ఇచ్చానని భార్యతో అన్నాడు వెంకన్న ఆవకాయముక్క కొరుక్కొంటూ. హెడ్మాస్టరు గారు తనకి అయిదు రూపాయిల ఫైను వేసిన సంగతి వెంకన్న భార్యకు చెప్పలేదు

**All I Wanted was to Read** తృష్ణ కథ 1970లో *ఆంధ్రజ్యోతి* నూతన సంవత్సర కథల పోటీలో ప్రత్యేక బహుమతి గెలుచుకొన్నది. బాలయ్య ఒక లైబ్రరీలో అటెండరు. నాలుగో తరగతి ఉద్యోగి కావటంతో పుస్తకాలు తీసుకువెళ్ళే అర్హత లేదు. కాని అతనికి చిన్నప్పటి నుండి పుస్తకాలు చదవటం అలవాటు. అతను పుస్తకాలు దొంగిలించుతున్నాడని ఆరోపణలు వస్తే, లైబ్రరీ అధికారిణి ముందు నమ్మదు. కాని ఉద్యోగం నుండి తీసివేయాల్సి వస్తుంది. అధికారిణికి ఏళ్ల తరువాత మద్రాసు మూర్ మార్కెట్‌లో బాలయ్య కనపడతాడు. ఇప్పుడు అక్కడ ఒక సెకండ్‌హాండ్ పుస్తకాల కొట్టు నడుపుతున్నాడు. చిన్నప్పటి నుండి తనకు పుస్తకాలు చదవటం అలవాటని చెప్తాడు. లైబ్రరీలో పుస్తకాలు తను దొంగిలించలేదని, షెల్ఫు నుండి తీసి, బయట చదివి, మళ్ళీ వెనక్కు పెట్టేవాడినని చెప్పాడు. మాలతి గారు వ్రాసిన తీరు పాఠకునికి ఉత్కంఠజనితంగా ఉంటుంది. మాలతి గారి కథలు జీవన స్రవంతి కథలు. నిజ జీవితంలో జరిగే సంఘటనలను అందమైన చట్రంలో బిగించి, చూపిస్తారు. తెలుగు కథల్లో ప్రతిదానిని చెకోవ్ కథ అనటం పరిపాటి అయిపోయింది గాని మాలతి గారి కథలు నిజమైన చెకోవియన్ శైలి కథలు. ఈ వ్యాసంలో క్రింద చెకోవ్, మొపాసా, ఓ హెన్రీ కథల శైలి గురించి వ్రాస్తాను. మాలతి గారు తన కథల ప్రేరేపణ గురించి ఇలా వ్రాశారు. "కథలు రాయడానికి పూనుకున్నప్పుడు నేను ప్రధానంగా ఆలోచించేవి వ్యక్తి విలువలు. కథల్లోనూ నిత్యజీవితంలోనూ మనుషులు ఏ ఒక్క పరిస్థితిలో గానీ ఎలా ప్రవర్తిస్తారు, ఎందుకు అలా ప్రవర్తిస్తారు, ఏం మాటాడతారు, ఎందుకు అలా మాటాడతారువంటివే నేను ఎక్కువగా ఆలోచిస్తాను. రెండోది జాతి విలువలు. ఇది నాకు అమెరికా వచ్చాక స్ఫురించింది. నేను ఇక్కడికి వచ్చేకే మన దేశం గురించి అమెరికాలో ఉన్న అపోహలూ, అమెరికనుల గురించి మనకున్న అపోహలూ అర్థమయేయి. ఆ తరవాత మౌలికమయిన మానవీయ విలువల్లో సామ్యాలు కూడా కనిపించాయి."

మాలతి గారు సాహిత్య వ్యాసాలు కూడా వ్రాశారు. ఆ సాహిత్య వ్యాసాలను వ్యాసమాలతి పేరుతో నాలుగు సంపుటాలుగా ప్రచురించారు. ఇందులో సుదీర్ఘమయిన నవలా సమీక్షలు (జి.వి. కృష్ణారావు గారి కీలుబొమ్మలు నవల, బుచ్చిబాబు గారి చివరకుమిగిలేది, బలివాడ కాంతారావు గారి దగా పడిన తమ్ముడు, ఉదాహరణకు), కథాసమీక్షలు (మధురాంతకం రాజారాం, మునిపల్లె రాజు, భండారు అచ్చమాంబ, ఆచంట శారదాదేవి, భానుమతి, శారద/ఎస్. నటరాజన్) సాహిత్య వ్యాసకర్తలపై వ్యాసాలు (నోరి నరసింహ శాస్త్రి, కె.కె. రంగనాథాచార్యులు), కవులూ, రచయితలూ (కుమారి మొల్ల, వేములవాడ భీమకవి, నిడదవోలు వెంకట రావు, మల్లాది రామకృష్ణశాస్త్రి, రాచకొండ విశ్వనాథ శాస్త్రి),ఇంటర్వ్యూలు (శివరాజు సుబ్బలక్ష్మి, ద్వివేదుల విశాలాక్షి), ఇవీ అవీ (కథకులకీ పాఠకులకీ మధ్యగల అవినాభావ సంబంధం, కథల వెనక కథలు, రచయితలు పాత్రల్ని ఎందుకు ఎందుకు చంపుతారు?), ఇలాంటివి ఎన్నో వ్యాసాలిక్కడ ఉన్నాయి. వ్యాస విస్తార పరిమితుల మూలంగా క్లుప్తంగా ఇవి సూచిస్తున్నాను. ఆసక్తి ఉన్న పాఠకులు తెలుగు తూలిక వెబ్‌సైట్ (tethulika.wordpress.com)లో ఈ వ్యాసాలన్నీ చదవవచ్చును. నిడదవోలు మాలతి ఆంధ్ర యూనివర్సిటీలో ఇంగ్లీషు సాహిత్యంలో ఎం.ఏ. చదివారు. లైబ్రరీ సైన్సులో కూడా ఎం.ఏ. చేశారు. తిరుపతిలో కొంతకాలం లైబ్రేరియన్‌గా పనిచేసారు. తరువాత అమెరికాలో స్థిరపడ్డారు. చాలా ఏళ్ళు యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్‌లో తెలుగు భాష బోధించారు. నలుబది ఏళ్లకుపైగా రచనా వ్యాసంగంలో ఉన్నారు. 2001 నుండి thulika.net వెబ్‌సైట్ నిర్వహిస్తున్నారు. తెలుగు రచనల కోసం విడిగా తెలుగు తూలిక వెబ్‌సైట్ tethulika.wordpress.comని ఏర్పరిచారు. అనువాదాలతో పాటు కథలు, వ్యాసాలు వ్రాశారు. కవితామాలతి పేరుతో వారు వ్రాసిన కవితలు సంపుటిగా తమ వెబ్‌సైట్‌లో ప్రచురించారు. 'ఎన్నెమ్మ కతలు'

పేరుతో ఒక కాలక్షేపం కాలమ్ వ్రాస్తుంటారు. ఎన్నెమ్మ తమ పేరు ప్రథమాక్షరాలు N.M.లకు తెలుగీకరణ.పూరం లత గారు *ఆంధ్రప్రభ* లో వ్రాసిన 'ఊహాగానం', పురాణం సుబ్రహ్మణ్య శర్మ గారు పురాణం సీత కలం పేరుతో *ఆంధ్రజ్యోతి* లో వ్రాసిన 'ఇల్లాలి ముచ్చట్లు' ఈ కాలమ్‌కి స్ఫూర్తి ఇచ్చాయని మాలతి గారు వ్రాశారు. ఇప్పటికి నూటముప్పదిపైగా ఈ గల్పికలను వ్రాశారు.

మాలతి గారి తరువాత ఆంధ్రాంగ్లానువాదకర్తగా ఎనలేని కృషి చేసిన రచయిత రంగారావు గారు. That Man on the Road (2006) పేరిట ఇంగ్లీషులో తెలుగు తర్జుమా కథల సంపుటం ప్రచురించారు. రంగారావు గారు ఈ సంపుటానికి సంపాదకుడు. ఇందులో ఉన్న పదునెనిమిది కథల్లో పదునాలుగు రంగారావు గారే అనువాదం చేశారు. బోయ జంగయ్య (దొంగ), కొలకులూరి ఇనాక్ (Cattle Thief), వినోదిని (మరియా), కందాళం కమలమ్మ (ఆడలేక మద్దెల మీద పడి కొట్టుకోవటమా?), కాళీపట్నం రామారావు (ఆదివారం), పి. సత్యవతి (What is my name?), సి. రామచంద్రరావు (నల్లతోలు), గురజాడ అప్పారావు (What is your name?), మధురాంతకం రాజారాం (That man on the road), రావి శాస్త్రి (మామిడి చెట్టు), మునిపల్లె రాజు (మహాబోధి ఛాయలో), తోలేటి జగన్మోహన రావు (By the grace of our Goddess of wealth) గార్ల కథలతో పాటు ఇంకొన్ని కథలున్నాయి. ఈ సంకలనాన్ని సమీక్షిస్తూ, ట్రిబ్యూన్ విమర్శకురాలు షాలిని రావత్ ఇలా వ్రాశారు, "ఈ సంపుటి తెలుగు భోజనంలాంటిది – తీపి – చేదు రుచులతో కూడి, కులం, అవినీతి, స్త్రీవాదం, సైన్సు కాల్పనికం, హాస్యం వంటి సామాజికాంశాలపై ఈ కథలు తెలుగువారి పద్ధతులని సూచిస్తాయి. కాని తెలుగు వచనాన్ని ఉన్నదున్నట్లుగా అనువాదం చేయటంతో ఇంగ్లీషు పాఠకులకు కష్టతరంగా ఉంటుంది. ఇంగ్లీషులోకి అనువాదం చేస్తున్నప్పుడు వాక్యనిర్మాణ పద్ధతులు ఆ భాషవయ్యుంటే చదువరులకు తేలిగ్గా ఉంటుంది." ఈ విషయం గురించే ఈ సంపుటి తుదిమాటలో రంగారావు గారు వ్రాశారు. అనువాదంలో తెలుగు నుడికారాన్ని పదిలపరచటానికి ప్రయత్నం చేశానన్నారు.

**Classic Telugu Short Stories** (1995) రంగారావు గారు సంపాదకత్వం వహించిన ఇంకో ఆంగ్లానువాద కథాసంపుటి. ఇందులో గురజాడ వారి Kamalini, బుచ్చిబాబు వ్రాసిన నన్ను గురించి కథ వ్రాయవూ?, కరుణకుమార గారి పోలయ్య, చలం వ్రాసిన వితంతువు, చాగంటి సోమయాజులు (చాసో) గారి ఏలూరెళ్ళాలివంటి క్లాసిక్ కథలున్నాయి. *ఇండియా టుడే* వారపత్రిక ఈ సంపుటి గురించి ఇలా వ్రాసింది. "తెలుగు నాటి పరిమళాలు, ఆ సామాజిక చిత్రాలు ఉట్టిపడే కథలున్న ఈ సంపుటి తెలుగు ప్రాంతం గురించి అట్టే తెలియని ఆంధ్రేతర పాఠకులకు మంచి పఠనయోగ్యము. భారతదేశపు హృదయానికి చేరువవుతుంది." అనువాదకర్త రంగారావు గారి పూర్తి పేరు వి. పాండురంగారావు. వీరు ఆంధ్ర యూనివర్సిటీలో ఎం.ఏ. ఇంగ్లీషు సాహిత్యం చదివారు. ఆర్.కె. నారాయణ్ సాహిత్యంపై పరిశోధన చేసి పిహెచ్.డి. పుచ్చుకొన్నారు. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన వెంకటేశ్వర కాలేజిలో ముప్పది ఏళ్లకు పైగా ప్రొఫెసరుగా పనిచేశారు. తరువాత శ్రీ సత్యసాయి యూనివర్సిటీలో ప్రొఫెసరుగా పనిచేశారు. కేంద్ర సాహిత్య అకాడెమీలో నివాస రచయితగా కూడా కృషి చేశారు.

**Gold Nuggets** (2004) కేంద్ర సాహిత్య అకాడెమీ ప్రచురణ. స్వాతంత్ర్యానంతరం వచ్చిన కథల్లో ముప్పదొకటి ఈ సంపుటిలో ఉన్నాయి. సంపాదకులు బిహెచ్. కృష్ణమూర్తి, సి. విజయశ్రీ. ఇందులో చాసో (ఎంపు), పాలగుమ్మి పద్మరాజు (పడవ ప్రయాణం), చలం (ఓ పువ్వు పూసింది), విశ్వనాథ సత్యనారాయణ (ముగ్గురు బిచ్చగాళ్ళు), బుచ్చిబాబు (కాగితం ముక్కలు గాజు పెంకులు), మునిపల్లె రాజు (బిచ్చగాళ్ళ జెండా), రావి శాస్త్రి (మోక్షం)వంటి ప్రామాణిక కథలు ఈ సంపుటిలో ఉన్నాయి. ఇంకా మధురాంతకం రాజారాం (విశ్వపతి), బాలగంగాధర తిలక్ (ఊరిచివరి ఇల్లు), బీనాదేవి (డబ్బు), కొలకలూరి ఇనాక్ (ఊరబావి), డి. కామేశ్వరి (కన్నీటికి విలువ ఎంత?), అబ్బూరి ఛాయాదేవి (ఆఖరికి అయిదు నక్షత్రాలు), తురగా జానకీరాణి (యాత్ర), వోల్గా (ఆర్తి), పెద్దిభొట్ల సుబ్బరామయ్య (నీళ్ళు) కథలున్నాయి. ఇవన్నీ నిజంగా బంగారు గుళికలు. అనువాదకర్తలు వేగుంట మోహనప్రసాద్, సి. విజయశ్రీ, ఎస్.ఎస్. ప్రభాకర రావు, ఎమ్. శ్రీధర్, అల్లాడి ఉమ, ఇంకా ఎందరో ఉన్నారు.

**Ayoni and other stories** (2001) కథాసంపుటికి సంపాదకులు, అనువాదకర్తలు అల్లాడి ఉమ, ఎమ్. శ్రీధర్. ఇందులో గురజాడ అప్పారావు (మటిల్డా), శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి (అరికాళ్ళ కింద మంటలు), చలం (ఆర్గుమెంటు), కనుపర్తి వరలక్ష్మమ్మ (ఒట్టు), కొడవటిగంటి కుటుంబరావు (చెడిపోయిన మనిషి), రావి శాస్త్రి (విలువలు),

శివరాజు సుబ్బులక్ష్మి (తెల్లవారింది), అబ్బూరి ఛాయాదేవి (బోన్సాయి బతుకులు), పి. సత్యవతి (తాయిలం), వోల్గా (అయోని), ఇంకా కొన్ని కథలతో మొత్తం పదునారు కథలున్నాయి. ఈ కథలు గర్భస్రావము, బలాత్కారము, కట్నాలు, స్త్రీస్వేచ్ఛ, స్త్రీలపై ఆధిపత్యం, వ్యభిచారము వంటి స్త్రీ సమస్యలపై కేంద్రీకరించినవి.

**Moisture Trapped in a Stone** (2017) కె.యన్. రావు గారు అనువదించిన ఇరువది ఎనిమిది కథల సంపుటి. ఈ సంకలనం పేరు మధురాంతకం రాజారాం గారు వ్రాసిన 'రాతిలో తేమ' కథకు తర్జుమా పేరు. ఆ కథతో బాటు, కళ్యాణ సుందరీ జగన్నాథ్ (అలరాస పుట్టిల్లు), కేతు విశ్వనాథ రెడ్డి (కూలిన బురుజు), వసుంధర (లెక్కల మాస్టారు), కాళీపట్నం రామారావు (నిర్వాకాలు), వాసిరెడ్డి సీతాదేవి (తమసోమా జ్యోతిర్గమయ), ద్వివేదుల విశాలాక్షి (మనస్వి), బి. గీతిక (వెన్నెల సోకని పున్నమి), మరిన్ని కథలు ఉన్నాయి. ఈ సంపుటానికి ముందుమాటలో ప్రసిద్ధ అనువాదకురాలు మినీ క్రిష్ణన్ ఇలా వ్రాశారు. "మనం ఈ రోజుల్లో ఇంగ్లీషు సాహిత్యం గురించి మాట్లాడాలంటే పలు దేశాల నుండి ఇంగ్లీషులోకి వచ్చిన సాహిత్యాల గురించి మాట్లాడాలి. నైజీరియన్ ఇంగ్లీషు, చైనీస్ ఇంగ్లీషు, ఈజిప్టియన్ ఇంగ్లీషు, ఇండియన్ ఇంగ్లీషు, ఇలా ఎన్నో. ఇండియన్ ఇంగ్లీషు భారతీయ భాషల నుండి బలం చేకూర్చుకొంటుంది. కొన్ని భారతీయ భాషలు ఇంగ్లీషుకంటే పురాతనమైనవి. ఈ పుస్తకం చదివితే తెలుగును చిన్నచూపుగా "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అనేబదులు ఇంగ్లీషునే "తెలుగు ఆఫ్ ది వెస్ట్" అనబోతారు."

**Perspectives** (2016) శ్రీనివాస్ రాయప్రోలు అనువదించిన కథానంపుటం. ఇందులో ఇరువది కథలున్నాయి. తిలక్, కొడవటి కుటుంబరావు, అబ్బూరి ఛాయాదేవి, చలం, తురగా జానకీరాణి, బోయ జంగయ్య, నెల్లూరు కేశవస్వామి, రావి శాస్త్రి, మునిపల్లె రాజు, ఇంకా ఇతర చయతల కథలున్నాయి. శ్రీనివాస్ రాయప్రోలు సుబ్బారావు గారి కుమారుడు. వృత్తిరీత్యా ఇంజినీరు అయినను, ప్రవృత్తి ఇంగ్లీషులో కవిత్వం వ్రాయటం. అందువల్ల ఈ కథలు అనువాదాలు అనిపించవు. ఆర్.ఎస్. క్రిష్ణమూర్తి, ఎన్.ఎస్. మూర్తి కలిసి మూడు అనువాద సంకలనాలు The Palette, The Easel, The Canvas పేర్లతో ప్రచురించారు. ఈ మూడిటిలో కలిపి ఏబది కథలకు పైగా ఉన్నవి.

http://www.dkagencies.com/doc/from/1023/to/21430/LCSH/Short%20stories,%20Telugu-Translations%20into%20English./LCSubjectHeading.html

పై లింకు దగ్గర నలుబది పైగా పుస్తకాల వివరాలు ఉన్నవి. ఇవన్నీ తెలుగు కథలకు ఇంగ్లీషు అనువాద సంకలనాలు. మచ్చుకి, అంపశయ్య నవీన్, కొలకలూరి ఇనాక్, పి. సత్యవతి, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, రాచకొండ విశ్వనాథ శాస్త్రి, విశ్వనాధ సత్యారాయణ, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, కాళీపట్నం రామారావు, బలివాడ కాంతారావు, వాసా ప్రభావతి, ఆర్. యస్. సుదర్శనం, మధురాంతరం రాజారాం, సలీమ్, కొడవటిగంటి కుటుంబ రావు. డి. కామేశ్వరి, వోల్గా, అబ్బూరి చాయాదేవి, కేతు విశ్వనాథరెడ్డి ఇంకా ఎన్నో... కొన్ని రచయత ప్రధానమైనవి (ఒక రచయత, ఎందరో అనువాదకర్తలు), కొన్ని అనువాదకర్త ప్రధానమయినవి (ఎందరో రచయతలు, ఒక అనువాద కర్త), మరికొన్నిసంపాదక ప్రధానమైనవి (ఎందరో రచయతలు, ఎందరో అనువాదకర్తలు, ఒకరో ఇద్దరో సంపాదకులు).

వల్లభనేని అశ్వినీకుమార్‌గారు వ్రాసిన కథల్లో కొన్ని చంద్రహాస్, తపస్వి ఆంగ్లానువాదం చేశారు. అమాహ కథలో కార్పొరేట్ ఉద్యోగి జెకె (JK) ఆఫీసు పనిమీద హాంగ్‌కాంగ్ వెళ్తాడు. హార్బర్ దగ్గర్లో ఉన్న హోటల్ పురామాలో దిగాడు. బిజినెస్ మీటింగులతోనూ, కాన్ఫరెన్స్‌లతోనూ రెండు రోజులు తీరిక లేకుండా గడిపాడు. మూడో రోజు నుండి సేద తేర్చుకోవచ్చుననుకొన్నాడు. హాంగ్‌కాంగ్ సిటీ ఇదివరకటిలాగే ఉన్నప్పటికీ, జనంలో తేడా వచ్చిందని భావించాడు జె.కె. ఇంకో ఆరునెలల్లో హాంగ్‌కాంగ్ చైనా ఆధ్వర్యంలోకి వెళ్ళిపోతుంది. ఆ అనిశ్చితస్థితి మూలంగా జనంలో కలవరం కానవస్తుందనుకొన్నాడు.

క్రితం సారి జె.కె ఈ సిటీకి వచ్చినప్పుడు తనకు గైడుగా లీ అనే యువతీని కంపెనీ వాళ్ళు ఏర్పాటు చేశారు. ఆ పూర్వ పరిచయంతో జెకె లీకి ఫోను చేశాడు. లీ ఆ సాయంకాలం వచ్చింది. బోటులో హార్బరు చూడటానికి వెళ్ళారు. తరువాత డిన్నరు ప్లాను చేసుకొన్నారుగానీ, జెకెకి వచ్చిన అస్వస్థత మూలంగా అది విరమించుకొన్నారు. "మీరు ఎక్కడ ఉంటారు?" లీని అడుగుతాడు జెకె. చెంగ్ చౌ దీవిలో తన తల్లితో ఉంటానని చెప్తుంది. ఆ దీవి చూడాలని ఉంది అంటాడు జెకె. చెంగ్ చౌ దీవి సిటీ నుండి ముప్పది మైళ్ళ దూరంలో ఉంటుంది. ట్రైనులో వెళ్తారు. లీ నివాసగృహం

చిన్న నిరాడంబరమైన కాబిన్ ఇల్లు. జెకె మంచం మీద కూర్చుంటాడు. కడుపు తిప్పటంతో వాంతి చేసుకొంటాడు. నిద్రపోతాడు. మరునాడు ప్రొద్దున్న లేస్తాడు. లీ మంచం ప్రక్కన కుర్చీలో నిద్రపోతున్నది. రాత్రంతా జెకెకి కోల్డ్ పాక్ పెడుతూ, అతని జ్వరాన్ని తగ్గించింది. మూడో రోజుకి పూర్తిగా కోలుకొంటాడు. లీ కి చైనాలో ఆరేళ్ళ క్రితం పెళ్లయింది. లీ భర్త ఆర్మీలో పనిచేస్తాడు. అతను, లీ, లీ తల్లి చైనా నుండి తప్పించుకొందామని ప్లాను వేస్తారు. లీ, లీ తల్లి బోటు ఎక్కుతారు కాని లీ భర్త బోటు ఎక్కలేకపోతాడు. అప్పుడు లీ గర్భవతి. హాంగ్‌కాంగ్‌లో లీకి కూతురు పుడుతుంది. ఆ పాపకి ఇప్పుడు అయిదేళ్ళు. జెకె ఆ పాపతో సైకిల్ మీద అక్కడి చిన్న రోడ్లమీద తిరుగుతాడు.

లీ, జెకె ఒకరోజు లాంటో దీవికి వెళ్తారు. అక్కడ ఉన్న పెద్ద బుద్ధ విగ్రహాన్ని చూస్తారు. అదేరోజు ఇంకొక చిన్న దీవిలో అమా రాక్‌ని చూస్తారు. అది కొండరాతిపై చెక్కిన ప్రతిమ. ఒక స్త్రీ తన పసిపాపను వీపు మీద వేసుకొని భర్తకోసం సముద్రంవైపు నిరీక్షించే ప్రతిమ. "వచ్చే జులై ముప్పయి నాటికి చైనీస్ ఆర్మీ హాంగ్‌కాంగ్ వచ్చేస్తుంది. నా అదృష్టం బావుంటే నా భర్త చంగ్ వా కూడా వస్తాడేమో." అంటుంది లీ.

ఈ కథలో తారతమ్యాలున్న కొన్ని భావనలు అంతర్గతంగా ఉన్నాయి. సిమెంట్, స్టీల్, గ్లాస్‌తో నిర్మింపబడిన నిలువాటి బిల్డింగులతో నిండిన హాంగ్‌కాంగ్ మనిషి నిర్మించిన వికృతి. ఆ పట్టణం దగ్గరలోనే ప్రశాంతమయిన చిన్నచిన్న అరణ్య దీవులు. ఆ శాంతియుత అటవీ ప్రదేశంలో బుద్ధుని విగ్రహం ఉండటం ఒక విశేషం. ధనవంతుల, యూరోపియన్ల పిల్లలను పెంచి, శుశ్రూష చేసే ఆసియా స్త్రీలకు అమా (ఆయా) ప్రతీక. జెకె జ్వరంతో బాధ పడుతున్నప్పుడు లీ అమాలాగానే అతనికి సేవలందించి బాగుపరుస్తుంది. ఆరు నెలల్లో చైనీస్ ఆర్మీ రాబోతున్నది. ఆ భయానక భావనతో ఆర్మీతో తన భర్త కూడా వస్తాడేమో అనే లీ ఆశాభావన మిళితమై ఉన్నది.

అశ్వినీకుమార్ గారి ఇంకో కథ The Cage. కథాస్థలం అమెరికాలోని అట్లాంటా నగరం. ఇండియా నుండి వచ్చిన అతిథి దృక్పథంలో నడుస్తుంది ఈ కథ. అతిథికి తన స్నేహితుడు సాగర్ ద్వారా శ్యామ్ పరిచయం అవుతాడు. శ్యామ్ వెన్నెముక సర్జరీ, ఇతర జబ్బులవల్ల నడవలేడు. వీల్ చైర్‌కి పరిమితం అయ్యాడు. ఉద్యోగం పోవటంతో హెల్త్ ఇన్సూరెన్సు కూడా పోతుంది. ఇన్సూరెన్సు కోసం అతని భార్య ప్రమోద ఒక స్టోరులో క్లర్క్‌గా ఉద్యోగంలో చేరుతుంది. అతిథికి కామేష్ తెలుసు. కామేష్‌కి, ప్రమోదకి సంబంధం ఉందేమోనని అతిథి అనుమానిస్తాడు. ఒక రాత్రి సాగర్, కామేష్, శ్యామ్, అతిథి కలిసి నైట్ క్లబ్‌కి వెళ్తారు. ఆ రాత్రి శ్యామ్ ఎంతో హుషారుగా ఉన్నాడు. మర్నాడు ప్రొద్దున శ్యామ్ పిస్టల్‌తో ఆత్మహత్య చేసుకొంటాడు.

*మాలి* కథాస్థలం బాంగ్‌కాక్ సిటీ. సన్యాల్, హిమాలి ప్రేమించుకొంటారు. హిమాలికి కాలిఫోర్నియా యూనివర్సిటీలో అడ్మిషన్ వస్తుంది. సన్యాల్‌కి ఇష్టం లేకపోయినా, హిమాలి అమెరికా వెళ్తుంది. అక్కడ మైక్ అనే అమెరికన్‌తో పరిచయం ఏర్పడుతుంది. మైక్ తనకు ప్రొపోజ్ చేసాడని సన్యాల్‌కి వ్రాస్తుంది. సన్యాల్ మద్యవ్యసనానికి లోనవుతాడు. సన్యాల్ పరిస్థితి చూసి, ఒక ప్రొఫెసర్ అతన్ని ఒక బౌద్ధ ఆశ్రమంలో చేర్పిస్తాడు. సన్యాల్ క్రమేపీ బౌద్ధ సాధువుగా మారుతాడు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు సేవలు అందిస్తుంటాడు. అమెరికాలో హిమాలికి మైక్ ద్వారా ఎయిడ్స్ సోకుతుంది. మైక్ కారు యాక్సిడెంట్‌లో చనిపోతాడు. హిమాలి బాంగ్‌కాక్ వెళ్ళిపోతుంది. జీవచ్ఛవ స్థితిలో సన్యాల్ పనిచేస్తున్న ఆశ్రమంలో చేరుతుంది. సన్యాల్ చేతుల్లో హిమాలి చనిపోతుంది. ఈ కథలో ఎక్కువ సంఘటనలుండటంతో వస్తైక్యత లోపించింది. సంఘటనల జోడింపు సహజంగా లేదనిపిస్తుంది.

అశ్వినీకుమార్ గారి ఇంకో కథ Poverty. విమల, శంకర్ దంపతులు శాన్‌ఫ్రాన్సిస్కో, ఓక్లండు దగ్గర పెద్ద ఎస్టేట్ భవనంలో నివసిస్తుంటారు. పాతిక ఏళ్లకు పైగా బాగా కష్టపడి సంపాదించారు. విమల పాత స్నేహితుడు రవి వాళ్ళని చూడటానికి ఒక వారాంతం వస్తాడు. ఏ బాదరబందీ లేకుండా, నిశ్చింతతో, హాయిగా బ్రతికే నిత్యపర్యాటకుడు రవి. తాను తరిగిన ప్రదేశాల గురించి విమలకు చెప్తుంటాడు. జోకులు వేసి, నవ్విస్తుంటాడు. అతని తీరుతెన్నులు చూసి, విమల తనకు సంపద ఎంత ఉన్నా, తన జీవితంలోని న్యూనతకు, శూన్యతకు బాధ పడుతుంది. ఈ కథలో చెకోవ్ ఛాయలు కానవస్తాయి.

*ఇంకా ఉంది..*

డా. రమేష్ ప్రసాద్ రావెళ్ల
e-mail: rravella2@gmail.com.,
1-703-338-2194 (mobile and whatsapp)

# కళ్యాణ కర్ణాటక సీమ చారిత్రక వైభవం

*– కొసరాజు వెంకటేశ్వరరావు*

నిజాం నవాబులు (కుతుబ్ షాహి మరియు అసఫ్ జాహి వంశస్థులు) పరిపాలించిన హైదరాబాద్ సంస్థానంలో మూడు ముఖ్యమైన భౌగోళిక ప్రాంతాలు ఉండేవి. ఈ 1. తెలంగాణ, 2. మరాట్వాడ, 3. కన్నడ ప్రాంతంగా వ్యవహరింపబడేవి. కన్నడ భాష మాట్లాడే మూడు జిల్లాలైన బీదర్, గుల్బర్గా (నేటి కల్బుర్గి) మరియు రాయచూరు మొదట్లో మరట్వాడా ప్రాంతంలో భాగంగా ఉండేవి. కానీ పరిపాలనా సౌలభ్యం కోసం ఈ మూడు జిల్లాలు హైదరాబాద్ – కర్ణాటక ప్రాంతంగా పరిగణింపబడినాయి. ఔరంగాబాద్, పర్భణి, భీడ్, నాందేడ్, ఉస్మానాబాద్ జిల్లాలు మరణ్వాడా ప్రాంతానికి చెందినవి కాగా, మిగిలిన తెలంగాణ జిల్లాలను కలిపి 16 జిల్లాలు ఉన్న హైదరాబాదు రాష్ట్రంగా వ్యవహరింపబడింది. హైదరాబాద్ సంస్థానానికి మొదట్లో ఔరంగాబాద్ కేంద్రంగా ఉండేదని ఆ తర్వాత హైదరాబాద్ (అత్రాఫ్‌బల్దా)కు మార్చబడినట్లుగా తెలుస్తుంది.

హైదరాబాద్, కర్ణాటక ప్రాంతాన్ని కన్నడ యొక్క కాశీ అనే పేరుతో వ్యవహరించినట్లుగా చరిత్రకారుల అభిప్రాయం. ఇది యదార్థమే అయి ఉంటుంది. ఎందుకంటే కన్నడ భాష అభివృద్ధి చెందింది ఈ ప్రాంతం నుండే. ఏదైనా ప్రాంత చరిత్ర తెలుసుకోవాలంటే ఆ ప్రాంతాన్ని పరిపాలించిన రాజులు, వారి వైభవం, వారి కాలంలో ఉన్న కవులు, వారు రచించిన గ్రంథాలు మొదలైన విషయాలను పరిగణనలోనికి తీసుకునే సమయంలో హైదరాబాద్ – కన్నడ ప్రాంతాన్ని కన్నడ యొక్క కాశీ అని చరిత్రకారులు నిర్ధారించినట్లుగా తెలుస్తున్నది. హైదరాబాద్ ప్రాంతానికి ఘనమైన చారిత్రక వైభవం ఉన్నట్లుగా తెలుస్తున్నది. ఈ ప్రాంతంగుండా ప్రవహించే తుంగభద్ర భీమా, కృష్ణ, గోదావరి, మంజీరా నదుల పరివాహక ప్రాంతాలలో ఆదిమానవుడు నివసించినట్లుగా వారు రాతితో చేసిన అనేక పనిముట్లు లభించిన దానిని బట్టి పైన పేర్కొన్న నదీతీరాలు మొదటి రాతియుగపు (పాత శిలాయుగము) స్థావరాలైనట్లుగా తెలుస్తున్నది. ప్రముఖ శాసన పరిశోధకుడు దివంగత పి.బి. దేశాయ్ అభిప్రాయపడినట్లుగా ప్రాచీన శిలాయుగంలో ఆది మానవుడు ఒక విధమైన పద్ధతి నీతి నియమాలను ఏర్పరుచుకుని ఆ ఆచార వ్యవహారాల ప్రకారమే తమ జీవనాన్ని సాగించినట్లుగా తెలుస్తున్నది. ఆదిమానవుడు జంతువులను వేటాడి, ఆ వేట పైనే జీవించినట్లుగా ఆనాడు వారు ఉపయోగించిన రాతి పనిముట్ల ద్వారా తెలియవచ్చింది. ఆదిమానవుడు పాతరాతి యుగపు నాగరికత నుండి అనేక మార్పులతో కొత్తరాతి యుగంలో ప్రవేశించినట్లుగా ఈ ప్రాంతంలో లభించిన నునుపుగా – నల్లగా రాతితో చేసిన గొడ్డళ్లు, ఇంకా అనేక ఇతర రాతి పరికరాల ద్వారా తెలుస్తున్నది. ధార్వాడ విశ్వవిద్యాలయ పురావస్తు విభాగానికి చెందిన ఆచార్యులు డా. ఎ. సుందరం గారు భారత పురావస్తు సర్వేక్షణ శాఖకు చెందిన దివంగత పురావస్తు శాస్త్రజ్ఞుడు డా. బి. నరసింహయ్య గారు ఈ విషయాలను తమ గ్రంథాలలో విశదీకరించారు. రాయచూరు జిల్లాలో అనేక ప్రదేశాలలో కొత్త శిలాయుగపు రాతి పనిముట్లు లభించినట్లు తెలియజేశారు. వీరేకాక ఇంకా అనేకమంది పురాతత్వ శాస్త్రజ్ఞులు తమ పరిశోధనలలో ఈ విషయాన్ని ధృవీకరించారు. పూనా దక్కన్ కళాశాల పురావస్తు విభాగం ఆచార్యులు డా. కె. పద్దయ్య గుల్బర్గా జిల్లాలో హస్సగే, బూదిహాళ్, ఇసాన్‌పూర్ మొదలైన జేవరి, షోరాపూర్ మరియు షాపూర్ తాలూకాలలో జరిగిన సుదీర్ఘమైన త్రవ్వకాలలో కొత్తరాతి యుగము (New Stone Age), సూక్ష్మ శిలా యుగము (Microlithic Age) మరియు లోహపు యుగానికి (Megalithic Age) చెందిన అనేక కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. అంతకు పూర్వం బ్రిటిష్ పురాతత్వ శాస్త్రజ్ఞుడు రాబర్ట్ బ్రూస్ ఫుటే హైదరాబాద్ – కర్ణాటక ప్రదేశాలలో విస్తృతంగా సర్వే చేసి ఆ వివరాలను

గ్రంథస్థం చేశారు. 1940 ప్రాంతంలో మెడోస్ టైలర్ అనే బ్రిటిష్ పరిపాలనాధికారి జేవరి ప్రాంతంలో త్రవ్వకాలు నిర్వహించి సుమారు 100 మెగాలిథిక్ సమాధులు ఉన్నట్లుగా తన రిపోర్టులో పేర్కొన్నారు. 1951–52లో ఇంకొక బ్రిటీష్ పురాతత్వ శాస్త్రవేత్త ఆల్బిన్ రాయచూర్ జిల్లాలోని పిక్లీహాల్ అనే ప్రదేశంలో శాస్త్రీయ తవ్వకాలు నిర్వహించి నూతన శిలాయుగము మరియు సూక్ష్మ శిలాయుగానికి చెందిన అనేక రాతి పనిముట్లను వెలికితీశారు. బ్రిటిష్ పురావస్తు శాస్త్రవేత్తలు ప్రచురించిన గ్రంధాలు భారత పురావస్తు శాస్త్రవేత్తలైన డా. పద్దయ్య, డా. సుందర్, డా. నరసింహయ్య మరియు ఇతర శాస్త్రవేత్తలకు, జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, శాస్త్రవేత్తలకు, నిజాం రాష్ట్ర పురావస్తు శాఖవారికి, భారత పురావస్తు సర్వేక్షణ వారికి అనేక విశ్వవిద్యాలయ ఆచార్యులకు మార్గదర్శకాలు, ప్రేరణకాలు అయినట్లుగా తోస్తున్నది.

భారత పురాతత్త్వ శాస్త్రజ్ఞులైన డా. పద్దయ్యగారు షోరాపూర్–షాపూర్ లోయలలో చేసిన త్రవ్వకాలు అతిముఖ్యమైనవిగా ప్రముఖ శాస్త్రజ్ఞులు గుర్తించారు. వీరు ఈ లోయలలో సుమారు 1000 చ.కి.మీ. ప్రాంతంలో సర్వే నిర్వహించి 200కు పైగా పాత రాతియుగపు స్థావరాలను గుర్తించారు. వీరు బూదిహాళ్‌లో నిర్వహించిన త్రవ్వకాలు మరియు 'హున్సిగి'లో నిర్వహించిన సుదీర్ఘమైన త్రవ్వకాలలో ఆనాటి ప్రజలు స్థానికంగా లభించే సున్నపు రాతితో తయారు చేసిన సూక్ష్మ పరికరాలేకాక వారు నివసించిన స్థలాలు వారి జీవన విధానం వారి వినూత్నమైన ఆచార వ్యవహారాలు వెలుగులోకి ప్రపంచ శాస్త్రజ్ఞుల దృష్టిని ఆకర్షించి వారిని ఆలోచింపజేశాయి. బూదేహాళ్‌లో లభించిన కార్బన్ డేటింగ్ ప్రకారం ఆ స్థలానికి క్రీస్తు పూర్వం 2000–1400గా ఉన్న కాలాన్ని స్థిరీకరించారు. ఆల్బిన్ ఉట్నూర్‌లో నిర్వహించిన త్రవ్వకాలలో అనేక బూడిద దిబ్బలు (Ashmounds) వెలుగులోకి వచ్చాయి. వీటిని లోహపు యుగానికి సంబంధించినవిగా గుర్తించబడ్డాయి.

అశోకుని శాసనం (క్రీ.పూ. 3వ శతాబ్దం) ఉన్న మస్కి (రాయచూర్ జిల్లా ప్రస్తుతం ఇది కొప్పళ జిల్లాలోకి చేరింది)లో నైజాం రాష్ట్ర పురావస్తు శాఖవారు నిర్వహించిన త్రవ్వకాలలో అనేక కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. మస్కి మొదటి పేరు మాసంగి. మాసంగి అంటే మహా సంఘం. ఈ నగరంలోను కొప్పళ (లేక కొప్పన) నగరంలోను అశోకుని శాసనాలు చెక్కించబడినాయి. ఈ రెండు ప్రదేశాల నుండి మౌర్య చక్రవర్తి అశోకుడు బౌద్ధమత ప్రచారం చేసినట్లుగా తెలుస్తున్నది. పురాతన కాలం నుండే కొప్పళ నగరం అనేక మతాలకు కేంద్రం అయింది. ఒక అంచనా ప్రకారం ఇక్కడ మొదట బౌద్ధమతం ఆ తర్వాత జైనమతానికి కేంద్రబిందువు అయినట్లుగా ఇక్కడ ఉన్న అశోకుని బ్రాహ్మీ భాషలో ఉన్న శాసనాలు, రాతి బండలపై చెక్కబడిన అనేక జైన విగ్రహాలు సాక్ష్యాలుగా ఉన్నాయి. ఈ నగరం ప్రక్కనే ఉన్న గవిమఠ మరియు దీని యొక్క వెనుకవైపున ఉన్న పాల్కిగుండ పైన అశోకుని శాసనాలు కనుగొనబడినాయి. అదేకాక ఇదే భాగంలో ఉన్న 'చిచ్చుకుంది' అనే బౌద్ధ భిక్షువులు ఉన్న గ్రామం ఉన్నట్లుగా తెలుస్తున్నది. కుతూహలమైన విషయమేమిటంటే 1954లో ఇక్కడ నిర్వహించిన త్రవ్వకాలలో ఇప్పటికి సుమారు నాలుగు వేల సంవత్సరాలకు ముందు ఉన్న హరప్పా సంస్కృతికి చెందిన నాగరికతకు పోలిక ఉన్న వస్తువులు లభించాయి. పురావస్తు శాఖవారు మస్కి, ముదగళ్, పికిలిహాళ, కరడికల్లు, కల్లూరు మొదలైన ప్రాచీన ప్రాంతాలలో జరిపిన సంశోధనలో ఇక్కడ రాతితో చేసిన ఆయుధాలు, ఉపకరణాలు లభించాయి. ఆ తరువాత కాలానికి సంబంధించిన ఇనుము, తామ్రము (రాగి) మొదలైన లోహాలను ఉపయోగించిన నవీన శిలాయుగంనాటి ప్రజలు ఈ ప్రాంతంలో నివసించినట్లుగా తెలియవచ్చింది. జేవరి లోయలో సుమారు బృహత్ శిలాయుగపు సమాధులు వందకు పైగా ఉన్నట్లుగా మెడోస్ టైలర్ గమనించాడు. రాయచూర్ – బీదర్ జిల్లాల్లో కూడా ఈ బృహత్ శిలా సమాధులు కనుగొనబడినాయి.

హైదరాబాద్ – కర్ణాటక ప్రాంతానికి అపూర్వమైన చారిత్రక పరంపర ఉన్నట్లుగా సన్నతి, కనగనహళ్ళి, మస్కి, కొప్పళలో కనుగొనబడిన అశోకుని శిలాశాసనాలు తెలియజేస్తున్నాయి. మౌర్య చక్రవర్తి క్రీ.పూ. 3వ శతాబ్దంలో బౌద్ధ మత ప్రచారాన్ని చేసినట్లుగా ఈ పైన పేర్కొన్న ప్రదేశాల నుండేకాక బళ్ళారి జిల్లాలోని బ్రహ్మగిరి, నిట్టూరు, ఉదెగొల్లం, జటింగ, రామేశ్వరం మొదలైన ప్రాంతాలలో లభించిన అశోకుని కాలం నాటి శాసనాల ద్వారా కూడా తెలుస్తున్నది. మస్కిలో లభించిన అశోకుని శాసనానికి ఒక ప్రత్యేకత ఉంది. దక్షిణ భారతదేశంలో ఉన్న అశోకుని శాసనాలలో మొదటిసారిగా అశోకుని పేరు ప్రస్తావించబడింది. ఆ తర్వాత వెలుగులోకి వచ్చిన శాసనాలైన నిట్టూరులోని కనగనహళ్లి స్థావంలోని శాసనాలలోనూ అశోకుని పేరు ప్రస్తావించబడినప్పటికీ అశోకుని పేరు ప్రస్తావించిన

మొట్టమొదటి శాసనంగా మస్కి శాసనానికి ప్రత్యేకత ఉన్నది. అంతకు ముందు వెలుగులోకి వచ్చిన అశోకుని శాసనాలలో దేవానాం ప్రియం, ప్రియదర్శి రాజు అని మాత్రమే పేర్కొనబడగా ఆ పైన పేర్కొన్న శాసనాలలోనూ అశోకుని పేరు ఉండటం గమనార్హం. గుల్బర్గా జిల్లా, చిత్తాపూరు తాలూకాలో కనగనహళ్లి బౌద్ధ స్థూపం పై ఉన్న అశోకుని చిత్రం పైన ఉన్న లఘు శాసనం 'రాన్యో అశోక' (రాజా అశోక్) అని మౌర్యుని కాలంనాటి బ్రాహ్మీ భాషలో అశోకుని రూపంతో పాటు ఆయన పేరు కూడా ప్రస్తావించబడటం గొప్ప విశేషమే అవుతుంది. కనగనహళ్లి గ్రామంలో ఉన్న బౌద్ధ స్తూపం బండి చక్రం ఆకారంలో, కాల్చిన ఇటుకలతో అశోకుని కాలంలోనే నిర్మింపబడినట్లుగా చరిత్రకారులు గుర్తించారు. ఈ బౌద్ధ స్తూపం శాతవాహనుల పరిపాలనా కాలంలో (క్రీ.పూ. 2వ శతాబ్దం నుండి క్రీ.శ. 2వ శతాబ్దం) పూర్తి చేయబడినట్లుగా ఆ స్తూపపు వాస్తు శైలి తెలియజేస్తున్నది. సున్నపు రాతితో చెక్కిన బుద్ధుని జీవిత ఘట్టాలు, జాతక కథలు, ఫల పుష్పాదులు, జంతువులు, పక్షులు, హీనయాన, మహాయాన శాఖలకు చెందిన అనేక దృశ్యాలతో స్థూపం రాతి తాపడం (కప్పటం) చేయబడింది. ఈ స్థూప ఫలకాలపై అశోకుని చిత్రమేకాక శాతవాహన రాజులైన మహారతి, పులుమావి పుత్ర, సిముక సిరి, సాతకర్ణి, సుందర శాతకర్ణి, యజ్ఞశ్రీ, మాతలక మొదలైనవారి పేర్లతో ఉన్న లఘు శాసనం, చిత్రం కూడా చెక్కబడినాయి. సాంచీ (మధ్యప్రదేశ్) స్థూపం యొక్క తోరణంపై అశోకుడు తన రాణితో పాటు బోధివృక్షాన్ని సందర్శిస్తున్న చిత్రం ఉన్నది. ఆ చిత్రంలో బోధివృక్షం ఉన్నది కనుక ఆ చిత్రంలో ఉన్నది అశోకుడు మరియు ఆయన రాణి అయి ఉండవచ్చునని చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. కానీ కనగనహళ్లి బౌద్ధ స్థూపంపై ఉన్న అశోకుని చిత్రంతో పాటు దాని మీద అశోకుని పేరుతో లఘు శాసనం ఉన్నది. మొత్తం భారతదేశంలో ఉన్న బౌద్ధ స్థూపాలపై అశోకుని చిత్రం మరియు ఆయన పేర్లు ఉన్న స్థూపం ఇది మాత్రమే. సన్నతి ఊరి బయట ఉన్న చంద్రలాంబా పరమేశ్వరి దేవాలయంలో అశోకుని శిలాశాసనం కూడా ఉన్నది. బహుశా సన్నతి–కనగనహళ్లి ప్రాంతం శాతవాహనుల కాలంలో ఒక వ్యాపార కేంద్రమై ఉండి ఉంటుందని చరిత్రకారుల అభిప్రాయం. శాతవాహనుల రాజధాని ప్రతిష్టానపురం (పైఠాన్ - మహారాష్ట్ర) నుండి ధాన్యకటకానికి (అమరావతి) వెళ్లే వ్యాపార మార్గంలో ఇది ఉండి ఉంటుంది. పైఠాన్ నుండి కనగనహళ్లి, కొండాపూర్ (మెదక్ జిల్లా), ఫణిగిరి (నల్గొండ జిల్లా), నేలకొండపల్లి (ఖమ్మం జిల్లా), జగ్గయ్యపేట (కృష్ణాజిల్లా), విజయపురి (నాగార్జున కొండ గుంటూరు జిల్లా) అమరావతికి వెళ్ళే వ్యాపార మార్గంలో గొప్ప వ్యాపార కేంద్రమై ఉండి ఉంటుంది. స్థూపానికి సమీపంలో ఉన్న భీమా నది ద్వారా విదేశాలతో వర్తక వాణిజ్యాలు జరిపి ఉండవచ్చు. కనగనహళ్లి స్థూపంలో 250కి పైగా బ్రాహ్మీ భాషలో ఉన్న లఘు శాసనాలు లభించాయి. అందులో 241 దాన శాసనాలు కాగా మిగిలినవి బాదామి చాళుక్యుల, రాష్ట్రకూట రాజుల కాలానికి సంబంధించినవిగా ఉన్నాయి. లిపి, భాష, శిల్పం యొక్క శైలి మరియు వాస్తు క్రీ.శ. 1వ శతాబ్దం నుండి క్రీ.శ. 3వ శతాబ్దానికి చెందినట్లుగా చరిత్రకారులు నిర్దేశించారు. కనగనహళ్లి స్థూపానికి అమరావతి, నాగార్జునకొండ స్థూపాలకు చాలా దగ్గర పోలికలు ఉన్నాయి.

నానాఘాట్ శాసనంలో కొందరు శాతవాహన రాజుల పేర్లు పేర్కొనబడినాయి కాని వారి చిత్రాలు చెక్కబడలేదు. ఈ స్థూపంలో లభించిన ఇంకొక ముఖ్యమైన చారిత్రక సంఘటన చిత్రించబడింది. శాతవాహన రాజు పులుమావి ఉజ్జయిని రాజైన సంజయంతను ఓడించినట్లుగా మనం చరిత్ర పాఠాల్లో చదివాము. ఒక శిలాఫలకంపై పులుమావి క్షాత్రపరాజు సంజయంతను యుద్ధంలో ఓడించిన తరువాత ఆయనను ఉజ్జయినికి తన సామంతునిగా నియమిస్తున్న చిత్రం అతి రమ్యంగా చిత్రింపబడింది. ఆ చిత్రంలో పులుమావి క్షాత్రపరాజైన సంజయంతను ఆహ్వానిస్తూ ఉజ్జయిని అధికారాన్ని ఆయనకు అప్పగిస్తున్నట్లుగా చిత్రింపబడింది. ఆ చిత్రం క్రింది భాగంలో పులుమావి అనే లఘు శాసనం ఉన్నది. ఇటువంటి చారిత్రక సంఘటన మరి ఏ ఇతర బౌద్ధస్థూపంలోను చిత్రింపబడలేదు. ఇక్కడ లభించిన శాసనాల ఆధారంతో సుందర శాతకర్ణి పేరున్న వ్యక్తి శాతవాహన సామ్రాజ్యాన్ని పరిపాలించినట్లుగా మొట్టమొదటిసారిగా వెలుగులోకి వచ్చింది. కనగనహళ్లి స్థూపంలో హీనయాన శాఖ బౌద్ధులు, బుద్ధుని బోధి వృక్షము, సింహాసనము, స్థూపము, బుద్ధుని పాదములు, నాగము చలిందుడు, ధర్మచక్రము మొదలైన రూపాలతో బుద్ధుని పూజింపగా ఆ తర్వాత వచ్చిన మహాయాన శాఖీయులు బుద్ధుని మానవాకారంలో పూజించినట్లుగాను, అమరావతి స్థూపంలో ఉన్నట్లు కనగనహళ్లి స్థూపంలో ఈ రెండు శాఖల శిల్పుల నైపుణ్యం మన కళ్ళకి కనిపిస్తుంది. అశోకుని శాసనాల ఆధారంగా ఈ ప్రాంతం మౌర్య చక్రవర్తుల

సామ్రాజ్యంలో భాగంగా ఉన్నట్లు చరిత్రకారుల అభిప్రాయం. అశోకుని పాలన తదనంతరం ఈ ప్రాంతం శాతవాహనుల అధీనంలో ఉన్నట్లుగా సన్నతి, కనగనహళ్లి, మస్కి, వడగాం, మాదాపూర్ (బెల్గాం) బనవాసి (దక్షిణ కన్నడ జిల్లా), చంద్రవల్లి, (చిత్రదుర్గ జిల్లా), పట్టదకల్ (బాగలకోట జిల్లా) ఇంకా అనేక ఇతర ప్రదేశాలలోని నిర్వహించిన త్రవ్వకాలలో లభించిన శాతవాహన సీసపు నాణాలు, మట్టి పాత్రలు, టెర్రకొట్టా పూసలు, రోమను నాణాలు, వారి మధుపాత్రలు ఇంకా అనేక ఇతర వస్తువుల ద్వారా తెలుస్తున్నది. కర్ణాటక ఎక్కువ భాగం శాతవాహనుల పరిపాలన కింద ఉన్నట్లుగా అర్థం అవుతున్నది. వీరు 'ఆంధ్ర భృత్యులు' అని కూడా వ్యవహరింపబడేవారు. శాతవాహనులు తెలుగువారు అనే వాదన ఉన్నది. 'ఆంధ్ర భృత్యులు' అంటే తెలుగువారే కావలసిన అవసరం లేదని మరికొందరి వాదన. ముఖ్యమైన విషయం ఏమిటంటే వీరి సామ్రాజ్యం నిజాం ప్రాంతం కూడా భాగంగా ఉండేది. హైదరాబాద్ పట్టణానికి 65 కిలోమీటర్లు పశ్చిమంగా ఉన్న కొండాపూర్ (మెదక్ జిల్లా)లో నిజాం ప్రభుత్వ పురావస్తు శాఖవారు నిర్వహించిన త్రవ్వకాలలో శాతవాహనుల కాలంనాటి అనేక వస్తువులు లభించాయి. కొండాపూర్ చుట్టూ మట్టిగోడను శాతవాహనులే నిర్మించినట్లుగా ఈ త్రవ్వకాల ద్వారా తెలియవచ్చింది. ఆ తరువాత గుల్బర్గా జిల్లాలో ఉన్న సన్నతిలో శ్వేతరాజు కట్టి ఉన్నట్లుగా అక్కడ జరిగిన త్రవ్వకాలలో తెలియవచ్చింది. ప్రఖ్యాత శాసన పరిశోధకులైన డా. కె.వి రమేష్‌గారు అభిప్రాయపడినట్లుగా శాతవాహనర కోటి, శేతురాజునకట్టిగా అపభ్రంశం అయి ఉంటుంది. ఈ ప్రాంతాన్ని పరిపాలించిన సేతురాజు అపురూప అందగత్తె అయిన చంద్రవదనను బలాత్కరించగా ఆమె శేతురాజును శపించినట్లుగా స్థానికుల స్థలపురాణ కథనంగా తోస్తున్నది. ఏది ఏమైనప్పటికీ సన్నతిలో నిర్వహించిన త్రవ్వకాలలో శాతవాహనుల కాలంనాటి మట్టితో నిర్మించిన కోట, రణమండలం, నివాస స్థానాలు వెలుగులోకి తేబడినాయి. కర్ణాటక రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకులైన డా. ఎం. శేషాద్రి 1964-65లో ఇక్కడ త్రవ్వకాలు నిర్వహించి, ఇక్కడ బౌద్ధమతానికి చెందిన స్థావరాలు ఉన్నట్లు తన రిపోర్టులో పొందుపరిచారు. సన్నతి ప్రాముఖ్యతను మొదటిసారి ప్రభుత్వ దృష్టికి తెచ్చినవారు సురుపురం సంస్థానపు ఉద్యోగి కపటరాళు కృష్ణ రాయలు. కన్నడ విశ్వవిద్యాలయానికి చెందిన డా. పి.బి. దేశాయి 1966లో ఈ ప్రాంతాన్ని విస్తృతంగా సర్వే చేసి ఇది కర్ణాటక రాష్ట్రంలో అతి పెద్దదైన, అత్యంత మహత్తు ఉన్న బౌద్ధనివేశనము అని అభిప్రాయపడ్డారు.

శాతవాహనుల పరిపాలన ముగిసిన తర్వాత కర్ణాటకం వివిధ వంశాలకు చెందిన రాజుల ఆధీనంలోకి వెళ్ళింది. ఈ భాగం బనవాసిని రాజధానిగా చేసుకుని పరిపాలించిన కదంబుల అధీనంలోకి పోగా తలకాడులో గంగరాజులు హేమావతిలో నోళంబురులు పరిపాలించసాగారు. హైదరాబాద్ - కర్ణాటక ప్రాంతాన్ని క్రీ.శ. 6వ శతాబ్దంలో బాదామి (వాతాపిపురం) చాళుక్యులు పరిపాలించారు. ఈ వంశంలో మహాశూరుడైన రెండవ పులకేసి ఉత్తర భారతదేశ చరిత్ర హర్షవర్ధనుని ఓడించి తన సామ్రాజ్యాన్ని నర్మదా నది నుండి దక్షిణాన పల్లవ సామ్రాజ్యం వరకు విస్తరించాడు. పులకేశి పరిపాలనా కాలంలో కన్నడ భాష, సంస్కృతి, సాహిత్యం, ధర్మం, శిల్పకళా మొదలైనవాటికి మంచి ఆదరణ, ప్రోత్సాహం లభించాయి. బాదామి, మహాకూట పట్టదకల్ (బాదామి రాజుల పట్టాభిషేకం నిర్వహించే గ్రామం). ఐహోళె, బనశంకరి మరియు ఇతర ప్రాంతాలలో అనేక దేవాలయాలు, గుహాలయాలు తటాకములు నిర్మింపబడినాయి. వీరి శాసనాలు కుక్కనూరు, ఇట్టగి, బాదామి, మహాకూట, ఐహోళె, బెణకల్, హలగేరి మొదలైన ప్రదేశాల్లో ఉన్నాయి. వీరు నిర్మించిన పట్టదకల్‌లోని దేవాలయ సమూహాన్ని విశ్వమానవ కట్టడాలుగా ప్రపంచ సాంస్కృతిక సంస్థ (UNESCO) గుర్తించింది. వీరి తదనంతరం గుల్బర్గా జిల్లాలో ఉన్న మాల్ఖేడ్ (మళఖేడ)ను రాజధానిగా చేసుకుని పరిపాలించిన రాష్ట్రకూటుల ఆధీనంలో ఈ ప్రాంతం ఉండేది. నృపతుంగ చక్రవర్తి కాలంలో మాల్ఖేడ్ (మాన్యకటకం అని కూడా పిలుస్తారు) విదేశీ వ్యాపారస్తులను ఆకర్షించింది. వీరు అనేక దేవాలయాలను నిర్మించారు. మొదటి కృష్ణుని కాలంలో ఎల్లోరాలో కైలాస్‌నాథ్ దేవాలయం, ఇతర దేవాలయాలు నిర్మింపబడి భారత వాస్తు శిల్పానికి మణిహారాలైనాయి.

క్రీ.శ. 10వ శతాబ్దం హైదరాబాద్ - కర్ణాటక చరిత్రలో సువర్ణాధ్యాయంగా లిఖించబడింది. కళ్యాణ (బసవ కళ్యాణ్ బీదరు జిల్లా)ను రాజధానిగా చేసుకుని పశ్చిమ చాళుక్యులు ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. ఈ కాలంలో కన్నడ సాహిత్యం పంప, రన్న మొదలైన కవుల రచనలతో ఆకాశాన్ని తాకిందని చరిత్రకారుల అభిప్రాయం. శకపురుషునిగా భావించే ఆరవ విక్రమాదిత్యుని కాలం స్వర్ణయుగంగా భావించబడుతున్నది. వీరి కాలంలో అనేక దేవాలయాలు

నిర్మింపబడినాయి. బీదర్, గుల్బర్గా, రాయచూర్ జిల్లాలో వీరు వేయించిన అనేక శాసనాలు లభ్యమయినాయి. వీరు కవి పండితులను పోషించారు. కాశ్మీర్‌కు చెందిన కవి బిల్హణుడు 'విక్రమాంక దేవ చరిత్ర' అనే గ్రంథాన్ని రచించాడు. విక్రమార్కుని సోదరుడు కీర్తివర్మకు పెరమాడి, త్రిభువనమల్ల అనే బిరుదులు ఉండేవి. ఆయన *గో వైద్య* అనే గ్రంథాన్ని కన్నడంలో రచించాడు. నృత్య, సంగీత కళలలో ఆరితేరిన ఆయన రాణి చందలాదేవికి *అభినవ సరస్వతి* అనే బిరుదు ఉండేది. ఆ తరువాతి రాజు మూడవ సోమేశ్వరుడు మంచివే కాని సమర్థుడైన పరిపాలకుడు కాలేకపోయాడు. ఆయన *మానసోల్లాస, విక్రమాంకాభ్యుదయ* అనే గ్రంథాలు రచించాడు. వీరిని కాలాఆచూరులు ఓడించి అధికారానికి వచ్చారు. బిజ్జలుని ప్రధాన మంత్రిగా ఉన్న బసవేశ్వరుడు వినూతనానికి నాందీభూతమైన సాంఘిక, ధార్మిక, ఆర్థిక క్రాంతికి పునాదివేసి వీరశైవ మతాన్ని స్థాపించి సంఘంలో ఎన్నో మార్పులకు కారణభూతుడైనాడు. కాలాచూరి రాజులు దుర్బలులు మరియు దక్షిణ భారతదేశపు రాజుల కలహాలు, వారి అనైక్యత మూలంగా ఢిల్లీ నవాబు అలావుద్దీన్ ఖిల్జీ దండయాత్రకు అనుకూలమైంది. అతడు దేవగిరి యాదవ రాజులను ఓడించి ఢిల్లీ సామ్రాజ్యాన్ని దక్షిణ భారతదేశానికి విస్తరింపజేశాడు. ఖిల్జీ ఈ ప్రాంతాన్ని జయించి తన ప్రతినిధిని నియమించాడు. హసన్ గంగు బహమని డిల్లీ పరిపాలనను ధిక్కరించి సర్వ స్వతంత్రుడై గుల్బర్గా రాజధానిగా బహమనీ రాజ్యాన్ని 14వ శతాబ్దంలో ప్రారంభించాడు. బహమనీ రాజుల కాలంలో గుల్బర్గా నగరంలోని కోట, కోటలో జామా మసీదు, కోట బటయ హఫ్త్ గుంబజ్ (ఎనిమిది గుంబజ్‌లు) అనేవి బహమనీ రాజుల సమాధులు ఉన్న 8 గుంబజ్‌లు నిర్మింపబడినాయి. మల్లిక్ కాఫర్ కాకతీయులను ఓడించి 1326లో ప్రతాపరుద్రుని బందీగా చేశాడు. రాయచూర్ దోఆబ్ (రాయచూరు – ముద్గళ్ మధ్య ఉన్న ప్రాంతం) కోసం బహమనీ మరియు విజనగర పాలకుల మధ్య తరచు యుద్ధాలు జరుగుతూ ఉండేవి. దక్కను పీఠభూమిలో భాగమైన హైదరాబాద్ – కర్ణాటక ప్రాంతం బహమనీ రాజ్యం చీలిపోయి 5 ముస్లిం రాజ్యాలుగా ఏర్పడింది. బీదర్ బరీద్ షాహిల ఆధీనంలోకి వెళ్లింది. బరీద్ షాహి రాజులు మూడు అగడ్తలు (కందకాలు) ఉన్న బీదరు కోటను, కోట లోపల రంగీన్ మహల్, షోలాఖంబా మసీద్, తఖ్త్‌మహల్, చీనీ మహల్, నౌబత్ ఖానా, బారూద్ కోటె, వారి సమాధులు ఉన్న గుంబజ్‌లు నిర్మించారు.

1565 సం.లో జరిగిన రక్కస తంగడిగి (తాళికోట) యుద్ధంలో విజయనగర రాజులు 5 ముస్లిం రాజ్యాలైన గోల్కొండ, బీదరు, బీజాపూరు, అహమ, దునగర్ మరియు బిరార్ రాజ్యాలు కలసికట్టుగా దండయాత్రకు వచ్చిన సైన్యం చేతిలో పరాజయంపాలు కాగా వారు పెనుగొండకు పారిపోవలసిన అగత్యం ఏర్పడింది.

ఔరంగజేబు, గోల్కొండ, బీజాపూర్ రాజ్యాలతో పాటు దక్షిణ భారతదేశంలోని ఇంకా కొన్ని ప్రాంతాలలో తన విజయ యాత్రను ముగించుకొని తన దక్షిణ ప్రాంత అధికారిగా నిజాముల్ ముల్క్ అసఫ్ జాను నియమించాడు. ఈ నిజాముల్ ముల్క్ గత చరిత్రను గురించి తెలుసుకుందాం. ఇతని తాత ఖాజా అబిద్, ఔరంగజేబు తండ్రి అయిన షాజహాన్ కాలంలోనే ఇరాక్ నుండి హిందూ దేశానికి వచ్చి షాజహాన్ కోర్టులో ఉద్యోగంలో ప్రవేశించాడు. అతని పరాక్రమానికి మెచ్చిన ఔరంగజేబు అతనికి నవాబ్ ఖిలిజ్ ఖాన్ అనే బిరుదు ఇచ్చి గౌరవించాడు. ఔరంగజేబు గోల్కొండ కోటను ముట్టడించినప్పుడు ఇతను దండనాయకునిగా ఉండి ఆ యుద్ధంలో చనిపోయాడు. అతని కుమారుడు షహబుద్దీన్ కూడా మొగలు సైన్యంలో ఫిరోజ్ జంగ్ గాజియుద్దీన్ అనే బిరుదుతో పెద్ద సర్దార్ పదవిలో నియమింపబడ్డాడు. బీజాపూర్ యుద్ధంలో ఇతను తన పరాక్రమంతో ఔరంగజేబుకు విజయాన్ని అందించాడు. ఇతని కుమారుడే నిజాముల్ ముల్క్. ఇతను 1663లో ఢిల్లీలో జన్మించాడు. ఇతని అసలు పేరు జమరుద్దీన్. ఇతని పరాక్రమానికి మెచ్చిన షారూఖ్ సియార్ 1683లో బిన్ ఖిలిజ్ ఖాన్ అనే బిరుదు ఇచ్చి ఇతనిని దక్కన్ ప్రాంతానికి సుబేదారుగా నియమించాడు. ఇతనికి అసఫ్ జా అనే బిరుదు ఇవ్వబడింది. ఇతనితో హైదరాబాద్ కేంద్రంగా అసఫ్ జాహీల వంశ పాలన ప్రారంభమైంది. వీరి కాలంలో సుబే, జిల్లాలు ఏర్పాటు చేయబడి సుబేదార్, తాలూక్దార్ (జిల్లా అధికారి), తహసిల్దార్‌లు నియమించబడ్డారు. వీరి కాలంలో అనేక చారిత్రాత్మక భవనాలు నిర్మింపబడినాయి. ఆరవ అసఫ్ జా పుత్రుడైన అసఫ్ జహను పరిపాలన కాలంలో హైదరాబాద్ నుండి గుల్బర్గా వరకు రైలు బండి ప్రారంభించబడింది. హైకోర్టు భవనం స్థాపించబడింది. పార్శీ భాష స్థానంలో ప్రభుత్వ వ్యవహారాలు, ఉర్దూ భాషలో ప్రారంభించబడ్డాయి. సర్ మహారాజ్ కిషన్ ప్రసాద్ ముఖ్యమంత్రి కాగా మహబూబియా పేరుతో నాణాలు ముద్రించబడినాయి. 7వ నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ కాలంలో ఉస్మానియా

ఆసుపత్రి, సిటీ కాలేజ్, యునాని ఆసుపత్రి అసఫియా గ్రంథాలయం, ఉస్మానియా విశ్వవిద్యాలయ భవనాలు, ఉస్మాన్ సాగర్, నిజాం సాగర్, హిమాయత్ సాగంలు నిర్మింపబడినాయి. అనేక ప్రజోపయోగ సంస్థలు ప్రారంభించబడినాయి. ప్రజలు తెలుగు, మరాఠీ, కన్నడ, ఉర్దూ భాషలు మాట్లాడేవారు.

అసఫ్ జాహి నవాబుల పరిపాలనా కాలంలో పరిపాలన దేశ్ ఫాండే, సర్ దేశ్ పాండే, దేశ్‌ముఖ్, సర్ దేశ్‌ముఖ్, కోత్వాల్ మొదలైన అధికారుల సహకారంతో జరిగేది. వీరి హయాంలో హిందువులు కూడా మంచి హోదాలలో నియమింపబడ్డారు (అకన్న, మాదన్న, గోపన్న, కిషన్ ప్రసాద్ మొదలైనవారు). భారతదేశానికి 1947 ఆగస్టు 15 నాడు బ్రిటిష్ పాలకులు స్వాతంత్రాన్ని ప్రకటించారు. జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా, సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉపప్రధానిగా నియమింపబడ్డారు. దేశవిభజన జరిగి భారతదేశం, పాకిస్థాన్‌గా ఏర్పడినాయి. సర్దార్ పటేల్‌గారి చొరవతో దేశంలో ఉన్న అనేక సంస్థానాలు భారతదేశంలో విలీనం కాబడినా నిజాం నవాబు హైదరాబాద్ రాష్ట్రాన్ని భారతదేశంలో విలీనం చేయటానికి అంగీకరించలేదు. రజాకారుల ఆగడాలు భరించలేని స్థితికి చేరటం, హిందువుల ఉనికికే ప్రమాదం ఏర్పడటంతో సర్దార్ పటేల్ 1948 సెప్టెంబర్ 18వ తేదీనాడు నైజాం రాష్ట్రానికి అన్నివైపుల నుండి పంపిన పోలీసు చర్య ద్వారా భారతసైన్యం హైదరాబాద్ నగరం ప్రవేశించగా నిజాం నవాబు తన రాష్ట్రాన్ని భారతదేశంలో విలీనం చేయుటానికి అంగీకరించాడు.

ఎంతో ఘనమైన చరిత్ర కలిగిన హైదరాబాద్ - కర్ణాటక ప్రాంతమైన బీదరు, రాయచూర్, గుల్బర్గా జిల్లాలు హైదరాబాద్ రాష్ట్రంలో భాగం కాగా 1953లో జరిగిన భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు సందర్భంగా ఈ మూడు జిల్లాలు కొత్తగా ఏర్పాటైన కర్ణాటక రాష్ట్రంలో కలపబడినాయి. ఈ ప్రాంతం ప్రస్తుతం కళ్యాణ కర్ణాటకగా వ్యవహరింపబడుతున్నది. ఈ మూడు జిల్లాలు ఆ తరువాత కొప్పళ, యాద్గిర్ జిల్లాల ఏర్పాటుతో విభజింపబడి పురోభివృద్ధి చెందుతున్నాయి.

కె. వెంకటేశ్వరరావు - ఫోన్: 949 063 6659.

---

*.... బతుకు తీపే మరణ భయం! తల్లి ఒడిలోని బిడ్డను తస్కరించు / బిగువు కౌగిలి తెగత్రెంపి ప్రియులబాపు / అకట! / మృత్యువు నిర్దయురాలు, దాని / లీలకుంప్రతీకారముల్ లేవు, జగతి... అంటాడు బుద్ధుడు - పింగళి, కాటూరి కవుల సౌందర్యనందం కావ్యంలో. ఇదీ మరణం రణాన్నినాదం. మిసిమి ఆగస్ట్ - 2021లో అశ్వినీకుమార్ మరణమంటే భయమెందుకు? వ్యాసం చదివాక నా గుండె చప్పుడు ఇది. బుద్ధుడు చెప్పినా బుద్ధిమంతుడు చెప్పిన మరణం మరణమే. బ్రతుకుకు సవాలక్ష ప్రత్యామ్నాయాలున్నాయేమోగానీ మరణానికి ప్రత్యామ్నాయం లేదు. జన్మించినప్పుడు మరణం తప్పదన్నది నగ్నసత్యం. ఇది తెలిసి కూడా మానవుడు మరణానికి భయపడుతుంటాడు. మనకంటే ముందు చనిపోయినవాళ్లను చూశాకయినా మనకూ మరణం తప్పదన్న వాస్తవాన్ని మనం గుర్తించలేకపోవటం అజ్ఞానానికి పరాకాష్ట. జీవితం ఆనందమయమనుకుంటే మరణం కూడా ఆనందమయమే! బుద్ధుడే అంటాడు - సుతుడంచున్ పతియంచు బాంధవుడటరానునే మోహ విభ్రాంతి సం / గతులై, దుస్తర శోకవార్ధిపడి చీకాకైనయో! జీవసంతతులారా! కలిపాశబద్ధులగు ఆర్త ప్రాణులారా! జను / ర్మృతి సంపీడితులార! సత్యపథమాన్ మీరెల్లరాచరింపుడీ (సౌందరనందం - 1-20) - మానవ జన్మ చావుపుట్టుకల సమ్మేళితం. జీవితం శాశ్వతం కాదని తెలిసి కూడా మనమంతా సంసార మోహంలో పడి దుఃఖాన్ని అనుభవిస్తున్నాం. కానీ నిజమైన జీవిత సత్యాన్ని తెలుసుకోలేకపోతున్నాం. ఎప్పుడో వచ్చే మరణానికి భయపడి కళ్ళముందున్న ఆనందానికి దూరమవుతున్నాం. మనం మరణానికి భయపడాల్సిన పని లేదు. అది మన వెన్నంటే ఉంటుంది. మహాత్మా గాంధీ, మదర్ థెరిస్సా, వివేకానందుడు, మండేలావంటివారు నిస్వార్థ సేవలో చరితార్థులయ్యారు. మరణాన్ని జయించారు. ఎందరో దాతలు, వదాన్యులు తమ దానగుణంతో కీర్తికాముయ్యారు. సేవామార్గం, సత్యమార్గం, ధర్మ దృష్టి ఉంటే మనం దేనికీ భయపడాల్సిన పనిలేదు. చివరికి మరణానికి కూడా! చనిపోయినవారి కోసం మనం కంటతడి పెడతాం. కానీ కాలం కన్నీరు పెట్టుకోదు. ఒకరి స్థానంలో మరో కారణజన్ముణ్ణి కాలమే లోకానికి ప్రసాదిస్తుంది. చరిత్రలో మహనీయులంతా వారే! కొత్త నీరు వస్తే, పాత నీరు పోయినట్లు, కొత్త తరానికి చోటిస్తూ పాతతరం వెళ్లిపోవాల్సిందే! పోతూపోతూ వాళ్ళ పాదముద్రల్ని మనకు వదిలి వెళ్తారు అంటాడు హెచ్.డబ్ల్యు లాంగ్ ఫెలో. చావు నీది / పుట్టుక నీది / బ్రతుకంతా దేశానిది అన్నాడు లోకనాయక్ జయప్రకాశ్ నారాయణ్‌ని ఉద్దేశించి ప్రజా కవి కాళోజీ. మృత్యువు మనిషినే కాదు, చుట్టూ ఉన్న సంతాన*

*మిగతాది 72వ పుటలో...*




# సూయజ్ కెనాల్

## నౌకా రహదారి

– ప్రసాద్ చెన్నూరి

ఈ సంవత్సరం మార్చి నెలలో ఎవర్ గివెన్ అను పెద్ద కంటైనర్ నౌక సూయజ్ కెనాల్లో ఇరుక్కుపోవడం ప్రపంచ వాణిజ్య, రాజకీయ వర్గాలలో అలజడి సృష్టించింది. వివిధ రంగాలకు చెందిన నిపుణులు ప్రపంచ వ్యాప్తంగా స్థూల దేశీయోత్పత్తికి రానున్న నష్టాలు, అవసరం అయిన వస్తువుల సరఫరాకి కలుగనున్న అంతరాయాలు, దాని ప్రభావం గురించి చర్చించ సాగారు. V. ఎవర్ గివెన్ వార్త విడుదల అయిన తక్షణమే ముడిచమురు ధరలు అకస్మాత్తుగా పెరిగాయి. సూయజ్ కెనాల్ ఇరువైపులా అనేక నౌకలు అర్థాంతరంగా ఆగిపోవడంవల్ల ప్రపంచ వ్యాప్తంగా సరుకుల రవాణాకు అందుబాటులో ఉన్న నౌకల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఈ ప్రభావం నౌకల సగటు రవాణ ధరల మీద పడింది. ఈజిప్ట్ దేశానికి కెనాల్ ద్వారా సమకూరే ఆదాయం తాత్కాలికంగా స్తంభించి పోయింది. ఈ సంఘటన ప్రపంచంలోని ప్రతి నాగరికుని మీద పడిందనడంలో అతిశయోక్తి లేదనవచ్చు. ఈ నేపథ్యంలో మనమందరం అంతర్జాతీయ జలరహదారులు, వాటి ప్రాముఖ్యత, చరిత్ర గురించి తెలుసుకోవలసిన అవసరం ఎంతో ఉంది.

సూయజ్ కెనాల్ ఉత్తరాన ఉన్న మధ్యధరా సముద్రాన్ని దక్షిణాన ఉన్న ఎఱ్రసముద్రంతో కలుపుతుంది. ఈ కాలువ నిడివి సుమారు 190 కి.మీ. ఈ కాలువ ఆవిష్కరణ 1869లో జరిగింది. ఈ ఆవిష్కరణవల్ల భారత్, ఉత్తర ఐరోపా దేశాల మధ్య దూరం సుమారు, 4500 మైళ్ళు (7000 కి.మీ. పైన) తగ్గింది. అంటే ప్రయాణ సమయం 15 రోజుల వరకు తగ్గుతుంది. ఫలితంగాకలిగే ఆర్థిక లాభాలు ఊహించడం సామాన్యులకు కూడా కష్టతరం కాదనుకుంటాను. సూయజ్ కెనాల్ దగ్గరదగ్గర 3900 సంవత్సారల క్రితమే వాడుకలో ఉన్నదని కొతమంది చరిత్రకారుల అభిప్రాయం. అయితే ప్రస్తుతమున్న కెనాల్‌కు అప్పటి కెనాల్‌తో ఎటువంటి పోలిక లేదని అంటారు. ఫారో సెనుస్రెట్ III ఈ కెనాల్ రూపకర్తగా చరిత్రకారులు చెపుతారు. నైల్ నదిని, దాని అనేక పాయలను వినియోగించి, బిట్టర్లేక్స్ ద్వారా యెఱ్ఱ సముద్రాన్ని మధ్యధరా సముద్రంతో అనుసంధానం చేశాడని చరిత్రకారులు అంటారు. మధ్యధరా సముద్రం వైపు ఉన్న అలెక్జాండ్రియ వద్ద నౌకలు నైల్ నదిలో ప్రవేశించి, జగజిగ్ వరకు ప్రయాణించి, నైల్ నది ఇతర పాయల ద్వారా బిట్టర్లేక్స్ చేరి, అక్కడి నుండి యెఱ్ఱ సముద్రానికి వెళ్ళేవట. ఆ సమయంలో ఈ చెరువులు ఎఱ్రసముద్రానికి కాలువల ద్వారా అనుసంధానమై ఉండేవని చరిత్రకారులు నమ్ముతారు. కాలగమనంలో ఈ కాలువలు కలిసిపోయినవి. కాని ఈ కాలువల అవశేషాలు పోర్ట్ సూయజ్ దగ్గర ఉన్న జెనీవా వద్ద ఇప్పటికీ చూడవచ్చు.

క్రీ. పూ. 610 లో ఇసుక మేటలు వేసి ఈ కాలువలకు ఆనకట్టలాగా నిలిచిందంటారు. ఈ కారణంగా నైల్ నది బిట్టర్ లేక్స్ నిండి విడిపోయినదని చరిత్రకారుల అభిప్రాయం. నిర్లక్ష్యం, నిర్వహణ లోపాలవల్ల ఈ చెరువులు యెఱ్ఱ సముద్రం నుండి కూడా వేరైనవంటారు. నీకొ II (Necho II – క్రీ.పూ. 610 ది 595) ఈ జలమార్గమును పునరుద్ధరించే ప్రయత్నం చేశాడట. నైల్ నదిని బిట్టర్లేక్స్‌తో అనుసంధానం చేయడంలో సఫలీకృతుడైనాడు కాని బిట్టర్లేక్స్‌ను యెఱ్రసముద్రంతో కలపడంలో విఫలమైనాడు అంటారు. క్రీ.పూ. 510లో డారియస్ I (Darius I – క్రీ.పూ. 550 ది 486) ఈ జలమార్గాన్ని తిరిగి వాడుకలోనికి తీసుకు రావడనికి ప్రయత్నం చేశాడు. తన ముందు ప్రయత్నించిన నీకొ II (Necho II)లాగానే నైల్ నదిని చెరువులతో కలుపగలిగాడు కాని చెరువులను యెఱ్రసముద్రంతో కలపడంలో పూర్తిగా సఫలత సాధించలేకపోయాడు. అంటే



గ్రేట్ బిట్టర్ లేక్స్ వేడుకలలో పాల్గొన్న నౌకలు


నౌకాయానానికి ఉపయోగకరం కానటువంటి చిన్న కాలువలతో యెర్రసముద్రాన్ని బిట్టర్ లేక్స్‌కు కలుపగలిగాడు. ఈ కాలువలు నైల్ నదికి వరదనీరు వచ్చిన సమయంలో మాత్రమే పనిచేసేవని చరిత్రకారుల కథనం. టోలెమి II లేక టోలెమి ద గ్రేట్ (Ptolemy The Great - క్రీ.పూ. 308 ది 246), నీకొ II మరియు డారియస్ I ఎదురుకొన్న ఇబ్బందులను అధిగమించి నైల్ నదిని గ్రేట్ బిట్టర్ లేక్స్ ద్వారా ఎర్రసముద్రానికి కలిపాడు. డారియస్ I తవ్వించిన నౌకాయానానికి పనికిరాని కాలువలను తిరిగి తవ్వించి విజయాన్ని సాధించాడు. నైల్ నదిని గ్రేట్ బిట్టర్ లేక్స్‌తో కలిపే కాలువను ఫారొస్ కాలువగా పిలిచేవారు. డారియస్ I మరియు టోలెమి II తాము సాధించిన ఈ విజయాలను ప్రకటిస్తూ చేయించిన శిలాఫలకాలు సూయజ్ దగ్గరలో నైల్ నదీతీరంలో దొరికాయి. టోలెమి II వ్రాయించిన ఫలకాల ప్రకారం నైల్ నది – యెర్రసముద్రాల అనుసంధానం క్రీ.పూ. 279/269 సంవత్సరాలలో పూర్తి అయ్యి ఉండవచ్చు.

రోమన్ రాజు ట్రేజన్ (Trajan – క్రీ. శ. 53 ది 117) వాణిజ్యాభివృద్ధికి ఈ కాలువ ప్రాముఖ్యతను గుర్తించి తిరిగి తవ్వించాడు అని అంటారు. ఈ కాలువ పాత కైరొ నగరం వద్ద ప్రారంభమై ఎల్ అబ్బాస వద్ద అంతమయ్యేదట. అక్కడ జగజిగ్ పట్టణంలోని ఒకానొక నైల్ పాయలో విలీనం అయ్యేదని చరిత్రకారులు నిర్ధారించారు. ఆ తరువాత వచ్చిన పాలకులు ఈ జలమార్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చెయ్యడంవల్ల ఇసుకతో నిండి నౌకాయానానికి పనికిరాకుండా పోయింది. క్రీ.శ. 641లో అమిర్ ఇబిన్ ఎల్యాస్ ఈ కాలువను పునఃప్రారంభించి అమిర్ ఎలొ మొమెనిన్ కాలువ అని నామకరణం చేశాడు. ఆ సమయంలో అమిర్ ఇబిన్ ఎల్యాస్ మధ్యధరా మరియు ఎర్రసముద్రాలను నేరుగా కలపాలనుకున్నాడట. అయితే ఖలిఫ్ ఒమర్ ఇబిన్ ఎల్ – ఖట్టబ్ ఎర్రసముద్రంలోని నీటితో ఇజిప్ట్ మొత్తమంతా మునిగిపోతుందన్న అభిప్రాయంతో అభ్యంతరం తెలిపాడని, అందువలన ఆ ప్రతిపాదన అక్కడితో ఆగిపోయిందని చరిత్రకారులు చెప్పారు. క్రీ.శ. 761లో అబ్బాసిద్ ప్రాంతపు ఖలిఫ్, అబుజాఫర్ అల్మన్సూర్ తనకు ఎదురు తిరిగిన మక్కా, మదీనా వాసులకు సరుకుల రవాణా ఆపివెయ్యడానికి ఈ కాలువను ఇసుకతో పూడ్చివేయమని ఆదేశాలు ఇచ్చాడని చరిత్రకారులు చెప్పారు. ఈ ఘటనతో రెండు సముద్రాలను కలుపుతున్న ఆ జలమార్గం సుమారు 1100 సంవత్సరాలు మూతబడిపోయింది. ఈ సమయంలో ఈజిప్ట్ వాణిజ్య విస్తరణకు అనుగుణంగా భూతల రవాణా మార్గములు ఏర్పడినవి. ఎల్ అబ్బాస మరియు ఎల్కస్సాసిన్ పట్టణాల మధ్య ఉన్న భూముల సాగుకు వెసులుబాటు కలిగించడానికి క్రీ.శ. 1820లో మొహమ్మద్ ఆలి పాషా ఈ కాలువలో కొంత భాగానికి తగిన మరమ్మత్తులు చెయ్యమని ఆదేశాలు ఇచ్చాడట. ఇది కేవలం భూముల సాగుబడి కోసం చేసిన ప్రయత్నమా లేక రెండు సముద్రాలను కలపటానికి చేసిన ప్రయత్నమా అన్నది నిర్ధారించి చెప్పలేము.

15వ శతాబ్దాంతంలో పోర్చుగీస్ నావికుడు బార్తలొమ్యు డయాస్ కేప్ ఆఫ్ గుడ్ హోప్ మీదుగా భారతదేశము మరియు పరిమళ/సుగంధ ద్రవ్యాలు దొరకు ఇతర ద్వీపాలకు దారి కనుగొన్నాడు. దీనితో మధ్యధరా ప్రాంతానికి, ముఖ్యంగా వెనిస్ నగరానికి వాణిజ్య పరంగా ప్రాముఖ్యత సన్నగిల్లింది. వెనిస్ నగరానికి చెందిన ప్రముఖులు ఎర్ర, మధ్యధరా సముద్రాలను కలిపే పురాతన జలమార్గాన్ని పునరుద్ధరించడానికి ఈజిప్ట్‌తో చర్చలు జరిపారు. క్రీ.శ. 1517లో ఆటొమన్ సుల్తాన్ సలిం ఈజిప్ట్‌పై సాధించిన విజయంతో ఈ ప్రయత్నాలకు సాఫల్యం చేకూరలేదు. క్రీ.పూ. 16వ శతాబ్దంలోనే ఆటొమన్ సుల్తాన్ సోకొల్లు మెహముద్ పాషా (Sokollu Mehmed Pasha – క్రీ.శ. 1506 ది 1579) కాన్ స్టాంటినోపుల్ Constantinople), ప్రస్తుతపు ఇస్తాన్‌బుల్, నుండి మక్కా మదీనాలకు ప్రయాణం సులభతరం చెయ్యడానికి, సుగంధ/పరిమళ ద్రవ్యాల వాణిజ్య కేంద్రాలను, హిందూమహా సముద్రాన్ని మధ్యధరా ప్రాంతానికి చేరువ చెయ్యడానికి మరియు మధ్యధరా, నల్లసముద్ర ప్రాంతాలలోని ఆటొమన్ నావికా దళాలను ఎర్రసముద్రంలోని నావికా దళాలతో

అనుసంధానం చెయ్యడానికి ఈ పురాతన జలమార్గాన్ని తిరిగి వాడుకలోనికి తీసుకురావాలనుకొన్నాడనీ, కానీ అర్థికంగా లాభదాయకం, ఆచరణీయ యోగ్యం కాదని తన ప్రయత్నాన్ని విరమించుకొన్నాడనీ అంటారు..

క్రీ.శ. 1798లో ఈజిప్ట్–సిరియాలపై దండయాత్రల నేపథ్యంలో నెపోలియన్ బోనపార్ట్ ఎర్ర, మధ్యధరా సముద్రాల మధ్య ఉన్న పురాతన జలమార్గ అవశేషాలను కనుగొనడానికి కుతూహలం కనబరిచాడట. ఫలితంగా అనేకమంది పురావస్తు పరిశోధకులు, మాన చిత్రకారులు, యంత్రకారులు ఈజిప్ట్ ప్రాంతంలో పలు పరిశోధనలు జరిపారు. వారు ఎర్రసముద్రం నుండి ఉత్తరంగా పయనించి నైల్ నదిలో కలియు ఒక జలమార్గ అవశేషాలను కనుగొన్నారని చరిత్రకారులు చెప్పారు. క్రీ.శ. 1804లో ఫ్రాన్స్ దేశానికి రాజు అయిన తరువాత, నెపోలియన్ బోనపార్ట్ ఈ రెండు సముద్రాలను కలుపుతూ ఒక కాలువ నిర్మాణం చేయాలనుకొన్నాడని చరిత్రకారులు చెప్పారు. ఈ యోచనను పరిశీలించడానికి నియమితులైన నిపుణులు తమ నివేదికలో ఎర్రసముద్రం మధ్యధరా సముద్రంకన్నా సుమారు 30 అడుగులు యెక్కువ యెత్తులో ఉన్నదని తప్పు అంచనా వేశారని చెపుతారు. అందువల్ల కాలువ నిర్మాణానికి లాకుల ఆవశ్యకత తప్పనిసరి అని, ఫలితంగా ధనం, సమయం భారీగా ఖర్చు అవుతాయని తమ నివేదికలో పేర్కొన్నారని, ఈ కారణంతో నెపోలియ తన ఆలోచనను విరమించుకున్నాడని చరిత్రలో నమోదయ్యింది.




ఫెర్డినాండ్ డి లిస్సెప్స్

నిర్మాణపరంగా ఎదురయ్యే సవాళ్ళ గురుంచి అనేక సందేహాలు ఉన్నప్పటికి తూర్పునున్న దేశాలకు దగ్గర మార్గాన్ని నిర్మించేందుకు కొంతమంది తమ ప్రయత్నాలు కొనసాగించారు. క్రీ.శ. 1830లో జెనరల్ ఫ్రాన్సిస్ చెస్నీ, ఎర్ర – మధ్యధరా సముద్రాల ఎత్తులో ఎలాంటి అంతరం లేదని, ఈ రెండు సముద్రాల మధ్య కాలువ నిర్మాణం సాధ్యమేనని తాను తయారుచేసిన ఒక నివేదికలో పేర్కొన్నాడు. కానీ ఈ నివేదికకు ఎటువైపు నుండి మద్దతు లభించలేదు. క్రీ.శ. 1846లో ఒక ఫ్రెంచ్ సంస్థ అనేకమంది నిపుణలను సూయజ్ కెనాల్ నిర్మాణ ప్రతిపాదనను అధ్యయనం చేయడానికి ఆహ్వానించింది. ఈ నిపుణుల బృందంలో బ్రిటిష్ ఇంజనియర్ రాబర్ట్ స్టీఫెన్సన్ మరియు ఫ్రెంచ్ ఇంజనియర్ పాల్ ఏడ్రియన్ బొర్డలూ కూడా సభ్యులే. బ్రిటిష్ వారు అందరికీ అందుబాటులో ఉండే ఈ కాలువ నిర్మాణంవల్ల భారత ఉపఖండంతో తమకున్న వాణిజ్యానికి పోటీ పెరుగుతుందన్న ఆలోచనతో ఈ ప్రతిపాదనకు సుముఖత చూపలేదు.

ప్రస్తుతం వాడుకలో ఉన్న సూయజ్ కెనాల్ నిర్మాణానికి జరుగుతున్న ప్రయత్నాలకు క్రీ.శ. 1854 – 1856 కాలంలో మార్గం సుగమమైనది. ఈ కాలంలో ఫ్రెంచ్ దౌత్యవేత్త, వ్యాపారి ఫెర్డినాండ్ డి లిస్సెప్స్ మరియు ఈజిప్ట్–సూడాన్ సుల్తాన్ సయిద్ పాషాల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందానికి సంబంధించిన అనుమతి పత్రం 30 నవంబర్ 1854న జారీ అయ్యింది. ఈ ఒప్పందానుసారం కెనాల్ నిర్మాణాంతరం, కెనాల్ నిర్వహణ 99 సంవత్సరాలపాటు నిర్మాణ సంస్థకు అప్పగించబడింది. బదులుగా ఈ సంస్థ లాభాలలో 15% ప్రభుత్వానికి చెల్లించవలసిందిగా నిర్ణయమైనది. ఒప్పందానుసారం ఫెర్డినాండ్ డి లిస్సెప్స్ కెనాల్ సంబంధిత ప్రణాళికలు, యోచనలు తయారు చేయడానికై నిపుణలతో కూడిన ఒక అంతర్జాతీయ సదస్సును ఏర్పాటు చేశాడు. ఈ బృందం 1856 డిసెంబర్‌లో ఒక వివరణాత్మకమైన నివేదికను సమర్పించింది. 15 డిసెంబర్, 1858న "దసూయజ్ కెనాల్ కపెని" స్థాపించబడింది. ఈ కాలువ నిర్మాణానికి ముందే బ్రిటన్, అలెక్జాండ్రియ నుండి కైరో మీదుగా సూయజ్ వరకు రైలు మార్గాన్ని నిర్మించింది. కేప్ ఆఫ్ గుడ్ హోప్ రవాణా మార్గంపై కూడా ఆధిపత్యాన్ని సాధించింది. అన్ని దేశాల నౌకలకు అందుబాటులో ఉండే ఈ కాలువ తమ ప్రయోజనాలకు అవరోధంకాగలదన్న ఆలోచనతో ఈ కాలువ నిర్మాణం మొదలైనప్పటి నుండి పూర్తి అయ్యేవరకు బ్రిటిష్ వారు అభ్యంతరం చెపుతూనే వచ్చారు. ఈ అభ్యంతరంలో భాగంగా కెనాల్ నిర్మాణానికి పనిచేస్తున్న కూలీలు వెట్టిచాకిరి చేస్తున్న బానిసలని దౌత్యపరంగా కూడా బ్రిటన్ ఒత్తిడి తీసుకు వచ్చింది.

ప్రస్తుతపు పోర్ట్ సయిద్ వద్ద 25 ఏప్రిల్ 1859న కెనాల్ని ర్మాణ పనులు మొదలు అయ్యాయి. ఈ తవ్వకాలు 10 సంవత్సరాలకు పైగానే సాగాయి. ఈ 10 సంవత్సరాలలో సుమారు 5 సంవత్సరాలపాటు బలవంతపు



పోర్ట్ సయిద్‌లో మతైక ప్రార్థనలు

కూలీ జరిగింది. 1863లో అప్పటి ఖెడీవ్ ఇస్మాయిల్ పాషా నిర్బంధ కూలీని రద్దు చేశాడు. ఈ చట్టంవల్ల కెనాల్ నిర్మాణానికి అందుబాటులో ఉన్న కూలీల సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఈ పరిణామంవల్ల నిర్మాణ పనులకు యంత్రాలను ఉపయోగించవలసిన అవసరం యేర్పడింది. ఈ ఆధునీకరణవలన బహుశా కెనాల్ నిర్మాణం త్వరితగతిని పూర్తి అయ్యినదేమో కూడా. నిర్మాణ సమయంలో చాలామంది కూలీలు కలరావంటి అయన రేఖాంతర/ఉష్ణమండల వ్యాధులతో మరణించారు అని చెపుతారు. కెనాల్ నిర్మించినవారు భద్రపరచిన గణాంకాల ప్రకారం ఈ సంఖ్య 1000 వరకు మాత్రమే.

ఫ్రాన్స్ ఆధ్వర్యంలో 1859 నవంబర్ మాసం మధ్యలో సూయజ్ కెనాల్ ఆవిష్కరణ ఘనంగా జరిగింది. ప్రపంచం నలువైపుల నుండి అనేకమంది ప్రముఖులు అతిథులుగా ఆహ్వానింపబడినారు. క్రైస్తవ, మహమ్మదీయ రీతులలో ప్రార్ధనలు, వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికై తాత్కాలికంగా పోర్ట్ సయిద్ వద్ద సముద్ర తీరంలో క్రైస్తవ ప్రార్థనా మందిరం, మసీదులను నిర్మించారు. నవంబర్ 15న సాయంత్ర సమయంలో ఖెడీవ్ ఇస్మాయిల్ పాషా విలాస నౌక మీద బాణాసంచా కాల్చడంతో ఆవిష్కరణ వేడుకలు ఆరంభమైనాయి. నవంబర్ 16న అతిథుల సమక్షంలో అధికారిక కార్యక్రమాలను నిర్వహించారు. నవంబర్ 17న అగ్రస్థానంలో ఇస్మాయిల్ పాషా విలాస నౌక సాగుతూ వెనుక మరికొన్ని నౌకలతో సూయజ్ కెనాల్ ద్వారా మొదటి ప్రయాణం మొదలైనది. ఈ తొలి ప్రయాణఘట్టం లోకొన్ని అవాంఛనీయ సంఘటనలు కూడా జరిగాయి. నవంబర్ 17న ఈ నౌకల సమూహం లేక్ తింసాలోని ఇస్మాయిలియ పట్టణం చేరింది. అక్కడ కూడా వేడుకలు జరిగాయి. అనేక రాజకీయ, సాంకేతిక, ఆర్థిక ఇబ్బందులను తట్టుకొని కాలువ నిర్మాణం పూర్తి అయినప్పటికీ ఖర్చు మాత్రం అంచనాలకు రెండితలైనది. మొదటి రెండు సంవత్సరాలలో ఈ కాలువగుండా రవాణా అయిన నౌకల సంఖ్య తక్కువగా ఉండడంవలన ఆర్థిక ఇబ్బందులు యెదురుకోవలసి వచ్చింది. 1869లో కాలువ ఆవిష్కరింపబడినప్పటికీ నిర్మాణ ప్రణాళికలో సూచించిన అన్ని అంశాలు 1871లో మాత్రమే పూర్తి అయినాయి.


సూయజ్ కెనాల్ నిర్మాణానికి ఆరునెలల ముందు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో అమెరికన్ ట్రాన్స్-కాంటినెంటల్ రైల్ రోడ్ నిర్మాణం పూర్తి అయినది. ఈ రెండు పరిణామాలు కలిసి వాణిజ్య ప్రపంచంలో మహత్తరమైన మార్పులు తెచ్చాయి. నౌకలకు ప్రపంచం చుట్టిరావడానికి పట్టే సమయం గణనీయంగా తగ్గిపోయింది. ఈ కాలువ ఆవిష్కరణ ఐరోపా దేశాలకు ఆఫ్రికా ఖండంలో త్వరితగతిన వలస సామ్రాజ్యాలు ఏర్పాటు చేయడానికి సహకరించింది. ప్రపంచవ్యాప్తంగా 1873లో ఆరంభమైన ఆర్థిక సంక్షోభానికి ఈ కాలువ ఒక కారణంగా చరిత్రకారులు పేర్కొన్నారు. పశ్చిమ/ఉత్తర ఐరోపా దేశాలకన్న మధ్యధరా సముద్ర ప్రాంతంలో ఉన్న దేశాలకు ఆసియా, తూర్పు ఆఫ్రికా దేశాలు దగ్గరవడంవల్ల ఆ దేశాలకు వాణిజ్యపరంగా లాభం చేకూరింది.

క్రీ.శ 1875లో అప్పటి ఈజిప్ట్ పాలకుడు, ఇస్మాయిల్ పాషా దేశంలో ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను అధిగమించాడానికి సూయజ్ కెనాల్ సంస్థలో ఈజిప్ట్ వాటా 44 శాతాన్ని 4 మిలియన్ పౌండ్లకు ఇంగ్లండ్ (బ్రిటన్)కు అమ్మివేశాడు. విచిత్రమైన విషయం ఏమిటంటే, సూయజ్ కెనాల్ నిర్మాణానికి నిరంతరం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వచ్చిన బ్రిటన్ సూయజ్ కెనాల్ సంస్థలోని ఆ 44% కొనడం. ఈ లావాదేవీ తరువాత కూడా ఫ్రాన్స్ దేశం అత్యధిక వాటాదారుగా (56%) ఉండిపోయింది. ఈ లావాదేవీతో ఈజిప్ట్ ప్రభుత్వం సూయజ్ కెనాల్ సంస్థ లాభాలలో యేటా తమకు అందే 31% వదులుకోవలసివచ్చింది.

క్రీ.శ. 1879లో మొహమద్ తౌఫిక్ పాషా ఈజిప్ట్ దేశానికి రాజు అయ్యాడు. ఈ సమయంలో ఈజిప్ట్ పాలనా వ్యవహారాలలో ఫ్రాన్స్ మరియు బ్రిటన్ దేశాల ప్రభావం, జోక్యం యెక్కువగా ఉండేది. ఈ పరిస్థితులను వ్యతిరేకిస్తు కల్నల్ అహ్మద్ ఉరబి నేతృత్వంలో 1879లోనే తిరుగుబాటు మొదలైంది. ఈ తిరుగుబాటును అణచివేయడానికి

మొహమెద్ తౌఫిక్ పాషా బ్రిటిష్ వారి సహాయం కోరాడు. ఈ నెపంతో బ్రిటన్ ఈజిప్ట్‌పై ఆధిపత్యం సాధించింది. ఈజిప్ట్ పేరుకు ఆటొమన్ సామ్రాజ్యంలో భాగంగా ఉన్నప్పటికీ పరిపాలనా వ్యవహారాలు పూర్తిగా బ్రిటిష్ వారి ఆధీనంలోకి చేరాయి. ఆంగ్ల దౌత్యవేత్త ఎవెలిన్ బేరింగ్ తిరుగుబాటును అణచివేసి, అవినీతిని నిరోధించి పాలనా తీరును ఆధునీకరించాడు. ఈ పరిణామాలు సూయజ్ కాలువ ద్వారా జరిగే రాకపోకలు, తద్వారా వచ్చే రాబడి పెరగడానికి దోహదపడ్డాయి. క్రీ.శ. 1888లో కాన్‌స్టాంటినోపుల్ (ప్రస్తుతపు Istanbul) తీర్మానం సూయజ్ కాలువను బ్రిటీష్ స్వాధీనంలోని తటస్థ ప్రదేశంగా ప్రకటించింది.

1955లో జమాల్ అబ్దుల్ నస్సర్ అధ్యక్షుడుగా ఉన్న ఈజిప్ట్, రష్యావైపు మొగ్గుచూపసాగింది. అమెరికా నుండి ఆయుధాలు కొనడంలో ఈజిప్ట్ విఫలమవ్వడమే ఈ పరిణామానికి దారితీసిందని విశ్లేషకులు భావిస్తారు. ఈ పరిణామానికి ముందు అస్వన్ వద్ద ఆనకట్ట నిర్మాణానికి ఈజిప్ట్ ఆర్థిక సహాయం కోసం బ్రిటన్, అమెరికాలతో ఒప్పందం కుదుర్చుకొంది. కానీ పై కారణాల వల్ల అమెరికా ఒప్పందం నుండి వైదొలగి ఆర్థిక సహాయాన్ని నిరాకరించింది. ఆనకట్ట నిర్మాణానికి కావలసిన ఆర్థిక వనరులు సమకూర్చుకునేందుకు ఈజిప్ట్ అధ్యక్షుడు జమాల్ అబ్దుల్ నాస్సర్ సూయజ్ కెనాల్‌ను 26 జులై 1956 న జాతీయం చేశాడు. అప్పటికి ఈజిప్ట్, సూయజ్ కెనాల్ కంపెనీల మధ్య కుదిరిన ఒడంబడిక పూర్తి అవ్వడానికి 13 సంవత్సరాల సమయం మిగిలి ఉన్నది. అంతేకాకుండా టిరాన్ జలసంధిని ఇజ్రైక్ నౌకలు వాడుకోకుండా ఈజిప్ట్ అడ్డగించింది. సూయజ్ కెనాల్ కంపెనిలో వాటాదారులైన బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఇజ్రైల్‌తో కలసి ఈజిప్ట్‌పై దాడి చెయ్యడానికి ఒప్పందానికి (సెవ్రూ ఒడండిక – Protocol of Sevres) వచ్చాయి. ఈ ఒప్పందం ప్రకారం 29 అక్టోబర్ 1956న ఇజ్రైల్ సినాయ్ ద్వీపకల్పంలోనికి చొచ్చుకువచ్చి ఈజిప్ట్‌ను యుద్ధానికి రెచ్చగొట్టింది. ఈ యుద్ధం మధ్య–తూర్పు ప్రాతంలో అనిశ్చితికి దారితీస్తుందనే నెపంతో బ్రిటన్, ఫ్రాన్స్ యుద్ధంలోకి దిగాయి. ఈజిప్ట్, ఇజ్రైల్‌ల మధ్యయుద్ధం ఆపే ప్రయత్నమే తాము యుద్ధంలో దిగడానికి కారణం అని ఆంగ్లో–ఫ్రెంచ్ భాగస్వామ్యం ప్రకటించినా, యుద్ధానికి అసలు కారణం జమాల్ అబ్దుల్ నాస్సర్ ప్రభుత్వాన్ని పడగొట్టి సూయజ్ కెనాల్‌ను తిరిగి తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలన్న ఉద్దేశ్యమే. ఈ యుద్ధం ఆపడానికి కెనడా విదేశాంగ మంత్రి



లేక్ తింసాలో వేడుకలు

లెస్టర్ బౌల్స్ పియర్సన్ ఐక్యరాజ్య సమితి (UNO)లో ఒక ప్రతిపాదనను తీసుకు వచ్చాడు. సూయజ్ కెనాల్ ప్రాంతంలో శాంతిభద్రతలు కాపాడడానికి, కాలువ అన్ని దేశాలకు అందుబాటులో వుండేటట్టు చూడడానికి ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో మొదటిసారిగా ఒక సైనిక దళాన్ని మోహరించాలని, సినాయ్ ద్వీపకల్పం నుండి ఇజ్రైల్ తమ సేనను ఉపసంహరించాలని ప్రస్తావించాడు. ఐక్యరాజ్య సమితిలోని అత్యధిక దేశాలు ఈ ప్రతిపాదనకు 4 నవంబర్ 1956న మద్దతు తెలిపాయి. ఇజ్రైల్, ఈజిప్ట్‌లు ఉమ్మడి అంగీకారంతోనే ఈ సేనలు ఉపసంహరింపబడతాయని ఈ తీర్మానంలో పేర్కొన్నారు. అమెరికా బ్రిటన్‌పై ఒత్తిడి తేవడానికి స్టెర్లింగ్–పౌండ్ అమ్మసాగింది. బ్రిటన్ యుద్ధవిరమణ చేసి, సంవత్సరాంతానికి తమ సేనను ఉపసంహరించడానికి అంగీకరించింది. తరువాత లెస్టర్ బౌల్స్ పియర్సన్‌కు ఈ యుద్ధం ఆపడానికి చేసిన ప్రయత్నాలకు గుర్తింపుగా నోబెల్ శాంతి బహుమతి (Nobel peace prize) లభించింది. యుద్ధం ఆగిపోయినప్పటికీ, యుద్ధకాలంలో వాటిల్లిన నష్టంవల్ల, జమాల్ అబ్దుల్ నాస్సర్ ఆదేశానుసారం కాలువలో ముంచివేసిన నౌకలవల్ల, ఏప్రిల్ 1956 వరకు సూయజ్ కాలువ మూతబడి ఉండిపోయింది. ఐక్యరాజ్య సమితి సహాయ సహకారాలతో ఈ కాలువ పునఃప్రారంభమైనది. ఇదేసమయంలో, కాలువ అందరికీ అందుబాటులో ఉండేటట్టు చూడడానికి, సినాయ్ ప్రాంతంలో శాంతిభద్రతలు కాపాడడానికి యునైటెడ్ నేషన్స్ ఎమర్జెన్సి ఫోర్స్ (UNEF) స్థాపన కూడా జరిగింది.

30 ఏప్రిల్ 1961 నసూయజ్ కెనాల్ మొదటి దశ విస్తరణ పనులు పూర్తి అయినాయి. రెండవ దశ విస్తరణ పనులు 1 సెప్టెంబర్ 1961న ముగిశాయి. ఈ విస్తరణ తరువాత సుయజ్ కెనాల్ ద్వారా ప్రయాణించే నౌకల

ప్రమాణం క్రమేపి పెరుగుతూ వచ్చింది. 13 మార్చ్ 1962న అప్పట్లో అన్నింటికన్నా అతి పెద్దదైన (106500 టన్నులు) ముడిచమురు నౌక "మన్‌హట్టన్ (MT Manhattan)" ఈ కాలువ ద్వారా రవాణా అయ్యింది. 27 అక్టోబర్ 1966న ముడిచమురు నౌక "బర్గ్‌హావెన్" (MT Birghaven - 153511 టన్నులు) ఈ కాలువ ద్వారా రవాణా అయ్యింది.

మే 1967లో జమాల్ అబ్దుల్ నాస్సర్ ఐక్యరాజ్య సమితి భద్రతాదళాలను సినాయ్ ప్రాంతంను ఖాళీ చెయ్యమని ఆదేశించాడు. దీనికి ఇజ్రైల్ అభ్యంతరం తెలిపింది. ఈజిప్ట్ టిరాన్ జలసంధిని తిరిగి ఇజ్రైల్ నౌకలకు అడ్డగించింది. 1951 ది 1952 మధ్య కొద్దికాలం తప్పించి 1949 నుండి ఇజ్రైల్‌కు చెందిన నౌకలకు సూయజ్ కెనాల్ మూసివేయబడి ఉంది. ఆరు రోజుల యుద్ధం తరువాత ఇజ్రైల్ సూయజ్ కెనాల్ తూర్పు తీరంతో సహా సినాయ్ ప్రాంతంను ఆక్రమించింది. ఇజ్రైల్‌ను సూయజ్ కెనాల్ వాడుకోకుండా నిరోధించడానికి జమాల్ అబ్దుల్ నాస్సర్ అడ్డంకులు కల్పించి కాలువను మూతపడేటట్టు చేశాడు. ఈ కారణాన 15 వాణిజ్య నౌకలు కాలువలో 1975 వరకు యిరుక్కుపోయాయి. 1973లో ఈజిప్ట్, ఇజ్రైల్‌ల మధ్య మరోసారి యుద్ధం జరిగింది. ఈ యుద్ధం యొంకిప్పర్ యుద్ధంగా కూడా పిలవబడుతుంది. ఈ యుద్ధంలో ఈజిప్ట్, ఇజ్రైల్ ఆక్రమిత సినాయ్ ప్రాంతంలోకి చొచ్చుకు రాగా, ఇజ్రైల్ కాలువను దాటి ఈజిప్ట్‌లోకి చొచ్చుకు వెళ్ళింది. ఈ యుద్ధంలో జరిగిన నష్టాలకు, విధ్వంసానికి సాక్ష్యాలుగా కొన్ని అవశేషాలు ఇప్పటికీ మిగిలి ఉన్నాయి. 1974, 1975 సంవత్సరాలలో అమెరికా, బ్రిటన్‌ల నౌకాదళాలకు చెందిన నౌకలు సూయజ్ కెనాల్‌లోని అడ్డంకులను తొలగించి కాలువ ద్వారా మార్గాన్ని సుగమము చేసాయి. అప్పటి నుండి ఈ కాలువ ఎటువంటి అవాంతరాలు లేకుండా నడుస్తున్నది. 2014లో సూయజ్ కెనాల్ భారీ విస్తరణ పూర్తి అయ్యింది. ఇప్పుడు 2 లక్షల టన్నుల భారీ నౌకలు కూడా ఈ కాలువ ద్వారా పయనించగలవు. ఈ వ్యాసంలో ఇంతకు ముందు ప్రస్తావించినట్లు 1967లో జరిగిన యుద్ధసమయంలో 15 నౌకలు ఈ కాలువలో 8 సంవత్సరాల పాటు యిరుక్కుపోయాయి. ఎడారి యిసుక పేరుకు పోవడంవల్ల ఈ నౌకల రంగు పసుపు పచ్చగా మారిందట. అందువల్ల వీటికి "యల్లోఫ్లీట్" అని పేరు వచ్చింది. 1975లో కాలువ మళ్ళీ తెరువబడి ఈ నౌకలకు ప్రయాణం తిరిగి కొనసాగించడానికి అనుమతి లభించే సమయానికి వీటిలో కేవలం 2 నౌకలు మాత్రమే సముద్ర యానానికి యోగ్యంగా మిగిలాయి.

1869లో సూయజ్ కెనాల్ నిర్మాణం పూర్తికావస్తున్న సమయంలో ఫ్రెంచ్ శిల్పి ఫ్రెడ్రిక్ అగస్టియె బార్తోల్డి మధ్యధరా సముద్రంవైపు కాలువ మొదలయ్యేచోట "కొలొసస్ అఫ్రోడ్స్‌వంటి 90 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని ఆవిష్కరించాలని ఒక ప్రతిపాదనను కాలువ రూపకర్త ఫెర్డినాండ్ డి లెస్సెప్స్, ఈజిప్ట్ ప్రభుత్వాల ముందు ఉంచాడు. ఈ విగ్రహానికి "ఈజిప్ట్ బ్రింగింగ్ లైట్ టు ఏషియా అని పేరుపెట్టాలని, ఈ విగ్రహం ద్వీపస్తంభంగా కూడా పనిచేస్తుందని సూచించాడు. అయితే ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. బార్తోల్డి తన ఈ ప్రతిపాదనను వదలలేదు. తుదకు 1886లో బార్తోల్డి తన ఆలోచనకు రూపకల్పన చేయగలిగాడు. న్యూయార్క్ ఓడరేవులో "లిబర్టీ ఎన్‌లైట్నింగ్ ద వరల్డ్‌గా ఆవిష్కరింపబడింది. ప్రస్తుతం ఈ విగ్రహం "స్టాట్యూ ఆఫ్ లిబర్టీ"గా పిలవబడుతున్నది.

ప్రసాద్ చెన్నూరి - మెరైన్ ఇంజనీర్
హైదరాబాద్. ఫోన్: 991 225 5220.

---


*66వ పుట తరువాయి...* *బంధాన్ని, అతడి ప్రామాణిక సామాగ్రిని తీసుకుపోతుంది. నిద్రిస్తున్న గ్రామాన్ని వరద తీసుకుపోయినట్లు - అంటాడు బుద్ధుడు. లోకంలో అందరూ దుఃఖాశ్రయులే! నూనె దీపం ఆరిపోవడానికి నాలుగు కారణాలు ఉన్నట్లే మానవ జీవితం కూడా వత్తిలాగే ఆరిపోతుంది. మరణమంటే భయమెందుకు అనే అంశాన్ని విశ్లేషిస్తూ అశ్వనీకుమార్ లోతైన, తాత్విక చర్చకు తెరతీశారు. మహాభారతం లోని ధర్మరాజు యక్షప్రశ్నలు, బౌద్ధం ప్రకారం మరణానికి కారణాలు, సాక్ అలిన్‌స్కీ, గురునానక్‌వంటి మహనీయుల అభిప్రాయాలను సందర్భోచితంగా వివరించారు. జ్ఞానులు మృత్యువును సంతోషంగా ఆహ్వానిస్తారు. మరణం నను వరించి వస్తే / ఏమంటాను, నేనేమంటాను / పాలు తాపి, జోలపాడి పడుకోమంటాను అంటారు సినారె. సత్కార్యాలు, సత్కర్మలు చెయ్యటం ద్వారా, కోరికలను విసర్జించడం ద్వారా, స్వార్థరహితంగా బ్రతకడం ద్వారా మనం మరణాన్ని జయించవచ్చు. అంటే జీవితాన్ని సార్థకం చేసుకోవచ్చు. అశ్వినీకుమార్ గారికి ఆత్మీయ అక్షరాంజలులతో....."*

డా. బీరం సుందరరావు, చీరాల. ఫోన్: 9848039080



# ధార్మిక విలువలు

*– అశ్వినీకుమార్*



బుద్ధుని బోధనలను సాధారణంగా 'ధమ్మ'మని ధర్మమని అంటారు. అది కొత్తగా బహిర్గతమైనదో – ఆధ్యాత్మికపరమైన లేక వేదాంతపరమైన మర్మాలతో కూడిన ఊహాగానమూ కాదు. అది ఈ విశ్వంలో అనాదిగా – సర్వాంతర్యామిగా వర్ధిల్లుతున్న సత్యం. దానిని ఎరుకలోనికి తెచ్చింది జ్ఞానప్రకాశకుడయిన ఆధ్యాత్మిక గురువు. అయితే ఈ 'ధమ్మ' – 'ధర్మా'నికి ఆధునిక నామం 'బుద్ధిజమ్'. గౌతమ బుద్ధుని పేర ఈ 'ధమ్మ' ప్రకాశం లోకంలో ప్రచారం పొందింది.

బుద్ధుడు తాను తెలుసుకున్న సత్యాన్ని ప్రపంచానికి తెలియజేయడానికి తన కర్తవ్యంగా ప్రవచించాడు – సామాన్యులకు ఇది కష్టసాధ్యమైన ఎరుకయే! సందేహం లేదు. వారి బుద్ధి భ్రమలతో నిండి ఉంటుంది కదా!

ఈ ధార్మిక విలువలు – ధమ్మాన్ని పవిత్రంగా – ఉన్నంతగా నిలబెడతాయి.

ముఖ్యంగా మూడు అంశాలు – ఈ 'ధమ్మ'పరంగా మనం గుర్తుంచుకోవాలి.

మొదటిది – ఈ సిద్ధాంతాన్ని అకలంక సహజత్వంతో అర్థం చేసుకోవాలి.

రెండవది – త్రికరణశుద్ధిగా బుద్ధుని బోధనాసారానుగుణంగా జీవితంలో ఆచరించగలగాలి. మంచిని పెంచుతూ – చెడుకు దూరంగా ఉంటూ – బుద్ధిని శుద్ధిగా ఉంచుకోవడానికి సర్వశక్తులూ వినియోగించుకోవాలి.

చివరిది – మూడవది – వివేకాన్ని పెంపొందించుకుని – బుద్ధుని ప్రవచనాల పూర్తి అవగాహన పొందాలి.

ఈ ధార్మిక విలువలలో ముఖ్యంగా 6 విశిష్ట లక్షణాలను ప్రముఖ బౌద్ధిక గ్రంథాలు ఉటంకిస్తున్నాయి. ఎన్నో ధార్మిక విలువలలో పైన చెప్పినట్లు 6 ప్రముఖ లక్షణాలను బౌద్ధులు వారి రోజువారీ ప్రార్థనలో జపించేవి – అవి 'పాలీ'లో ఈ 'ధమ్మ' విలువలను ఈ క్రింది విధంగా చెప్పారు–

***స్వఖతో – భగవతాధమ్మో;***
***సందిత్తికో, అకలికో, ఎత్తిపస్సికో***
***పక్కత్తమ్ వెదితబ్బో విన్నుహి...***

వీటి అర్థ తాత్పర్యాలు మనం తెలుసుకుందాం!!

***

**1. స్వఖతో భగవతా ధమ్మో:**

దీని అర్థం ధమ్మాన్ని ప్రకాశనంచేసి స్పష్టంగా ప్రబోధించింది – బుద్ధ భగవానుడు.

దీనిని ఇంతకు పూర్వం చెప్పిన మూడు అంశాల సాధారణ బోధగా – సిద్ధాంతము, సాధన, పూర్తి అవగాహన పొందటం – అర్థం చేసుకోవాలి. ఇది ఇలా ఉండగా – మిగతా అంశాలు 'లోకుత్తర'గా చెప్పబడతాయి. అందు ముఖ్యంగా ఎనిమిది అంశాలు పవిత్రతకు – నిర్మాణానికి "సమ్ముమ్వ్ం బోనవ్ం" బౌద్ధ సారాంశంగా తెలుసుకోబడుతుంది.

ధమ్మాన్ని బుద్ధుడు స్పష్టంగా ప్రవచించాడు. ఆది అద్భుతం – మధ్య అద్భుతం – అంతం (చివర) అద్భుతం! అందులో 'ద్వంద్వాలు' – విరుద్ధాలు లేవు – అనవసర ప్రసక్తి లేదు – దాని రాజమార్గం నుంచి ప్రక్క దారులు

లేవు!! సముద్రంలో ప్రతి బిందువుకూ ఒకే రుచి ఉన్నట్లు - అదే ఉప్పగా - ధమ్మానికి ఒకే రుచి - అదే నిర్వాణ ఆనందం!

ధర్మం - ధమ్మం - సత్యమైనది - సర్వ సత్తాకమైనది. ధమ్మం - 'శీల'తో మొదలవుతుంది. 'సద్గుణ'గా దాన్ని అర్థం చేసుకోవచ్చు. 'శీల' పునాదిపై ప్రశాంత మానసిక 'సమాధి' నిర్మాణమవుతుంది. 'పణ్ణ' - వివేకం - ఈ సమాధిని అనుసరించి - స్థిరత్వాన్ని పొందుతుంది.

ఈ 'ధమ్మ' జ్ఞానాన్ని పొందటం - ధమ్మాన్ని అధ్యయనం చేయటం, జ్ఞానుల ప్రసంగాలు విని నేర్చుకోవడం ద్వారా - ధర్మ సూత్రాలను అర్థం చేసుకోవడానికి, సరైన మార్గంలో సాధన చేయటానికి ఉపయోగపడుతుంది.

నిత్య సాధన ద్వారా మానసిక రుగ్మతలను అణిచివేసి బుద్ధిని శుద్ధిగా, శాంతంగా, సంతోషంగా ఉంచుకోగలగాలి! ఇలాంటి సాధనా సంపత్తి ఉత్తమ జ్ఞానానికి మానసిక అంతర్వీక్షణానికి దారిచూపి 'విపస్సన' జ్ఞానాన్ని తెలియజేస్తుంది. ఈ అంతర్దృష్టి - అంతర్వీక్షణం - అంతర్లోక జ్ఞానాన్ని ఈ జన్మ కాలపరిధిలోనే దర్శించగలిగే అవకాశం కూడా కలిగిస్తుంది.

జీవి - ఈ ప్రపంచంలో జీవి ఉనికిని బుద్ధుడు విశదీకరించినదే - మానవ జీవితంలో చివరి ఆలోచన!! హేతుబద్ధంగా బుద్ధుడు కనుగొన్న మార్గం - అప్పటికి ప్రచారంలో ఉన్న సంప్రదాయాలకు - పురాణాలకు భిన్నమైనది.

బుద్ధుడు ధమ్మ మూలాలను శోధించి నిర్ద్వందంగా మానవ మనుగడను నిర్వచించగలిగాడు.

నిరంకుశంగానో ఒంటెద్దు పోకడగానో కాకుండా ధమ్మాన్ని తెలియచెప్పింది - అప్పటివరకూ ప్రచారంలో ఉన్న సిద్ధాంత ప్రచారాలకు భిన్నంగా ధమ్మ రూపాన్ని ఆవిష్కరించాడు.

***

బుద్ధుడు ప్రవచించిన 'ధమ్మ' విశ్వంలో ఎటువంటి మానవాతీత శక్తికీ ఆపాదించలేదు. ఇది వ్యక్తిత్వ ధర్మానికి మూల విషయంగా ప్రతిపాదించాడు. అంటే వ్యక్తికీ - వ్యక్తికి స్వాతంత్ర్యాన్ని పాటిస్తూ - వ్యక్తిగతంగా ఆలోచించి నిర్ణయించుకునే శక్తి మనిషికే వదిలివేస్తూ తాను అనుభవపూర్వకంగా నిర్వాణ పథంలో పయనించాలని బోధించాడు. దీనికి బాహిరకమైన శక్తులపై ఆధారపడవలసిన అవసరం లేదంటూ ప్రవచించాడు.

'ధమ్మ' - ధర్మం - విశ్వవ్యాప్తమైనది - అది మానవాళి క్షేమానికి - చాలా గురుతరమైన అంశం - ప్రపంచంలో ఎక్కడైనా!?

ధమ్మాన్ని బోధించే ముందు బుద్ధుడు హేతుబద్ధంగా శాస్త్రపరంగా, ఆధ్యాత్మిక నిబంధనలు - వాడుక నియమాలు - స్పష్టంగా వివరించి - తన ప్రబోధన సాగించాడు.

ఉదాహరణకు - కమ్మ - కర్మ - కేవలం ఆచరణగానే అప్పటివరకు అర్థం చేసుకున్న విషయాన్ని కర్మకు ముందు సంకల్పం ఉంటుందని వివరించాడు!

ఉత్తమమైన ధర్మం సాంఘిక దురాచారాలను, కుల వివక్షతను, బానిసత్వాన్ని నిర్ద్వంద్వంగా వ్యతిరేకించింది. అలాగే స్త్రీల పట్ల అత్యాచారాలనే కాక సంఘంలో వారికిగల ప్రత్యేక స్థానాన్ని గుర్తు చేసింది. బుద్ధుడు ఎప్పుడూ నిరంకుశుడు కాడు. ఆధ్యాత్మిక సమానత్వాన్ని బోధించిన ఆచార్యుడు. త్రిశరణతో మొదలై నిర్వాణాన్ని పొందేవరకు బుద్ధుని అనుయాయులు ధమ్మపదంలో, ధమ్మ దర్శకత్వంలో ఎంతో రక్షణలో ఉంటారు.

**2. సందిత్తికో:**

ధర్మాన్ని అధ్యయనం చేసి త్రికరణశుద్ధిగా ఆచరించగలిగితే దాని ఫలితాలు ఇప్పుడే ఇక్కడే దర్శించవచ్చు.

ఉదాహరణకు - ఒక దుర్మార్గుడు - తనకు - సమాజానికి పీడగా తయారయి - చివరికి బుద్ధుని శరణుజొచ్చి - ధమ్మాన్ని ఆశ్రయించి - కొత్త జీవితాన్ని ప్రారంభించ నిశ్చయించుకుంటే - అతని కష్టాలు, దుఃఖాలు అంతమయిపోతాయి. దీనికి ఉన్నతమైన ఉదాహరణ అశోక చక్రవర్తి! బుద్ధుని శరణుజొచ్చిన తర్వాత - అతనిలోని క్రూరత్వాన్ని జయించగలిగి అప్పటివరకు 'చండశోక'గా తెలిసిన చక్రవర్తి 'ధమ్మశోక'గా ప్రసిద్ధి చెందాడు.

**3. అకలికో**

ధమ్మాచరణవలన కలిగే సత్ఫలితాలు వెంటనే లభిస్తాయి. బుద్ధుడు దర్శించిన ధమ్మానికి ఎంత కాలం గడిచిపోయినా అది నిత్యనూతనంగా - అసమానంగా వర్ధిల్లుతుంది! నేటి శాస్త్ర పరిశోధకులకు ధీటుగా సత్యాన్ని నిలబెడుతుంది.

సత్యం నిత్య నూతనం - అదే సత్యం. ధర్మమే సత్యం. దీనికి కాలధర్మాలు ఉండవు. ఈ ప్రపంచపు మూలస్వరూపాన్ని ఆవిష్కరిస్తుంది ధర్మం.

ప్రపంచంలో అంతులేని అసంతృప్తి ఉందని - లోభగ్రస్తమైన లోకానికి కష్టకాలం తప్పదని - అందుకు విరుగుడు - లోభాన్ని జయించగలగటమేనని - దానికోసం అష్టాంగమార్గమే శరణ్యమని - అకలికో తాత్పర్యం.

**4. ఇహిపస్సికో:**

ఇది అందరికీ ఆహ్వానం. వచ్చి, చూసి - పరీక్షించి - విశ్లేషించి - విమర్శించి అప్పుడు సంతృప్తితో ధర్మాన్ని అంగీకరించమని!

ఇందులో మార్మికత - మాయా ఏమీలేదని తెలుసుకోగలగాలి. ధమ్మం - పవిత్రమైన స్పష్టమైన విశదమైనది. అది మేలిమి బంగారంలాగా లోపరహితమైనది. బుద్ధుడు స్పష్టంగా చెప్పాడు.

"నేను చెప్పానని మీరు విశ్వసించకండి - నన్ను గౌరవించాలని తలదాల్చకండి - బంగారపు నిగ్గు గీటురాయి తేల్చినట్లు - ధమ్మాన్ని నిశితంగా పరిశీలించి - అంగీకరించాలి."

ఇంత స్పష్టంగా బుద్ధుడు తను ప్రతిపాదించిన 'ధమ్మ' విశేషాన్ని నిర్భయంగా ప్రపంచానికి చాటి చెప్పాడు.

**5. ఒపనాయికో:**

దీని తాత్పర్యం: ధర్మమార్గంలో పయనించాలంటే ధర్మసూత్రాలన్నీ మనఃపూర్వకంగా ఆచరించాలి. ఆ విధంగా ధమ్మపథం శాశ్వత శాంతికి - ఆనందానికి దారి చూపుతుంది! ధమ్మ - దీనికి నాలుగు దశలను బోధిస్తుంది. అవి పవిత్రమైనవి - ఫలితాలనిచ్చేవి - ఒకదాని తర్వాత ఒకటి సాధించదగిన దశలు - ధమ్మము మిమ్మల్ని చేయి పుచ్చుకుని - ఈ దశలన్నీ దాటించగలదు. మిమ్మల్ని విముక్తుల్ని చేయగలదు.

**6. పక్మత్తమ్ వేదితబ్బో విన్నుహి:**

దీని తాత్పర్యం: ధమ్మాన్ని వ్యక్తిగతంగా అర్థం చేసుకుని - వివేకంతో వ్యవహరించాలని. మరొకరి ప్రమేయంతో ధమ్మాన్ని 'జీర్ణించు।కోలేరు - మీకు దాహం వేస్తే మరొకరు నీరు తాగితే - మీ దాహం తీరదు కదా!

దీనిలో మనం చూడవలసిన రెండు అంశాలు: మొదటిది - నీ నిర్వాణం - లేదా జ్ఞానోదయానికి మీరే వ్యక్తిగత బాధ్యత - రెండవది ధమ్మాన్ని కేవలం వివేకవంతులే అర్థం చేసుకోగలరు.

బుద్ధుడు మిమ్మల్ని మాయమర్మాలతో రక్షించలేదు - మీకు జ్ఞానబోధ మాత్రం చేశాడు.

మీరు మంచి మార్గంలో ఎలా నడవాలో ఆయన నడిచి చూపాడు. నీ 'శీలాన్ని' నీవే పెంపొందించుకోవాలి. నీతిమార్గాన్ని వదలకుండా 'సమాధి' సాధన చేయాలి. బుద్ధిని కేంద్రీకరించి - తర్వాత 'పణ్ణ' సాధించటానికి నీ సహజ వివేకం వర్ధిల్లజేసుకోవాలి. నీ ధమ్మ ఆలోచన - సాధన - ఆచరణ ద్వారా నిర్వాణ పథంలో సాగాలి.

*- డా. కె. ధర్మానంద (జెమ్స్ ఆఫ్ బుద్ధిస్ట్ విజ్డమ్)*

---

## జ్ఞానవృద్ధుడు

ఒకరోజున కొందరు భిక్షువులు బుద్ధభగవానుడికి ప్రణామాలు సమర్పించాలని ఆయన సన్నిధికి వచ్చారు. ఆయనకు తెలుసు ఈ భిక్షువులకు అచిరకాలంలోనే అర్హత్వం కలుగుతున్నదని. ఆ భిక్షువులను ఆయన అడిగాడు. మీరు నా కుటీర ప్రాంగణంలోకి వస్తున్నప్పుడు ఎవరినైనా ఒక వృద్ధుణ్ణి (వృద్ధభిక్షువు) చూశారా? అని. అప్పుడు వాళ్లు మేము వృద్ధభిక్షువును ఎవరినీ చూడలేదే అంటూ ఒక యువశ్రామణేరుడు మాత్రం మీ దగ్గరకు రావటం చూశాము అని చెప్పారు. అప్పుడు బుద్ధభగవానుడు 'అలా వచ్చినతడు యువశ్రామణేరుడని అనుకుంటున్నారేమో కాని అతడు చాలా చాలా వృద్ధుడు. వయస్సును బట్టి నేను ఒక భిక్షువును తరుణుడనీ, వృద్ధుడనీ చెప్పను. పెద్దవాడు అని ఎవరి గూర్చి అంటాను అంటే చతురార్య సత్యాలను బాగా బోధపరచుకొని ఇతరులకెవరికీ ఈషణ్మాత్రమైనా అపకారం తలపెట్టని వ్యక్తినే వృద్ధుడంటాను. వయోవృద్ధుడు వృద్ధుడు కాదు. అతడెంత చిన్నవయస్సు వాడైనప్పటికీ జ్ఞానవృద్ధుడే వృద్ధుడు' అని తథాగతుడు వాళ్లకు బోధించాడు.



**ధమ్మపదం గాథలు - అనువాదం: అక్కిరాజు రమాపతిరావు**



# ఈ భూమిపై నివసిస్తున్న ప్రాణికోటితో బాంధవ్యం

నది ప్రక్కనే ఒక చెట్టు ఉన్నది. ప్రతి రోజూ సూర్యోదయం అవక మునుపు నుంచే చెట్టువైపు చూస్తూ కూర్చుంటాను. ఇలా అనేక వారాలు చెట్టును చూస్తూ గడిపాను. దిగంత రేఖ పై నుండి, దూరాన ఉన్న చెట్లపై నుండి మెల్లమెల్లగా పైకి లేస్తూ ఉండగానే ఈ చెట్టు హఠాత్తుగా బంగారు వర్ణంలోకి మారిపోతుంది. ఆకులన్నీ ప్రాణంతో తొణికిసలాడుతూ మిలమిలలాడిపోతుంటాయి. చూస్తుండగానే గంటలు గడిచిపోతాయి.

ఆ చెట్టు – దాని పేరు ఏదైతే ఏమిటి – అది ఒక అందమైన వృక్షం. ముఖ్యమైన సంగతి అదీ. పేరు కాదు ముఖ్యం. చూస్తూ చూస్తూ ఉండగానే ఆ ప్రాంతం అంతటా, ఆ నది పైన కూడా ఒక అపూర్వమైన గుణం ఏదో ఆవరించుకొని పోయినట్లుగా అనిపిస్తుంది. సూర్యుడు ఇంకొంచెం పైకి ఎక్కి వస్తుంటే ఆకులు కదిలి రెపరెపలాడిపోతూ నృత్యం చేయడం ఆరంభిస్తాయి. ఒక్కొక్క గంట గడుస్తుంటే ఆ చెట్టు ఒక్కొక్కరకమైన, ఒక్కొక్క కొత్త గుణాన్ని సంతరించుకున్నట్లుగా కనబడుతుంది. సూర్యోదయానికి పూర్వం ఆ చెట్టు ఉదాసీనంగా నిలబడి ఉన్నట్లు చప్పుడు చేయకుండా ఎక్కడో దూరంలో ఉన్నట్లు, గంభీరంగా నిండు కుండలా ఉన్నట్లు అనిపిస్తుంది. ప్రొద్దు ఎక్కడం మొదలవటంతోటే, సూర్యకాంతి తమ మీద సోకగానే ఆకులు నర్తించడం సాగిస్తాయి. అప్పుడు ఆ చెట్టు ఒక వింతైన ప్రత్యేకత అబ్బినట్లుగా తోస్తుంది. గొప్ప సౌందర్యంతో నిండిపోయి ఉన్నటువంటి భావం అది.

మధ్యాహ్న సమయానికి ఆ చెట్టు నీడ చిక్కబడుతుంది. ఇక మనం ఆ నీడలో కూర్చుని ఎండ తీక్షణత నుండి తప్పించుకోవచ్చు. అక్కడ ఒంటరిగా ఉన్నట్లు అనిపించనే అనిపించదు. చెట్టు సాన్నిహిత్యం మనకు తోడునిస్తుంది. అక్కడ కూర్చున్నప్పుడు ఒక ప్రగాఢమైన, అచంచలనమైన భద్రతను ఇచ్చే బాంధవ్యమూ, స్వేచ్ఛా కూడా లభిస్తాయి. ఇది చెట్లకు మాత్రమే సాధ్యం.

సంధ్యా సమయం సమీపిస్తున్నప్పుడు అస్తమిస్తున్న సూర్యుని కాంతితో పశ్చిమాకాశం వెలిగిపోతుంది. అప్పుడు చెట్టు క్రమక్రమంగా ఉదాసీనంగా అయిపోతుంది. నల్లబడి తనలోకి తాను వెళ్ళిపోతుంది. ఆకాశం ఎరుపు, పసుపు, హరిత వర్ణాలలోకి మారిపోతూ ఉంటుంది. అయితే చెట్టు మౌనంగా, మన కంటికి అందకుండా పోతుంది. నిశీథి వేళలో విశ్రాంతి తీసుకుంటుంది.

ఆ చెట్టుతో బాంధవ్యం నెలకొల్పుకుంటే అప్పుడు మానవాళితో సత్సంబంధం ఉంటుంది. అప్పుడు ఆ చెట్టు బాధ్యత మీది అవుతుంది. అప్పుడు ప్రపంచంలో ఉన్న సమస్త వృక్షాల బాధ్యత మీది అవుతుంది. ఈ భూమి మీద ఉన్న ప్రాణంతో మీకు కనుక ఏ సంబంధమూ లేనట్లయితే మానవాళితో మానవులతో మీకుగల ఈ కాస్త సంబంధాన్ని కూడా కోల్పోతారేమో.

ఒక చెట్టు గుణతత్వంలోకి మనం ఎన్నడూ లోతుగా పరికించి చూడం. ఆ చెట్టును నిజంగా తాకి చూడటం అనేది చేయనే చేయం. ఆ చెట్టుని పట్టుకొని దృఢంగా ఉన్న నా చెట్టు గట్టితనాన్ని చూడనే చూడం. గరుకుగా ఉన్న బెరడును చేతితో స్పృశించినప్పుడు ఎలా అనిపిస్తుందో చూడం. ఆ చెట్టులో ఒక భాగమే అయిన దాని ధ్వనిని వినవే వినం. అది ఆకుల మధ్య నుండి వీస్తూ గాలి చేసే ధ్వని కాదు. ప్రాతఃకాలంలో ఆకులను కలవరపెట్టి వణికించే మందమారుతపు ధ్వనిని కాదు. చెట్టుకు గల సొంత ధ్వనిని. చెట్టు మానుకుగల ధ్వనిని. చెట్టు వేర్లు మౌనంగా వినిపించే ధ్వనిని. ఈ ధ్వనిని వినాలంటే మీలో అత్యంతమైన సున్నిత శీలత ఉండాలి. ఈ ధ్వని ఈ మన ఈ ప్రపంచపు గోలవంటిది కాదు. ఎప్పుడూ వాగుతూ ఉండే మనసు చేసే గోలవంటిది కాదు.

మానవుల కలహాలలో, మానవుల యుద్ధకాండలలో ఉండే ఆ అసహ్యమైన చప్పుళ్ళు కాదు. ఈ అపార విశ్వానికి చెందినది అయినటువంటి ధ్వని అది.

*జిడ్డు కృష్ణమూర్తి - కృష్ణమూర్తి టు హిమ్ సెల్ఫ్ నుండి*


బెంగుళూరు నాగరత్నమ్మ

# నాదోపాసిని

– డా. నటరాజ రామకృష్ణ
నృత్య పరిశోధకులు

*నను పాలింప నడచి వచ్చితివో నా ప్రాణ నాథా!*
*వనజ నయన మోమును జూచుటే*
*జీవన మని నెనరున మనసు మర్మము దెలిసి ॥*
*సురపతి నీల మని నిభ తనువులో*
*ఉరమున ముత్యాల సరుల చయములో*
*కరమున శరకోదండ కాంతిలో*
*దరణి తనయతో త్యాగరాజార్చిత ॥*

వేంకటగిరి రాజాగారి కోటలో జరిగిన ఒక వేడుకకు కవి, పండిత, గాయక నర్త విద్వరేణ్యులు సమావేశమై రాజావారికి వారందరూ కానుకలర్పించారు. నాగరత్నమ్మ గారి వంతు చివరికి వచ్చింది. ఆమె చేతిలో పట్టు వస్త్రాలతో చుట్టి ఒక పెద్ద వస్తువు ఏదో ఉంది. ఆమె పై త్యాగరాయ కృతిని మోహన రాగంలో పాడటం మొదలుపెట్టింది. ఆమెవైపే సభికులందరూ వింతగా చూస్తున్నారు. ఆమె ఇంకా లేచి నిలబడలేదు. ఆమెది స్థూలకాయం. అలా ఆమె పాడుతూ తన్ను తాను మరిచింది. నేత్రాల నుండి అశ్రుధారలు కారుతున్నాయి. ఆమె చేతిలోని వస్తువుపైన అవి రాలుతున్నాయి. ఆమె అలా పాడుతూ పాడుతూ అభినయించడం మొదలుపెట్టింది. అదొక అద్భుత దృశ్యం. ఎవ్వరూ, ఎప్పుడూ చూసియుండరు.

కొంతసేపటికి ఆమె శాంతించింది. ఆటా పాటా ముగిశాయి. చేతిలోని వస్తువుపై ఉన్న పట్టు వస్త్రాన్ని తొలగించింది. రాజావారి దగ్గరగా వెళ్లింది.

అయిదడుగులు వేసి,

*నిధి చాల సుఖమా?*
*రాముని సన్నిధి సేవ సుఖమా?*
*నిజముగ దెల్పుమో మనసా*
*దధి నవనీత క్షీరములు సుఖమో*
*దాశరథి శరణామృతము సుఖమో!*

అంటూ ఆలపించి, పాడి ఆమె కూర్చుంది. ఆ రాజావారు ఆ సీతారాముల పటం వంక ఒక్కసారి చూసి, తమ చూపు ఆస్థాన పండితుని వైపు మరలించారు. ఆ పండితుడు లేచి, "నేడు సుదినం. నాగరత్నంగారి అభినయాన్ని కూడా చూచే భాగ్యం కలిగింది. ఏదీ ఒక్క పదం! బంగారేచ భూపాలుని మీద రచింపబడ్డ ఆ సంస్కృత పదాన్ని కూడా అభినయిస్తే బాగుంటుంది" అని రాజావారి మాటగా తెలియజేశాడు.

"రాజావారూ! ఇక్కడ ఆశీనులైయున్న పెద్దలూ మన్నించాలి. ప్రస్తుతం భక్తిమార్గం. ఆ రామనామాన్ని ఉచ్చరించిన నోట వేరొకటి ఉచ్చరించలేను" అని రాజావారికి, సభకు నమస్కరించింది నాగరత్నమ్మ.

ఆ సభలు, వేడుకలు జరిగిన ఆ వారం రోజులూ ఆమె వెంకటగిరిలోనే ఉంది. ఆమె ఆ వారం రోజులు తన బసకు స్వయంపాకం తెప్పించుకొని, స్వయంగా వంట చేసుకొంది.

ఏడవ రోజున ఆ యాస్థానంలో దక్షిణలు ఇచ్చారు. అంతఃపురంలో పెద్దమ్మగారి వద్ద కొన్ని భజన కీర్తనలు పాడి చిన్నమ్మగారి వద్ద కీర్తనలు పాడి దక్షిణ నాగరత్నమ్మ పుచ్చుకొంది. విద్వాంసులు కోరినవి పాడి దక్షిణ పుచ్చుకొంది. రాజావారు ఇచ్చిన దక్షిణ సరేసరి. ఇలా అందరివద్దా దక్షిణలు పుచ్చుకొని వాటినన్నింటినీ జాగ్రత్తగా మూటగట్టుకొని విడిదికి ఆమె తెచ్చుకొంది. ఒంటరిగా గదిలో కూర్చొని అన్నిటినీ ఒకసారి చూసుకొని, లెక్కపెట్టుకొని సందుగ పెట్టిలో పెట్టుకొంది. వంటకు ఇచ్చిన సరుకులలో మిగిలియున్న

వాటినన్నింటినీ కారంపొడితో సహా పొట్లాలు కట్టి జాగ్రత్తగా పెట్టుకొంది. తన సేవకై ఈ వారం రోజుల పాటు నియమింపబడ్డ బ్రాహ్మణ యువకుడు ఆమెను జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు. అతనికి ఆమె చేస్తున్న పని వింతగా తోచి, "నిధి చాల సుఖమా? రాముని సన్నిధి ఏవయే సుఖమా?" అని తనలో తాను పాడుకొంటున్నట్లు ఆమెకు వినిపించేటట్లు పాడాడు. అతడు అలా ఎందుకు పాడాడో ఆమె అర్థం చేసుకొని ''అప్పా! ఇలా రా!'' అని పిలిచి ''చూడు, సంపాదించేటప్పుడు, కూడబెట్టేటప్పుడు తేనెటీగలు కష్టపడి తేనెను సంపాదించి, కూడబెట్టినట్టు కష్టపడాలి. డబ్బు సంపాదించలేనివాడు దేన్ని ఖర్చుపెడతాడు?" అని అతన్ని అడిగింది. అతడు నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. తర్వాత తేరుకొని, "ఇంతవరకూ మీరు సంపాదించిన ఆస్తిని ఏం చేస్తారు? శ్రీ రామచంద్రార్పణమేనా?" అని చిన్నగా నవ్వాడు. ఆమె సమాధానంగా ఒక చిరునవ్వు నవ్వింది.

చివరకు ఆమె అలాగే చేసింది. శ్రీ త్యాగరాజస్వామి వారి ద్వారా తన ఆస్తినంతా ఆ శ్రీరామచంద్రునికే అర్పించింది. శ్రీరాముని సేవిస్తూ ఒక యోగినిలా తన శేష జీవితాన్ని గడిపిందామె.

బెంగుళూరులో స్థిరపడిన ఒక తెనుగు కళాకారుల వంశానికి చెందిన అచ్చమైన తెలుగు కళాకారిణి శ్రీమతి బెంగుళూరు నాగరత్నమ్మ. పూర్వమెప్పుడో కొన్ని తెలుగు నాట్య కుటుంబాలు బెంగుళూరులో స్థిరవాసం ఏర్పరచుకొన్నాయి. ఆ నగరంలో గుండప్ప అనే ప్రముఖ నాట్యాచార్యుడొకాయన ఉండేవాడు. తరతరాలుగా వారి వంశీయులందరూ నాట్యాచారులే. నేడు నాట్యాచార్యునిగా అక్కడున్న శ్రీ సత్యనారాయణ కూడా వీరి వంశీయుడే.

శ్రీమతి ధనభాగ్యమ్మ అనే మరొక ప్రసిద్ధ నర్తకీమణి కూడా బెంగుళూరులో ఉన్నారు. నేను ఒకసారి బెంగుళూరు వెళ్లినప్పుడు ఆమెను కలుసుకొన్నాను. ఆమెకు వృద్ధాప్యం రావడం వల్ల ఆమె నాట్యకళ నుండి విరమించి విశ్రాంతి తీసుకొంటున్నారు. ఇలా ఎందరో తెలుగు సాంప్రదాయక నర్తనం తెలిసినవారు బెంగుళూరులో ఇంకా ఉన్నారు.

నాగరత్నమ్మ జీవితం నృత్యకళతో ప్రారంభమయింది. ఆమె కొన్ని నాట్యకచ్చేరీలు కూడా చేశారు. ఒక వయస్సు వచ్చేవరకే నాట్యకచ్చేరీలు చేసే అవకాశముంది. ఆ తర్వాత ఆ కచ్చేరీలు ఆకర్షణీయంగా ఉండవు. ఈ సత్యాన్ని ముందుగానే గ్రహించిన నాగరత్నమ్మ సంగీత సాధన చేసి, సంగీత కచ్చేరీలు చేయడం మొదలుపెట్టింది.

బొబ్బిలి సంస్థానంలో బుగత రామన్న, గోపన్న అనే ఇద్దరు నాట్యాచారులుండేవారు. వీరిరువురూ కూడా మంచి మార్దాంగికులు, శివ పంచముఖి, షణ్ముకి తాళాలు వేయడంలో వీరు ప్రసిద్ధులుగా పేరు పొందారు. నాట్యంలోని వీరి జతి కట్టుబాట్లు చాలా కష్టమైనవిగా ఉండేవి. ఈ మధ్యకాలంలో పంచముఖి, షణ్ముఖి తాళ వాయిద్యంలో ప్రసిద్ధిగాంచిన స్వర్గీయ ముట్నూరి సత్యనారాయణగారి తండ్రిగారు పై మార్దాంగికుల వద్దనే ఆ విద్యను నేర్చుకొన్నారు. బొబ్బిలి రాజాస్థానంలో చిరంజీవి, సంజీవి, సువర్ణ అనే ముగ్గురు ప్రముఖ నర్తకీమణులు ఉండేవారు. వీరు ముగ్గురూ సహోదరులే. వీరు గడ్డిభుక్త కుటుంబానికి చెందినవారు. వీరిలో సువర్ణది గుడి సాంప్రదాయక నృత్యం. గడ్డిభక్త జీవరత్నమ్మగారితో బొబ్బిలి ఆస్థాన నృత్య సంప్రదాయం అంతరించిపోయింది. ఈమె చిరంజీవి కుమార్తె.

ఈమె ఒక నర్తకికి ఆస్థాన కేళికలు నేర్పి కొన్ని ప్రదర్శనలు ఇప్పించింది. ఆ తర్వాత బొబ్బిలి రాజావారి కోర్కెపైన ఆ నర్తకికి బెంగుళూరు నాగరత్నమ్మ కొంతకాలం శిక్షణ ఇచ్చి కొన్ని నాట్య కచ్చేరీలు చేయించారు. ఆ నర్తకికి ఈ రెండు బాణీలలోను ఆరితేరిన కళాకారిణి అయింది. బొబ్బిలి బాణీలో నర్తకి పాడుతూ ఆడుతుంది. నాగరత్నమ్మ బాణీ మూగబాణి. అంటే నట్టువలు పాడుతూ ఉంటే నర్తకి నాట్యం చేస్తుంది. అయితే ఈ కళాకారిణి కూడా కొన్నాళ్ల తర్వాత నాట్యం మానేసి సంసార జీవితంలో స్థిరపడింది. మా నృత్యనికేతన్‌లో శిక్షణ పొందినవారిలో కొంతమంది ఈ బొబ్బిలి సంప్రదాయ నృత్యంలోని కొన్ని అంశాలు మాత్రమే తెలుసు. అందువల్ల బొబ్బిలి బాణీ ఒక విధంగా అంతరించినట్టేనని చెప్పవచ్చును.

నాగరత్నమ్మగారు ఎన్నో సంస్థానాలను సందర్శించారు. ఎన్నోచోట్ల సంగీత కచ్చేరీలు చేశారు. ఎంతో ధనాన్నీ, దానిని మించిన కీర్తిని ఆమె సంపాదించారు. ఈ బెంగుళూరు నాగరత్నమ్మ గారి సంగీత జైత్రయాత్ర గురించి కన్నడ భాషలో ఒక గ్రంథం కూడా వెలువడింది. అందులో ఆమె కీర్తిప్రతిష్టలు వివరించబడ్డాయి. కాళ్లకు గజ్జెలు కట్టడంతో ప్రారంభమైన ఆమె కళా జీవితం త్యాగరాజులవారి భక్తి కీర్తనలు పాడటంతో ముగిసింది.

"హే గోపాలా! హే గోవిందా! హే కృపానిధీ!" అని ఆమె ముకుందమాలలోని శ్లోకాలు పాడుతుంటే ఆమెకు ఆ భగవంతుడు పలుకుతున్నాడా? సాక్షాత్కరిస్తున్నాడా అని

అనిపించేది. ఆమెను ఆ స్థితిలో చూసే భాగ్యం నాకు కలిగింది.

ఆమెకు కన్నబిడ్డలు లేరు. అందువల్ల ఆమె ఒక పిల్లను పెంచుకొంది. ఆ అమ్మాయికి విద్యాబుద్ధులు, సంగీతాది కళలు నేర్పి వృద్ధిలోకి తేవాలని ఎంతో ఆశించింది. విద్యల మాట దేవుడెరుగు కనీసం సరైన బుద్ధి కూడా ఆమెకు రాలేదు.

క్రౌంచపక్షిని ఒక కిరాతకుడు చంపడాన్ని చూసి వాల్మీకి రామాయణాన్ని రాసినట్లు ఈ పెంపుడు కూతురు ప్రవర్తన చూసి ఈమె రామ భక్తురాలై త్యాగరాయ కృతులు పాడుకొంటూ జీవితం గడిపింది.

నాగరత్నమ్మకు నానాటికీ ఆధ్యాత్మిక చింతన ఎక్కువ అయినా ఆమె ఈ భౌతిక విషయాలను గురించి కూడా ఆలోచించి, తన తదనంతరం తన ఆస్తిలో కొంత తన పెంపుడు కూతురు చెందేటట్లు వీలునామా రాసింది. ఆ పెంపుడు కూతురు తనకు రావలసిన ఆస్థి గురించి తహతహలాడింది. అడిగితే ఆమె ఇవ్వదేమోనన్న భయంతో తల్లిని ఎలాగైనా దైవసాన్నిధ్యానికి పంపాలనుకొంది. కానీ తల్లికి ఎటువంటి అనుమానం రాకుండా మసలుకొంది.

నాగరత్నమ్మ తరచుగా తిరువయ్యూరు వెళ్లి త్యాగరాజులవారి సమాధిని దర్శించి వస్తూ ఉండేది. దక్షిణ దేశ శాస్త్రీయ సంగీతానికి భిక్షపెట్టిన ఆ మహానుభావుని సమాధి వద్ద చెత్తాచెదారం పేరుకుపోయి యుండటం చూసి ఆమె బాధపడింది.

త్యాగరాజులవారి కీర్తనలు పాడి కచ్చేరీలు చేసి బాగా డబ్బు సంపాదించుకొన్నవారు దక్షిణ భారతావనిలో చాలామంది ఉన్నారు. కానీ వారి సమాధిని కాపాడుకోవాలన్న ఆలోచన వీరికి రాలేదు. ఆయన సమాధిపైన ఒక దివ్యమందిరాన్ని నిర్మించి, దానినొక పవిత్ర యాత్రాస్థలంగా మార్చి, త్యాగరాయ స్వామివారి భక్తులకు దానిని ఒక పుణ్యక్షేత్రంగా రూపొందించాలన్న ఆలోచన ఇంతమంది దక్షిణాది సంగీత విద్వాంసులలో ఏ ఒక్కరికీ రానందుకు ఆమె దుఃఖించింది. తన కూతురుకు వ్రాసియిచ్చిన ఆస్తి పోగా మిగిలిన ఆస్తితో త్యాగరాజవారి సమాధి వద్ద ఒక మందిరాన్ని కట్టించాలని ఆమె నిశ్చయించుకుంది. అక్కడి నుండి బెంగళూరు తిరిగి వెళ్ళిన తర్వాత ఈ ఆలోచన మరీ ఎక్కువైంది. ఎప్పుడూ ఆలోచిస్తూ పరధ్యానంగా ఉండేది. ఒకనాడు ఆమెకు ఒక చెడు కల వచ్చింది. కనుక తన ఆలోచనను కార్యరూపంలో పెట్టాలనుకొంది. ఈ విషయాన్ని ఎలాగో ఆ కూతురు గ్రహించింది. ఆమె ఈ కార్యాన్ని నెరవేర్చక ముందే గతిస్తే ఆస్తి అంతా తనకు చెందుతుందన్న ఆశ ఆ కుమార్తెకు కలిగింది. అందుకు వీలైనంత వేగంగా తల్లిని వదిలించుకోవడానికి ఆ కూతురు ఒక పథకం వేసింది.

ప్రతి దినం రాత్రి పడుకునే ముందు పాలు తాగడం నాగరత్నమ్మకు మొదటి నుంచి అలవాటు. కూతురే స్వయంగా ఆ నాటి రాత్రి పాల గ్లాసు తల్లికి ఇచ్చింది. ఆమె ఏదో గ్రంథ పఠనంలో ఉన్నందువల్ల వెంటనే పాలు త్రాగకుండా పక్కన పెట్టుకొంది. మళ్ళీ గ్రంథ పఠనంలో నిమగ్నమయిపోయింది. ఇంతలో ఎక్కడి నుండో పిల్లి వచ్చి ఆ గ్లాసులోని పాలు తాగి గిలగిలా కొట్టుకుని చచ్చిపోయింది. నాగరత్నమ్మ విషయాన్ని గ్రహించి కూతుర్ని పిలిచి "అమ్మా! నిన్ను కన్న కూతురులా పెంచాను. అందుకనే నీ పేర కావలసినంత ఆస్తిని వీలునామాలో వ్రాసిపెట్టాను. డబ్బు కోసం పెంచి పోషించిన తల్లిని చంపాలనుకొన్నావు. నన్ను అడిగితే నేనే నీకు వెంటనే ఇచ్చేదాన్ని కదా!" అంటూ నాగరత్నమ్మ కంటనీరు పెట్టింది. ఆ మర్నాడే తన న్యాయవాదిని పిలిపించి కూతురుకు చెందవలసిన ఆస్తిని అప్పజెప్పింది.

మిగిలిన ఆస్తితో ఆమె తిరువయ్యూరు చేరుకుంది. త్యాగరాజుల వారి సమాధిని శుభ్రం చేయించింది. ఆ సమాధి పైన ఒక భవనాన్ని కట్టించింది. దానికి చేరువలో ఒక చిన్న కుటీరం వేసుకుని నిత్యం ఆ స్వామివారిని ఆరాధిస్తూ అక్కడే స్థిరంగా ఉండిపోయింది. ప్రతి సంవత్సరం త్యాగరాజస్వామి వారి ఆరాధనోత్సవాలు అక్కడ దివ్యంగా జరుగుతూంటాయి. దీనికొక కార్యవర్గం ఉంది. దేవుని పెళ్ళికి అందరూ పెద్దలే. ఈ పెద్దల్లో చిన్నచిన్న కలతలు వచ్చి పెద్ద, చిన్న కక్షలుగా మారాయి. తర్వాత అవి మళ్లీ ఈమె కృషివల్ల సర్దుకొన్నాయి.

ఈ విషయమై ఒక పత్రికా విలేఖరి ఆమెను ప్రశ్నించినప్పుడు, "సంగీతానికి ప్రచారం ఎక్కువయింది. భక్తి సన్నగిల్లింది. సంగీత జ్ఞానం భక్తి వినా సన్మార్గము కలదే ఓ మనసా? మాట అన్న త్యాగరాజులవారి ఆదర్శాలకు ఈనాడు విలువ లేకుండా పోయిందం"టూ ఆ కళా తపస్వి కంట నీరు కార్చింది.

ఆమె తన యావదాస్తిని పెట్టి త్యాగరాజుల వారి సమాధి పైని మందిరాన్ని నిర్మించినపుడు ఆమె త్యాగాన్ని అందరూ 'ఓహోహో! ఆహాహా! నాగరత్నమ్మాళ్ ఎంతటి త్యాగమూర్తి! ఆమె సంగీత సరస్వతి గనుక ఇంత గొప్ప కార్యం చేసింది' అంటూ ఆమెను కొనియాడారు.

ఇంతవరకు ఆమె కథ బాగానే నడిచింది. అక్బర్ ఆస్థానంలో బీర్‌బల్‌లా ఆమె ఒక సమస్యను తెచ్చిపెట్టి మరీ చనిపోయింది. ఆమె రాముని భక్తురాలు. త్యాగరాజస్వామి వారి ఆరాధకురాలు కనుక తను తన తనువు చాలించిన తర్వాత త్యాగరాజస్వామి వారి సమాధికి ఎదురుగా తన సమాధిని నెలకొల్పాలని ఆమె కోరుకుంది. అందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంది. ఆమె తన ధనాన్ని త్యాగరాజ స్వామి వారికి సమర్పించినపుడు ఆ కార్యవర్గ సభ్యులకు ఎటువంటి శంకలు రాలేదు. ఆమె తన సమాధికి ఏర్పాట్లు చేసుకున్నప్పుడు ఎటువంటి అభ్యంతరాలు రాలేదు. కానీ ఆమె చనిపోయిన తర్వాత ఆమె కోరికను తీర్చడానికి అందరికీ అన్ని శంకలూ వచ్చాయి. అభ్యంతరాలు వచ్చాయి.

*ఊర్వశీ గర్భ సంజాతో*
*వశిష్ఠశ్చ మహామునిః*
*తపసా బ్రాహ్మణోజాతః భవత్యేం*
*జాతిస్తత్ర కారణమ్*

అని ఋషి వాక్కు.

బ్రహ్మం పరబ్రహ్మం, ఆత్మ పరమాత్మల స్వరూపాలను ఎరుగని ఆ పెద్దలు ఆమె చనిపోయిన తర్వాత అనేక శంకలను వెలిబుచ్చారు. ఆమె బ్రతికి ఉండగా ఆ శంకలను వెలిబుచ్చి ఉంటే ఎటువంటి ఘాటైన సమాధానం చెప్పి ఉండేదో!


నటరాజ రామకృష్ణ

'త్యాగరాజ స్వామి వారి సమాధికి ఎదురుగా ఆమెను సమాధి చేయడమా' అని ఆ పెద్దలు ముక్కు మీద వేలు వేసుకొన్నారు, కనుబొమ్మలు చిట్లించారు, పెదవులు విరిచారు.

అయితే ఆ పెద్దలు హృదయం ఉన్న, మానవత్వం ఉన్న, కృతజ్ఞత కలిగియుండినవారు ఒకరు "ఆమె శరీరాన్ని మనం సమాధి చేయడం లేదు. పంచభూతాల్లో ఆమె శరీరం కలసిపోయిన తర్వాత మిగిలే పిడికెడు బూడిదను తీసి దాన్ని సమాధి చేస్తున్నాం. ఆమె చేసిన త్యాగానికి మనం ఈమాత్రం చేయవచ్చును. దీనికి అభ్యంతరం ఎందుకు" అని అన్నారు. దీనికి మిగిలినవారందరూ సమాధానపడ్డారు.

రామసన్నిధిని చేరడానికి తన సంకీర్తనతో రాజమార్గము చూపిన నాదయోగి, రామభక్తుడైన ఆ త్యాగరాజ స్వామివారి ఎదురుగా ఈ నాదోపాసిని సమాధి నిర్మించబడింది. ధన్యురాలు ఆమె.

**పద్మభూషణ్ పి.వి. రావు - ఫెస్ట్‌స్క్రిఫ్ట్ - ఇయర్స్ ఆఫ్ విజన్ నుంచి**

## ఆయన నేర్పినదే

## మన సజీవ భాష


గిడుగు పిడుగు

"క్రొత్త రేడియో నిలయంలో రోజుకొక మంచి ప్రసంగాన్ని ప్రసారం చేసేవారం. మొదటి వారంలోనే అనుకుంటాను పూజ్యులు శ్రీ గిడుగు రామ్మూర్తి పంతులు *సజీవ భాష* ను గురించి చెప్పారు. ఈ నిమిషాన కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది ఆయన గంభీర విగ్రహం, భీష్మ విగ్రహంలా, మా స్టూడియోలో అడుగుపెడుతూన్న దృశ్యంలో, ఆయన ఎడమచేతిని ప్రియశిష్యుడు తెలికిచర్ల వెంకటరత్నం భుజాన ఆనించారు, కుడిచేయి నా భుజాన. ఆనాటి వారి ప్రసంగం ఇన్ని ఏళ్ల రేడియో ప్రసంగాలలోను మణిపూసలా ప్రకాశిస్తుంది. ఎంత చక్కని భావాలు! ఎంతటి సహజ శైలి! ఎటువంటి దివ్యకంఠమూ వారిది! ఆ మూర్తిని మరిచిపోలేము మనము. ఆ ప్రసంగంలో వారు దిద్దిన ఒరవడినే ఇన్నాళ్లూ రేడియో వాచకంలో అనుసరిస్తూ వచ్చాము. ఆయన నేర్పినదే మన సజీవ భాష!"



**సాగుతున్న యాత్ర** – *ఆచంట జానకిరామ్*

**సేకరణ: తాజీ ప్రసాద్, చెన్నై. ఫోన్: 917 674 6536.**

# మానవీయ మానవి

– ఓల్గా
*మహిళావాద రచయిత్రి*



డాక్టర్ కొమర్రాజు అచ్చమాంబ

ఇది డాక్టర్ కొమర్రాజు అచ్చమాంబ గారి శతజయంతి సంవత్సరం. ఈ తరానికి ఆమెని పరిచయం చేయాలనే ఉద్దేశంతో కొందరు మిత్రులం నూరేళ్ల అచ్చమాంబ కమిటీగా ఏర్పడి ఆమె గురించి, ఆమె పనిచేసిన ఉద్యమాల గురించీ, ఆమె ఆదర్శాల గురించీ ఆశయాల గురించీ వీలైనంత ఎక్కువ ప్రచారం చేయాలనుకున్నాం. ఆమె ప్రేరణతో కొందరైనా సమాజం గురించి ఆలోచిస్తారనేది మా ఆశ.

"కొమర్రాజు లక్ష్మణరావు గారి కుమార్తె కొమర్రాజు అచ్చమాంబ 1960వ సంవత్సరం అక్టోబర్ 6న గుంటూరులో జన్మించారు. తెలుగులో మొదటి కథ రాసిన భండారు అచ్చమాంబ ఈమెకు మేనత్త. మద్రాసులో విద్యార్థినిగా ఉన్న రోజుల్లోనే ఆమె జాతీయోద్యమంలో ప్రవేశించారు. ఆమె తన వ్యక్తిత్వంతో నిజాయితీతో ఆ రోజుల నుంచే పలువురిని ప్రభావితం చేశారు." 1946లో హిందూ దినపత్రికలో ఖాసా సుబ్బారావు గారు అచ్చమాంబను మొదట చూసినప్పటి జ్ఞాపకాలను ఇలా రాశారు:

"నేనామెను మొదట 17 ఏళ్ల క్రితం (1929లో) చూశాను. మద్రాసులో మహాత్మాగాంధీ ప్రసంగించే సభలో ఆమె మొదటి వరుసలో ఉంది. అసంఖ్యాకమైన ప్రజలు ఉన్నారు ఆ సభలో. ఆమె చేతిలో ఖద్దరుతో చేసిన హారం ఉంది. తగిన సమయంలో ఆమె దానిని మహాత్ముని మెడలో వేసింది. ఆమెలో ఏదో ప్రత్యేకత ఉందని నాకు చూడగానే అనిపించింది. ఆమెలో అప్పుడున్న ఆనందమో, ఉత్తేజమో, గాంధీజీని చూడటం వల్ల కలిగిన ఆత్మానందం ఆమె కళ్లలో ప్రకాశించడం వల్ల కావచ్చు. ఆమె నా దృష్టిని ఆకర్షించింది. నిజాయితీకి ఎంతో గొప్ప శక్తి ఉంటుంది. నిజాయితీలో ఉన్న రహస్య శక్తి ప్రభావం వల్ల వాళ్లు కూడా ఆ వ్యక్తుల పట్ల ఆకర్షితులవుతారు. తర్వాత వాళ్లు భక్తులవుతారు. ఆమె చూపులు, ఏకాగ్రత, తన గురించి ధ్యాస లేకుండా మహాత్ముని మాటలను శ్రద్ధగా వినటం దీనితో ఆమె నిజాయితీ యొక్క అందమైన రూపం అయింది. ఆ నిజాయితీ దానికదే ఒక సౌందర్యం. ఆ రోజు అంత వివరంగా చూసిన ఆ రూపం ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా నా మెదడులో చెరిగిపోకుండా ఉంది. ఆ రోజు నేను మహాత్ముడిని పూర్తిగా నిర్లక్ష్యం చేశాననుకుంటాను. మళ్లీమళ్లీ నాలో నేను ప్రశ్నించుకుంటూ ఉన్నాను. "ఆమె ఎవరు?"

జాతీయోద్యమంలోకి వచ్చేనాటికి ఆమె వైద్య విద్యార్థిని. ఉప్పుసత్యాగ్రహంలో పోలీసుల దౌర్జన్యంవల్ల గాయపడిన సత్యాగ్రహుల కోసం వైద్య విద్యార్థి బృందాలను తయారు చేసింది. క్రమంగా ఆమె కమ్యూనిస్టు భావాల పట్ల ఆకర్షితురాలై కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి పూనుకుంది. ఆ రోజుల్లో ఆమె గురించి ఖాసా సుబ్బారావు గారు హిందూ దిన పత్రికలో వ్రాసిన వాక్యాలు ఇలా ఉన్నాయి:

"నిరాశా నిస్పృహలతో, ఒంటరితనంతో ఇంకా అనేక భావాలతో, సిగ్గుతో తమ గూళ్లలో ఉన్న అనేకమందిని అచ్చమాంబ తన పదునైన హాస్యంతో, చేయూతనిచ్చి చేసే సాంఘిక సేవలో, రాజకీయపు పనిలో మంచి మార్గంలో పెట్టేది. అలాంటి వారిలో సుందరయ్య కూడా ఒకడు. దానివల్ల ఆ యువకులలో తృప్తి, ఏదో సాధించామనే సంతోషం కలిగేవి. నాయకత్వం అవకాశాలు దొరికేవి. ఆమె ఇతరులను నాయకులుగా చేసే పని కోసం తనను తాను తయారు చేసుకుంది."

ఈ మాటల వల్ల తొలినాళ్ల కమ్యూనిస్టు ఉద్యమంలో ఆమె ప్రభావం ఎంతో ఉందని అర్థమవుతుంది. కానీ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ప్రథమురాలిగా ఆమెను ఎవరూ తలచుకోవటం లేదు. ఎందుకంటే స్త్రీలు చరిత్రలో నిర్లక్ష్యం చేయబడతారు. చరిత్ర నిర్మాతలుగా స్త్రీలను గుర్తించే మంచి సంప్రదాయం ఇంకా మన చరిత్రకారులలో ఏర్పడవలసే ఉంది. ''అచ్చమాంబ యూరప్ వెళ్లి వైద్యశాస్త్రంలో ఉన్నతమైన పట్టా పొంది బెజవాడలో డాక్టర్‌గా ప్రాక్టీసు పెట్టారు. అప్పటినుంచీ ఆమె ఇల్లు కమ్యూనిస్టు పార్టీకి, మహిళా ఉద్యమానికీ, ప్రజానాట్యమండలికీ కేంద్రంగా ఉండేది. మహిళా ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన తొలి తరం మహిళలలో అచ్చమాంబ మొదటివారు. ఆమె రాసిన "ప్రసూతి–శిశుపోషణ" స్త్రీల పునరుత్పత్తి ఆరోగ్యం గురించి తెలుగులో సమగ్రంగా వచ్చిన తొలి పుస్తకం. ఆ రోజుల్లో

దానిని గ్రామీణ స్త్రీలకు చదివి వినిపించటాన్ని మహిళా ఉద్యమం ఒక కార్యక్రమంగా తీసుకుంది. మహిళా ఉద్యమ కార్యకర్తల శిక్షణ శిబిరాలలో, రాజకీయ పాఠశాలలో అచ్చమాంబగారు ప్రసూతి–శిశుపోషణ, శారీరక శాస్త్రం, ఆరోగ్య సూత్రాలు, సమాజంలో స్త్రీల స్థితి, వీటన్నిటి గురించి పాఠాలు చెప్పేవారు. "దేశ సౌభాగ్యానికీ, నాగరికతకూ, సంస్కృతికీ ఆ దేశంలోని ప్రజాసామాన్యము యొక్క ఆరోగ్య సంతోష సుఖ జీవితమే నిదర్శనము. అందులోనూ మాతా శిశువుల ఆరోగ్యము దేశ పురోభివృద్ధికి మూలము" అంటూ స్త్రీల ఆరోగ్యాన్ని రాజకీయ విషయంగా గుర్తించిన మొదటి డాక్టర్ ఆమె. రాష్ట్ర మహిళాసంఘ అధ్యక్షురాలిగా అన్ని జిల్లాల్లో పటిష్టమైన మహిళా ఉద్యమాన్ని నిర్మించడానికి ఎంతో కృషి చేశారు. హిందూకోడ్ బిల్లు గురించి దేశవ్యాప్తంగా ఆందోళన జరుగుతున్నప్పుడు స్త్రీల ఆస్తి హక్కు, వారసత్వ హక్కులతో "హిందూ లా"ను తయారు చేయాలని ఆంధ్ర దేశం నుంచి పదివేల సంతకాలు సేకరించి పార్లమెంటుకు సమర్పించిన ఉద్యమానికి నాయకత్వం వహించారు.

1946వ సంవత్సరంలో ఏలూరు నుంచి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. అప్పుడు కాంగ్రెస్ వారు ఆమెపై దుష్ప్రచారం చేశారు. హిందూ మత ప్రకారం జరిగని ఆమె వివాహాన్ని 'కాంట్రాక్టు పెళ్లి' అనీ, స్త్రీ పురుష సమానత్వాన్ని కోరే ఆమెను మగాళ్ల భుజాల మీద చేతులు వేసి మాట్లాడుతుందనీ రకరకాలుగా ప్రచారం చేశారు. మహిళా ఉద్యమ కార్యకర్తలు ఆ ప్రచారాన్ని ధైర్యంగా తిప్పికొట్టారు. ఒకసారి అచ్చమాంబగారు కాంగ్రెస్ వారి మీటింగ్ జరుగుతుంటే సరాసరి వేదిక మీదికి వెళ్లి "మనం రాజకీయ ప్రాతిపదికన పోటీ చేస్తున్నాం. వ్యక్తుల మీద బురద చల్లడానికి కాదు. మీరు మీ సిద్ధాంతాలు ప్రచారం చేసుకోండి. అచ్చమాంబ వ్యక్తిగత జీవితం కాదు" అని గట్టిగా మాట్లాడి అందరి నోళ్ళూ మూయించారు. 1948లో నిషేధాజ్ఞలు ధిక్కరించి మహిళా ప్రదర్శన నిర్వహించి, అరెస్టయి, ఆరు నెలల రాయవెల్లూరు జైలులో ఉన్నారు.

జైలులో ఉన్నప్పుడే ఆమె కమ్యూనిస్టు పార్టీ అనుసరించాల్సిన విధానం గురించీ పార్టీలో లేని అంతర్గత ప్రజాస్వామ్యం గురించి ఆలోచించారు. ఆమె ఆలోచనలతో పార్టీ ఏకీభవించలేదు. ఆమెను పార్టీ నుండి దూరం చేశారు. మహిళా ఉద్యమ కార్యకర్తలను కూడా చాలా రోజుల పాటు ఆమెతో మాట్లాడనీయలేదు. ఒకరకంగా ఒంటరిదాన్ని చేసి బాధించారు. ఆమె ఆ బాధ భరించి, తన సహాయం అర్థిస్తూ వచ్చిన పార్టీవారికి సహాయం చేసింది. ఆ రోజుల్లో ఆమె వైద్యానికే తన కాలమంతా వెచ్చించింది. డాక్టర్ హాస్పిటల్‌లో కూర్చుంటే రోగాలు తగ్గవంటూ విజయవాడ పేటలలో తిరుగుతూ ప్రజలకు పోషకాహారం గురించి, శరీరారోగ్యం గురించీ బోధిస్తూ ఉండేది. విజయవాడలో ఎవరికి ఏ అవసరం వచ్చినా అచ్చమాంబ గారి దగ్గరికే వచ్చేవారు. ఒకరోజు అర్ధరాత్రి పొరుగూరు నుంచి బస్సు దిగిన మహిళ ఒంటరిగా భయపడుతుంటే రిక్షా తొక్కే మనిషి ఆమెను అచ్చమాంబగారి ఇంటి దగ్గర వదిలి ఇక్కడ నీకు ఏ ఆపదా రాదు అని చెప్పాడు. అంటే జనసామాన్యంలో తమను ఆపదలో ఆదుకునే అమ్మ, డాక్టరమ్మ, అచ్చమాంబగారనే నమ్మకం బలంగా ఏర్పడింది.

1957లో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేశారు. రాజకీయాలలో ఆమెకున్న ఆసక్తి, పార్లమెంట్‌కు వెళ్లి కీలక నిర్ణయాలు చేయటంలో భాగస్తురాలై ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కల్పించాలనే కోరికతో పోటీ చేశారు. ఈ ఎన్నికలలో దుష్ప్రచారం చేసే బాధ్యత కమ్యూనిస్టులు తీసుకున్నా, ఆమె భారీ మెజార్టీతో గెలిచారు. డాక్టర్‌గా, మానవిగా ప్రజలకు చేసిన సేవ ఆమెను గెలిపించింది. లోక్‌సభ సభ్యురాలిగా వరకట్న నిషేధ చట్టం తీసుకురావడంలో కీలక పాత్ర వహించారు. కానీ ఎన్నికల రాజకీయాలలో నిజాయితీకీ స్నేహభావానికీ, సేవ భావానికి చోటులేదని ఆ అయిదేళ్లలో ఆమె గ్రహించారు. ఆ రాజకీయాలలో అవినీతిని గురించి నెహ్రూని నిలదీశారు. ఆయన తాను 'నిస్సహాయుడన'ని చెప్పడంతో ఇక ఆ రాజకీయాల జోలికి వెళ్ళలేదు. వైద్యంతో పాటు స్త్రీ విద్యను కూడా ఉద్యమ స్థాయిలో తీసుకొని పని చేశారు. విజయవాడలోని మాంటిస్సోరి మహిళా కళాశాల స్థాపనలో, అభివృద్ధిలో కీలక పాత్ర వహించారు. రాత్రింబవళ్ళు ప్రజల కోసం పని చేయడంతో ఆమె ఆరోగ్యం పాడైంది. విశ్రాంతి ఆమెకు నచ్చని విషయం. ఆమె శరీరానికి కావాల్సిన అవసరం. ఒక విద్యార్థి సీటు గురించి మాట్లాడడానికి వెళ్లి గుండెపోటుతో మరణించారు. మరణించే సమయంలో కూడా ఇతరులకు సహాయం చేయాలనే తలంపు తప్ప తన ఆరోగ్యం గురించి శ్రద్ధ లేదు ఆమెకు. నిజాయితీకి, నిస్వార్థ సేవకు, అచ్చమాంబగారి పేరు ఇప్పటికీ తలుచుకుంటారు. ☸

**పద్మభూషణ్ పి.పి. రావు - ఫెస్ట్‌స్క్రిఫ్ట్ - ఇయర్స్ ఆఫ్ విజన్ నుంచి**




# శ్రీకాకుళ స్వామి సిగపై సువాసించె

– తనికెళ్ల భరణి
రచయిత, నటులు

ఆంధ్రదేశంలో రెండు శ్రీకాకుళాలున్నాయి.

ఒకటి శ్రీకాకుళం జిల్లా రెండోది కృష్ణా జిల్లాలోని శ్రీకాకుళం గ్రామం. ఈ శ్రీకాకుళంలోనే ఆంధ్రమహావిష్ణువు దేవాలయం ఉంది. శ్రీకృష్ణదేవరాయలు ఈ దేవుణ్ణి దర్శించే అదే ప్రాంగణంలోని ఒక మండపంలో ఆముక్తమాల్యద కావ్యాన్నికి శ్రీకారం చుట్టాడు. అలా సంగీత సాహిత్యాలకు నెలవైన శ్రీకాకుళంలో 1883 డిసెంబర్ 5వ తేదీన పారుపల్లి శేషాచలం, మంగమాంబగార్లకు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు జన్మించారు. తండ్రి శేషాచలం గారు సంగీత విద్వాంసులు. కాబట్టి ఉగ్గుపాలతోటే సంగీతం అబ్బింది...

అదే ప్రాంతానికి చెందిన సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి గారు దాదాపు 150 ఏళ్ల క్రితం... సంగీతం నేర్చుకోవడానికి కాలినడకన తమిళనాడు వెళ్లి... అక్కడ శ్రీ త్యాగరాజ స్వామి వారి శిష్యులైన ఆకుమళ్ల వెంకటసుబ్బయ్య గారు (ఆయన్నే మానాంబు చావడి వెంకటసుబ్బయ్య గారు అంటారు) దగ్గర శిష్యరికం చేసి మళ్లీ కాలినడకన ఆంధ్రదేశం వచ్చీ... ఎంతోమంది శిష్యుల్ని తయారు చేశారు. అందులో అగ్రగణ్యులు పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారు.. రాజనాల వెంకటప్పయ్య శాస్త్రి, ద్వివేదుల లక్ష్మణ శాస్త్రి, సుసర్ల గంగాధర శాస్త్రి, పట్నం సుబ్రహ్మణ్యయ్యర్, మహా వైద్యనాదయ్యర్ మొదలైన మహామహులంతా వారి సహాధ్యాయులే... ఒకసారి ఊహించండి అదో సంగీత గురుకులం... బ్రాహ్మీ ముహూర్తానికి అంతా నిద్రలేవటం... శిష్యులంతా గబగబా కృష్ణానదికి వెళ్ళిపోయి... స్నానాలు... సంధ్యలు. తర్వాత విభూతి పెట్టుకునేవారు... నామం దిద్దుకునేవారూ... అంతా వచ్చి నిశ్శబ్దంగా, వినయంగా కూర్చుంటే... మంద్రమంద్రంగా వస్తున్న తంబుర నాదం మధ్యలోంచి సరస్వతీ స్వరూపులైన సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రుల వారి కమ్మని కంఠస్వరం సంగీత పాఠాలు చెప్తూ ఉంటే శిష్యులు శ్రద్ధగా, ఏకాగ్రతతో వినడం, నేర్చుకోవడం. అంతా ముక్తకంఠంతో ఆలపిస్తోంటే ఆ నాదం ప్రకృతి అంతా ప్రతిధ్వనించడం. మల్లెలు తెల్లబోయి చూడడం, మామిడి పిందెలు తలలూపడం.. కోకిలలు సిగ్గుతో కొమ్మల్లోకి దూరిపోవటం.. భ్రమరం తేనె కోసం పిల్లల చుట్టూ ప్రదక్షిణలు చెయ్యటం.. ఉదయం పాఠాలవగానే... గాడిపొయ్యి మీద గుండిగలు పెట్టేవారు కొందరు... నీళ్లు తోడేవారు... పాలు పితికేవారు... కూరలు తరిగేవారు... పప్పు రుబ్బేవారు... పచ్చడి చేసేవారు... వండేవారు... వార్చేవారు... వడ్డించేవారు. ఓహ్! అదో పెళ్ళివారిల్లూ!! పాలూ – పంచదార కలిపి సరళీస్వరాలయేది కత్తిపీట – కొత్తిమీర జంటస్వరాలయేది – అన్నం కుతకుతలో – ఆలాపన – అప్పడాలు వేగటంలో – వర్ణాలు – పులుసు చేస్తూ కృతులు – పరమాణ్ణం తయారు చేస్తూ కీర్తనలు వంటశాల సంగీతశాలై పోయీూ....! నవరసాలతో శ్రవణేంద్రియాలన్నీ – అక్షుల్ని – కుక్షుల్ని – కూడా నింపేసేది! అలాంటి వాతావరణంలో నుంచి వచ్చిన సంగీతవేత్త పారుపల్లి వారు. చల్లపల్లి అడవి చిన్న రామయ్య గారి దగ్గర ఠాణేదారుగా ఉద్యోగానికి తర్ఫీదు పొందీ – పెదకల్లేపల్లిలో ఠాణేదారుగా తన 12వ ఏట నియమితులయ్యారు. కానీ సంగీతం, సాహిత్యం అబ్బినవాడికి ఉద్యోగాలు రుచిస్తాయా – తేనె రుచి మరిగినవారికి బెల్లం పాకం వెగటేయదూ! అంచేత ఉద్యోగానికి తిలోదకాలిచ్చి... అచ్చంగా సంగీతాన్ని అవపోసన పట్టడం ప్రారంభించీ... వయోలిన్, వేణువు, మృదంగం, కంజిర ఇలా అన్ని వాయిద్యాల్లోనూ నైపుణ్యం సంపాదించారు. సరే, గాత్రం ఎలాగ ఉండనే ఉంది. ఇంక ఆంధ్రదేశమంతటా సంగీత కచేరీలు ప్రారంభించారు.

1915లో చెన్నపట్నం పాలకులైన పెట్లండ్ ప్రభువు గారిచే తెనాలి పురపాలక వర్గం వారు సమర్పించిన స్వర్ణపత్రాన్ని అందుకున్నారు. బరోడాలో అఖిల భారత

సంగీత సభలో పాల్గొని సన్మానితులయ్యారు. 1928లో కాకినాడ శ్రీరామసమాజం వారు పంతులుగారికి బంగారు గొలుసు, పథకంతో సన్మానించారు. పుష్పగిరి పీఠాధిపతుల చేత 'కనకాభిషేకం' చేయించుకున్నారు.

1906లో పశ్చిమగోదావరి డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న భక్తవత్సలంగారు పంతులు గారి సంగీతానికి ముగ్ధులైపోయి 'తెలుగు రాయని పాలెం' గ్రామానికి కరణంగా నియమించారు. 1921లో కె.వి. శ్రీనివాస అయ్యంగారు మద్రాసులోని 'గోఖలే' హాల్లో పంతులు గారి గాన సభ ఏర్పాటు చేశారు. పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారి – గాత్రం. మైసూరు ఆస్థాన విద్వాంసులు చౌడయ్య గారు – వయోలిన్ – అలహనంది పిళ్ళై – మృదంగం – వేలాయుధం పిళ్ళై – కంజిర – ఆనాటి సంగీత కచేరీ – తరతరాల వరకు విన్నవారి స్మృతిపథంలో ఒక మధురానుభూతి మిగిల్చారు. కారణం – అంతా సరస్వతీ పుత్రులే. కిటకిటలాడిపోయిన హాలు ఒక 'రసిక సముద్రం'. ఆ సంవత్సరంలోనే ఆంధ్రా రీసెర్చ్ యూనివర్సిటీ చేత 'భారతీ తీర్థోపాధ్యాయ' అన్న పట్టాని కూడా పొందారు. 1931లో అఖిలాంధ్ర పరిషత్ వార్షిక మహాసభలో ఎంతోమంది సంగీత విద్వాంసులు, వేలకొద్దీ రసికులు, విద్యావేత్తలు, పురప్రజల సమక్షంలో సభ దద్దరిల్లిపోయేలా హర్షధ్వనుల మధ్య 'గాయక సార్వభౌమ' బిరుదు పొందారు. అంబ, నవాంబుజోజ్వల కరాంబుజ పులకరించి చల్లగా దీవించింది. పంతులు గారి శిష్య వాత్సల్యానికి ఓ మచ్చుతునక–

60 – 70 ఏళ్ళ క్రితం... తిరువాయూరు త్యాగరాజ ఆరాధనోత్సవాలలో కమిటీ మెంబర్ పంతులుగారు. సరే – తనతో పాటు శిష్యుడు చిరంజీవి మంగళంపల్లి బాలమురళీకృష్ణను తీసుకెళ్లారు. అప్పటికి ఆ కుర్రాడికి ఎనిమిదేళ్లు. అయితేనేం చిచ్చరపిడుగు. సరే ఆరాధనోత్సవాలు మొదలయ్యాయి. భారతదేశం నలుమూలల నుంచి వచ్చిన విధ్వాంసులు తమతమ ప్రతిభాపాటవాలు చూపిస్తున్నారు. బాలమురళి గురువుగారికేసి బేలగా చూశాడు. గురువుగారికి అర్థమైంది. కమిటీ వాళ్ళతో మాట్లాడి మా శిష్యుడు చిరంజీవి బాలమురళీకృష్ణ కచేరీ చేస్తాడు అన్నారు. త్యాగరాజ ఆరాధనోత్సవాలు అంటే పిల్లల ఆటా – లేక బాలానందం ప్రోగ్రామా – అని వీల్లేదంటే వీల్లేదన్నారు అక్కడి పెద్దలు. అప్పుడు పంతులుగారు "సరే ఒక పని చేయండి – ఆరాధనోత్సవాలలో నేను పాడటానికి కేటాయించిన సమయంలో నేను పాడను. నా శిష్యుడు పాడతాడు. మిమ్మల్ని మెప్పిస్తాడని నా నమ్మకం – అన్నారు. సంగీత సభ ఆత్రంగా ఎదురు చూస్తోంది. బాలమురళి గురువు గారికికేసి చూసి నమస్కారం చేశాడు. కళ్ళతోటే ఆశీర్వదించారు గురువుగారు. ఏమి పాడాడో... బహుశా ఎందరో మహానుభావులు అన్న ఉద్దేశంతో పాడి ఉంటాడు. బాల మురళి నాదం – సభ యావత్తునూ మత్తులో ముంచేసింది. పెద్దలంతా చప్పట్లు కొట్టి మంగళాక్షితలు చల్లారు. గురువుగారు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ మురిసిపోయారు. ఈ సంఘటన గురించి మంగళంపల్లి వారు తమ కళ్ళతో ఎన్నిసార్లు చెప్పుకున్నారో... 'గురువంటే ఆయనా... ఆయన శిష్యరికం నా పూర్వ జన్మ సుకృతం' అని. పారుపల్లి వారిది కూడా సుసర్ల వారి పద్ధతే. ఆయనకు కూడా గురుకులం ఉండేది. అయితే ఆయన ఇంట్లో అన్ని వర్గాలవారూ.. అన్ని వర్ణాలవారు... అన్య మతస్థులు కూడా సంగీతం నేర్చుకోవడానికి వచ్చేవారు. అందర్నీ సమదృష్టితో చూసిన ఉత్తమ గురువు పారుపల్లి. ఉదాహరణకు అన్నవరపు రామస్వామి, దాలిపర్తి పిచ్చహరి, పాతూరి సీతారామయ్య చౌదరి, వంకదారి వెంకటసుబ్బయ్య గుప్తా, షేక్ చినమౌలానా సాహెబ్, జి.వి. రామకుమారి, నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులు, మంగళంపల్లి బాల మురళీకృష్ణ, నేతి శ్రీరామ శర్మ, అరుంధతీ సర్కార్, చిలకలపూడి వెంకటేశ్వర శర్మ, ఇలా ఎంతోమంది శిష్యులకి సంగీతంతో పాటు ఇంగితజ్ఞానం కూడా నేర్పిన మహానుభావుడు ఆయన.

సుసర్ల దక్షిణామూర్తిగారు కాలం చేశాక, ప్రతి ఏటా ఆయన పేరున ఆరాధనోత్సవాలు జరుపుతూ స్వయంగా 'తద్దినం' పెట్టేవారు పంతులుగారు. అది 1951... సుసర్లగారి ఆరాధనోత్సవాలు... విజయవాడలో దుర్గాపురంలో శరభయ్య గుళ్లల్లో జరుగుతున్నాయి. అపరాహ్ణంవేళ! గురువుగారికి ఆబ్దికం పెట్టి... మేడ దిగి కిందకి వెళ్లి తూర్పువైపున గురువుగారిని స్మరిస్తూ సాష్టాంగ ప్రణామం ఆచరించిన పారుపల్లి రామకృష్ణయ్య పంతులు గారు మరి లేవలేదు. గురుస్మరణ చేసుకుంటూ నాదబ్రహ్మంలో ఐక్యమైపోయారు!

---

పద్మభూషణ్ పి.పి. రావు - ఫెస్ట్‌స్క్రిప్ట్ - ఇయర్స్ ఆఫ్ విజన్ నుంచి

# జ్ఞాపకాల జడివాన!

**– పద్మశ్రీ ఎస్.వి. రామారావు**



పద్మశ్రీ ఎస్.వి. రామారావు

గుడివాడలో పుట్టాను. గుడివాడ హైస్కూల్ చిత్రకారుణ్ణి చేసింది. గుడివాడ కాలేజి కవిగా మలచింది. ఇవి నా జీవిత యానానికి పునాదులు. గుడివాడ నుండి బయలుదేరిన నా ప్రయాణం భారతదేశంలోని నగరాలను దాటి యూరప్ ఖండానికి, అక్కడి నుండి అమెరికాకు – అలా సాగుతూనే ఉన్నది – ఇంకా అలుపెరుగకుండగా.

జ్ఞాపకాలకు మతిమరపు ఉండదు. తలచుకుంటే వాటంతటికి అవే మరోమారు పిలవకుండగ, మనోనేత్రాల ముందు కనిపిస్తాయి. 'తియ్యటి జ్ఞాపకాలు' చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు తాతలు, అమ్మమ్మలు, నాయనమ్మలు పాడిన పాటలు, చెప్పిన మాటలు; ఇచ్చిన ఆట వస్తువులు, తాయిలాలు; అమ్మ, నాన్న కసిరితే కాని, చిన్నగా దెబ్బలు వేస్తే గాని ఏడుస్తుంటే అక్కున చేర్చుకొని బుజ్జగించి ఇచ్చిన ప్రేమానురాగాలు, బడిలో మాస్టార్లు కసిరిన మాటలు, పాఠాలు చెప్పిన విధానాలు; పెండ్లి అయిన వెంటనే భార్యతో గడిపిన మధురస్మృతులు; పిల్లలు పుట్టిన తర్వాత వాళ్లు పెరుగుతున్నప్పుడు మనసు పెట్టి చదవకపోతే, మార్కులు బాగా రాకపోతే, తనకు కలిగిన ఇబ్బందులు ఎన్నెన్నో, జీవితమంతా నిండిన విషయాలు – అన్నీ జ్ఞాపకాలే. అందుకే అంటాను జీవితానికి నిర్వచనం – "జ్ఞాపకాల దొంతర్లు" అని. ఎవరి జ్ఞాపకాలు వారివి. అందుకే మన జీవితాలు విభిన్నంగా, మన ఆలోచనలు మరొకరితో పోల్చబడనివిగా ఉంటాయి.

నేను మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్సులో చిత్రకళ నేర్చుకుంటున్నప్పటి విషయాలు – 1956-1962 మధ్య కాలంలో. చాలా చాలా కాలం క్రిందటి మరపురాని విశేషాలు తెరలు తెరలుగా జ్ఞప్తికి వస్తున్నాయి.

మద్రాసులో ఉన్న రోజులు – "స్వతంత్ర" వారపత్రిక చదవడం మామూలు అయిపోయింది. నిజానికి అది నేను "గుడివాడ కాలేజి"లో చదువుతున్నప్పుడే మొదలైన ఓ మంచి అలవాటు. 1951 లో కాలేజిలో చేరాను ఈ కాలేజి పేరు ఏఎన్ఆర్ కాలేజిగా మార్చారు. నా క్లాసుమేట్సు తిరునగర్, దివ్య ప్రభాకర్ కథలు "స్వతంత్రలో" పడేవి. అలానే మా ప్రక్క ఇంట్లోనే ఉండే "కాలాతీతవ్యక్తులు" నవలా రచయిత్రి డా॥ శ్రీదేవిగారు ''స్వతంత్ర''కు అప్పుడే రాయడం మొదలుపెట్టారు. తరువాత పెళ్లి చేసుకుని హైదరాబాదుకు వెళ్లారు. అక్కడ నుండే స్వతంత్ర పత్రికకు విరివిగా వ్రాయడం సాగించారు. అప్పటికే నేను మద్రాసు వచ్చేసాను. అయినా ' స్వతంత్ర ', ' భారతి ' నా ప్రియమైన పత్రికలు. ఈ రెండింటితోనే మా తరం పెరిగిందని అనడంలో అతిశయోక్తి లేదు. మా కాలేజి పత్రికలో తరచుగా నా గేయాలు ప్రచురించబడేవి. "వైతాళికులు" సంకలనం నన్ను ప్రభావితం చేసింది.

గుడివాడ కాలేజి నుండి 1955లో బి.కాం. డిగ్రీ తరువాత బి.ఎ. (ఎకనామిక్స్)లోను డిగ్రీలు పొందాను. తరువాత మానాన్నగారు నన్ను వారికి తెలిసినవారి స్నేహితుడు సినిమా తీస్తుంటే, మద్రాసు నగరంలో, నన్ను వారిదగ్గరకు పంపించారు. ఆయన నన్ను వారి సినిమా ప్రొడక్షన్‌లో అసిస్టెంట్ ఆర్ట్ డైరెక్టర్‌గా తీసుకున్నారు. మరొక మిత్రుడు నాతో అన్నారు "విజయవాహిని స్టూడియోస్‌లో ఒక మహాగొప్ప చిత్రకారుడు, ఆర్ట్ డైరెక్టర్ అయిన శ్రీ మాధవపెద్ది గోఖలేగారు ఉన్నారు. ఆయన దగ్గరకు వెళ్లి నీ చిత్రాలు చూపించి వారి సలహా తీసుకో" అని అన్నారు. అలాగే నేను వెళ్లి గోఖలే గారిని కలిసి వారికి అసిస్టెంట్‌గా పనిచేసే అవకాశం ఏమైనా ఉంటుందా అని అడిగాను. "ఒక హైస్కూల్ డ్రాయింగ్ మాష్టారు గారి దగ్గర నేర్చుకున్న విద్య" సినిమారంగంలో ఆర్ట్ డైరెక్షన్‌లో పనిచేసేందుకు సరిపోదు అని అన్నారు. "నువ్వు మద్రాసు స్కూలు ఆఫ్ ఆర్ట్సులో చదివి

డిగ్రీ పొందకపోతే సినిమా రంగంలో ఆర్ట్ డైరెక్టరు అవ్వడం చాలా చాలా కష్టం. ఒకవేళ ఇప్పుడు నువ్వు ఏ ఆర్ట్ డైరెక్టర్ కిందనైనా అసిస్టెంట్‌గా పనిచేస్తున్నా, తర్వాత నీకు అవకాశం ఎవరు ఇవ్వరు. అంతగా నిన్ను గౌరవించరు అన్నారు. మా నాన్నగార్ని మద్రాసుకు పిలిపించి ఒప్పించారు. ఆయన సలహా సహకారాలతో నేను మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చేరడం జరిగింది. గోఖలే గారు 6 సంవత్సరాలు మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చదివారు. ఆ మహాత్ముడు శ్రీ గోఖలే గారు నా జీవిత రేఖనే మార్చివేసిన వ్యక్తి. "నాకు జీవితాన్నే భిక్షగా పెట్టిన మహానుభావుడు" అని ఎప్పుడూ మనసులో తలచుకుంటూనే ఉంటాను. దీక్షగా చిత్రకళను అధ్యయనం చేసాను. శిక్షణలో లోపం లేకుండా కృషి పెట్టాను. మద్రాసులోని అమెరికన్ లైబ్రరీలో, బ్రిటీష్ కౌన్సిల్ లైబ్రేరీలో చిత్రకళ మీదున్న పుస్తకాల్ని, మూరుమార్కెట్టులో నాకై నేను, సొంతడబ్బుతో కొనుక్కున్న పుస్తకాల్ని శ్రద్ధగా చదివేవాడిని. ఒక విధంగా మా నాన్నగారికి ఋణపడి ఉన్నాను. కాలేజిలో చేరి, ఏదైనా సరే ఒక డిగ్రీ తీసుకున్న తర్వాతనే చిత్రకళ నేర్చుకోవలసింది, అని ఆయన పట్టుపట్టకపోతే, నాకు ఇంగ్లీషు అంతగా వచ్చి ఉండేది కాదు. నేను మద్రాసులో స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చేరేవాడిని కాదు. జీవితం మరో మార్గాన్ని పట్టి ప్రయాణం సాగించేది. ఇప్పుడు అర్థం అయ్యింది కాలేజి చదువు ఎంత అవసరమైనదో నా జీవితంలో. అందుకే మా నాన్నగారి పాదాలకు తల ఆన్చి నమస్కరిస్తున్నాను, నా మనసులోనే.

దేశంలో గొప్పగా నా చిత్రాలకు గౌరవం రావాలి అని ఆశించాను. ఆ దృష్టితోనే నా జీవితాన్ని కళకు అర్పించుకున్నాను. ఓడిపోవడానికి వీలులేదు అన్నదే పట్టుదల. నేను చిత్రకళారంగంలో జీవితం గడపడం నా తండ్రి గారికి ఇష్టం లేకపోయినా, ఆయన అడ్డు రాలేదు నా నిర్ణయానికి. నేను ఓటమి పాలయితే మా నాన్నగారిని నిరాశాపరుణ్ణి చేస్తాను. నాకు ఇద్దరు చెల్లెల్లు, తమ్ముడు ఉన్నారు. వారిని చూడవలసిన బాధ్యత నామీద ఉన్నది అని గ్రహించాను. అందుకే ' ఓటమి ' అన్న మాటను నాలో నుండి తీసివేసాను.

మద్రాసులో నాకు పరిచయం అయిన రచయిత 'ఎల్లోరా' – ఆంధ్రప్రభ (దినపత్రిక)లో పనిచేస్తుండేవారు. తరచుగా వారింటికి వెళ్లేవాడిని. తాను రాసిన జానపదగేయాల్ని చదివి వినిపించేవారు. అలా నాకు జానపద సాహిత్యంతో పరిచయం కలిగింది. అప్పటికే నేను ' ఆంధ్రపత్రిక 'కు, ' భారతి 'కి గేయాలు , వ్యాసాలు రాస్తుండేవాడిని. నేను రాసే భాష వేరు, పదాలు వేరు, కృష్ణాజిల్లా తెలుగు మాండలీకంలో పెరిగినవాడిని. జానపద సాహిత్యంలోని మాధుర్యం, సుకుమారత్వం, సులువైన మాటలు, వాటిలోని యాస, ముఖ్యంగా సామెతలు కలిసిపోయిన భాషను చవిచూపించిన వ్యక్తి ఎల్లోరా గారు. వారికి నేను ఎంతో రుణపడిఉన్నాను. ఆ ప్రభావంతో "పాములవాడు", "గుడికి", "అలంకరణ" అనే పేర్లతో ఎన్నో చిత్రాల్ని టెంపెరా రంగుల్లో చిత్రించాను. నాకు జానపద చిత్రకళ, ఇండియన్ ఆర్ట్ నేర్పిన అమృతహృదయులు, నా గురువుగారు శ్రీ కె.శ్రీనివాసులగారు. వారు అడయార్ కళాక్షేత్రంలోని "బిసెంట్" స్కూల్లో చిత్రకళ అధ్యాపకులుగా ఉన్నారు. ఆ అనుభవం, బెంగాల్ చిత్రకారుడు శ్రీ జామినీరాయ్ చిత్రాల్ని భారతీయ, రాజపుత్, మొగల్, జైన చిత్రకళలను అర్థం చేసుకోవడానికి ఎంతగనో దోహదపడ్డది.

అయినా నా చిత్రాలను వారి చిత్రాల మాదిరిగా కాక నా స్వంత శైలిలో చిత్రించాను. అవి ఆల్ ఇండియా ఎగ్జిబిషన్‌లలో ప్రదర్శింపబడి మన్ననలు, బహుమతులు పొందాయి. ఇదంతా ఎందుకు రాస్తున్నానంటే – సాహిత్యం, చిత్రకళ సమ్మిళితమై, ఒకదానికొకటి పెనవేసుకొని నాలో పెరిగాయి అని చెప్పడానికి. చిత్రకారుల మీద రాసిన పుస్తకాలను ఎన్నిటినో చదివేవాడిని. ఎక్కువగా నాకు సాహితీవేత్తలతో పరిచయాలు, స్నేహాలు గాఢంగా ఉన్నాయి. అందువల్లనేమో నేను చిత్రకళను – ఎవరు చిత్రించినవైనా, నేను చిత్రించినవైనా – అన్నిటిని విమర్శనాదృష్టితోనే చూడటం అలవాటైనది మొదటినుండి. విమర్శకుడికి నిశిత పరిశీలన అవసరం అన్నది నిజసత్యం. అందుకే అన్నీ సమపాళ్లలో ఉన్న నా ఆప్తమిత్రులు, మహామేధావి, కీ.శే.సంజీవదేవ్ గారు అంటే నాకు ఎనలేని గౌరవం.

మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చేరకముందుగా, నేను ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నడిపే నాలుగు హైయ్యర్ లెవల్స్ పరీక్షలు పూర్తిచేసిన తరువాత ఇచ్చే GD (Art) అనే డిగ్రీని పొందాను. అంతకంటే పెద్ద డిగ్రీ (డిప్లొమా అనే వారు ఆ రోజుల్లో) చిత్రకళలో లేదు. మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చేరాలంటే, ఎంట్రన్స్ పరీక్షలు ఆ ఆర్ట్స్ స్కూల్ పెడుతుంది. నేను ఆ పరీక్షలలో పాల్గొన్నాను. దేవిప్రసాద్ రాయ్‌చౌదరి ప్రిన్సిపాల్‌గారు, వైస్ ప్రిన్సిపల్ కె.సి.ఎస్. ఫణిక్కర్ గారు. ఎంట్రన్స్ ఎగ్జామినేషన్‌లో నేను వేసిన చిత్రాల ఆధారంగా,

నన్ను ఒక్కసారిగా 3వ సంవత్సరంలో తీసుకున్నారు. ఆ రోజుల్లో అది ఎంతో విశేషమైనదిగా గుర్తింపబడ్డది. అలా అంతకుముందు ఎవరికీ ఇవ్వలేదు. అది నా అదృష్టమనుకుంటాను.

మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ పూనమల్లి హైరోడ్డు మీద, ఎగ్మూరు ఎలక్ట్రిక్‌ట్రెయిన్ స్టేషన్‌కు దగ్గరగా ఉండేది. అది ఎఱ్ఱటి రంగులో ఉన్న అందమైన భవనం. స్కూలు నుండి చిన్ని బ్రిడ్జి దాటి మధ్యాహ్నం భోజనానికి నేను, మిగిలిన తెలుగు క్లాసుమేంట్లందరం వెళ్లేవాళ్లం ఒక అరవ హోటల్‌కి. తెలుగు స్టూడెంట్లందరం ఆంధ్రాలోని పలుప్రాంతాలనుండి వచ్చినవాళ్లమే. ఎవరికివాళ్లం విడివిడిగా రూములు అద్దెకు తీసికొని ఉండేవాళ్లం– మద్రాసు నగరంలో అక్కడక్కడా. మేముండే గదుల్లో వంటలు చేసికొనేవాళ్లం కాదు– హోటళ్లలోనే భోజనాలు చేసేవాళ్లం. ఆ రోజుల్లో, మద్రాసు నగరం భారతదేశంలోనే చాలా చవుకగా జీవించగలిగే అవకాశం ఉన్న, దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద నగరం. అది దాని ప్రత్యేకత. తిన్నంత శాఖాహారం సమృద్ధిగా పెట్టేవారు. త్రాగినంత మజ్జిగ యిచ్చేవారు. మద్రాసులోనే భోజనం చేస్తూ, గ్లాసుడు రసం త్రాగడం నేర్చుకున్నాను. అరవ వాళ్లు అలా త్రాగేవారు. నెలకు ఒక్కసారిగా మీల్స్ కూపన్ల బుక్కు కొంటే 25 రూపాయలు. విడిగా ఒక్కొక్క భోజన టిక్కెట్టు 50పైసలు.

మా స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌కు దగ్గర్లో మూర్ మార్కెట్ ఉండేది. దాని ప్రక్కనే మద్రాసు సెంట్రల్ రైల్వే స్టేషన్. మూర్ మార్కెట్ ఇండియాలోనే పాతపుస్తకాలు అమ్మేచోటుగా ప్రసిద్ధి చెందింది. లెక్కలేనన్ని పుస్తకాల షాపులుండేవి. అక్కడ దొరకని పుస్తకం అంటూ లేదు అంటే ఆశ్చర్యపడనవసరం లేదు. రచయితలకు, జర్నలిస్టులకు, సాహిత్యం మీద ప్రేమ ఉన్నవారందరికి అది స్వర్గం. చిత్ర శిల్ప కళల మీద ఉన్న ఎన్నో పుస్తకాలను కొనుక్కునేవాడిని. విదేశాల్లో ప్రచురించబడ్డ లెక్కలేనన్నీ అందమైన, అద్భుతమైన పుస్తకాల్ని కొన్నాను. తర్వాత గుడివాడలోని మా ఇంటికి తీసికొనివెళ్లి ఉంచాను. అవన్ని ఎలా పోయాయో, ఎవరు తీసికొన్నారో తెలియదు. నేను లేని మా ఇంట్లో నా పుస్తకాలు ఉండదల్చుకోలేదు గాబోలు. అవన్నీ మాయమైపోయాయని తల్చుకుంటే చాలా బాధ వేస్తుంది – ఇప్పటికీ నాకు. చిత్ర, శిల్ప కళల మీదే కాక, సాహిత్యం మీద, వేదాంతం, మతం మీద ఎన్నో కొన్నాను. అవన్ని నాకు అర్థం అయ్యాయి అని కాదు, కాని తెలుసుకోవాలి అనే తృష్ణ అలా నడిపించింది నా జీవితాన్ని. నేను విద్యార్థిగా ఉన్న రోజుల్లో ఎన్నో విషయాల్ని తెలుసుకోవాలని, చదవాలని ఉండేది. మొదటగా నా రచనలకు ప్రేరణ గుడివాడ అయితే, నాకు అన్ని విధాల, నా వ్యక్తిత్వానికి పునాది వేసింది, సాహిత్యరంగంలో, చిత్రకళారంగాల్లో సృజనాత్మక వ్యక్తిగా మలచింది మద్రాసు నగరం. అందుకే మద్రాసు అంటే ఎనలేని ప్రేమ ఇప్పటికిని. ఆనాటి రామారావే ఈనాటి రామారావు, కొద్ది మార్పులు చేర్పులతో – ఆ ఆశయాలే, జీవితదృక్పథాలే ఈనాటికి నన్ను నడిపిస్తున్నాయి.

నాకు నచ్చింది ముఖ్యంగా చిత్రకళ అయినా, శిల్పకళ మీద చాలా పుస్తకాల్ని కొనేవాడిని. మా మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ప్రిన్సిపాల్, విఖ్యాత శిల్పి, శ్రీ దేవిప్రసాదరాయ్ చౌదరి గారిని గురించి తెలుసుకోవాలన్న కుతూహలమే శిల్పకళ మీద ప్రేమ పుట్టించింది. విశ్వవిఖ్యాత యూరోపియన్ శిల్పి రోడా. దేవిప్రసాద్‌రాయ్‌గార్ని "రోడా ఆఫ్ ఇండియా" అనేవారు. చాలా రియలిస్ట్‌గా శిల్పాల్ని మలచేవారు. ఆయన చుడ్డానికి వస్తాదులా ఉండేవారు. నిజంగా ఆయన వస్తాదు.

మద్రాసులోని బ్రిటిష్ కౌన్సిల్, యునైటెడ్ స్టేట్స్ ఇన్ఫర్మేషన్ లైబ్రరీలలో నుండి తెచ్చుకున్న చిత్ర, శిల్పకళలలోని పుస్తకాలలో ముద్రించిన పెయింటింగులను, వ్రాసిన వివరాలను, అవగాహన చేసుకొనడానికి చాలా కృషి చేశాను. చదివింది, చూసింది అర్థమైందని కాదు. నిజానికి 90% అసలు అర్థం అవ్వలేదు. పాశ్చాత్య చిత్రకళలలోని వివిధ శైలిలు, పికాసో చిత్రకళ, సర్వేడార్ డాలీల చిత్రకళలు, మరెంతో మంది ఇతర చిత్రాలున్నూ అర్థం కాలేదు. అయినా చదవడం, చూడటం చేస్తూనే ఉన్నాను – నేను మద్రాసులో ఉన్నంత వరకు. ప్రపంచంలోని నగరాల మీద ప్రచురింపబడ్డ పుస్తకాలంటే ఎంతో ఇష్టం. పెద్ద పెద్ద భవనాలు, పార్కులు, జలపాతాలు, చర్చిలు, అక్కడున్న మతసంబంధమైన చిత్రాల్ని చూస్తూ అందులో లీనమైపోయేవాడిని. ఈ పుస్తకాలు మరో ప్రపంచంలోకి తీసికొనివెళ్లి కలలు కనేలా చేసేవి. ఆ దేశాలలో నన్ను వదలిపెట్టేవి. అలాంటి తెలియని దేశాల గురించి ఊహించే మహత్తరశక్తిని ఇచ్చాయి. మద్రాసులో శరీరాన్ని ఉంచి, ఊహాలోకంలో విహరిస్తూ అన్ని దేశాల చుట్టూ తిరుగుతూ, విద్యార్థిదశను గడిపాను – పుస్తకాలను చదువుతూ.

1956లో మద్రాసుకు వెళ్లి అక్కడ ఉన్న స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ కళాశాలలో చేరాను. ఆ నగరంలోనే ఎల్ఐసి (LIC)

బిల్డింగ్ ఉన్నది. గుడివాడ నుంచి వచ్చిన నాకు దాన్ని చూడగానే ఎంతగానో ఆశ్చర్యం వేసింది. పదకొండు అంతస్థుల బిల్డింగు అది. అప్పటికి అదే ఎత్తైన భవనం మద్రాసు నగరంలో. ఆ బిల్డింగు దగ్గర ట్రాఫిక్ లైటు క్రొత్తగా వేశారు, అదే మొదటి ట్రాఫిక్ లైటు మద్రాసులో. ఎఱుపు, ఆకుపచ్చని రంగుల లైట్లు మారడం, అవే ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడం నమ్మశక్యం కానంతగా ఉండేది. అప్పుడే "బుహారి" అనే పేరుతో ఒక నాన్ వెజిటేరియన్ హోటల్ పెట్టారు, అక్కడ భోజనం చెయ్యడం ఓ ఫ్యాషన్‌గా ఉండేది, మరొక "బుహారి" ని మద్రాసు బీచ్‌లో కూడా పెట్టారు. మౌంటురోడ్డు దగ్గరే ఒక మేడపైన రూము అద్దెకు తీసికొని ఉన్నాను. అక్కడనుండి కూమ్‌నది ప్రక్కనే నడిచి ఒక అరగంటలో ఎగ్మూర్‌లో ఉన్న స్కూల్ ఆఫ్ ఆర్ట్సుకు వెళ్లేవాడిని రోజూ.మద్రాసు దక్షణాది రాష్ట్రాల్లోనే పెద్దనగరం. మరో విశేషం ఏమంటే తెలుగు సినిమా రంగం అంతా మద్రాసులోనే ఉండేది. ఉన్న రెండు తెలుగు దినపత్రికలు, ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రికలు గూడ అక్కడ నుండే వచ్చేవి. పేపర్లను రైళ్లలో ఆంధ్ర ప్రాంతాలన్నిటికీ పంపేవారు. ఎంతోమంది తెలుగువారుండేవారు మద్రాసు నగరంలో అరవం నేర్చుకోకుండా, తెలుగులోనే మాట్లాడి, ఏమి ఇబ్బంది లేకుండ జీవితం గడపవచ్చు. అందువల్లనేమో నాకు అరవం రాలేదు. నేను క్రొత్త భాషలు నేర్చుకున్నా, అవి నాలో ఇమిడేవి కావు. ఇప్పుడూ అంతే. నా సీనియర్ క్లాస్‌మెట్ వరూ శ్రీనివాసశర్మకు అలవోకగా భాషలు వచ్చేవి. బెంగాల్ నుండి చిత్రకళ నేర్చుకునేందుకు మా ఆర్ట్ స్కూల్‌కు వచ్చిన స్టూడెంట్స్‌తో కలిసిన అతికొద్ది కాలంలోనే బెంగాలి భాషను సునాయాసంగా మాట్లాడేవాడు.

నా క్లాసుమేటు కస్తూరి భాస్కరరావు దైవచింతన గల్గిన వ్యక్తి. ఆయనతో కలిసి జిడ్డు కృష్ణమూర్తిగారి ఉపన్యాసాలు వినేందుకు అడయారు వెళ్లేవాడిని. చిన్మయానందస్వామి గారి ఉపన్యాసాలు 1958లో, మౌంట్‌రోడ్డుకు ఇరుప్రక్కల ఉన్న విశాలమైన ఖాళీ స్థలాలలో, ఏర్పాటుచేశారు – అంటే నిజంగా ఎంతో బిజీగా ఉన్న అతిపెద్ద మౌంటురోడ్డు ప్రక్కన అన్నమాట. ఆ రోజుల్లో అంత ట్రాఫిక్ లేదు. వందలమంది కూర్చొని ఆయన ఉపన్యాసాలు వినేవాళ్లం. ఈ రోజుల్లో మౌంట్‌రోడ్డు దాటడమే కష్టం. ఒకసారి భాస్కరరావు చిన్మయానందస్వామి గారి పోర్ట్రెయిట్ వెయ్యాలనే కోరిక తనకు ఉన్నది అన్నాడు. ఉపన్యాసం అయ్యాక ఇద్దరం ఆయన దగ్గరకు వెళ్లాం. "నేను మాంబళంలో ఒకరి ఇంట్లో విడిదిచేస్తున్నాను. ఉదయంపూట, నేను ఉన్న ఇంటికి వచ్చి నీవు, నా పోర్ట్రెట్ చిత్రించుకోవచ్చు. నాతో మాట్లాడటానికి ఎంతోమంది వస్తారు గదా ! నా పని – వాళ్లతో మాట్లాడడం, నీ పని – పెయింటింగు చేసుకోవడం" అన్నారు శ్రీ చిన్మయానందస్వామివారు. సరేనని రెండవ రోజునే, రంగులు, కాన్వాస్, ఈసెల్ తీసికొనివెళ్లాం. నా మిత్రుడు ఆయన పోర్ట్రెట్ చేస్తుంటే, నేను ఊరికే చూస్తూండేవాడిని. నేను ఆయన పోర్ట్రేటు చిత్రించడం లేదు. ఒకరోజున శ్రీ చిన్మయానందస్వామి గారిని పరీక్ష చేద్దామని తలచాను. చిన్నవాడిని కనుక, జీవితంలో అనుభవం లేని గర్వం. ఆయనకు వేదాంతం, మతం విషయాలపైన మాత్రమే బాగా పరిజ్ఞానం ఉండి ఉంటుంది; చిత్ర శిల్ప కళల్లో అవగాహన ఉండడానికి అవకాశం లేదు; గనుక నాకు తెలిసినంతగ ఆర్ట్ ఆయనకు తెలియదు, అని తలచాను. ప్రశ్నలు వేస్తే ఆయన ఏమి చెప్పలేకపోతారు అన్న ఉద్దేశ్యంతో ఉన్నాను. నే చెప్పే విషయాలు చిత్రకళ మీద విని చిన్మయానందస్వామి గారు మెచ్చుకుంటారు, రామారావుకు చిన్నతనంలోనే ఇంత పరిజ్ఞానం ఉన్నది అని ఆశ్చర్యపోతారు అని అనుకున్నాను. ఇక సాగించాను చెప్పడం – మైకేలాంజెలో, లియనార్డో డావిన్సిల ఆర్ట్ మీద, క్రిష్టియన్ మతం ఎలా వారిని ప్రభావితం చేసిందో అని. నేను చెప్పింది అంతా విన్నాక ఆయన మాట్లాడడం మొదలుపెట్టారు. క్రిష్టియన్ మతం, బౌద్ధమతాలు, హిందూమతాలు వాటికి చిత్ర శిల్ప కళలకు ఉన్న అవినాభావ సంబంధాలు యూరప్‌లో పుట్టిన ఇంప్రెషనిజం, వాన్‌గో, పికాసోల మీద మాట్లాడుతుంటుంటే, వింటూ నాకు తల తిరిగిపోయింది. వారికి తెలిసినంత క్షుణ్ణంగా నాకు తెలియదు. ఆయనకు అంత లోతుగా తెలిసే అవకాశం ఎలా సాధ్యపడింది అని ఆశ్చర్యంలో మునిగిపోయాను. ఆయన మహాజ్ఞాని. ఆయనకు తెలియని విషయం లేదు. నేను సిగ్గుతో తలవంచుకున్నాను – నా అజ్ఞానానికి. నా గర్వాన్ని, వారు చిఱునవ్వుతో కాలితో తొక్కిపెట్టారు. ఎల్లోరా గుహలో ఒక శిల్పం ఉంది, రావణాసురుడు తను మహాబలవంతుడనని గర్వపడుతూ, శివపార్వతులు కూర్చున్న మహాపర్వతాన్ని తన చేతుల్లో అలవోకగా లేవనెత్తగలనని ఎత్తబోతుంటే, పరమేశ్వరుడు తన పాదం బొటనవ్రేలితో అలా, చిన్నగా, నొక్కిపెడితే రావణాసురుడు ఎత్తలేకపోతాడు పర్వతాన్ని. గర్వభంగం అవుతుంది. అప్పుడుగాని తెలియలేదు తాను శివుని ముందు గడ్డిపూసలాంటివాడినని. నాకున్నూ అలాగే గర్వభంగం

అయింది. వొంగి ఆయన కాళ్లను తాకుతూ, సిగ్గుతో నమస్కరించాను. ఆయన ఒకచేత్తో నన్ను లేవనెత్తారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు, శ్రీ చిన్మయానందస్వామి గారిని తలచుకున్నప్పుడు అంత మహాజ్ఞానిని కలుసుకోవడం, నా జీవితంలో భగవంతుడు ఇచ్చిన వరం అని అనుకుంటాను. ఆయన పోర్ట్రెట్ చేసిన తర్వాత నా మిత్రుడు దానిని శ్రీ చిన్మయానందస్వామి వారికిచ్చి, ఆయన ఆశీస్సులు పొందాడు. నాకు వేదాంత, మత విషయాల మీద ఆసక్తి కల్గేందుకు కారకులు కస్తూరి భాస్కరరావు. చిన్మయానందస్వామిని తలచుకున్నప్పుడల్లా నాకు జ్ఞాపకం వస్తాడు, మిత్రుడు.

మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్సులో చేరి సంవత్సరం అవుతుంది. అప్పటికే నేను పలువిధాల శైలుల్లో చిత్రాలు వేస్తున్నాను – అంటే ఒక చిత్రానికి మరొక చిత్రానికి సంబంధం లేకుండగా, ప్రతి చిత్రం క్రొత్త రకంగానే ఉండాలి అన్న భావనతో చాలా చాలా చిత్రాలను చిత్రించాను. అందువల్లనే, ఆ అలవాటే ఈ రోజుకూ ఉన్నది నాలో – ప్రతి పెయింటింగు ఒక క్రొత్త Experiment. అది నా సూత్రం – అదే నా చిత్రాల గుర్తింపుకు కారణమైనదని భావిస్తాను. నా చిత్రాలు అమ్ముడుపోవడం కూడా జరుగుతున్నది. ప్రతి సంవత్సరం మద్రాసులోని కాంగ్రెస్ గ్రౌండ్సులో 'ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్' జరుగుతుంది. వేలమంది వస్తారు చూడ్డానికి. అందులో పాల్గొనేందుకు ఎన్నో చిత్రాలు, శిల్పాలు దేశమంతటి నుండి వస్తాయి. నేను రెండు చిత్రాల్ని ప్రదర్శించాను. అదే మొదటిసారి నేను చిత్రాల్ని ప్రదర్శించడం. ఉత్తమ చిత్రాలకి బహుమతులు ఉన్నాయి. ఎవరు బహుమతులు సంపాదిస్తారో అని అందరం ఎదురుచూస్తున్నాం. జడ్జిగా ఉన్నవారి పేరు శ్రీ జి.వెంకటాచలం అని తెలిసింది. మా టీచర్లు అనుకుంటున్నారు. – "ఆయన దొరకడమే కష్టం – ఎప్పుడూ భారతదేశంలోనే ప్రయాణాలు చేస్తుంటారు. అంత గొప్ప కళావిమర్శకుడు, మన ప్రదర్శన సమయానికి మద్రాసు వచ్చి జడ్జిగా ఉన్నారంటే అదొక విశేషమే !" కాని నాకు ఆయన ఎలా ఉంటారో గూడ తెలియదు. వారి ఫోటో అయినా పేపర్లలో చూడలేదు.

ఆల్ ఇండియా ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవం అయిన తరువాత రోజున, మా ఆర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.సి.ఎస్ ఫణిక్కర్ గారు ఎవరెవరికి ఏఏ బహుమతులు వచ్చాయో మా ఆర్ట్‌స్కూల్ నోటీస్ బోర్డులో పెట్టారట. నేను ఎనిమిది గంటలకు ఉదయం స్కూలుకు వచ్చాను. అప్పుడే నెమ్మదినెమ్మదిగా స్టూడెంట్స్ అందరూ వస్తున్నారు. మా తెలుగు స్టూడెంట్స్ బృందంలోని ఒకరు – నాకు ఒక సంవత్సరం జూనియర్ అయిన ఆంజనేయులు నా దగ్గరకొచ్చి – "ఏమోయ్ రామారావ్ – నాకు ఒక స్ట్రాంగ్ కాఫీ కొట్టించు. ఈవేళ నీ జేబులో డబ్బులన్ని అయిపోతాయిలే, లంచ్ గూడ తినిపించాలి మన వాళ్ళందరికి" అన్నాడు. నేను, వర్ఝా శ్రీనివాసరశర్మ, ఆంజనేయులు, రాజు (ప్రఖ్యాత నటి వాణిశ్రీ బావ) కేతినేడి భాస్కరరావు, సూర్యనారాయణ, రెడ్డప్పనాయుడు, నెల్లూరు నుండి వచ్చిన రెడ్డి (మ్యాజిక్‌లో బహుప్రావీణ్యత పొందిన వ్యక్తి) కోటేశ్వరరావు అందరం ప్రతిరోజు లంచ్‌కి కలిసి వెళ్లేవాళ్లం. "ఏమిటోయ్ ఈ వేళ నన్ను ఆటపట్టించేలా ఉందే నీ సంగతి చూస్తుంటే. అర్ధంతరంగా డబ్బులు ఎక్కడనుండి వస్తాయ్ నాకు – నేనేమన్నా పెయింటింగ్ అమ్మానా ఏమిటి? లేదుగా? ఎవరితోనైనా నా పెయింటింగ్ కొనిపించు, అప్పుడు భోజనాలు పెట్టిస్తాను'' అన్నాను. ''బొమ్మలు కొనిపించడమేమిటోయ్. బొమ్మలు అమ్మకుండానే అప్పలంగా డబ్బొచ్చి ఒళ్లో పడ్తుంటేను" అన్నాడు ఆంజనేయులు. "నేనేమి లాటరీ కొట్టలేదు. నాకేమి పిల్లనిచ్చి కట్నం ఇచ్చే మేనమామ లేడు" అన్నాను. "అయితే నీకేమి తెలియదా ?" అన్నాడు. ఏమిటి తెలియడం అంటే అని అడిగాను. అప్పుడు చెప్పాడు నాకు ఫస్ట్‌ప్రైజ్ ఇచ్చారు అని. అది 250 రూపాయల ప్రైజు. ఎంత పెద్ద మొత్తమో!. ఆ రోజుల్లో, మేము నెలకు రూపాయిన్నర జీతం కట్టేవాళ్లం. సంవత్సరం చివర్న మద్రాసు గవర్నమెంటు వారు ఎనభై రూపాయల విలువైన రంగులు, క్రేయాన్స్, కాన్వాస్, బ్రష్‌లు లాంటివి మాకిచ్చేవారు. అలాంటి రోజులవి. నాకు ప్రైజ్ వచ్చిన చిత్రాన్ని చూడాలని ఆగమేఘాల మీద వెళ్లాను బస్సులో. ప్రదర్శనలో నా చిత్రానికి ప్రథమ బహుమతి ఇచ్చారు. దానికో పెద్ద రిబ్బను, ప్రైజు ఇంత అని వ్రాసి ఉంది.. చూస్తూన్నాను – నా ఆనందానికి అంతులేదు. ఒక్కసారిగా అంత డబ్బు వస్తే. నేను కొండంత పెరిగినట్లుగా భావించాను. అదే మొదటిసారి మద్రాసులో ఒక ప్రదర్శనకి నా చిత్రాన్ని పంపడం, ఒక ప్రైజు రావడం–.అదీ ఫస్ట్ ప్రైజ్ – ఆల్ ఇండియా ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో.

స్నేహితులు ప్రోత్సహించారు జి.వెంకటాచలం గారిని కలవమని. ఒక రోజు సాయంత్రం వారింటికి వెళ్లాను, ఆయన మైలాపూర్‌లో ఒక ప్రముఖ సంగీత విద్వాంసురాలి

ఇంట్లో ఉన్నారు. ఆవిడ పేరు రంగనాయకి. ఆవిడకి నన్ను పరిచయం చేసుకొన్నాను. "నేనూ ఉన్నాను. ప్రైజు సెలక్షన్ చేసేటప్పుడు. నీ చిత్రం ఆమోఘంగా ఉంది. చూడగానే అది అందరికి నచ్చింది. అన్ని చిత్రాల్ని ప్రక్కకు తోసేసి, ముందుకు వస్తున్న "పవర్‌ఫుల్ చిత్రం" అన్నది ఆవిడ. అంతవరకు ఎవరూ నా చిత్రాన్ని అలా వర్ణించలేదు. థాంక్స్ చెప్పాను. ఏదో చిన్న ఊరు నుండి వచ్చిన వాడిని అనే భావన నాలో ఉండేది. మద్రాసులాంటి పెద్దనగరంలో పెరిగిన వారికి ఇంగ్లీషు బాగా వస్తుంది. వారిలాగా నేను సునాయాసంగా ఇంగ్లీషు మాట్లాడలేను అన్న బిడియంతో తక్కువగా మాట్లాడేవాడ్ని. వెంకటాచలం గారు వచ్చారు. కూర్చున్నవాణ్ణి లేచి నిలబడ్డాను. "హాల్లో నైస్ టు సీయూ", దెన్ యూ ఆర్ రామారావ్ !" రంగానాయకమ్మ గారు కాఫి తెచ్చారు మా ఇద్దరికి స్టెయిన్‌లెస్ స్టీల్ గ్లాసుల్లో.

"నువ్వు ఇంత చిన్నవాడివి అనుకోలేదు", అప్పుడు నాకు 20 సంవత్సరాలు. ఆంధ్రాలో ఏ ఊరు నుండి వచ్చింది ఇతర కుటుంబ విషయాలన్ని తెలిసికొన్న తర్వాత "నీ చిత్రాలు చాలా యునిక్‌గా ఉన్నాయి. బొంబాయి, ఢిల్లీ , కలకత్తా, బరోడాలలో వేసే చిత్రాలకు, నీ చిత్రాలకు సంబంధం లేదు. రంగుల మిశ్రమం అద్భుతంగా ఉంది. రేఖల్లో ఫోర్స్, బలం ఉన్నది. బోల్డ్‌గా ఉన్నాయి. తక్కువ రంగులు ఉపయోగిస్తూ, ఎక్కువ రంగులున్నట్లుగా భ్రమపెట్టడం ఆశ్చర్యాన్ని కలుగజేసింది. అది వర్ణ మిశ్రమంతో చేసిన మ్యాజిక్. You are very confident as an artist, sure of yourself. నీకు మంచి భవిష్యత్తు ఉంది. "బిలియర్డ్స్" అన్న చిత్రం నాకే కాదు అందరికి నచ్చింది. అందుకే దానికి ఫస్ట్ ప్రైజ్ ఇచ్చాం. అయినా బిలియర్డ్స్ గేమ్ ఎక్కడ చూశావు? ఆడేవారి కాన్సెన్‌ట్రేషన్, వ్రేలాడుతున్న ఎలక్ట్రిక్ లైటు వెలుతురు డార్క్ గ్రీన్ బిలియర్డ్స్ టేబుల్ మీద పడిన విధానం చాలా గొప్పగా ఉంది. చీకటి గదిలో గ్రీన్ టేబుల్ మెరిసిపోతున్నది వెలుతురు కంటె. అది ఆశ్చర్యం, అద్భుతాన్ని కలిగిస్తున్నది. వంగి ఆడుతున్న అతను బిలియర్డ్స్ కఱ్ఱను రెండుచేతుల్తో పట్టుకొని గురిచేస్తూ, ఆడేందుకు సిద్ధంగా ఉండడం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. నువ్వు ఆడతావా బిలియర్డ్స్?

"నేను ఆడనండి. ఈ మధ్యనే ఒక స్నేహితుడు వేమరాజు భానుమూర్తిగారు నన్ను ఆంధ్రా క్లబ్‌కు తీసికొని వెళ్లారు. అక్కడ చూశాను. మొదటిసారిగ. ఆ చీకటిగదిలోని, ఆ ఒక్క గ్రీన్ టేబుల్ టాప్ మాత్రమే నన్నాకర్షించింది. సూర్యరశ్మిలా వెలిగిపోతున్న ఆకుపచ్చటి రంగును మర్చిపోలేను."

"నేను పదిహేను రోజుల్లో వస్తాను. వచ్చినప్పుడల్లా ఇక్కడే ఉంటాను. నన్ను వచ్చి కలువు. నీవు వేసిన ఇతర చిత్రాల్ని తీసుకురా. చూడాలని ఉంది."ఈవిడకు ఫోను చెయ్యి. తాను చెప్తుంది నేను ఎప్పుడు వచ్చేది అన్నారు."

వారికి నమస్కారములు చెప్పి శెలవు తీసికొన్నాను. చిత్రం అంత గొప్పదో కాదో తెలియదు కాని, ఓ గొప్ప చిత్రకళా విమర్శకుడు నా చిత్రాన్ని మెచ్చుకున్నాడంటే అంతకంటె ఏమి కావాలి ? నా కండ్ల వెంట నీళ్లు వచ్చాయి. నా సహజ లక్షణం ఏమంటే కష్టం వస్తే తట్టుకోలేను, సంతోషాన్ని కూడ పట్టలేను. "బిలియర్డ్స్" చిత్రాన్ని నేను ఎవరికి అమ్మలేదు. నా దగ్గరే ఉంచుకున్నాను.

జి.వెంకటాచలం గారు ఢిల్లీలోని "ఆల్ ఇండియా ఫైన్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సొసైటి" సంస్థాపకులలో ఒకరు. బహుముఖ ప్రజ్ఞాశాలి. క్లాసికల్ భారతీయ నృత్యం, సంగీతం, సాహిత్యం, చిత్రశిల్పకళల్లో అశేషమైన పరిజ్ఞానం ఉన్న వ్యక్తి, గ్రంథకర్త. ఇంగ్లీషులో రాసేవారు. మనదేశానికి స్వతంత్ర్యం రాకముందు, అనిబిసెంట్ అనే ఇంగ్లీషు ఆవిడ మహాజ్ఞాని జిడ్డు కృష్ణమూర్తి గారిని దత్తత తీసుకొని, థియోసాఫికల్ సొసైటీలో ప్రముఖమైన వ్యక్తిగా, 1907 నుండి 1933 వరకు ఆ సొసైటీకి ప్రెసిడెంట్‌గా, సోషల్ రిఫార్మర్‌గా ప్రపంచమంతా పేరుపొందిన వారు. మద్రాసులోనే ఉండేవారు. అనిబిసెంట్ గారిని ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంటుగా ఎన్నుకున్నారు. ఆమె ఇంగ్లీషు "న్యూ ఇండియా" అనే దినపత్రికను మద్రాసు నుండి నడిపేవారు. దానిలో జి.వెంకటాచలం గారు కళలకి సంపాదకులు. ఎం.ఎస్.సుబ్బలక్ష్మి చాలచిన్నపిల్లగా ఉండగా పాట పాడితే, అది విని "నీవు అత్యుత్తమ సంగీత కళాకారిణివిగా గుర్తింపబడతావు అని" పత్రికలో వ్రాసి శ్లాఘించారు. అది నేను వారు వ్రాసిన పుస్తకాలలో చదివాను. దేశంలో పెద్దపెద్ద కళాకారులందరు వీరిని కలవాలని ప్రయత్నాలు చేసేవారు. వీరు ట్రావన్‌కూర్, బరోడా, మైసూర్ మహారాజులకు, ఇంకెంతమందికో కళల మీద సలహాదారులు. ఎం.ఎస్. హుస్సేన్, ఎన్.ఎస్.బంద్రే, కె.కె.హెబ్బర్, రెహమాన్, చుగతాయి లాంటి మహాగొప్ప చిత్రకారులకు, వివిధ కళారంగాలలో ఉన్న మరెంతోమందికి ఆయన ఆర్థికంగాను, మరెన్నో విధాలుగా సహాయపడేవారు.

*ఇంకా ఉంది.*

**ఎస్.వి. రామారావు - చికాగో, అమెరికా**

# నిరుడు మెరిసిన తెర వసంతాలు

*– సరస్వతీ ప్రదీప్*

సినిమా, టివి అనేవి వినోద ప్రపంచంలో రెండు కళ్ళలాంటివి. సినిమాతో సమానంగా టివి కూడా ఎదిగింది అనడంలో సందేహం లేదు. వారానికి అరగంట సీరియల్‌తో 1986 చివరలో మొదలైన ప్రస్థానం ఇంతింతై వటుడంతై అన్న చందాన ఎదిగింది. టివి సీరియల్ అంటే నేడు చిన్నపాటి వెటకారంతో పాటు అంతులేని మమకారం కూడా ఉంది.

సినిమా అయినా, టివి సీరియల్ అయినా మనిషి జీవితం నుండి ఆవిర్భవించిన సహజసిద్ధమైన కథావస్తువుతోనే ప్రేక్షకులని అకట్టుకుని, వారు మమేకమైపోయేలా చేస్తుంది. వస్తువు పటిష్టంగా లేకపోతే సాంకేతికంగా ఎన్ని హంగులున్నా అది తాత్కాలికమే.

ముఖ్యంగా నేడు ప్రజలు ఎక్కువగా ఆదరిస్తున్నది, వారిపై ఎక్కువ ప్రభావం చూపుతున్నవి సినిమా మరియు టెలివిజన్ అనడంలో సందేహం లేదు. కానీ ఈ రెండింటికీ చాలా వ్యత్యాసముంది. ముఖ్యంగా సినిమాల విషయంలో ప్రేక్షకులకు ఎంపిక చేసుకుని వెళ్ళి చూసే అవకాశం ఉంటుంది. కానీ టివి ఇంట్లోని వారందరికీ తప్పనిసరి అయిపోయింది. కుటుంబం మొత్తానికీ అందుబాటులో హాల్లో మధ్యలో ఉండే టివిని అన్ని వయసులవారూ కలిసి కూర్చుని చూస్తారు.

మనిషి జీవితంలో అవసరమయిన మౌలికమైన వస్తువులలో టెలివిజన్ ఒకటిగా మారింది. అందులో ఎంటర్టైన్మెంట్ ఛానెళ్ళ ప్రారంభంతో వీక్షకులు వినోద కార్యక్రమాలకు ఆకర్షితులయ్యారు. సినిమాలకు వెళ్ళలేనివారికి, టికెట్ కొని సినిమాలు చూడలేనివారికి కూడా ఈ ఛానెళ్ళు ఒక వరంలా మారాయి. టివి చూసేవారితో పాటు టివి ఛానెళ్ళ సంఖ్య కూడా రోజురోజుకీ పెరుగుతూ ఉంది. కేవలం వినోద కార్యక్రమాలకే పరిమితం కాకుండా వార్తలు, సినిమాలు, క్రీడలు, ప్రత్యక్ష ప్రసారాలతో టెలివిజన్ ఒక పెద్ద పరిశ్రమగా మారింది.

టివిలో ప్రసారమయ్యే అన్ని కార్యక్రమాల్లోకీ సీరియల్స్ ముందు వరసలో ఉన్నాయి. నేడు టెలివిజన్ లేని ఇల్లు, సీరియల్ చూడని కన్ను లేవంటే అతిశయోక్తి కాదు. సీరియల్ ఏమిటి అని ఆశ్చర్యంగా చూసేలోపే గత మూడున్నర దశాబ్దాలుగా టివి సీరియల్ జీవితంలో ఒక భాగమైపోయింది.

ఆరంభ దశలో సీరియల్స్‌లో ఎన్నుకున్న కథావస్తువు ఎంతో ఉన్నతమైన అంశంతో ఉండటమే కాకుండా అత్యున్నతమైన ప్రమాణాలతో రూపొందించబడేవి. అప్పటి సీరియల్స్ ఇప్పటికీ ప్రేక్షకుల గుండెల్లో స్థిరనివాసం ఏర్పరచుకున్నాయి అంటే కారణం మంచి కథ, కథనం, పాత్రల్లో లీనమై నటించిన నటీనటులు అనే చెప్పవచ్చు. మొట్టమొదట దూరదర్శన్‌లో ప్రారంభమైన సీరియల్స్ విలువలకు కట్టుబడి, సంభాషణల్లో కానీ, వస్తువు విషయంలో కానీ ప్రామాణికతను పాటించేవి. ఖచ్చితంగా సందేశాత్మకంగా, సామాజిక ప్రయోజనంతో కూడుకుని ఉండేవి. 'బుచ్చిబాబు', 'మనిషి' , 'మర్యాద రామన్న కథలు', 'స్త్రీ' 'ఆగమనం'వంటి వందల సంఖ్యలో సీరియల్స్ నేటికీ ప్రేక్షకులకి గుర్తుండిపోయాయి. వినోదం, వ్యాపారంతో పాటు సమాజ శ్రేయస్సుకి కూడా ప్రాధాన్యత ఉండేది. వారాంతపు సీరియల్స్ నుండి ఇప్పుడు రోజువారి ధారావాహిక సీరియల్స్‌గా విస్తరిల్లాయి.

క్రమేణా ఇక్కడా వ్యాపార ధోరణి పెరిగిపోయింది. గమనిస్తే గత పదేళ్ళలో ఈ విపరీత ధోరణి మరీ ఎక్కువైంది. మీడియా ఎంత శక్తివంతమైన సాధనమో అందరికీ తెలుసు.

అందులో టెలివిజన్ ప్రభావం సమాజంపై ఎంత ఎక్కువగా ఉందో వేరే చెప్పనవసరంలేదు. ఒకరకంగా చెప్పాలంటే క్రమశిక్షణ పెరిగి ఇంట్లో అందరూ సమయానికి పనులు పూర్తి చేసుకుంటున్నారు. ఆడబిడ్డలు, అత్తాకోడళ్ళ మధ్య పోరు కూడా తక్కువైందనే చెప్పవచ్చు. రిటైర్ అయినవారికి, పెద్దవారికి మంచి కాలక్షేపం. పరిశ్రమ పెరగడం, ఎంతోమంది కళాకారులకు ఉపాధి దొరకడం అనేది సంతోషించదగిన విషయమే అయినా, ఈ అభివృద్ధి ఏ దిశలో సాగుతోంది అన్నది ప్రశ్నార్థకమే. కుటుంబమంతా కలిసి చూసే సీరియల్స్ వినోదభరితంగా, సమాచారపరంగా, చైతన్యవంతంగా, ఆదర్శవంతంగా కనిపించడం లేదు. అవసరానికి మించిన పాత్రలు, మాటలు, విలనిజం, కక్షలు, కుట్రలు, వస్త్రధారణ, బరువైన నగలు, విపరీతమైన మేకప్, ద్వంధార్థాలతో సహజత్వానికి భిన్నంగా విచిత్రమైన పోకడలు చోటుచేసుకున్నాయి.

సీరియల్ అంటే ప్రాణాలు పెట్టే స్థాయి నుండి సీరియల్స్ గురించి చులకనగా మాట్లాడే స్థితికి వచ్చింది. నిజానికి సీరియల్స్ చూడటం ఎవరూ మానలేదు. కానీ చూసేవారు కూడా సీరియల్స్ చూస్తున్నాం అని చెప్పడానికి నామోషీగా భావిస్తూ వాటిని విమర్శిస్తూ ఉంటారు. సాంకేతికపరంగా ఎంతో మార్పు వచ్చి, అత్యున్నతమైన ప్రమాణాలతో ఒక భారీ బడ్జెట్ సినిమా స్థాయిలో సీరియల్స్ రూపొందిస్తున్నప్పటికీ వస్తువు విషయంలో కానీ, పాత్రల చిత్రీకరణ విషయంలో కానీ చాలా వెనకబడిపోతున్నారు. స్త్రీలను చాలా తక్కువగా చూపించడం, వారిని విలన్లుగా చిత్రీకరించడం, పిల్లలతో కూడా వయసుకు మించి సంభాషణలను చెప్పించడం, సాగతీత కథలు, వందలు వేలకొద్దీ ఎపిసోడ్స్, ప్రజల్లో వ్యతిరేకత పెరగడానికి ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.

కథకు అవసరమైన పాత్రలు ఉండాలి. ఆ పాత్రలు కూడా నిజజీవితానికి దగ్గరగా ఉండేలా చూసుకోవాలి. మహిళా పాత్రలను నెగెటివ్‌గా చూపడం సరికాదు. ఈ ప్రభావం ఈ తరం పిల్లలపై పడే ప్రమాదముంది అంటూ ఎన్ని విమర్శలు వెల్లువెత్తినా, ఎన్ని చర్చలు చేపట్టినా చలనం కనిపించడం లేదు. ప్రొడ్యూసర్ కోసమో, డైరెక్టర్ కోసమో, హీరోల కోసమో, వ్యాపారం కోసమో వచ్చే కథలు ఎక్కువ కాలం నిలవవు. సమాజం కోసం, ప్రజల కోసం వచ్చే కథలు అత్యంత జనాదరణ పొందటమే కాకుండా చిరస్థాయిగా నిలిచిపోతాయి అని ఇప్పటికే తొలినాళ్ళలో ప్రసారమైన కొన్ని ఆణిముత్యాల్లాంటి సీరియల్స్ నిరూపించాయి. నాటితరం నుండి నేటితరంవరకు సీరియల్స్ ప్రభావం అన్ని వర్గాలపైనా పడుతోంది. కాబట్టి సీరియల్స్ తీసేవారు నాగరిక సమాజంలో మానవ సంబంధాలు దెబ్బతినే పరిస్థితి రాకుండా బాధ్యతాయుతంగా, కొంత మానవతా దృక్పథంతో సీరియల్స్ నిర్మించాలి. పరిశ్రమ పెద్దలు, నిర్మాతలు, రచయితలు మేధోమథనం చేయాలి. మంచి చెడులను చర్చించుకుని, నడుస్తున్న తీరును విశ్లేషించుకుని, విమర్శించుకోవాలి. అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకుని ప్రస్తుతం సమాజంలో టివి సీరియల్స్‌పై వస్తున్న విమర్శలను సద్విమర్శలుగా మలుచుకోగలగాలి. సమాజాన్ని చైతన్యపరిచే విధంగా కథాంశాలను ఎంచుకోవాలి. మాట, ఆట, పాటలతో కూడిన దృశ్యరూపానికి సమాజం స్పందిస్తుంది. ప్రజలు త్వరగా ఆకళింపు చేసుకుంటారు.

చూస్తున్నారు కాబట్టి తీస్తున్నాం, తీస్తున్నారు కాబట్టి చూస్తున్నాం అనే వాదనలు సరికావు. సమాజంలో మంచి మార్పు తీసుకురావాలని, కుళ్ళుని కడిగేయాలని, రోజురోజుకీ పెరిగిపోతున్న క్రిమినల్ మనస్తత్వాలని తుడిచేయాలని ప్రయత్నం చేయడం పౌరులుగా ప్రతి ఒక్కరి బాధ్యత. ముఖ్యంగా సమాజం పై అత్యంత ప్రభావం చూపే సీరియల్స్‌ని తమ సామాజిక బాధ్యతగా భావించి, సొంత లాభం కొంత మానుకుని, చిన్ని నా పొట్టకు శ్రీరామరక్ష అనే రీతిగా కాకుండా వ్యాపారంతో పాటు, సమాజ హితవు కోసం కూడా సీరియల్స్ నిర్మిస్తున్న చానెల్స్, నిర్మాతలు, దర్శకులు సంకల్పిస్తే టివి సీరియల్‌కి పునర్ వైభవం తప్పకుండా వస్తుంది, మళ్ళీ పసిడి తెర నిండుగా మెరుస్తుంది.



**సరస్వతీప్రదీప్**
టి.వి. వ్యాఖ్యాత, వ్యక్తిత్వ వికాస శిక్షకురాలు - హైదరాబాద్.

# సదా సమాజ సేవలో: గాంధీ మార్గం

*– డా. శ్రీరాములు గోసికొండ*



విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య ఆరోగ్యకరమైన సంబంధాలను పెంపొందిస్తూనే క్యాంపస్, కమ్యూనిటీ మధ్య సంబంధాలను నెలకొల్పడానికి విద్యాసంస్థలలో 'జాతీయ సేవ'ను ప్రవేశపెట్టాలని యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ సిఫార్సు చేసింది. మహాత్మాగాంధీ కూడా పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అని దృఢంగా నమ్మి, దేశాన్ని అభివృద్ధి చేయాలంటే ముందుగా గ్రామాలను అభివృద్ధివైపు నడిపించాలన్నారు. దాని కోసం విద్యార్థి యువత వారి ఉపాధ్యాయుల మార్గనిర్దేశనంలో పనిచేయాలని పిలుపునిచ్చారు. అధికారికంగా, జాతీయ సేవాపథకం (నేషనల్ సర్వీస్ స్కీమ్) సెప్టెంబర్ 24, 1969న, 'జాతి పిత' – మహాత్మాగాంధీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా భారతదేశంలోని 37 విశ్వవిద్యాలయాలలో 40,000 మంది వాలంటీర్లతో మొదలైంది. స్వచ్ఛంద సమాజ సేవ ద్వారా విద్యార్థి యువత యొక్క వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేయడం ఎన్ఎస్ఎస్ యొక్క ప్రాథమిక లక్ష్యం. ప్రస్తుతానికి, ఎన్ఎస్ఎస్ 396 విశ్వవిద్యాలయాలు/పాలిటెక్నిక్ కళాశాలతోపాటుగా 47 ఇంటర్మీడియట్ కళాశాలల కౌన్సిల్స్/+2 స్థాయి పాఠశాలల్లో కలిపి 3.8 మిలియన్ విద్యార్థి వాలంటీర్లతో నడుస్తుంది. ఎన్ఎస్ఎస్‌ను కేంద్ర క్రీడలు, యువజన మంత్రిత్వ శాఖ, కేంద్ర విద్యాశాఖ యొక్క సమన్వయంతో నిర్వహిస్తుంది.

**ఎన్ఎస్ఎస్ నినాదం, చిహ్నం, లక్ష్యాలు:**

'నేను కాదు, మీరు' (నాట్ మి, బట్ యు) అనేది ఎన్ఎస్ఎస్ యొక్క నినాదం, ప్రజాస్వామ్య జీవన సారాన్ని ప్రతిబింబిస్తూ, నిస్వార్థ సేవ యొక్క అవసరాన్ని నొక్కి చెబుతుంది. ఇది 'సేవ ద్వారా విద్య'ను నమ్ముతుంది. ఎన్ఎస్ఎస్ వాలంటీర్ తనకంటే కూడా సమాజానికే అధిక ప్రాధాన్యతనిచ్చే విధంగా విలువలను పెంపొందిస్తుంది. అలాగే, ఒరిస్సాలో ఉన్న ప్రపంచ ప్రఖ్యాత కోణార్క్ సూర్య దేవాలయం యొక్క రథ చక్రాన్ని ఎన్ఎస్ఎస్ యొక్క చిహ్నం (లోగో)గా నిర్ధారించారు. లోగోలో ఉన్న ఎరుపు, నీలం రంగులు వాలంటీర్లను జాతి నిర్మాణానికి ఎల్లప్పుడు చురుకుగా, శక్తివంతంగా ఉండేలా ప్రేరేపిస్తాయి. ఇంకా చక్రం సామాజిక మార్పు, ప్రగతి కోసం ఎన్ఎస్ఎస్ యొక్క నిరంతర కృషిని సూచిస్తుంది.

విద్యార్థులు ఏ ప్రాంతంలో అయితే చదువుతారో, ఆ సమాజాన్ని అర్థం చేసుకొని, దాని అవసరాలు, సమస్యలను గుర్తించడమే కాకుండా వారి జ్ఞానాన్ని ఉపయోగించి వాటిని పరిష్కరించడం, సామాజిక స్పృహ, పౌర బాధ్యతలను పెంపొందించడం, సామూహిక నివాసానికి (గ్రూప్–లివింగ్), బాధ్యతలు పంచుకోవడానికి అవసరమైన సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం, సమాజంలోని వ్యక్తులందరినీ సమీకరించడానికి కావాల్సిన నైపుణ్యాలను అందించడం, నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య వైఖరిని మెరుగుపరచడం, దేశంలో జాతీయ సమైక్యత, సామాజిక/మత సామరస్యాన్ని నెలకొల్పే సామర్థ్యాలకు సానపెట్టడం, అత్యవసర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు తలెత్తినప్పుడు సహాయ సహకారాలు అందించడంలో ముందుండేలా శిక్షణ ఇవ్వడం, మొదలైనటువంటివన్నీ ఎన్ఎస్ఎస్ యొక్క లక్ష్యాలు.

**ఎన్ఎస్ఎస్ యొక్క కార్యక్రమాలు:**

ఎన్ఎస్ఎస్ యూనిట్లు సమాజానికి సంబంధించిన ఎన్నో కార్యక్రమాలను చేపట్టగలవు. సమాజ అవసరాలకు

అనుగుణంగా వివిధ కార్యకలాపాలను ఎన్ఎస్ఎస్ నిర్వహిస్తుంది. విద్య - అక్షరాస్యత, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, పోషకాహారం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవాకార్యక్రమాలు, మహిళల స్థితిని మెరుగుపరిచే కార్యక్రమాలు, ఉత్పత్తి-ఆధారిత కార్యక్రమాలు, విపత్తు ఉపశమనం, పునరావాసం, అవగాహన ర్యాలీలు తీయడం, సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా ప్రచారం చేయడం మొదలైనవన్నీ ఎన్ఎస్ఎస్ చేపట్టే ప్రధాన కార్యకలాపాలు. ఇవే కాకుండా జాతీయ యువజన దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, అమరవీరుల దినోత్సవం, అంతర్జాతీయ మహిళా దినోత్సవం, ప్రపంచ ఆరోగ్య దినోత్సవం, ఉగ్రవాద వ్యతిరేక దినం, ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం, ప్రపంచ పర్యావరణ దినోత్సవం, ప్రపంచ జనాభా దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం, సద్భావన దినం, అంతర్జాతీయ అక్షరాస్యత దినం, అంతర్జాతీయ శాంతి దినం, ఎన్ఎస్ఎస్ దినోత్సవం, జాతీయ రక్తదాన దినోత్సవం, మత సామరస్య దినం, జాతీయ సమైక్యతా దినోత్సవం, ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం, ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం, జాతీయ యువత వారోత్సవం, వనమహోత్సవ్ వారం, అంతర్జాతీయ అక్షరాస్యత వారం, క్వామి ఏక్తా వారోత్సవాలను ఎన్ఎస్ఎస్ నిర్వహిస్తుంది.

ఎన్ఎస్ఎస్ కింద ఎన్నో మంచి పనులు జరుగుతుండగా, ఇంకా చాలా చేసే అవకాశం ఉంది. విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మన దేశానికి క్రియాశీలక, శక్తివంతమైన అపారమైన మేధోసంపద. ఎన్ఎస్ఎస్ ద్వారా వాలంటీర్లు తమ స్వంత వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడంతో పాటు సమాజానికి విలువైన సహకారం అందిస్తున్నారు. వాలంటీర్లు శ్రమదానం, మొక్కలు నాటే కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, ఆరోగ్య శిబిరాలు, పల్స్ పోలియోవంటి రోగనిరోధక శిబిరాలలో చురుకుగా పాల్గొంటారు. వారు ముఖ్యమైన ప్రభుత్వ కార్యక్రమాలు, వివిధ సామాజిక సమస్యలపై ర్యాలీలు/ప్రచారాల ద్వారా అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహిస్తారు. అంతేకాకుండా, స్వచ్ఛభారత్ మిషన్‌లో స్వచ్ఛంద సేవకులుగా కీలక పాత్ర పోషిస్తున్నారు. దేశవ్యాప్తంగా దత్తత గ్రామాలు/మురికివాడల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు.

**విద్యలో ఎన్ఎస్ఎస్ స్థానం ఎక్కడ?**

ప్రతి ఎన్ఎస్ఎస్ వాలంటీర్ తన రెండు సంవత్సరాలలో కనీసం 240 గంటల సేవను అందించాల్సి ఉంటుంది. ఈ పని వారియూనిట్ ద్వారా దత్తత తీసుకోబడ్డ గ్రామాలు/మురికివాడల్లో లేదా పాఠశాల/కళాశాల/విశ్వవిద్యాలయ క్యాంపస్‌లలో జరుగుతుంది. అంతేకాకుండా, ప్రతి ఎన్ఎస్ఎస్ యూనిట్ స్థానిక సంస్థలను కలుపుకుని, కొన్ని నిర్దిష్ట ప్రాజెక్టులతో, దత్తత తీసుకున్న గ్రామాలు/పట్టణ మురికివాడల్లో ఏడు రోజుల వ్యవధిగల ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తుంది. కానీ మరోవైపు కళాశాల/విశ్వవిద్యాలయ స్థాయిలోని విద్యార్థులందరూ ఊపిరిసలపని/కఠినమైన విద్యా షెడ్యూల్‌వల్ల అంతర్గత, బాహ్య పరీక్షలతో ఎప్పుడూ బిజీగానే ఉంటారు. అందువల్ల వారు విద్యావిషయాలపై ఎక్కువ దృష్టి పెట్టాలి. అలాగే ఎన్ఎస్ఎస్ యూనిట్ కూడా అన్ని కార్యకలాపాలను నిర్వహించడం కష్టం. సమాజ అవసరాలు, విద్యార్థులకు లభించే సమయం ప్రకారం, ఎన్ఎస్ఎస్ యూనిట్ కార్యకలాపాలను నిర్వహించవచ్చు. ఎన్ఎస్ఎస్‌పై కళాశాల/యూనివర్సిటీ యాజమాన్య వైఖరి, ప్రోత్సాహం, బోధనా సిబ్బంది ధోరణి, స్థానిక గ్రామీణ/పట్టణ సంస్థల్లోని (లోకల్ బాడీస్) నాయకుల చొరవ, ప్రోద్బలం ఎన్ఎస్ఎస్ యొక్క కార్యకలాపాలను ఎంతగానో చాలా ప్రభావితం చేస్తాయి.

**ఎన్ఎస్ఎస్ కార్యకలాపాలపై కోవిడ్ ప్రభావం:**

ఏదేమైనా, దేశంలో కోవిడ్ మహమ్మారి పరిస్థితి కారణంగా, ఏప్రిల్, 2020 నుండి వివిధ ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు నిర్వహించబడలేదు. దురదృష్టవశాత్తు, ఈ ఆరోగ్య అత్యవసర కాలంలో దేశవ్యాప్తంగా ఉన్న పేద ప్రజలకు స్వచ్ఛంద సేవకులైన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేవ చేయలేకపోయారు. మరీ ముఖ్యంగా, కరోనా వైరస్ బారిన పడకుండా ఉండటానికి తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యల్లో భౌతిక దూరం ఒకటి. కానీ, భౌతిక దూరాన్ని పాటిస్తూ వాలంటీర్లు సామాజిక సేవలో పాల్గొనడం అనేది అంత సులభం కాదు. వైరస్ యొక్క రెండు వేవ్‌ల సమయాల్లో అమలు చేయబడిన వివిధ లాక్‌డౌన్ల సమయంలో దేశంలో క్లిష్టమైన, ప్రమాదకరమైన పరిస్థితుల కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులే కాకుండా వాలంటీర్లు కూడా సమాజ సేవలో ముందుకు రాలేకపోయారు. అయినప్పటికీ, కొంతమంది

వాలంటీర్లు తమ నివాసాల దగ్గర తమ వ్యక్తిగత ఆసక్తితో తమ సేవలను అందించారు. విద్యార్థులను పరీక్షలు రాయడానికి అనుమతించడం మినహా దాదాపు 16 నెలలుగా అన్నిరకాల విద్యా సంస్థలు భౌతికంగా మూసివేయబడ్డాయి. అందువల్ల, అనేక ఎన్ఎస్ఎస్ యూనిట్లు వివిధ సామాజిక సమస్యలపై కాలానుగుణంగా చర్చించడానికి వర్చువల్ సమావేశాలను నిర్వహించాయి. వాలంటీర్లతో కనెక్ట్ అవ్వడానికి ఇదొక్కటే ప్రత్యామ్నాయ పద్ధతి. కానీ, కరోనా మహమ్మారి కారణంగా చాలామంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కమ్యూనిటీ డెవలప్మెంట్లో చురుకైన పాత్ర పోషించలేక పోయారనేది వాస్తవం.

**ఎన్ఎస్ఎస్కు నిధులెలా వస్తాయి?**

ఎన్ఎస్ఎస్ అనేది కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం అయినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు, విద్యా సంస్థలు ఈ కార్యక్రమానికి మూడు మూల స్తంభాలు. ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ డైరెక్టరేట్లు, రాష్ట్ర ఎన్ఎస్ఎస్ సెల్స్, ఎంపానెల్డ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ (ఈటిఐ)లను నడపడానికి భారత ప్రభుత్వం పూర్తి ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. కేంద్ర ప్రభుత్వం రెగ్యులర్ యాక్టివిటీస్ (ఆర్. ఏ.) కొరకు సంవత్సరానికి ఒక్క వాలంటీర్కు రూ. 250, దత్తత గ్రామాలు/పట్టణ మురికివాడల్లో ఏడు రోజుల వ్యవధి కలిగిన ప్రత్యేక క్యాంపింగ్ ప్రోగ్రామ్ (ఎస్.సి.పి.) నిర్వహించడానికి ప్రతి వాలంటీర్కు రూ.450/- చొప్పున ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. అంతేకాకుండా, విశ్వవిద్యాలయాల స్థాయిలోని ఎన్ఎస్ఎస్కో- ఆర్డినేటర్లు, కళాశాల స్థాయిలోని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు కేంద్ర ప్రభుత్వం నుండి గౌరవ వేతనం పొందుతారు. అయితే ఎన్ఎస్ఎస్లో వివిధ స్థాయిల్లో సేవలందించేవారందరికీ ఆర్థిక ప్రయోజనాన్ని కొంత మొత్తంలో పెంచాల్సిన అవసరం ఉంది.

**ఎన్ఎస్ఎస్ బలోపేతానికి భవిష్యత్ ప్రణాళికలు:**

టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్)వారు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ మూల్యాంకన అధ్యయనం ప్రకారం, భారత ప్రభుత్వం ఈ పథకాన్ని పలు సిద్ధాంతాలతో ఒక మంచి ఉద్దేశ్యంతో ప్రారంభించింది. ఇది ప్రపంచంలోనే యువతను అభివృది పథంలో నడిపించే గొప్ప ప్రయోగాలలో ఒకటి అని తేల్చింది. అందువల్ల, ఎన్ఎస్ఎస్ను అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, ఇతర విద్యా సంస్థల్లో తప్పనిసరి చేస్తూ, పాఠ్యాంశాలలో భాగంగా విలీనం చేయాలని టిస్ సిఫార్సు చేసింది. మరోవైపు ఇప్పటివరకు, ఎన్ఎస్ఎస్లో చేరడానికి అర్హత ఉన్న విద్యార్థులలో 10 శాతంకంటే తక్కువమంది ఉన్నారు. కావున, కేంద్ర క్రీడలు, యువజన మంత్రిత్వ శాఖ ఎన్ఎస్ఎస్ను పెద్ద ఎత్తున విస్తరించడానికి సన్నాహాలు చేస్తుంది. ఇంకా ఎన్ఎస్ఎస్ విస్తరణకు నిధుల పెంపుదలతోపాటు, సెల్ఫ్-ఫైనాన్సింగ్ యూనిట్ల ఏర్పాటుకు కూడా ఈ శాఖ అనుమతినిచ్చింది. ఎన్ఎస్ఎస్లో విద్యార్థుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి, యుజిసి అన్ని విశ్వవిద్యాలయాలకు ఎన్ఎస్ఎస్ను ఎలెక్టివ్ సబ్జెక్ట్గా క్రెడిట్లతో ప్రవేశపెట్టాలని సలహా ఇచ్చింది. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చేసిన మంచి పనికి గుర్తింపుగా జాతీయ స్థాయిలో వార్షిక ఎన్ఎస్ఎస్ అవార్డులను ప్రధానం చేయడమే కాకుండా, రిపబ్లిక్ డే పరేడ్, ఇంటర్నేషనల్ యూత్ డెలిగేషన్స్, అడ్వెంచర్ క్యాంప్లు మొదలైనవాటిలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొనేలా అవకాశాలను కల్పిస్తుంది.

అనేక విద్యాసంస్థల్లో విద్యా సంబంధమైన అంశాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంవల్ల, విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందించడానికి ఉద్దేశించిన ఈ పథకం తన లక్ష్యాలను పూర్తి స్థాయిలో ఛేదించలేకపోతుంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్, డిగ్రీ, వృత్తివిద్యా కాలేజీల్లో, యూనివర్సిటీల్లో విద్యార్థుల సంఖ్యకనుగుణంగా ఎన్ఎస్ఎస్ యూనిట్లను నెలకొల్పేలా కేంద్ర విద్యాశాఖ తగు చర్యలు తీసుకోవాలి. ఏదో 'నామ్కే వాస్తే'గా ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలను చేయకుండా, విద్యార్థులు వాటిలో చిత్తశుద్ధితో పాల్గొనేలా విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అలాగే విద్యార్థులు సేవాకార్యక్రమాల్లో పాల్గొన్నందుకు, వారికి కొన్ని మార్కులు కేటాయిస్తే ఈ ఎన్ఎస్ఎస్ ఇంకా బలోపేతం అవుతుంది. అందుకుగాను యూజిసి, టిస్ సిఫార్సులకనుగుణంగా ఎన్ఎస్ఎస్ను ఒక ఎలెక్టివ్ కోర్సుగా అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుత కాలానుగుణంగా ఎన్ఎస్ఎస్కు సరిపడా ఆర్థిక వనరులు కేటాయించడం కూడా అనివార్యం అనిపిస్తుంది. అప్పుడే ఎన్ఎస్ఎస్ సేవాభావమున్న పౌరులను తయారు చేయడం ద్వారా భారత సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది.


---

**డా. శ్రీరాములు గోసికొండ - హైదరాబాద్.**

# చదవండి...

- మిసిమి


**సల్లో.. సల్ల:** కథలు. ఆర్.సి. కృష్ణస్వామి రాజు రచన.




ఈ కథలన్నీ పల్లెబతుకుల పరిశోధనా పత్రాలు. ఇవన్నీ పల్లె బ్రతుకు చిత్రాలు. పల్లెటూరు జీవన మిత్రాలు - తప్పక చదవండి. పల్లెటూళ్లు మీతో మాట్లాడతాయి. పట్టణ వాతావరణానికి అలవాటుపడి - మృత్యువు జీవితంలో నుంచి ప్రకృతిలోకి తొంగిచూడండి.

*పేజీలు: 126, వెల: ₹ 120/- ప్రతులకు: ఆర్.సి. కృష్ణస్వామి, 22-4-71, బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ, మంగళం రోడ్, తిరుపతి - 517 501. ఫోన్: 939 366 2821.*

**కామోత్సవ్:** గుంటూరు శేషేంద్ర శర్మ. కవిగా, రామాయణ అధ్యయనశీలిగా సుపరిచుతులు శేషేంద్ర. ఆయన *కామోత్సవ్* అనే నవల రాశారు. అది తెలుగు




పరిపాలనా లోకంలో సంచలనం రేకెత్తించి, ఎన్నో కోర్టుకేసులు ఎదుర్కొంది. దీనికి సమాధానం శేషేంద్రగారే చెప్పారు. దీనికి వ్యతిరేకత రాజకీయం ముసుగుదారుల నుంచే. వాళ్ల నైతిక బుషులని, సంఘసంస్కర్తలనీ నాకు ఇప్పుడే తెలుస్తున్నది! నీతులూ, చట్టాలూ సామాన్య ప్రజలకే. అధికార సంపన్న వర్గాలకు వర్తించవు. వారిలో ఉన్న అస్తవ్యస్త సంబంధాలు, నైతిక పతనానికి ఎవరి బాధ్యతా ఉండదు. వారే పాలక వర్గంగా చెలామణి కావటం మన దురదృష్టం. వారి జీవనశైలిని చిత్రించటమే *కామోత్సవ్* ముఖ్య ఉద్దేశ్యం. సహజంగానే దీనికి వ్యతిరేకత ఆ వర్గాల నుంచే వస్తుంది అంటారు. ఏమిటి శేషేంద్ర రాసిన *కామోత్సవ్?* ఎందుకు దీనిపై అంత దుమారం చెలరేగింది - నానాటికీ దిగజారుడుగా సమాజం కుళ్లిపోయిందా? మీరు *కామోత్సవ్* చదివితే తెలుస్తుంది. సమాజంలోని పాలకవర్గం ఎలా ఉందో - అలా ఎందుకు ఉండకూడదో. *పేజీలు: 200, వెల: ₹ 200/- ప్రతులకు: ఫోన్: 944 107 0985.*

**(1) పుష్కర తుంగభద్ర:** డా. భీంపల్లి శ్రీకాంత్. తుంగభద్ర నది, జోగులాంబ - గద్వాల జిల్లా అయిజ మండలం - జోగులాంబ ఆలయాన్ని వరుసుకుంటూ ప్రవహిస్తుంది. తుంగభద్ర నదీజల ప్రవాహం 531




కి.మీ. ఎన్నో ఆలయాలను, పుణ్యక్షేత్రాలనూ అభిషేకించి ఆలంపురం ప్రాంతంలో కృష్ణలో కలుస్తుంది. ఆ సంగమ ప్రదేశాన్ని కూడల సంగమేశ్వరం అంటారు. తుంగభద్ర నదీ ప్రవాహపు తీరాలలో వేణాసోంపరం - రాజోలి - పుటూరు - ఆలంపురం క్షేత్రాల వద్ద పుష్కర ఘాట్లను నిర్మించారు. పోయిన సంవత్సరం పుష్కలంగా వర్షాలు కురవడంతో తుంగభద్ర పుష్కరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆ విశేషాలన్నీ ఈ పుస్తకంలో పొందుపరిచారు. శ్రీకాంత్ గారు ముఖ్యంగా ఆలంపూర్ - జోగులాంబ ఆలయ ప్రాంతంలో చాలా విశాలమైన ఘాట్‌ను నిర్మించారు. చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యంగల ఈ ఆలయాన్ని తప్పక సందర్శించాలి, ఎన్నో శాసనాలు భద్రపరిచి ఉన్నాయి. బాదామి చాళుక్యుల చరిత్ర అధ్యయనానికి ఎంతో ఉపయోగపడతాయి.


*పేజీలు: 76, వెల: ₹ 30/-*

**(2) సురవరం మొగ్గలు:** సంపాదకులు: డా. భీంపల్లి శ్రీకాంత్. తెలంగాణకు వరం - సురవరం! గోల్కొండ





పత్రిక సంపాదకునిగా, పరిశోధకునిగా, కవిగా, విమర్శకునిగా, కథకునిగా - ఇలా ఎన్నో సాహిత్య ప్రక్రియలకు ప్రసిద్ధి పొందిన సువరం ప్రతాపరెడ్డి జీవిత విశేషాలను పాలమూరు రచయితలు తమ మూడుపాదాల పదాల ద్వారా నివాళి చెప్తున్నారు. ఆయన 124వ జన్మదిన సందర్భంగా 124 కథకులు రాసిన కథలివి.

*పేజీలు: 124, వెల: పేర్కొనబడలేదు.*





**(3) గాంధీ మొగ్గలు:** సంపాదకులు: డా. భీంపల్లి శ్రీకాంత్.
*పేజీలు: 160, వెల: ₹ 100/-*

**(4) అసాధ్యుడు (మొగ్గలు):** డా. భీంపల్లి శ్రీకాంత్.
*పేజీలు: 40, వెల: ₹ 30/-*




**(5) అసామాన్యుడు:** డా. భీంపల్లి శ్రీకాంత్.





*పేజీలు: 48, వెల: ₹ 30/-*
*పై ఐదు ప్రతులకు: డా. భీంపల్లి శ్రీకాంత్, 8-5-38, టీచర్స్ కాలని, మహబూబ్‌నగర్. ఫోన్: 903 284 4017.*

**ఉడుకు బెల్లం:** కథలు. చింతకింది శ్రీనివాసరావు. కళింగసీమ గ్రామీణ జీవితాన్ని తన కథల ద్వారా





పాఠకులకు దృశ్యమానం చేస్తున్నారు శ్రీనివాస్ - *ఉడుకు బెల్లం* ఇందులో ఒక కథ పేరు. శిష్టవ్యావహారికంలో ఉన్న ఈ కథలన్నీ హాయిగా చదవుకోవచ్చు. మనకు పరిచయం లేని ప్రపంచాన్ని, జీవితాలను రచయితతలో పాటు చూడవచ్చు.
*పేజీలు: 122, వెల: ₹ 120/- ప్రతులకు: శ్రీనిజ పబ్లికేషన్స్, 6-60/1, రవీంద్ర నగర్, ఓల్డ్ డైరీ ఫామ్, విశాఖపట్నం - 530040. ఫోన్: 889 714 7067.*

**మనుషులమై బ్రతకాలి:** కవిత్వం. డా. కె. దివాకరా చారి. 72 కవితలున్న ఈ పుస్తకంలో కవి




స్పందించి, కవి ఎద లోతుల్లో చెలరేగే తుఫానులు ఈ కవితలంటారు.
ప్రొ. కె. గోపి - తన ముందుమాటలో. సాందర్భిక కవితలంటూనే - యథాలాపం కాదు అని కితాబిచ్చారు. వలసకూలీల కాలి పయనం - ఊరు చేరేదెప్పుడో గూడు చేరేదెన్నడో - అని వాపోతారు.
*పేజీలు: 144, వెల: ₹ 100/-*
*ప్రతులకు: డా. కె. దివాకరా చారి, తులసీ నందనం, 6-1-131, సి-72, ఓల్డ్ సి.ఐ.బి. క్వార్టర్స్, ఖైరతాబాద్, హైదరాబాద్-04. ఫోన్: 939 101 8972.*





**ఆధునికాంధ్ర సాహిత్యంలో స్త్రీవాదం పురుష రచయితలు:** డా. సి.హెచ్. సుశీలమ్మ. అనేక ప్రక్రియల్లో పురుషులు రాసిన స్త్రీవాద రచనలు పరిశోధించి, ఈ పరిశోధక గ్రంథాన్ని వెలువరించారు. ఇటువంటి ప్రయత్నం ఇంతకు ముందు జరగలేదంటారు శిఖామణి తన ముందుమాటలో.
*పేజీలు: 192, వెల: ₹ 150/- ప్రతులకు: డా. సిహెచ్. సుశీలమ్మ, 214, నారాయణాద్రి, ఎస్.వి.ఆర్. బృందావనం, సరూర్‌నగర్, హైదరాబాద్ - 35 మరియు పాలపిట్ట బుక్స్, హైదరాబాద్. ఫోన్: 984 878 7284.*

**మనమనం బరంపురం:** సంకలనకర్త స్వర్గీయ అవసరాల రామకృష్ణారావు. 15-11-1970 తేదీన బరంపురం తెలుగు యువతను తెలుగు సాహితీ సంస్థ *వికాసం* పేరుతో ఒక వేదికపైకి తెచ్చారు అవసరాల! అప్పుడు పదకొండుమంది యువకులు రాసిన కథలు - 1971 ఉగాదికి పురిపండా వారి అధ్యక్షతన సమావేశంలో బరంపురం ప్రకాశం హాల్లో వెలుగు




చూసిన కథాసంకలనం ఈ *మనమనం బరంపురం.* యాభైఏళ్ల తర్వాత అప్పటి యువత ఆలోచనలకు ప్రతిరూపం ఈ సంకలనం. 'మా ఆరాధ్య పత్రిక ***మిసిమి*** లో పరిచయానికి పంపుతున్నాం' అని లేఖ రాశారు సేతుపతి ఆదినారాయణ! ఒరిస్సా - భువనేశ్వరం నుంచి.
*పేజీలు: 127, వెల: ₹ 150/- ప్రతులకు: సేతుపతి ఆదినారాయణ, ఫోన్: 943 867 6699.*

**దేశభక్తి కైతికాలు:** కైతిక కవిమిత్ర రాథోడ్ శ్రావణ్. ఉట్నూరు సాహితీ వేదిక కవులు, కళాకారులు, రచయితలు శ్రావణ్ మిత్రులు. ఇవన్నీ దేశభక్తి కవితలే. ఆయన సంకలించి, గుదిగుచ్చి మనకందించారు. ముఖ్యంగా స్కూలు విద్యార్థులు తప్పక చదవవలసినవి. దేశమంటే - భక్తి అంటే అవగాహన కోసం.




*పేజీలు: 96, వెల: ₹ 80/- ప్రతులకు: రాథోడ్ శ్రవణ్, 2-2/1, ఎల్.బి. సుభాష్ నగర్, ఉట్నూర్, ఆదిలాబాద్ జిల్లా.*

# మిసిమి
మాసపత్రిక

**మీరు చందాదారులుగా చేరండి** **బహుమతిగా పంపండి**

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల - ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు - మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ ద్వారా ఇ-మెయిల్ (misimi90monthly@gmail.com), ద్వారాగానీ తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.


**చందా వివరాలు:**

₹ 360/- (సంవత్సర చందా),
₹ 720/- (రెండు సంవత్సరాలకు),
₹ 1080/- (మూడు సంవత్సరాలకు),
₹ 1440/- (నాలుగు సంవత్సరాలకు).
₹ 1,800/- (అయిదు సంవత్సరాలకు)

BHIM G Pay Paytm UPI PhonePe

**Ph: 939 343 6969**

## మిసిమి ప్రచురణలు



నోబెల్ వ్యాసాలు | మిసిమి పార్థసారథి వ్యాసాలు | చిత్రకళా నీరాజనం | చార్లీ చాప్లిన్ | బైరన్ | పురస్కార సాహిత్యం



పారిజాతం | షెల్లీ జీవిత కథ | సిద్ధార్థ | దోసిట చినుకులు | నృత్యభారతి

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: 994 951 6567.

**మిసిమి** మాసపత్రిక
**Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.**